
‘ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరి గొంతు వినడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉండాలి’

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 72

సోమవారం 3-6-2024

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




అమెరికా ధనాధన్...

కెనడాపై 195 పరుగుల లక్ష్యాన్ని 17.4 ఓవర్లలో ఛేదించిన ఆతిథ్య జట్టు -12లో



ఆసియా కుబేరుడిగా అదానీ

111 బిలియన్ డాలర్ల సంపదతో ప్రపంచంలో 11వ ర్యాంక్ -13లో



5 నాటికి రాష్ట్రంలోకి నైరుతి!

రుతుపవనాల కదలిక చురుగ్గా ఉంటే ఈనెల 5 నాటికి తెలంగాణలోకి ప్రవేశించే అవకాశం ఉన్నట్టు వాతావరణ శాఖ చెప్పింది.

వివరాలు 5లో ▸



బీఆర్ఎస్ విజయం

మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థి నవీన్‌కుమార్ రెడ్డి గెలుపొందారు.

వివరాలు 3లో ▸



అరుణాచల్‌లో మళ్లీ బీజేపీ

అరుణాచల్‌ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించింది. వరుసగా మూడోసారి అధికారం నిలబెట్టుకుంది.

వివరాలు 6లో ▸



సిక్కింలో ఎస్‌కేఎం జయకేతనం

సిక్కిం శాసనసభ ఎన్నికల్లో సిక్కిం క్రాంతికారి మోర్చా (ఎస్‌కేఎం) సంచలన విజయం నమోదు చేసింది.

వివరాలు 6లో ▸



గన్‌పార్క్‌లో అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు జూపల్లి, పొంగులేటి, కోమటిరెడ్డి, అమరుల స్తూపం రూపశిల్పి ఎక్కా యాదగిరి రావు, భట్టి, పొన్నం, సీతక్క



శనివారం రాత్రి ట్యాంక్‌బండ్‌పై నిర్వహించిన వేడుకల్లో ఒగ్గుడోలు కళాకారుల ప్రదర్శన



తెలంగాణ భవన్‌లో నిర్వహించిన ఉత్సవాల్లో తెలంగాణ తల్లి విగ్రహానికి నమస్కరిస్తున్న కేసీఆర్. చిత్రంలో మహమూద్ అలీ, శ్రీనివాస్ గౌడ్, పల్లా, తలసాని తదితరులు

ఇక ప్రపంచంతోనే పోటీ

దేశ విదేశాల్లో మన విజయ పతాక దశాబ్ది వేడుకల్లో సీఎం రేవంత్

- ప్రపంచ నంబర్ వన్ బ్రాండ్‌గా హైదరాబాద్ ఎదగాలి
- గత పదేళ్లలో రాష్ట్రంలో స్వేచ్ఛపై దాడి, విధ్వంసం
- మేం ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాం..
- పాలకులు, పాలితుల మధ్య గోడలు బద్దలుకొట్టాం..
- ఇక సాంస్కృతిక, ఆర్థిక పునరుజ్జీవనం దిశగా సాగుదాం
- మేమే సర్వజ్ఞులమన్న భ్రమ లేదు.. పాలనలో తప్పులుంటే దిద్దుకుంటాం
- తెలంగాణతో సోనియాగాంధీది తల్లి బంధమని వ్యాఖ్య
- పరేడ్ గ్రౌండ్స్‌లో ఘనంగా రాష్ట్ర అవతరణ వేడుకలు

సాక్షి, హైదరాబాద్: ప్రపంచానికి తెలంగాణ ఒక దిక్సూచి కావాలని.. తెలంగాణ విజయ పతాక దేశ విదేశాల్లో సగర్వంగా ఎగరాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. తెలంగాణ పల్లెలు పాడి పంటలతో వెలగాలని.. ఒకనాడు పొట్ట చేతపట్టుకుని పట్నాలకు వెళ్లిన యువత రేపటి రోజున ప్రపంచానికి మన సత్తా చాటే శక్తిగా మారాలని చెప్పారు. ఇతర రాష్ట్రాలతో కాదు ఏకంగా ప్రపంచంతో పోటీపడేలా మిగతా 2వ పేజీలో ▶

ఘనంగా ఆవిర్భావ వేడుకలు

పరేడ్ గ్రౌండ్స్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించిన సీఎం

ప్రజలకు శుభాకాంక్షలు చెబుతూ సోనియా వీడియో సందేశం

2లో



వాన కురుస్తుండగా ట్యాంక్‌బండ్‌పై అందెశ్రీ, కీరవాణిలకు జ్ఞాపికలు అందజేస్తున్న గవర్నర్ రాధాకృష్ణన్. చిత్రంలో సీఎం రేవంత్, భట్టి

తెలంగాణ రక్షణ కోసమే గులాబీ జెండా పుట్టింది

ఎన్నికల్లో జయాపజయాలు ముఖ్యం కాదు.. ప్రజల ప్రయోజనాలే ప్రధానం..

తుది శ్వాస వరకూ తెలంగాణ కోసమే పనిచేస్తా..

తెలంగాణ దశాబ్ది వేడుకల్లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

- అన్ని వర్గాలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసింది
- ఈ సర్కారుకు రోజులు దగ్గర పడ్డాయి
- మొన్న ఓడగొట్టినోళ్లే ఇప్పుడు ‘అన్నంల మన్ను పోసుకున్నట్లు అయిపాయే’ అనుకుంటున్నరు
- ప్రజల్లో ఉన్న అసంతృప్తి సమయం వచ్చినప్పుడు బాంబు పేలినట్లు పేలుతుంది.. సమీప భవిష్యత్తులో పాలన మన భుజాలపైనే పడుతుంది
- ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే వచ్చేది బీఆరెస్సే..

సాక్షి, హైదరాబాద్: ‘ఎన్నికల్లో జయాపజయాలు మనకు ముఖ్యం కాదు. తెలంగాణ ప్రజల ప్రయోజనాల పరిరక్షణే ప్రధానం. గులాబీ జెండా పుట్టిందే తెలంగాణ సమాజ రక్షణ కోసం. మొన్నటి ఎన్నికల్లో ఓడగొట్టిన ప్రజలే ఇప్పుడు అన్నంల మన్ను పోసుకున్నట్లు అయిపాయే అనుకుంటున్నరు. అనతి కాలంలోనే అప్రతిష్ట పాలైన ఈ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయి. రీప్లేస్‌మెంట్ మనమే. ప్రజల్లో ఉన్న అసంతృప్తి సమయం వచ్చినప్పుడు బాంబు పేలినట్లు పేలుతుంది. అది ఎంతో దూరం ఉందని నేననుకోవడం లేదు. సమీప భవిష్యత్తులో మళ్లీ పాలన మన భుజాల మీదనే పడుతుంది. తెలంగాణకు భవిష్యత్తు బీఆర్ఎస్ జెండానే ..’అని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. తెలంగాణ మిగతా 3వ పేజీలో ▶



హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేస్తున్న ఎంపీ లక్ష్మణ్

హామీలు మరిస్తే ఉద్యమిస్తాం

బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు లక్ష్మణ్

- గ్యారంటీలు అమలు చేయకపోతే రేవంత్‌కు కష్టమే.. గత సర్కారు దురాగతాలపై చర్యలేవని ప్రశ్న
- సుష్మాస్వరాజ్‌కు బీజేపీ నేతల నివాళి
- 1969 ఉద్యమకారులకు సన్మానం
- పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు

5లో

లెక్క ఏదైనా.. ‘ఫ్యాన్’ పక్కా

అసెంబ్లీ ఎన్నికలపై మెజార్టీ జాతీయ, రాష్ట్ర మీడియా సంస్థల ఎగ్జిట్ పోల్స్ స్పష్టీకరణ

- దేశ వ్యాప్త యంత్రాంగం ఉన్న టైమ్స్, దైనిక్ భాస్కర్ గ్రూప్‌ల ఎగ్జిట్ పోల్స్‌దీ అదే మాట
- 50 శాతం ఓట్లతో 14 లోక్‌సభ సీట్లు వైఎస్సార్‌సీపీవేనన్న టైమ్స్‌నౌ–ఈటీజీ రీసెర్చ్
- 50% కంటే ఎక్కువ ఓట్లతో 15-17 ఎంపీ సీట్లు వైఎస్సార్‌సీపీ గెలుస్తుందన్న దైనిక్ భాస్కర్(డీబీ)
- రాష్ట్ర మీడియా, సెఫాలజిస్టులు, సర్వే సంస్థలు చేసిన 32 ఎగ్జిట్ పోల్స్‌లో 24 పోల్స్‌లో వైఎస్సార్‌సీపీ వైపే..
- బీజేపీ భజన చేసే ఇండియాటుడే గ్రూప్, ఎన్‌డీటీవీ, జీన్యూస్‌ల ఎగ్జిట్ పోల్స్‌లో మాత్రం భిన్నంగా వెల్లడి
- ‘ఈనాడు’తో భాగస్వామ్యం ఉన్న సీఎన్ఎన్ న్యూస్-18 ఎగ్జిట్ పోల్స్‌దీ అదే దారి
- 2021లో బెంగాల్లో, 2023లో రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లలో తప్పులో కాలేసిన ఇండియాటుడే ఎగ్జిట్‌పోల్స్.. తాజా ఎగ్జిట్‌పోల్స్‌లో వైఎస్సార్‌సీపీ గుర్తును ఫ్యాన్‌కు బదులు చీపురుగా చూపిన సంస్థ

10లో



టైమ్స్ నౌ–ఈటీజీ ఎగ్జిట్ పోల్‌లో వైఎస్సార్‌సీపీ హవా


51 శాతం ఓట్లతో 117-125 సీట్లు కైవసం

సాక్షి, అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తిరుగులేని విజయం సాధిస్తుందని దేశవ్యాప్తంగా విస్తృత నెట్‌వర్క్ కలిగిన టైమ్స్ నౌ–ఈటీజీ రీసెర్చ్ ఆదివారం తన ఎగ్జిట్ పోల్స్‌లో తేల్చిచెప్పింది. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 51 శాతం ఓట్లతో మొత్తం 117–125 సీట్లు కైవసం చేసుకుంటుందని.. అదే సమయంలో టీడీపీ–జనసేన–బీజేపీ ఎన్డీయే కూటమి 47 శాతం మిగతా 10వ పేజీలో ▶

ఇదండీ జాగ్రత్త



రేపటి వరకూ ఉండటం కుదరదుసార్! వెళ్లాలి!!




5లో

ప్రభాకర్‌రావును కలిసేందుకే

అమెరికాకు హరీశ్

తెలంగాణకు రావద్దని చెప్పేందుకే అల్లుడు హరీశ్‌ను కేసీఆర్ చడీచప్పుడు లేకుండా అమెరికా పంపారు

- కొలరాడో, షికాగోల్లో ప్రభాకర్‌రావును హరీశ్ కలిశారు
- వాళ్లు కలిసినప్పుడు పక్కన ఉన్నవారే నాకు చెప్పారు
- కలవలేదని హరీశ్ ప్రమాణం చేస్తారా?
- హరీశ్‌రావు ప్రయాణించిన విమానం నంబర్, తేదీలతో అన్ని వివరాలు వెల్లడించిన మంత్రి కోమటిరెడ్డి



5లో

కలిసినట్లు నిరూపిస్తే ముక్కు నేలకు రాస్తా

లేకుంటే బహిరంగ క్షమాపణ చెప్పి.. కోమటిరెడ్డి ముక్కు నేలకు రాయాలి

- మాజీ మంత్రి హరీశ్‌రావు సవాల్
- బహిరంగ చర్చకు సిద్ధమని ప్రకటన
- కోమటిరెడ్డికి మతిభ్రమించింది... ఆయన డాక్టర్‌కు చూపించుకోవడం మంచిది..
- మంత్రులు చిల్లర వ్యాఖ్యలు చేయడం మాని పాలనపై దృష్టి సారించాలని వ్యాఖ్య

1

2

3

4


1. తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా రాజ్‌భవన్‌లో జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న గవర్నర్ రాధాకృష్ణన్ 2. పరేడ్ గ్రౌండ్స్‌లో జెండా ఆవిష్కరించి వందనం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి 3. ట్యాంక్‌బండ్‌పై వేడుకల్లో డోలు వాయిస్తున్న సీఎం రేవంత్, చిత్రంలో గవర్నర్, పొంగులేటి, జూపల్లి, సంపత్ తదితరులు 4. అసెంబ్లీ ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద మండలి చైర్మన్ గుత్తా, స్పీకర్ ప్రసాద్‌కుమార్, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు పొన్నం, తుమ్మల తదితరులు

అసెంబ్లీలో రాష్ట్ర అవతరణ వేడుకలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ అవతరణ వేడుకలు ఆదివారం అసెంబ్లీలో ఘనంగా జరిగాయి. శాసనమండలిలో చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. కార్యక్రమంలో మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్, రామచంద్రు నాయక్, ఎమ్మెల్సీలు రవీందర్‌రావు, ఎంఎస్ ప్రభాకర్, వాణీదేవి, మహేశ్‌కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. శాసనసభ ప్రాంగణంలో స్పీకర్ ప్రసాద్ కుమార్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులు, పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. అవతరణ దినోత్సవం సందర్భంగా అసెంబ్లీ భవనాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు.

ఇక ప్రపంచంతోనే పోటీ

▶ మొదటి పేజీ తరువాయి

తెలంగాణను సమున్నతంగా నిలపాలని.. ఆ శక్తి, సత్తువ, తెలివి మనకు ఉన్నాయని అన్నారు. హైదరాబాద్ మన బ్రాండ్, ప్రపంచ నంబర్ వన్ బ్రాండ్‌గా ఎదగాలని ఆకాంక్షించారు. ఆ దిశలో ముందుకు సాగుతున్న తమ ప్రభుత్వానికి ప్రజల ఆశీస్సులు, వ్యవస్థల సహకారం కావాలని కోరారు. ఆదివారం ఉదయం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరిగింది. సీఎం రేవంత్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, ప్రసంగించారు. వివరాలు ఆయన మాటల్లోనే..

''రాష్ట్ర సాధన కోసం ప్రాణాలు అర్పించిన అమరులకు దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఘనంగా నివాళి అర్పిస్తున్నా. ఆరు దశాబ్దాల మన కలను నిజం చేసిన నాటి ప్రధాని మన్మోహన్ సింగ్, యూపీఏ చైర్ పర్సన్ సోనియా గాంధీలకు తెలంగాణ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నా. ప్రత్యేక శ్రద్ధతో మన చిరకాల వాంఛను నెరవేర్చిన సోనియా గాంధీ, నాటి లోక్‌సభ స్పీకర్ మీరా కుమార్, నాటి బీజేపీ ముఖ్య నేత సుష్మా స్వరాజ్ ఈ ముగ్గురు తల్లులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నా. దశాబ్ది ఉత్సవానికి సోనియా గాంధీని ఏ హోదాలో ఆహ్వానించారని కొందరు ప్రశ్నించారు. బిడ్డ ఇంట్లో శుభకార్యానికి తల్లికి హోదా కావాలా? తెలంగాణ చరిత్ర ఉన్నంత వరకు సోనియాగాంధీని ఈ సమాజం తల్లిగా గుర్తించి, గౌరవిస్తుంది.

స్వేచ్ఛను హరిస్తే తెలంగాణ ఊరుకోదు..

పెత్తనాన్ని ప్రశ్నిస్తాం, ప్రేమను పంచుతాం, ఆకలిని తట్టుకుంటాం.. కానీ స్వేచ్ఛను హరిస్తే భరించలేం. దాశరథి చెప్పినట్టు తెలంగాణ అమాయకపు నెరజాణే కానీ.. అన్యాయం జరిగితే తిరగబడే నైజం దాని సొంతం. సంక్షేమం ముసుగులో ప్రజాస్వామ్యాన్ని చెరబట్టాలని చూస్తే తెలంగాణ భరించదు. 'ప్రాంతేతరుడు ద్రోహం చేస్తే పొలిమేరల వరకు తరిమికొడతాం. ప్రాంతం వాడే ద్రోహం చేస్తే ప్రాణాలతోనే పాతిపెడతాం' అన్న కవి కాళోజీ మాటలు అక్షర సత్యాలు.

రాష్ట్రంలో ప్రజాపాలన తెచ్చాం..

డిసెంబరు 7 నుంచి రాష్ట్రంలో మొదలైన ప్రజాపాలనలో స్వేచ్ఛ పునరుద్ధరణకు మొదటి ప్రాధాన్యం ఇచ్చాం. పాలకులు, పాలితుల మధ్య గోడలు బద్దలు కొట్టాం. ప్రగతిభవన్‌ను జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌గా మార్చి ప్రజలకు అందుబాటులోకి తెచ్చాం. సచివాలయంలోకి సామాన్యుడు కూడా రాగలిగేలా చేశాం. ధర్నాచౌక్‌కు అనుమతి ఇచ్చాం. మీడియాకు స్వేచ్ఛ ఇచ్చాం. ప్రతిపక్షానికి గౌరవం ఇచ్చాం. మా నిర్ణయాల్లో లోటుపాట్ల సమీక్షకు అవకాశం ఇస్తున్నాం. తప్పులు జరిగితే సరిదిద్దుకోవడానికి సిద్ధంగా ఉన్నాం. మేమే సర్వజ్ఞానులం అన్న భ్రమలు లేవు. ఉద్యమ లక్ష్యాలు, అమరుల ఆశయాలను సాధించినప్పుడే తెలంగాణ సాధనకు సార్థకత. రాజకీయ విమర్శల జోలికి పోవడం లేదు.. కానీ చరిత్రను సమీక్షించుకున్నప్పుడే భవిష్యత్‌కు పునాదులు వేసుకోగలం.

పదేళ్లుగా స్వేచ్ఛపై దాడి

గత పదేళ్ల పాలనలో తెలంగాణ వందేళ్ల విధ్వంసానికి గురైంది. తెలంగాణ మూల స్వభావమైన స్వేచ్ఛపైనా దాడి జరిగింది. ప్రజలందరికీ చెందాల్సిన రాష్ట్ర సంపద గుప్పెడు మంది చేతుల్లోకి చేరింది. సంస్కృతి సంప్రదాయాలు ఎంతో విధ్వంసానికి గురయ్యాయి. ఆర్థిక విధ్వంసం సంగతి చెప్పనక్కర్లేదు. అదంతా గతం.. ఇప్పుడు ప్రజల కోసం ఎన్నికైన ప్రభుత్వం వచ్చింది. ప్రజా ప్రభుత్వంలో జరుపుకొంటున్న మొదటి ఆవిర్భావ దినోత్సవం ఇది. అందుకే ఈ రోజుకు చరిత్రలో ప్రత్యేక స్థానం ఉంటుంది.

సంక్షేమం దిశగా ముందడుగు..

అభయ హస్తం గ్యారంటీలకు కోటి తొమ్మిది వేల దరఖాస్తులు వచ్చాయి. వాటిని కంప్యూటరీకరించి, పరిష్కరించే ప్రక్రియ నడుస్తోంది. మేం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం అందుబాటులోకి తెచ్చాం. వైఎస్సార్ హయాంలో ప్రారంభించిన రాజీవ్ ఆరోగ్యశ్రీ అన్నది కాంగ్రెస్ పేటెంట్. దీని పరిమితిని రూ.పది లక్షలకు పెంచాం. 70 రోజుల్లోనే 30వేల మంది యువతకు ఉద్యోగ నియామక పత్రాలు అందించాం. గ్రూప్–1, మెగా డీఎస్సీ నోటిఫికేషన్లు ఇచ్చాం. తొలిదశలో నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున ఇందిరమ్మ ఇళ్లు నిర్మించబోతున్నాం. రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇచ్చి పేద మహిళలకు బాసటగా నిలుస్తున్నాం. అకాల వర్షాలతో నష్టపోయిన పంటలకు ఎకరాకు రూ.10 వేలు పరిహారం ఇచ్చాం. తడిసిన ధాన్యం కొంటున్నాం. నకిలీ విత్తనాలపై ఉక్కుపాదం మోపాం. పేదలకు 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ ఇస్తున్నాం. దావోస్ పర్యటనలో రూ.40 వేల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు కుదుర్చుకున్నాం. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి త్వరగా నీటి వాటాలు సాధించుకుంటాం. హైదరాబాద్ ఉమ్మడి రాజధానికి కాలం చెల్లింది. ఏపీతో ఆస్తుల విభజన సమస్యలను త్వరగా పరిష్కరించుకుంటాం'' అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

సాంస్కృతిక పునరుజ్జీవనం అవసరం..

అమరుల ఆశయాలు, ప్రజల కలలు నెరవేర్చేందుకు రాష్ట్రం సాంస్కృతిక పునరుజ్జీవనం, ఆర్థిక పునరుజ్జీవనం దిశగా ముందుకు సాగాలని ప్రభుత్వం నిర్ణయించింది. భావి తెలంగాణ నిర్మాణానికి ఈ రెండు ఇప్పుడు కీలక అంశాలు. బోనం నుంచి బతుకమ్మ వరకు.. సాయుధ పోరాటం నుంచి స్వరాష్ట్ర ఉద్యమం వరకు.. సమ్మక్క–సారలమ్మ నుంచి జోగులాంబ వరకు.. భద్రాద్రి రాముడి నుంచి కొమురం భీం వరకు మన సంస్కృతి, చరిత్ర గొప్పవి. వీటి పునరుజ్జీవనం జరగాలి.

- పదేళ్ల తెలంగాణకు రాష్ట్ర గీతం లేకపోవటం దారుణం. ఉద్యమకాలంలో ఉవ్వెత్తున స్ఫూర్తినిచ్చిన అందెశ్రీ రచన 'జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం..' గేయం ఇక నుంచి మన రాష్ట్ర అధికార గీతం. ఇది సాంస్కృతిక పునరుజ్జీవనానికి తొలి అడుగు.
- తెలంగాణ అంటే ధిక్కారం, పోరాటం.. రాష్ట్ర అధికారిక చిహ్నంలో అవి ప్రతిబింబించాలి. ఆ దిశగా ప్రజా ప్రభుత్వం నూతన చిహ్నాన్ని రూపొందించే పనిలో ఉంది. అందుకోసం వివిధ వర్గాల సూచనలు, సలహాలు తీసుకుంటున్నాం.
- ప్రభుత్వ అధికారిక ఉత్తర్వులు, సంస్థల సంక్షిప్త పేర్లు, వాహన రిజిస్ట్రేషన్‌లో రాష్ట్రాన్ని సూచించే సంక్షిప్త అక్షరాలుగా టీజీ ఉండాలన్న ప్రజాభీష్టాన్ని గౌరవిస్తూ ఆ మేరకు చర్యలు తీసుకున్నాం.
- నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపంగా ఉండేలా తెలంగాణ తల్లి రూపాన్ని ఏర్పాటు చేయబోతున్నాం. సగటు తెలంగాణ గ్రామీణ మహిళ రూపమే తెలంగాణ తల్లి ప్రతిరూపంగా ఉండాలి. తెలంగాణ తల్లి కష్టజీవి, కరుణామూర్తి. ఈ రూపురేఖలతో పునరుజ్జీవనం జరగాల్సి ఉంది. ఈ నిర్ణయాలు ఎవరికీ వ్యతిరేకం కాదు. ఒక జాతి ఆకాంక్షలకు ప్రతిరూపం మాత్రమే.

ఆర్థిక పునరుజ్జీవానికి చర్యలిలా..

గత పదేళ్ల ఇష్టారాజ్య పాలనతో రాష్ట్రం రూ.7 లక్షల కోట్ల అప్పుల ఊబిలో కూరుకుంది. మా పాలనలో ఆర్థిక క్రమశిక్షణకు ప్రాధాన్యత ఇస్తున్నాం. అదే సమయంలో సంక్షేమం, అభివృద్ధిలో రాజీ పడటం లేదు. దీర్ఘకాలిక ప్రణాళికలతో భవిష్యత్‌కు పునాదులు వేస్తున్నాం. మొత్తం తెలంగాణకు 'గ్రీన్ తెలంగాణ–2050 మాస్టర్ ప్లాన్' తయారు చేస్తున్నాం.

- ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో ఉన్న ప్రాంతం అర్బన్ తెలంగాణ.. ఔటర్ రింగ్ రోడ్డు నుంచి రీజనల్ రింగ్ రోడ్డు మధ్య ప్రాంతం సబర్బన్ తెలంగాణ.. రీజనల్ రింగ్ రోడ్డు అవతల రాష్ట్ర సరిహద్దుల వరకు గ్రామీణ తెలంగాణగా నిర్ధారించాం. మూడు జోన్లలో ఎక్కడ ఎలాంటి అభివృద్ధి జరగాలి, ఎక్కడ ఏ రకమైన మౌలిక సదుపాయాల కల్పన జరగాలన్నది ఈ మెగా ప్రణాళికలో విస్పష్టంగా ప్రకటిస్తాం.
- మూసీ సుందరీకరణ పథకం ద్వారా పరీవాహక ప్రాంతాన్ని ఉపాధి కల్పన జోన్‌గా తీర్చిదిద్దబోతున్నాం. దీనికోసం రూ.వెయ్యి కోట్లు కేటాయించాం. రీజనల్ రింగ్ రోడ్డును వీలైనంత తొందరలో పూర్తి చేసేలా ప్రయత్నిస్తాం. తక్కువ ఖర్చుతో, ఎక్కువ ఆయకట్టుకు నీరు ఇవ్వగలిగే సాగునీటి ప్రాజెక్టులకు తొలి ప్రాధాన్యత ఇస్తున్నాం. రాష్ట్ర ఆర్థిక పునరుజ్జీవనానికి అవసరమైన అన్ని నిర్ణయాలు తీసుకుంటాం.
- ఉద్యమకాలంలో పోరాటపంథాలో ఉన్న యువకుల్లో కొందరు ఇప్పుడు డ్రగ్స్‌కు బానిసయ్యారు. రాష్ట్రంలో డ్రగ్స్ అన్న మాట వినిపించడానికి వీలు లేకుండా చేస్తాం. ఈ విషయంలో తప్పు చేసేవారు ఏస్థాయి వారైనా ఉపేక్షించం.

ఘనచరిత్ర, విశిష్ట సంస్కృతుల తెలంగాణ

రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ, అమిత్ షా, ఖర్గే సందేశాలు

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే లు ఆదివారం ఎక్స్ వేదికగా రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

సుసంపన్నమైన వారసత్వం: రాష్ట్రపతి ముర్ము



తెలంగాణ సుసంపన్నమైన వారసత్వం, మిశ్రమ సంస్కృతి కలిగిన రాష్ట్రమని రాష్ట్రపతి ద్రౌపది పేర్కొన్నారు. దేశంలో ముఖ్యమైన ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ హబ్‌గా అవతరించిందని అభివర్ణించారు. తెలంగాణ సహా ప్రజలు నిరంతరం అభివృద్ధి చెందాలని, దేశాభివృద్ధికి తోడ్పడాలని ప్రార్థిస్తున్నట్టు పేర్కొన్నారు.

తెలంగాణ ప్రగతికి కృషి: ప్రధాని మోదీ



గొప్ప చరిత్ర, విశిష్టమైన సంస్కృతి తెలంగాణ ప్రత్యేకతలని ప్రధాని మోదీ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం దేశాభివృద్ధికి అందించిన సహకారం ప్రతి భారతీయుడికీ గర్వకారణమని తెలిపారు. రానున్న రోజుల్లో రాష్ట్రాభివృద్ధికి నిరంతరం కృషి చేసేందుకు కట్టుబడి ఉన్నామని మోదీ ఎక్స్‌లో పేర్కొన్నారు.

తెలంగాణకు ప్రత్యేక స్థానం: అమిత్ షా



దేశ సాంస్కృతిక పటంలో తెలంగాణ ప్రత్యేక స్థానం దక్కించుకుందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. ప్రత్యేక సంస్కృతి, వారసత్వంతో దేశ సాంస్కృతిక పటంలో రాష్ట్రం ప్రత్యేక స్థానాన్ని దక్కించుకుందని ప్రశంసించారు. శ్రేయస్సు అనే కొత్త శిఖరాలను అధిరోహిస్తున్న రాష్ట్రానికి శుభాకాంక్షలని షా ఎక్స్‌లో పోస్టు చేశారు.

అమరులకు నివాళి: ఖర్గే



తెలంగాణ ఉద్యమంలో ప్రాణ త్యాగాలు చేసిన అమరులకు ఎక్స్ వేదికగా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే నివాళులర్పించారు. మన్మోహన్‌సింగ్, సోనియా గాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్–యూపీఏ తెలంగాణ ఉద్యమానికి, ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు మద్దతు ఇవ్వడంలో కీలక పాత్ర పోషించాయని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలర్పించిన విద్యార్థులు సహా.. అమరవీరులకు ఈ సందర్భంగా నివాళులర్పించారు.

త్యాగాల ఫలితమే తెలంగాణ: గవర్నర్ దత్తాత్రేయ



సాక్షి, న్యూఢిల్లీ: విద్యార్థులు, యువకులు, రైతులు, కార్మికులు, కళాకారులు, మేధావులు, వ్యాపారులు, రాజకీయ పార్టీల పోరాటాలు, త్యాగాల ఫలితంగానే తెలంగాణ ఏర్పాటైందని హరియాణ గవర్నర్ దత్తాత్రేయ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ప్రజలకు ఆదివారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో అసువులు బాసిన అమరులకు నివాళులర్పించారు. రాష్ట్ర 10వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని నూతన ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దత్తాత్రేయ అభినందనలు తెలిపారు.



ట్యాంక్‌బండ్‌పై నిర్వహించిన ఉత్సవాల వేదికపై సీఎం రేవంత్ మనవడితో ఉల్లాసంగా గవర్నర్

పరేడ్ గ్రౌండ్స్‌లో ఘనంగా ఆవిర్భావ వేడుకలు

- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, గౌరవ వందనం స్వీకరించిన సీఎం
- తెలంగాణ ప్రజలకు శుభాకాంక్షలు చెప్తూ సోనియా వీడియో సందేశం
- రాష్ట్ర అధికారిక గేయం ఆవిష్కరణ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహించింది. ఆదివారం ఉదయం సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో ఈ వేడుకలు జరిగాయి. ఉదయం 9.30 గంటల సమయంలో గన్‌పార్క్‌లోని అమరవీరుల స్తూపం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు నివాళులు అర్పించారు. 9.55 గంటలకు పరేడ్ గ్రౌండ్స్‌కు చేరుకున్నారు. సీఎం రేవంత్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి.. వివిధ దళాల గౌరవ వందనం స్వీకరించారు. రాష్ట్ర అధికారిక గేయంగా ఖరారు చేసిన అందెశ్రీ రచన 'జయ జయహే తెలంగాణ..' సంక్షిప్త రూపాన్ని ఆవిష్కరించారు. ఈ గేయాన్ని వినిపిస్తున్న సమయంలో కవి అందెశ్రీ భావోద్వేగంతో కన్నీటి పర్యంతమవడం కనిపించింది.

కేసీఆర్ కోసం ప్రత్యేకంగా సోఫా..: రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు రావాలంటూ మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు సీఎం రేవంత్ ఆహ్వానం పంపిన విషయం తెలిసిందే. ఆదివారం పరేడ్ గ్రౌండ్స్ సభలో ముందు వరసలో కేసీఆర్ కోసం ప్రత్యేకంగా సోఫా ఏర్పాటు చేశారు. కేసీఆర్‌కు కేటాయించిన స్థానం అంటూ కాగితంపై రాసి ఉంచారు.

సోనియాగాంధీ వీడియో సందేశం



వేడుకలకు ముఖ్య అతిథిగా సోనియాగాంధీని సీఎం రేవంత్ ఆహ్వానించినా.. అనివార్య కారణాలతో రాలేకపోయారు. అయితే తెలంగాణ ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతూ సోనియా ఒక వీడియో సందేశం పంపారు. పరేడ్ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన ఎలక్ట్రానిక్ తెరలపై ఈ సందేశం వీడియోను ప్రదర్శించారు. ''తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఎందరో అమరవీరుల త్యాగఫలం. రాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన అమరవీరులందరికీ నివాళులు అర్పిస్తున్నాను. తెలంగాణ ప్రజల ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షను గుర్తించి 2004లో కరీంనగర్ సభలో హామీ ఇచ్చాను. అది సొంత పార్టీలో అసమ్మతి స్వరాలకు కారణమైంది. కొందరు నేతలు మా నిర్ణయంతో విభేదించారు. అయినా మాట నిలబెట్టుకుంటూ తెలంగాణ ఏర్పాటు చేశాం. ఇప్పుడు రాష్ట్ర ప్రగతికి కట్టుబడి ఉన్నాం. సీఎం రేవంత్ నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారంటీ హామీలు నెరవేరుస్తుంది. ప్రజలకు శుభం జరగాలి. జైహింద్.. జై తెలంగాణ ''అని వీడియో సందేశంలో సోనియా పేర్కొన్నారు.

కనుల పండువగా సాంస్కృతిక మహోత్సవం

- దశాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా ట్యాంక్‌బండ్‌పై వేడుకలు
- హాజరైన గవర్నర్ రాధాకృష్ణన్, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ప్రముఖులు
- వేదికపై అందెశ్రీ, కీరవాణిలకు సన్మానం
- అలరించిన కళాకారుల కార్నివాల్..
- 'జయ జయహే' పూర్తి గీతం నేపథ్యంగా సాగిన ఫ్లాగ్ వాక్


సాక్షి, హైదరాబాద్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాలకు ముగింపుగా ఆదివారం సాయంత్రం ట్యాంక్‌బండ్‌పై నిర్వహించిన తెలంగాణ సాంస్కృతిక మహోత్సవం కనుల పండువగా జరిగింది. వైవిధ్యభరితమైన తెలంగాణ సంస్కృతిని సమున్నతంగా చాటే కళాకారుల ప్రదర్శనలు.. 'జయజయహే తెలంగాణ'పూర్తి గీతం నేపథ్యంగా ఐదు వేల మందితో జరిగిన ఫ్లాగ్ వాక్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గవర్నర్ సీపీ రాధాకృష్ణన్, సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ తెలంగాణ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం, గీత రచయిత అందెశ్రీ, సంగీత దర్శకుడు కీరవాణి, తెలంగాణ ఉద్యమకారులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేసిన స్టాళ్లను గవర్నర్, సీఎం సందర్శించారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

తెలంగాణ అస్తిత్వాన్ని, వివిధ జిల్లాల వైవిధ్యాన్ని ఆవిష్కరిస్తూ రాష్ట్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో కళాకారులు కార్నివాల్ నిర్వహించారు. మహిళా కళాకారుల డప్పుదరువు, ఒగ్గుడోలు ప్రదర్శన, బోనాలు, పోతురాజులు, ఘట విన్యాసం, బైండ్ల జమిడికలు, చిందు యక్షగానం, బతుకమ్మలు, గుస్సాడీ, థింసా, శివసత్తులు, మాధురి, లంబాడా నృత్య ప్రదర్శనలతో కార్నివాల్ సాగింది. ప్రముఖ నృత్యకారిణి అలేఖ్య పుంజుల బృందం ప్రదర్శించిన తెలంగాణ నృత్య నీరాజనం ఆకట్టుకుంది.

ఉద్వేగ భరితం 'జయ జయహే'గీతం

13.5 నిమిషాల నిడివితో ఉన్న 'జయ జయహే తెలంగాణ'పూర్తి గీతాన్ని ఈ సందర్భంగా విడుదల చేశారు. దీనిని వినిపిస్తున్న సమయంలో 5 వేల మంది పోలీసు శిక్షణ అభ్యర్థులు జాతీయ జెండాలతో 'ఫ్లాగ్ వాక్'చేశారు. అప్పటికే వర్షం మొదలైనా కవాతు విజయవంతంగా సాగింది. ఈ సమయంలో వేదికపై గీత రచయిత అందెశ్రీ, సంగీత దర్శకుడు కీరవాణిలను సీఎం సన్మానించారు.



దశాబ్ది వేడుకల ముగింపు సందర్భంగా ట్యాంక్ బండ్‌పై బాణసంచా, లేజర్ షో

ఆటంకం కలిగించిన వర్షం

ట్యాంక్‌బండ్‌పై వేడుకలు మొదలైన కొంతసేపటికే వర్షం మొదలైంది. దీంతో వేడుకలకు వచ్చిన జనం ఇబ్బందిపడ్డారు. ఫ్లాగ్‌వాక్ సమయానికి వాన తీవ్రత మరింత పెరగడంతో ఇతర కార్యక్రమాలను హడావుడిగా ముగించాల్సి వచ్చింది. చివరిలో పది నిమిషాల పాటు బాణాసంచా పేల్చేందుకు ఏర్పాట్లు చేసినా.. వాన కారణంగా కొన్ని నిమిషాలకే పరిమితం చేశారు. మరోవైపు తమకు ఆహ్వానం ఉన్నప్పటికీ వేడుకల్లో పాల్గొనేందుకు పోలీసులు అనుమతించడం లేదని పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. పాస్‌లు లేనివారిని అనుమతించలేదని పోలీసులు తెలిపారు.

ఢిల్లీలో రాష్ట్ర అవతరణ దినోత్సవాలు

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాలు ఘనంగా జరిగాయి. తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ ఆదివారం అమర వీరుల స్తూపానికి, అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గౌరవ్ ఉప్పల్ మాట్లాడుతూ.. పదేళ్లుగా తెలంగాణ ఎన్నో సవాళ్లు, చిక్కుముడులు ఎదురైనా సమష్టిగా ఎదుర్కొని అనేక రంగాలలో ప్రగతి పథంలో నిలిచిందని తెలిపారు. వేడుకల్లో తెలంగాణ భవన్ మాజీ రెసిడెంట్ కమిషనర్ అశోక్ కుమార్, రాష్ట్ర ప్రభుత్వ స్టాండింగ్ కౌన్సిల్ శ్రవణ్ కుమార్ పాల్గొన్నారు.



ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో గౌరవ వందనం స్వీకరిస్తున్న రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్

భారతీయ సంస్కృతి ఎంతో ఇష్టం

తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో న్యూజిలాండ్ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్

సాక్షి, హైదరాబాద్: భారతదేశాన్ని ఎన్నోసార్లు సందర్శించానని, భారతీయ సంస్కృతి తనకెంతో ఇష్టమని న్యూజిలాండ్ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్ చెప్పారు. న్యూజిలాండ్‌లోని ఆక్లాండ్ నగరంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ న్యూజిలాండ్ ఆధ్వర్యంలో ప్రవాస భారతీయులు జరిపిన వేడుకల్లో న్యూజిలాండ్ దేశ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రిస్టోఫర్ మాట్లాడుతూ పదేళ్లలో తెలంగాణ రాష్ట్రం ఐటీ, ఫార్మసీ రంగాల్లో దూసుకుపోతోందని ప్రశంసించారు. ఈ ఏడాది భారత్ పర్యటన సందర్భంగా తెలంగాణ రాష్ట్రాన్ని కూడా సందర్శిస్తానని వెల్లడించారు. ఈ సంఘ అధ్యక్షుడు మాల్గారి శైలేంద్ర రెడ్డి అధ్యక్షతన జరిగిన వేడుకల్లో ఒక ప్రధాన మంత్రి పాల్గొనడం ఇదే తొలిసారని సభ్యులు తెలిపారు.



న్యూజిలాండ్ ప్రధాని క్రిస్టోఫర్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఎన్నారైలు


దశాబ్ది వేడుకల్లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్. చిత్రంలో సునీత, సత్యవతి, సబిత, వాణిదేవి, హరీశ్‌రావు, మధుసూదనాచారి, నామా, పోచారం, పొన్నాల, కేటీఆర్, శ్రీనివాస్‌గౌడ్, రసమయి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కౌశిక్‌రెడ్డి


తెలంగాణ ఆవిర్భావ వేడుకల సందర్భంగా ఆదివారం హైకోర్టు ఆవరణలో జాతీయ జెండాను ఎగురవేసి వందనం చేస్తున్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, వేడుకల్లో పాల్గొన్న న్యాయమూర్తులు

తెలంగాణ రక్షణ కోసమే.. గులాబీ జెండా పుట్టింది

▶ మొదటి పేజీ తరువాయి

అవతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా ఆదివారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం తెలంగాణ భవన్‌లో భారీ ఎత్తున ఉత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో కేసీఆర్ మాట్లాడారు.

సరైన పంథా లేక 1969 ఉద్యమం విఫలం

'నాడు ఉవ్వెత్తున ఎగిసిపడ్డ 1969 ఉద్యమం సరైన పంథా లేకపోవడంవల్ల ఘోరంగా విఫలమైంది. 1969 ఉద్యమంలో ముల్కీ రూల్స్ ప్రధాన అంశంగా ఉండేవి. ఆంధ్రా ప్రాంత ఉద్యోగులను ఇక్కడి నుంచి పంపించాలని ఇక్కడి యువత పోరాటం చేశారు. అయితే ముల్కీ రూల్స్ వ్యతిరేక పోరాటంలో రాజ్‌భవన్ దగ్గర 8 మంది విద్యార్థులను కాల్చి చంపారు. ఉద్యమం సమసిపోయింది. తెలంగాణ రాలేదు. ఆ తర్వాత పీవీ నరసింహారావు ముఖ్యమంత్రి అయ్యారు. ముల్కీ రూల్స్ ఉద్యమం లీగల్ బ్యాటిల్‌గా సుప్రీంకోర్టుకు వెళ్లింది. పీవీ ముఖ్యమంత్రిగా ఉన్న టైమ్‌లో 1973లో ముల్కీ రూల్స్ కొనసాగుతాయని తెలంగాణకు అనుకూలంగా సుప్రీంకోర్టులో తీర్పు వచ్చింది. దాంతోటి ఆంధ్రాలో వెంటనే జై ఆంధ్రా ఉద్యమం మొదలు పెట్టిన్రు. ఆ తర్వాత కేంద్రం సుప్రీంకోర్టు తీర్పును కాలరాస్తూ రాజ్యాంగ సవరణ చేసింది. ముల్కీ రూల్స్‌ను రద్దు చేసింది. ఇంత చేసినా తెలంగాణ నుంచి ఎవరూ నోరు మెదపలే. మారు మాట్లాడలే..'అని కేసీఆర్ పేర్కొన్నారు.

నాటి ఘోరాలకు జయశంకర్ సార్ సాక్షి

'ప్రొఫెసర్ జయశంకర్ ఆజన్మ తెలంగాణ వాది. ఆయన లాంటి మనుషులు అరుదుగా ఉంటారు. 14, 15 ఏళ్లు నేను ఆయనతో కలిసి పనిచేసిన. తెలంగాణ అస్తిత్వం కోల్పోవద్దని, తెలంగాణగనే ఉండాలని నిర్ణయించుకుని పోరాట పంథా ఎంచుకున్నారు. నాటి ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డి పిలిచి బెదిరించినా జయశంకర్ సార్ బెదరలేదు. పోరాట పంథాను వీడలేదు. అలా అనేక సందర్భాల్లో ఆయన బెదిరింపులను ఎదుర్కొన్నారు. తెలంగాణ కోసం జరిగిన పోరాటాన్ని అణచడం కోసం నాటి ప్రభుత్వాలు చేసిన ఘోరాలు అన్నింటికీ ఆయన సాక్షి. 1969 ఉద్యమంలో చాలామంది పెద్దలు పోరాటం చేశారు. నల్లగొండ జిల్లాకు చెందిన విజయసింహారెడ్డి తండ్రి కృష్ణారెడ్డి పోరాటంలో అగ్రభాగాన ఉండేవారు. పోచారం శ్రీనివాస్‌రెడ్డి 1969లో ఇక్కడి పాలిటెక్నిక్ కాలేజీలో ఇంజినీరింగ్ విద్యార్థిగా ఉంటూ అనేకసార్లు లాఠీ దెబ్బలు తిని జైలుకు వెళ్లారు. ఇలా అనేక మంది తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం కొట్లాడిండ్రు. వాళ్లందరికీ మనం తలెత్తి మొక్కాల్సిందే..'అని బీఆర్ఎస్ అధినేత చెప్పారు.


అమరవీరుల స్తూపం వద్ద నివాళి అర్పిస్తున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

తెలంగాణ పదాన్ని అసెంబ్లీలో వాడొద్దన్నారు

'2001లో తెలంగాణ కోసం పార్టీ పెట్టినప్పటికీ 1999 నుంచే చర్చోపచర్చలు జరిగాయి. తెలంగాణ వాదులు, మేధావులతో కలిసి ఉద్యమ పంథాపై ప్రణాళికలు తయారు చేశాం. పదవులకు రాజీనామా చేసి పార్టీ పెడితే పది మంది వెంటలేరు. అప్పుడు మీటింగ్‌లు పెట్టినా పది, పదిహేను మంది కూడా వచ్చేవారు కాదు. తెలంగాణ కాంగ్రెస్, టీడీపీ నాయకులు పదవులు చూసుకున్నారు. అసెంబ్లీలో తెలంగాణ పదం వాడొద్దని అప్పటి స్పీకర్ ప్రణయ భాస్కర్ చెప్పారు. వెనుకబడిన ప్రాంతం అనాలని శాసనసభ ముఖంగా వ్యాఖ్యానించారు. కనీసం నీళ్ల కోసం మాట్లాడిన వాళ్లు కూడా లేరు. నేను పాలమూరులో సభ పెట్టి పోరాటం చేస్తే అప్పుడు జూరాలకు నీళ్లు వచ్చాయి. కరీంనగర్‌లో సింహగర్జనను సూపర్ డూపర్ హిట్ చేశాం. సమైక్య రాష్ట్రంలో ఎందుకు ఉండాలని నేను నిలదీస్తే ప్రభుత్వం దిగి వచ్చింది. తెలంగాణ వస్తుందని ఎవరూ ఊహించలేదు. 15 ఏళ్ల పోరాటం తర్వాత తెలంగాణ వచ్చింది..'అని కేసీఆర్ తెలిపారు.

బీఆర్ఎస్ 25 ఏళ్ల మహా వృక్షం

'బీఆర్ఎస్‌ను ఖతం చేస్తమని అంటున్నరు. మోకాలంత ఎత్తు లేనోడు కూడా మాట్లాడుతున్నారు. బీఆర్ఎస్ 25 ఏళ్ల మహావృక్షం. ఖతం చేస్తే ఖతమైతదా? కాంగ్రెస్ పదేళ్లు అధికారంలో లేదు. ఖతమైందా? అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో కొంత నైరాశ్యం ఉంది. కానీ నేను బస్సు యాత్ర మొదలు పెట్టంగనే మళ్లీ అదే గర్జన కనిపించింది. సీఎం సొంత జిల్లా మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించాం. మరో ఎమ్మెల్సీగా రాకేశ్‌రెడ్డి గెలువబోతున్నడు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా మళ్లీ గెలిచేది బీఆరెస్సే. 105 సీట్లు వస్తయని ఒకాయన మొన్న వచ్చి చెప్పిండు. ఎగ్జిట్ పోల్స్‌లో ఒకడు 11 వస్తయన్నడు. ఇంకొకడు ఒకటే వస్తదన్నడు. రెండు నుంచి మూడు వస్తయని ఇంకో ఆయన అన్నడు. 11 వస్తే పొంగిపోయేది లేదు. తక్కువ వస్తే కుంగిపోయేది లేదు. ఎలక్షన్లు చాలా చూసినం. ఏదేమైనా భవిష్యత్తు మనదే...'అని మాజీ సీఎం చెప్పారు.

కాంగ్రెస్ వాళ్లకు పాలన తెలియదు


'నోటికి హద్దు లేకుండా హామీలు ఇచ్చిన్రు. ఆరునెలల్లో అంతా తలకిందులైంది. కళ్యాణలక్ష్మి, రైతుబంధు, కేసీఆర్ కిట్, దళితబంధు అన్నీ బందయ్యాయి. గీత కార్మికులను వేధిస్తున్నారు. కల్లు గీసి అమ్ముకునే గౌడలను జైళ్లల్ల పెడుతున్నారు. ఒకరు కాదు అన్ని వర్గాలను కాంగ్రెస్ మోసం చేసింది. ఇంత తొందరగ రావద్దు. కానీ అనతికాలంలోనే ఈ ప్రభుత్వం అప్రదిష్టపాలైంది. ప్రజాగ్రహానికి గురైంది. కాంగ్రెస్ వాళ్లతో ఏంకాదు. వారికి పాలన తెలియదు. అనుభం లేదు. అనుకోకుండా గెలిచిన గెలుపును ఎట్ల మలుచుకోవాలో తెలుస్తలేదు..'అని కేసీఆర్ విమర్శించారు.

లోగో ప్రజల గుండెల మీద ఉంటది

'రాష్ట్ర ప్రభుత్వ లోగో ప్రజల గుండెల మీద ఉంటది. అప్పట్లో ఏం చేసినా, పదులు, వందల సంఖ్యలో కూర్చొని మాట్లాడి నిర్ణయం తీసుకునే వాళ్లం. సమిష్టి నిర్ణయంతో చేసినం. దేవుడిచ్చిన ఆయుష్షు, చివరి శ్వాస ఉన్నంత వరకు తెలంగాణ కోసమే పనిచేస్తా..' అని కేసీఆర్ అన్నారు.

నైతిక విజయం మాదే

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో 300 ఓట్ల కాంగ్రెస్ బలం 653 ఓట్లకు పెరిగింది
- మంత్రి జూపల్లి



సాక్షి, హైదరాబాద్: మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీనే నైతిక విజయం సాధించిందని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు వ్యాఖ్యానించారు. మొత్తం 1437 ఓట్లకుగాను బీఆర్ఎస్ అభ్యర్థి కేవలం 111 ఓట్లతో గెలుపొందారని, 300 ఉన్న కాంగ్రెస్ బలం 653 ఓట్లకు పెరిగిందని విశ్లేషించారు. ఆదివారం హైదరాబాద్‌లో మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్, బీజేపీలకు చెందిన స్థానిక ప్రజాప్రతినిధులు కూడా కాంగ్రెస్ పార్టీకి ఓటేశారని చెప్పారు. ఈ ఎన్నికల్లో గెలిచినంత మాత్రాన కేటీఆర్ ఏదో మాట్లాడడం సరైంది కాదని, పార్లమెంటు ఎన్నికల్లో ప్రజాతీర్పు వచ్చిన తర్వాత మాట్లాడాలని జూపల్లి సూచించారు. తెలంగాణలో ఎవరు భూస్థాపితం అవుతారో మరో 48 గంటల్లో తేలుతుందనీ, బీఆర్ఎస్ భూస్థాపితం కాబోతుందని జోస్యం చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌లాగా కాంగ్రెస్ పార్టీ ఫిరాయింపులకు పాల్పడలేదని, తప్పుడు పద్ధతులను అవలంబించలేదన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో నిజాయితీగా బరిలో నిలిచిన కాంగ్రెస్ అభ్యర్థిని మంత్రి జూపల్లి అభినందించారు.

అరణ్యభవన్‌లో దశాబ్ది ఉత్సవాలు

సాక్షి, హైదరాబాద్: అటవీ శాఖ ప్రధాన కార్యాలయం అరణ్య భవన్‌లో ఆదివారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పీసీసీఎఫ్ ఆర్ఎం డోబ్రియాల్ జాతీయ జెండాను ఎగురవేసి రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఉన్నతాధికారులు సువర్ణ, ఏలు సింగ్ మేరు, సునీత భగవత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ, ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటాలకు నివాళులర్పించారు.

జాక్‌పాట్ సీఎంకు ఉద్యమ చరిత్ర తెలియదు

- విధ్వంస గాయాలు మాన్పుకున్న ఘనకీర్తి తెలంగాణ సొంతం
- రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం నాడు కూడా జై తెలంగాణ అనలేని మూర్ఖుడు
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ ఫైర్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం నాడు కూడా జై తెలంగాణ అనలేని మూర్ఖుడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు మండిపడ్డారు. శుభాకాంక్షల సందేశంలోనూ జై తెలంగాణ అనలేదని, జాక్‌పాట్ ముఖ్యమంత్రి రేవంత్‌కు తెలంగాణ ప్రజల త్యాగాలు, ఉద్యమ చరిత్ర తెలియదని అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా బీఆర్ఎస్ కార్యాలయం తెలంగాణ భవన్‌లో జాతీయ పతాకాన్ని, పార్టీ జెండాను ఎగురవేసిన అనంతరం కేటీఆర్ మాట్లాడారు.

ప్రజల ఆకాంక్షకు పురుడు పోసింది కేసీఆర్

'సీఎం రేవంత్ మూర్ఖుడు.. దశాబ్ది ఉత్సవాలను కేవలం ఒక్క రోజుకే పరిమితం చేశారు. బీఆర్ఎస్ అధికారంలో ఉంటే నెల రోజుల పాటు సంబురాలు నిర్వహించే వాళ్లం. మలిదశ ఉద్యమంతో 2001లో టీఆర్ఎస్‌తో కొత్త విప్లవాన్ని సృష్టించి చరిత్రను మలుపు తిప్పి తెలంగాణ ఆకాంక్షకు కేసీఆర్ పురుడు పోశారు. ఆధునిక భారత దేశం కళ్లారా చూసిన మరో స్వాతంత్ర్య పోరాటం తెలంగాణ ఉద్యమం. సబ్బండ వర్గాలు కొట్లాడి, పోట్లాడి సాధించుకున్న ప్రత్యేక రాష్ట్రం మనది. అమరుల ప్రాణత్యాగాల పునాదులపై ఏర్పడిన తెలంగాణ దశాబ్దాల స్వరాష్ట్ర కలను సాకారం చేసుకొని దశాబ్దం గడిచిన సందర్భమిది. 60 ఏళ్ల విధ్వంస గాయాలను పదేళ్ల వికాసంతో మాన్పుకున్న ఘనకీర్తి తెలంగాణ సొంతం. తెలంగాణ మరింతగా అభివృద్ధి చెంది దేశానికి ఆదర్శంగా నిలవాలని కోరుకుంటున్నా..'అని కేటీఆర్ పేర్కొన్నారు.


తెలంగాణ భవన్‌లో జాతీయ జెండా ఆవిష్కరణలో కేటీఆర్

ఘనంగా వేడుకలు

తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలు బీఆర్ఎస్ కార్యాలయం తెలంగాణ భవన్‌లో ఆదివారం ఘనంగా జరిగాయి. ఉదయం 9 గంటలకు పార్టీ కార్యాలయానికి చేరుకున్న కేటీఆర్.. తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేయడంతో పాటు అమరులకు నివాళి అర్పించారు. అనంతరం పార్టీ సీనియర్ నేతలతో కలిసి జాతీయ జెండా, పార్టీ జెండాను ఎగురవేశారు. తర్వాత ఉద్యమ జ్ఞాపకాలతో ఏర్పాటు చేసిన 'తెలంగాణ యాది'ఫోటో ఎగ్జిబిషన్‌ను తెలంగాణ అమరుడు కానిస్టేబుల్ కిష్టయ్య భార్య పద్మావతి, కూతురు ప్రియాంక చేతుల మీదుగా ప్రారంభించారు. ఉద్యమ ఘట్టాలతో పాటు పదేళ్ల బీఆర్ఎస్ పాలనకు అద్దం పట్టే రీతిలో ఏర్పాటు చేసిన ఈ ఫోటో గ్యాలరీని కేటీఆర్ నేతలతో కలిసి సందర్శించారు.

అమరులకు నివాళులర్పించిన కేసీఆర్

బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్ ఆదివారం ఉదయం 11.30కు తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. పార్టీ నేతలు ఆయనకు గులాబీలతో స్వాగతం పలికారు. తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసిన కేసీఆర్ అమరులకు నివాళి అర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో గంట 20 నిమిషాల పాటు సుదీర్ఘ ప్రసంగం చేశారు. రాష్ట్ర సాధన ఉద్యమ జ్ఞాపకాలను మననం చేసుకోవడంతో పాటు రాబోయే రోజుల్లో పార్టీ అనుసరించే పంథాను వివరించారు. అంతకుముందు మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆట పాటలతో హోరెత్తించారు. సమావేశం ముగిసిన తర్వాత కళింగ భవన్‌లో కేటీఆర్ నేతలతో కలసి భోజనం చేశారు.

కానిస్టేబుల్ కిష్టయ్య కుటుంబానికి కేసీఆర్ అండ

కూతురు వైద్యవిద్యకు మళ్లీ ఆర్థికసాయం

- ఎంఎస్ ఫీజుకు అవసరమైన రూ.24 లక్షలు చెక్కురూపంలో అందజేత
- కిష్టయ్య కుటుంబంతో కలిసి భోజనం చేసిన బీఆర్ఎస్ అధినేత



సాక్షి, హైదరాబాద్: కానిస్టేబుల్ కిష్టయ్య కుటుంబానికి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మరోసారి అండగా నిలిచారు. తెలంగాణ కోసం కిష్టయ్య ప్రాణత్యాగం చేసిన విషయం తెలిసిందే. పెద్దను కోల్పోయిన కుటుంబానికి నేనున్నానంటూ కేసీఆర్ ఆనాడే అండగా నిలిచారు. కిష్టయ్య మరణించిన నాటికి, ఆయన కొడుకు, కూతురు చిన్నపిల్లలు కావడంతో వారి చదువుతో సహా కుటుంబానికి వెన్నుదన్నుగా ఉన్నారు. కిష్టయ్య బిడ్డ ప్రియాంక ఎంబీబీఎస్ చేయడానికి అవసరమైన ఆర్థికసాయం కేసీఆర్ గతంలోనే అందించారు. ఎంబీబీఎస్ పూర్తి చేసిన ప్రియాంక ఇప్పుడు పీజీ చదువుతోంది. మెడికల్ కాలేజీలో కట్టాల్సిన ఫీజుకు అవసరమైన రూ.24 లక్షలను చెక్కురూపంలో ఆదివారం నందినగర్‌లోని తన నివాసంలో కిష్టయ్య కుటుంబానికి కేసీఆర్ అందించారు. అనంతరం వారితో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా కిష్టయ్య కొడుకు రాహుల్ చేస్తున్న ఉద్యోగం గురించి కేసీఆర్ ఆరా తీశారు. వారి కష్ట సుఖాలను అడిగి తెలుసుకున్నారు.

అమ్మకు కష్టం కలిగించొద్దు : కేసీఆర్

'రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేస్తూ నాయిన చనిపోయినప్పుడు మీరు చిన్నపిల్లలు. కష్టకాలంలో కూడా అమ్మ మిమ్ములను ఎంతో కష్టపడి సాదుకుంది..చదివించింది. ఇప్పుడు మీరు ప్రయోజకులయ్యారు. అమ్మకు ఏ కష్టం రాకుండా చూసుకోవాలి. మీకు ఏ సమయంలోనైనా నా సహకారం ఉంటుంది.'అని కేసీఆర్ వారికి భరోసా ఇస్తూ బాధ్యతలను గుర్తు చేశారు.

నా కుటుంబానికి అండగా ఉన్న దేవుడు కేసీఆర్ : కిష్టయ్య భార్య పద్మావతి

'నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్ష నెరవేరి 10 సంవత్సరాలు పూర్తయ్యింది. నా భర్త పోలీస్ కిష్టయ్య దూరమై 15 సంవత్సరాలు గడిచాయి. ఆనాడు చిన్న పిల్లలను పట్టుకొని తండ్రిలాంటి కేసీఆర్ సార్ దగ్గరకు వచ్చాను. మీ కుటుంబానికి నేనున్నానని ఆనాడు కేసీఆర్ మాట ఇచ్చాడు. నువ్వు బాధపడకమ్మా... నీ పిల్లలను నేను చూసుకుంటా అని ఇచ్చిన మాట ప్రకారమే, మా పిల్లలు, కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉన్నారు. 6వ తరగతి నుంచి ఇప్పటివరకు అన్ని విధాలా ఆసరా అందిస్తున్నారు'అని భావోద్వేగంతో కేసీఆర్‌ను దేవుడంటూ కొనియాడారు.


డీజీపీ కార్యాలయంలో ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని డీజీపీ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. మల్టీజోన్–2 ఐజీ జి.సుధీర్ బాబు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వందన సమర్పణ చేశారు. అసిస్టెంట్ ఐజీ ఎం.రమణ కుమార్, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ సీహెచ్.యోగేశ్వరరావు, స్టోర్స్ డీఎస్పీ ఎ.వేణుగోపాల్, డీజీపీ కార్యాలయ సిబ్బంది తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అదేవిధంగా లక్డీకపూల్‌లోని ఇంటెలిజెన్స్ ప్రధాన కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇంటెలిజెన్స్ అదనపు డీజీపీ బి.శివధర్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇంటెలిజెన్స్ కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహేశ్ భగవత్‌కు ప్రెసిడెంట్ పోలీస్ మెడల్



సాక్షి, హైదరాబాద్: సీనియర్ ఐపీఎస్ అధికారి, రాష్ట్ర రైల్వే, రోడ్డు భద్రత అడిషనల్ డీజీ మహేశ్ ఎం.భగవత్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రెసిడెంట్ పోలీస్ మెడల్‌ను ఆదివారం రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో భాగంగా పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రదానం చేశారు. అత్యుత్తమ సేవలకు ఐపీఎస్ మహేశ్ భగవత్‌కు 2022లో కేంద్ర ప్రభుత్వం ప్రెసిడెంట్ పోలీస్ మెడల్‌ను ప్రకటించింది. వేడుకల్లో భాగంగా ఆదివారం ఈ అవార్డును సీఎం రేవంత్ నుంచి మహేశ్ భగవత్ అందుకున్నారు. గతంలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పోలీస్ మెడల్స్‌ను సైతం పలువురు పోలీసు అధికారులు, సిబ్బందికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రదానం చేశారు.


దశాబ్ది వేడుకల సందర్భంగా ఆదివారం రాత్రి వెలుగులీనుతున్న హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్..

'స్థానిక' ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం

- సిట్టింగ్ స్థానాన్ని కాపాడుకున్న గులాబీ పార్టీ
- 109 ఓట్ల తేడాతో నవీన్‌కుమార్‌రెడ్డి గెలుపు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థి నవీన్‌కుమార్ రెడ్డి గెలుపొందారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర కళాశాలలో ఉప ఎన్నిక కౌంటింగ్ చేపట్టారు. కాంగ్రెస్ అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డిపై బీఆర్ఎస్ అభ్యర్థి నవీన్ కుమార్ రెడ్డి 109 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. దీంతో బీఆర్ఎస్ సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకున్నట్టయింది. గత ఎన్నికల్లో ఈ స్థానం నుంచి గెలుపొందిన బీఆర్ఎస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌లో చేరారు. కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొంది ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలోనే గత మార్చి 28న ఉపఎన్నిక జరిగింది. స్వతంత్ర అభ్యర్థిగా సుదర్శన్ గౌడ్ సైతం ఈ ఎన్నికల్లో పోటీ చేశారు. నియోజకవర్గంలో మొత్తం 1,439 మంది ఓటర్లు ఉండగా, 1,437 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇద్దరు ఎంపీటీసీలు ఓటు వేయలేదు. ఓట్ల లెక్కింపును ఏప్రిల్ 2నే చేపట్టాల్సి ఉండగా, లోక్‌సభ ఎన్నికల కోడ్ నేపథ్యంలో జూన్ 2 తేదీకి వాయిదా పడింది.


నవీన్‌రెడ్డిని అభినందిస్తున్న కేసీఆర్

మొదటి ప్రాధాన్యతా ఓట్లతోనే..

ఆదివారం ఉదయం 8 గంటల నుంచి కౌంటింగ్ ప్రారంభమైంది. పోలైన ఓట్లలో 1,416 ఓట్లు చెల్లగా.. 21 తిరస్కరణకు గురయ్యాయని అధికారులు నిర్ధారించారు. విజయానికి 709 ఓట్లు అవసరమని ఎన్నికల అధికారులు ప్రకటించారు. అభ్యర్థుల వారీగా మొదటి ప్రాధాన్యతా ఓట్లను లెక్కించగా నవీన్‌కుమార్ రెడ్డికి 762 ఓట్లు, జీవన్‌రెడ్డికి 653 ఓట్లు, స్వతంత్ర అభ్యర్థి సుదర్శన్‌గౌడ్‌కు ఒక్క ఓటు పోల్ అయ్యాయి. మొదటి ప్రాధాన్యత ఓట్లతోనే కోటాకు మించి 762 ఓట్లు రావడంతో తన సమీప ప్రత్యర్థి మన్నె జీవన్‌రెడ్డిపై 109 ఓట్ల మెజారిటీతో నవీన్‌రెడ్డి గెలిచినట్లుగా అధికారులు ప్రకటించారు. ఈ మేరకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రవినాయక్ ఆయనకు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు.

పట్టు నిలుపుకున్న గులాబీ పార్టీ

ఈ ఎమ్మెల్సీ స్థానంలో మొత్తం 1,439 మంది ఓటర్లు ఉండగా అధిక సంఖ్యలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులే ఉన్నారు. అయితే ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రాగా, ఆ వెంటనే ఎమ్మెల్సీ ఉప ఎన్నిక జరగడంతో తమకు అనుకూలంగా క్రాస్ ఓటింగ్ జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ భావించింది. కానీ అధికార పార్టీకి ధీటుగా గులాబీ పార్టీ తమ ప్రజాప్రతినిధులతో క్యాంపులను నిర్వహించి ఓటు బ్యాంకును కాపాడుకోవడంతో పాటు స్థానికంగా పట్టు నిలుపుకుంది.

'పాలమూరు' విజయంతో మరింత బాధ్యత: కేటీఆర్

- బీఆర్ఎస్ గెలుపు తెలంగాణ రాజకీయాల్లో కీలక మలుపు
- కాంగ్రెస్ ప్రలోభాలకు నిలువునా పాతరేసిన ఎన్నిక ఇది

సాక్షి, హైదరాబాద్: మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉపఎన్నికలో గెలుపు తమ పార్టీపై మరింత బాధ్యత పెంచిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. పార్టీ అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డి విజయం సాధించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు.ఈ గెలుపు మరిన్ని విజయాలకు దారితీస్తుందని, భవిష్యత్‌లోనూ మరిన్ని విజయాలు సాధిస్తామని కేటీఆర్ ఆశాభావం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ సొంత జిల్లాలో బీఆర్ఎస్ సాధించిన గెలుపు మారుతున్న తెలంగాణ రాజకీయ ముఖచిత్రంలో కీలక మలుపుగా ఉంటుందన్నారు. అధికార పార్టీ ప్రలోభాలకు నిలువునా పాతరేసిన ఎన్నికగా పేర్కొంటూ ఆరు నెలల్లోనే కాంగ్రెస్ పాలనా వైఫల్యాలను ఈ ఫలితం ఎత్తి చూపిందని చెప్పారు. హరీశ్‌రావు కూడా నవీన్ గెలుపు పట్ల హర్షం వ్యక్తం చేశారు.

నవీన్‌కుమార్‌రెడ్డికి కేసీఆర్ అభినందనలు

ఎమ్మెల్సీ ఉపఎన్నికలో విజయం సాధించిన నవీన్‌కుమార్‌రెడ్డిని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అభినందించారు. ఆదివారం ఉదయం ఉప ఎన్నిక ఫలితం వెలువడిన నేపథ్యంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి తదితరులు నందినగర్ నివాసంలో కేసీఆర్‌ను కలిశారు. నవీన్‌కుమార్‌రెడ్డిని కేసీఆర్ ఆలింగనం చేసుకుని అభినందించారు. మహబూబ్‌నగర్ జిల్లా నేతల సమష్టి కృషికి ఈ విజయం అద్దం పడుతోందని కేసీఆర్ అన్నారు. అధికారం కోల్పోయినా పార్టీ వెంట నడిచి తాను నిర్ణయించిన అభ్యర్థికి ఓట్లు వేసిన పాలమూరు స్థానిక సంస్థల ప్రతినిధులకు కేసీఆర్ కృతజ్ఞతలు తెలిపారు.



మీ సిద్ధాంతం మీ ప్రయోగంతో ఏకీభవించకపోతే,
అది తప్పు. అది ఎంత అందమైనదైనా అక్కరకు రానిదే.
– రిచర్డ్ ఫెయిన్‌మాన్

సాక్షి
సోమవారం, 3 జూన్ 2024

వాన జ్ఞానం

ప్రపంచమంతటా సృష్టిగాథలు ఒక్కలానే ఉంటాయి. ఆదిలో అంతా జలమయమే. ఎందుకనీ? వర్షాలు... క్షణం తెరిపివ్వని వర్షాలు... బ్రహ్మాండమంత కుండతో ఎత్తిపోసినట్టు నిరంతర ధారాపాతాలు... ఆ తర్వాత ఎప్పుడో సూర్యుడూ, చంద్రుడూ, నక్షత్రాలూ పుట్టాయి. భూమి పైకి తేలింది. జీవి పుట్టింది. మనిషితో సహా రకరకాల రూపాల్లోకి పరిణామం చెందింది. వర్షం పడుతూనే ఉంది కానీ, నిర్విరామం నుంచి విరామానికి మారింది. చెప్పొచ్చేదేమిటంటే, వర్షం సృష్టి అంత ప్రాచీనం; ప్రకృతి అంత పురాతనం.

మనిషి పుట్టిన చోటనే ఎప్పుడూ లేడు కనుక భ్రమణజీవి; అంతకన్నా ఎక్కువగా భ్రమల జీవి. తను ప్రకృతిలో భాగమన్న సంగతి మరచి; తన జీవితానికి, తన నిర్ణయాలకు తనే కర్తనన్న భ్రమ వాటిలో ఒకటి. శీతోష్ణాలను మించి ఆ భ్రమను పటాపంచలు చేయగలిగింది వర్షాలే. మనం బయటికి వెళ్లడానికి సిద్ధమవుతాం. ఆకాశం మబ్బు పట్టి ఉన్నా వర్షం రాదులే అన్న భ్రమతో గడప దాటుతాం. చినుకుతో మొదలై చూస్తుండగానే ఆకాశానికి చిల్లిపడిందా అన్నంత ఉధృతితో వర్షం ముంచెత్తుతుంది. చెట్టు కిందికో, చూరు కిందికో, మరో కప్పు కిందికో పరుగుతీస్తాం. వర్షనిర్బంధం నుంచి బయటపడడానికి నిలువుకాళ్ళ తపస్సు చేస్తాం. మనలానే, మనపక్కకి ఎవరెవరో అపరిచితులు వచ్చి చేరతారు. మాటలు కలుస్తాయి, ముచ్చట్లుగా మారతాయి, స్నేహాలను అల్లుకుంటాయి, ప్రేమలు మొలకెత్తుతాయి, అవి పెళ్లిళ్లకూ దారితీయవచ్చు. ఒక్కోసారి ఒకే ఒక్క వర్షం ఊహించని సన్నివేశాలను కల్పించి జీవితాలను పెద్దమలుపు తిప్పొచ్చు.

ప్రపంచ సాహిత్యంలో వర్షానుభవాన్ని చిత్రించని కథా, కావ్యం, నవలా దాదాపు ఉండవు. మనిషి బుద్ధిని బంకలా పట్టుకున్న మృగత్వం, కులమతాల భేదాలు, ధనిక, నిర్ధనిక తారతమ్యాలు, చదువు, అధికారంతో పుట్టే దుర్గర్వాలు సహా అన్ని రకాల మురికినీ, మకిలినీ కడిగి శుభ్రం చేసి మళ్ళీ మనిషిని చేయగల మంత్రజలం వర్షం. సమాజం గురించి మనుషుల గురించి నిశ్చితాభిప్రాయాల ఇరుకులో కరకుదేరిన అడ్వొకేట్ రావునూ, అతను చీదరించుకున్న బిచ్చగత్తెనూ ఒకచోటికి చేర్చిన పాలగుమ్మి పద్మరాజు కథ 'గాలివాన'నే చూడండి. ఆ క్షణంలో అతనికి అవసరమైన ఆ బిచ్చగత్తె ఆలింగనపు వెచ్చదనం అందించి అతనిలోని అరవయ్యేళ్ళ అజ్ఞానాహంకారాల జడలమర్రిని ఒక్క గాలివాన కూకటివేళ్ళతో కుప్పకూల్చింది. అతని బతుకు పలకను స్వచ్ఛజలాలతో పూర్తిగా ప్రక్షాళించి మానవత్వపు కొత్త ఓనమాలు దిద్దించింది. దాశరథి రంగాచార్య కథ 'తామరపూలు'లో చిట్టిపంతులికి తామరలే లోకం. ఋతుభ్రమణం గురించిన జ్ఞానం లేని ఆ అబ్బాయి ఎండాకాలంలో అవి కనిపించకపోయేటప్పటికి కలవరపడిపోయాడు. వానలు పడి తిరిగి కనిపించేవరకూ వాటికోసం ఒక జీవితకాలపు నిరీక్షణ. అలా ప్రకృతిపాఠాల బోధనలో వాన జ్ఞానకళిక అయింది. సొగసుతోపాటు ప్రకృతిలోని లయను, సమవర్తనను, ఒక్కోసారి అవి కలిగించే విషాదం గురించిన ఎరుకను తట్టిలేపే కథ మహేంద్ర రచించిన 'హొగినేకల్'. ఓ కుటుంబం ఆ కావేరి జలపాతాన్ని చూడడానికి చిన్న పాపను తీసుకుని వానను వెంటబెట్టుకుని వెళ్లింది. కావేరికి వరదెత్తి ఆ వరదలో పాప కొట్టుకుపోయింది. జీర్ణించుకోవడం కష్టమే కానీ; 'ఇదే ప్రకృతి. ఇదే ప్రకృతిధర్మం. అది మంచిదీ కాదు, చెడ్డదీ కాదు; దాని దృష్టిలో అన్నీ సమానం. సృష్టిని అంగీకరించే మనిషి, లయను కూడా అంగీకరిస్తే పెనుగులాట ఉండ'దంటుందీ కథ. వాన మన వ్యక్తిత్వాలకు, ఆలోచనలకు ఒక స్పష్టతనివ్వడానికి కూడా ఎలా నేపథ్యమవుతుందో కుప్పిలి పద్మ కథ 'గోడ' చెబుతుంది. 'వాన. తూర్పు సముద్రపు కెరటాల నురగల మీద వాన. యారాడ కొండల గరిక మీద వాన. రుషికొండ ఎగుడుదిగుడుల మీద వాన...' అని మొదలయ్యే ఈ కథలో స్వతంత్రభావాలు కలిగిన ఒక అమ్మాయి తనతో చదువుకున్న ఒక అబ్బాయి గదిలో ఆ వర్షపురాత్రిని గడపాల్సివస్తుంది. అతనిలో మగాడు నిద్రలేచి హద్దుమీరబోతే ఆ అమ్మాయి వారించి గట్టిగా బుద్ధి చెబుతుంది. మహమ్మద్ ఖదీర్ బాబు అద్భుతంగా పునఃకథనం చేసి సవ్యాఖ్యానంగా సంకలనం చేసిన 'నూరేళ్ళ తెలుగు కథ'లో ఈ నాలుగు కథలూ చేరాయి.

సహస్ర బాహువులతో జలఖడ్గాలు దూసి, ఉరుముల పెనుగర్జనలతో, మెరుపుల మిరుమిట్లతో వర్షం ఊరూవాడా ఆక్రమించుకుని జనాన్ని గృహనిర్బంధంలో ఉంచినప్పుడు ఇంకెన్ని చిత్రవిచిత్ర సన్నివేశాలు ఏర్పడగలవో తిలక్ కథ 'ఊరి చివరి ఇల్లు' చెబుతుంది. అలాంటి ఓ వర్షపురాత్రి ఒక ఆగంతక యువకుని రాక దుఃఖపూరితమైన ఒక యువతి జీవితంలో కొత్త ఆశా, ఉత్సాహాల జడివానగా మారి తెల్లవారేసరికి వానతోపాటే అదీ వెలసి అయ్యో అనిపిస్తుంది. వర్షం కలిగించే అలజడి సరే, అంతకన్నా ఎక్కువగా వర్షాభావం సృష్టించే కన్నీటి జలపాతాల సంగతేమిటి? తల్లావజ్ఝుల పతంజలి శాస్త్రి గారి 'ఆమె దనంతపురం', 'పిచ్చి లచ్చుమ్మ', 'కదిరమ్మ పేరంటాలు' కథలు ఆ విషాద పార్శ్వాన్ని అనితరసాధ్యంగా అక్షరబద్ధం చేస్తాయి.

మరిన్నికొత్త అనుభవాలను మబ్బులతో మూటగట్టి మళ్ళీ వర్షరుతువు వస్తోంది. అవి తీపినే నింపాలని కోరుకుంటూ హర్షోల్లాసాలతో పునఃస్వాగతం చెబుదాం.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, **తిథి:** బ.ద్వాదశి రా.11.05 వరకు, తదుపరి త్రయోదశి **నక్షత్రం:** అశ్విని రా.11.20 వరకు, తదుపరి భరణి, **వర్జ్యం:** రా.7.35 నుండి 9.05 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.24 నుండి 1.16 వరకు తదుపరి ప.3.00 నుండి 3.52 వరకు, **అమృతఘడియలు:** సా.4.33 నుండి 5.56 వరకు.

సూర్యోదయం : 5.28
సూర్యాస్తమయం: 6.27
రాహుకాలం : ఉ.7.30 నుండి 9.00 వరకు
యమగండం : ఉ.10.30 నుండి 12.00 వరకు

శత్రు దేశాల గూఢచారి మిత్రులు

కామెంట్



కరణ్ థాపర్

ఒకరిది భారత్, మరొకరిది పాకిస్తాన్. ఒకరిది 'రా', ఇంకొకరిది 'ఐఎస్ఐ.' వారిద్దరూ ఒకప్పుడు వైరి దేశాల గూఢచార సంస్థల అధిపతులు. ఇద్దరూ కలిసి తాజాగా 'కోవర్ట్: ద సైకాలజీ ఆఫ్ వార్ అండ్ పీస్' అనే పుస్తకం రాశారు. వాళ్లమధ్య అసలీ స్నేహం ఎలా మొదలైంది? ఇంతకీ ఈ పుస్తకంలో ఏం ఉంది? చాలానే ఉన్నాయి. గూఢచారి అధినేతల ఆంతరంగిక జీవితాలు, ప్రేరణలు, అంతర్లీన మానసిక స్థితుల అన్వేషణ అది. అంతేకాదు, భారత్–పాక్ దేశాల శాంతి సాధనకు తమ తమ దేశాల పట్ల చిన్నపాటి అవిధేయ సంకేతం కూడా లేకుండా వారు ముందుకు వెళ్లిన మనోహరమైన విధానం కూడా పుస్తకంలో కనిపిస్తుంది.

బహుశా జాన్ లి కరే(గూఢచర్య కథాంశాల బ్రిటన్ రచయిత) కూడా దీనినొక ఏమాత్రం నమ్మదగని అసంభవంగా భావించి ఉండేవారు. సి.ఐ.ఎ.(అమెరికా నిఘా సంస్థ), కె.జి.బి.(రష్యా నిఘా సంస్థ)ల అధినేతలు కలిసి పని చేసేందుకు ఒక అంగీకారానికి రావటమే ఇది. కానీ నమ్మేందుకు కష్టంగా ఉన్నా, దక్షిణాసియాలో ఇటువంటిదే ఒకటి ఇంకా ఎవరూ గుర్తించకుండా, ఎవరి గమనింపునకూ రాకుండా సంభవించింది. భారత్–పాకిస్తాన్‌ల గూఢచారి సంస్థలైన 'రా' (రీసెర్చ్ అండ్ ఎనాలిసిస్ వింగ్), ఐ.ఎస్.ఐ. (ఇంటర్–సర్వీసెస్ ఇంటెలిజెన్స్)ల మాజీ అధిపతులు స్నేహితులుగా మారి తాము ఉమ్మడిగా కలిసి రాసిన పుస్తకాలకు పరస్పరం సహకరించుకున్నారు. అమర్‌జీత్ సింగ్ దులత్, జనరల్ అసద్ దుర్రానీ తమ తాజా పుస్తకం 'కోవర్ట్: ద సైకాలజీ ఆఫ్ వార్ అండ్ పీస్'ను ఈ నెలలో ఆవిష్కరించారు (నీల్ క్రిషణ్ అగర్వాల్ మరో సహ రచయిత). వారి మొదటి పుస్తకానికి 'ద స్పై క్రానికల్స్' అని సముచితమైన పేరే పెట్టారు.

ఈ అనుబంధం ఎలా మొదలైంది? చూస్తుంటే బ్యాంకాక్‌లోని ఛావ్ ప్రాయా నదిపై ఒక చిన్న నౌకలో మొదలైనట్లుంది. ఉగ్రవాదంపై ఒక అనధికార చర్చా కార్యక్రమానికి వాళ్లిద్దరూ ఆ నౌకలోని ఆహ్వానితులు. దులత్‌ని మాట్లాడమని ఆహ్వానించారు. ఇలాంటి చర్చా కార్యక్రమాలకు ఆయన కొత్త కనుక సంకోచంగా, అనాసక్తిగా ఉండిపోయారు. దుర్రానీ ఆ సంగతి గమనించి దులత్‌కు మద్దతుగా నిలిచారు. ఆ సందర్భం గురించి దులత్... తమ మధ్య 'కెమిస్ట్రీ' కుదిరిందని అంటారు. ఆ తర్వాత అనతికాలంలోనే వారిద్దరూ స్నేహితులైపోయారు.

'కోవర్ట్' పుస్తకం ఆ ఇద్దరి మధ్య సారూప్యాలను, వైరుధ్యాలను వెల్లడిస్తుంది. చిన్నతనంలో దుర్రానీ ''ఎల్లప్పుడూ ఒంటరిగా ఉండటాన్ని ఇష్టపడేవారు''. పెద్దయ్యాక కూడా ''సమూహంలో భాగం కావాలని కోరుకోలేదు''. చిన్నవాడిగా ఉన్నప్పుడు దులత్‌కు కొద్దిమంది స్నేహితులు ఉండేవారు. వారిలో ''ఎక్కువగా పనివాళ్ల పిల్లలు''. ఆయన మాటల్లోనే చెప్పాలంటే... ''తనకై తను ఉండగలగటం, తనను తను కాపాడుకోవటం నేర్చుకున్నారు''.

ఇక భవిష్యత్తు ఐఎస్ఐ చీఫ్... స్కూల్లో అత్యుత్తమ ప్రతిభను కనబరిచేవాడు. ''నేను ఎల్లప్పుడూ దాదాపు ప్రతి సబ్జెక్టులో మొదటి నలుగురు లేదా ఐదుగురిలో ఒకరిగా ఉండేవాడిని'' అంటారాయన. దులత్ అందుకు విరుద్ధం. ఆయన ''చాలా సగటు విద్యార్థి''. కానీ ఈ భవిష్యత్తు 'రా' అధిపతి క్రీడల్లో తన తడాకా చూపించారు. స్కూల్లో ఆయన ''ప్రతి ఆటా ఆడాడు''. ఒంటరి దుర్రానీకి ''సైక్లింగ్ అంటే చాలా ఇష్టం''. కానీ ''లాహోర్ వంటి నగరంలో సైకిల్ తొక్కేందుకు దూరపు స్థలం ఉండేది కాదు''.



మాజీ 'గూఢచారి' అధిపతులు: అమర్‌జీత్ సింగ్ దులత్ (రా– ఇండియా), జనరల్ అసద్ దుర్రానీ (ఐఎస్ఐ–పాకిస్తాన్)



వ్యక్తిగతంగా దుర్రానీ ఎలా ఉండేవారో, అలాంటి వ్యక్తిగానే ఆయన ఎదగటంలో ఆశ్చర్యం ఏమీ లేదు. ''నేను భిన్నం, నేను నాలా ఉండే స్వభావం నాది'', ''నా గుణం ఎప్పుడూ కూడా కాస్త తిరుగుబాటు ధోరణితో ఉంటుంది'' అంటారు దుర్రానీ. దులత్ ప్రధానంగా తల్లిదండ్రుల మాట వినటానికీ, విద్యాబుద్ధులు నేర్పిన క్రమశిక్షణ ప్రకారం నడచుకోటానికీ సిద్ధంగా ఉంటారు. ''తగిన పనులు, తగని పనులు అని ఉంటాయి'' అనే నమ్మకంతో ఆయన పెరిగాడు. ఇది ఆయనకు స్పష్టమైన నైతిక దిశా నిర్దేశం చేసిందని నేను అనుకుంటాను.

దుర్రానీ సైన్యంలో చేరారు. ''ఆ కారణంగా నేనెప్పుడైనా పశ్చాత్తాపం చెందానని నేను అనుకోను'' అంటారు. దులత్ పోలీస్ అయ్యారు. ఎందుకంటే, ''అంతకన్నా మెరుగైన సర్వీసులలోకి వెళ్లలేకపోయాను'' అని ఆయన అంగీకరిస్తారు. అయితే యాదృచ్ఛికమో లేదా అనుకోని అదృష్టమో ఇద్దరూ కూడా ఇంటెలిజెన్స్ సంస్థల వైపు మళ్లారు.

''అనుకోకుండా నేను అక్కడికి చేరాను'', ''ఆ విషయాన్ని ఒప్పుకుంటాను'' అంటారు దుర్రానీ నవ్వుతూ. ''ఇంటెలిజెన్స్ అంటే ఏంటో తెలియకుండానే'' దులత్ ఇంటెలిజెన్స్ బ్యూరోలో చేరారు. అయినప్పటికీ ఇద్దరూ అత్యున్నత స్థాయికి చేరుకుని, తమ తమ దేశ ప్రజల చేత ఐఎస్ఐ, 'రా' సంస్థల అత్యుత్తమ మాజీ అధిపతులుగా గుర్తింపు పొందారు. కనుక వారు విధిని నమ్ముతారని నేను అనుకోవచ్చా? జేమ్స్ బాండే ఇలాంటి మూఢ నమ్మకాలను ఎప్పుడూ ఎకాఎకిన కొట్టిపడేయలేదు. వీళ్లు మాత్రం అలా ఎందుకు చేస్తారు?

''కుండబద్దలు కొట్టటం'' అని దులత్ ఎప్పుడూ అంటుండే దుర్రానీలోని ''నిర్మొహమాటాన్ని'' దులత్ ఇష్టపడతారు. దుర్రానీ ఉన్నదున్నట్లు బహిరంగంగా మాట్లాడతారు. పాకిస్తాన్ ఆర్మీని విమర్శించటానికి కూడా సంకోచించరు. అలాగే ఆయన భారతీయ సైన్యాన్ని ప్రశంసిస్తున్నట్లుగా కనిపిస్తుంది. అది మరింత కష్టమైన పని. ఆయన అనిన ఒక మాటను మీకు వదిలేసి, నా ముగింపు సరైనదేనా పరిశీలించమని మిమ్మల్ని అడుగుతున్నాను. ''భారతదేశంలో ప్రజలు ప్రతిభ ద్వారా పైకి ఎదిగి ఐ.బి. (ఇంటెలిజెన్స్ బ్యూరో) ని, 'రా'ను చేజిక్కించుకుంటారు. కానీ మా దగ్గర దేశాధ్యక్షుడు, లేదా సైన్యాధ్యక్షుడికి నచ్చిన వ్యక్తి అటువంటి పదవులను చేపట్టవచ్చు. కనుక ఒక మంచి ఐఎస్ఐ చీఫ్ ఎవరు అవగలరు అనే దానికి ఎల్లవేళలా మేము అనుసరించే ఒక ప్రమాణం ఉండదు.''

రహస్యాలను అలా ఉంచండి – 'కోవర్ట్' పుస్తకంలో వీరు 'రా', 'ఐఎస్ఐ' అంతర్గత కార్యకలాపాల పనితీరును బహిర్గతం చేయలేదు. 'ద స్పై క్రానికల్స్' లోనూ వాటి గురించి లేదు. బదులుగా ఈ తాజా పుస్తకం, ''గూఢచారి అధినేతల ఆంతరంగిక జీవితాలు, ప్రేరణలు, అంతర్లీన మానసిక స్థితులను అన్వేషిస్తుంది''. రెండు సూత్రాల మీద ఇది దృష్టి సారించింది. వారు ఎలాంటి మనుషులు? వారు అలా ఎందుకు చేయవలసి వచ్చింది? అనేవి ఆ రెండూ. అంతేకాదు, భారత్–పాక్ దేశాల శాంతి సాధనకు తమ తమ దేశాల పట్ల చిన్నపాటి అవిధేయ సంకేతం కూడా లేకుండా వారు ముందుకు వెళ్లిన మనోహరమైన విధానాన్ని కూడా వివరించింది. వారి అభిప్రాయాలు కూడా తరచూ ఒకేలా ఉన్న విషయం కూడా. చూస్తుంటే, గూఢచారులు చాలా అరుదుగా విభేదిస్తారని అనిపిస్తోంది.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



వెల్ డన్



అందరు అభ్యర్థులు, రాజకీయనాయకులకు... నేననుకోవడం ఇది చాలినంత చెప్పలేదు. మీరు చాలా కష్టపడ్డారు. మీకు బాగా అవసరమైన విశ్రాంతి తీసుకోండి. మీరు చేయాల్సింది చేశారు. ఫలితాల జనాల దగ్గర ఉన్నాయి. ఏది ఏమైనా సరే, మీరు బాగా కష్టపడ్డారు.

– చేతన్ భగత్, రచయిత

ఎంతకైనా...



అధికారం దాహం ఉన్నవాళ్లు, అధికారంలో ఉండటం కోసం ఎవరికైనా వ్యతిరేకంగా ఉండగలరు. కుటుంబం, పార్టీ సభ్యులు, మద్దతు దారులు, పౌరులు, ఎవరైనా... పెద్ద విషయం కాదు.

– శివమ్ శంకర్ సింగ్, రచయిత

ఎటులైనా కష్టమే...



ఎగ్జిట్ పోల్స్ ఫలితాలను వివరించడం మీద మన శక్తులను వెచ్చిస్తే, జూన్ 4 నాటికి(అవి సరైనవిగా తేలితే) మన విశ్లేషణా శక్తి అడుగంటిపోతుంది; ఒకవేళ మన అంచనాలు, వచ్చిన ఫలితాల మధ్య తేడా ఉంటే మనతో మనమే విభేదించుకున్నట్టు ఉంటుంది.

– సుహాస్ పల్శీకర్, ప్రొఫెసర్

ఆదరణ పెరిగిందా?



కాంగ్రెస్ ప్రతినిధి, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ సుప్రియా శ్రీనేత్ యూట్యూబ్ డేటాను వెల్లడించారు: కాంగ్రెస్ పార్టీ యూట్యూబ్ వేదికల మొత్తం వ్యూస్ మార్చ్ 16 నుంచి మే 30 వరకు 61.5 కోట్లు. అదే బీజేపీ వ్యూస్ 14.5 కోట్లు. ఇదే నిజమైతే, దీనికిదే ఒక కథనం.

– ఎం.కె.వేణు, సంపాదకుడు

మారని ఫిర్యాదు



బీజేపీ కేవలం హిందువుల సెంటిమెంట్లనే పట్టించుకుంటోందనీ, బీజేపీ పాలనలోని ఇండియాలో ముస్లింలు అణచివేతకు గురవుతున్నారనీ మనకు ఇప్పుడు ఫిర్యాదులున్నాయి. కానీ మనకు అవే ఫిర్యాదులు స్వాతంత్ర్య కాలంలో కాంగ్రెస్‌తోనూ ఉన్నాయి. బహుశా మనం దీన్ని మనలో మనం పరిష్కరించుకోవాలి.

– ఒమర్ ఘాజీ, రచయిత

మాట్లాడుకుందామా?



కార్గిల్ (1999) గురించిన వాస్తవాన్ని పాకిస్తాన్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ అంగీకరించిన నేపథ్యంలో, ఇండియా–పాకిస్తాన్ మధ్య చర్చలను తిరిగి ప్రారంభించడంలో ఇది ఏమైనా సాయపడగలదా? ఇప్పటికైతే కొన్ని సానుకూల సంకేతాలు కనబడుతున్నాయి.

– హుసేన్ హక్కానీ, పాకిస్తాన్ మాజీ రాయబారి

విలువలేని ప్రాణాలు



ఉత్తరప్రదేశ్, బిహార్, ఒడిశాల్లో వడగాడ్పుల వల్ల 250 మందికి పైగా మరణించారు; అందులో 25 మంది పోలింగ్ అధికారులు. ఇక జమ్ములో బస్సు లోయలో పడి 22 మంది చనిపోయారు; ఢిల్లీలో జరిగిన అగ్నిప్రమాదంలో 8 మంది నవజాత శిశువులు చనిపోయారు. సామాన్య జనాల జీవితానికి అర్థమే లేదు.

– రాణా అయూబ్, జర్నలిస్ట్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి.
ఈ–మెయిల్: editpage@sakshi.com ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

అభిప్రాయం

ప్రాంతీయ, రాజకీయ స్వభావాలు ఒకటి కాదు!


పులివెందుల ప్రజల గురించీ, ఇక్కడి సంస్కృతి గురించీ అభ్యంతరకరంగా మాట్లాడ్డం ఇవ్వాళ ప్రతి ఒక్కరికీ అలవాటు అయిపోయింది. ముఖ్యంగా సోషల్ మీడియాలో ఈ ప్రాంత ప్రజల పట్ల విషం కక్కడం పెరిగిపోయింది. ఇక్కడ జరిగే రాజకీయ సంఘటనలన్నింటికీ మొత్తం పులివెందుల ప్రజలనూ, ఆ ప్రాంతాన్నీ, సంస్కృతినీ తప్పుపడుతూ మాట్లాడుతున్నారు.

ఇప్పటికే పులివెందుల ప్రజల పట్ల మిగతా ప్రాంతాల్లో ఒక చెడు అభిప్రాయాన్ని కలిగించడంలో మీడియా, సినిమా వాళ్లూ, రాజకీయనాయకులూ సఫలీకృతమయ్యారు. ఇప్పుడు సోషల్ మీడియా కూడా తోడవడంతో చివరికి ఈ ధోరణి ఎక్కడికెళ్లి ఆగుతుందో అనే ఆందోళన వ్యక్తమవుతోంది. నిజానికి ఈ ముద్ర మొత్తం రాయలసీమకు ఉంది. ఇక్కడ లేని జీవితాన్ని ఇక్కడిదిగా చూపించి డబ్బు చేసుకోవడంలో సినిమా వాళ్లు ముందున్నారు. ఇవ్వాళ ఏ సినిమా రంగమైతే రాయలసీమనూ... అందులోనూ పులివెందుల వంటి ప్రాంతాలనూ నేరపూరితంగా చూపిస్తూ ఉందో, ఆ రంగానికి ఇక్కడి ప్రజలు చేసిన సేవ అంతా ఇంతా కాదు.

సినిమారంగంలో మొత్తం దక్షిణ భారతదేశంలోనే తొలి దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు పొందిన బీఎన్ రెడ్డి పులివెందుల ప్రాంతం వాడే. ఈయన తీసిన 'స్వర్గసీమ', 'బంగారు పాప', 'మల్లీశ్వరి' వంటి సినిమాలు కళాఖండాలు. 'వాహిని' సంస్థను స్థాపించి ఈయన సృష్టించిన చిత్రరాజాలు ఎన్నో ఉన్నాయి. ఈ ప్రాంతం నుంచే వచ్చిన బి. నాగిరెడ్డి కూడా సినీ రంగానికి ఎంతో సేవ చేశారు. విజయా సంస్థను ప్రారంభించి ఈయన నిర్మించిన 'పాతాళ భైరవి', 'మాయా బజార్', 'గుండమ్మ కథ', 'మిస్సమ్మ', 'షావుకారు' వంటి సినిమాలు అజరామరమైనవి. పత్రికా రంగంలోనూ బి. నాగిరెడ్డి అపార కృషి చేశారు. చక్రపాణితో కలసి 'చందమామ' పత్రికను ప్రారంభించారు. అప్పటి తరం పిల్లలు చందమామ చదవకుండా పెరగలేదంటే అతిశయోక్తి కాదు. మొరార్జీ దేశాయ్ వంటి మాజీ ప్రధాని కూడా బి. నాగిరెడ్డిని చందమామతోనే గుర్తు పెట్టుకుని 'చందమామ రెడ్డిగారు' అని పిలిచేవారట. తర్వాత ఆయన మహిళల కోసం 'వనిత', సినిమా పాఠకుల కోసం 'విజయ చిత్ర' వంటి పత్రికలను నడిపారు.

అలనాటి హాస్య నటుడు పద్మనాభం, 'షో' చిత్రానికి ఉత్తమ స్క్రీన్ ప్లే అవార్డు పొందిన నీలకంఠ వంటి వారు కూడా ఈ ప్రాంతం వారే. ఇక్కడ పుట్టిన రచయితలు మొదటి నుంచి అభ్యుదయ వాదులు. తమ రచనల్లో మానవత్వం, స్త్రీ హక్కులు, రైతు జీవితం, సామరస్య భావాల గురించి రాశారు. 'తెలుగునాట భక్తి రసం తెప్పలుగా పారుతోంది – డ్రైనేజీ స్కీము లేక... డేంజరుగా మారుతోంది' అన్న ప్రముఖ హేతువాద జర్నలిస్టు గజ్జల మల్లారెడ్డి ఇక్కడి వాడే. తెలుగు సాహిత్య విమర్శ దిగ్గజం రాచమల్లు రామచంద్రారెడ్డి, కథకులు వైసీవీ రెడ్డి, నాద మునిరాజు, అరవేటి శ్రీనివాసులు, కేంద్ర సాహిత్య అకాడెమి యువ పురస్కారం పొందిన వేంపల్లె షరీఫ్ వంటి వాళ్లు ఇక్కడివాళ్లే.

ఎక్కువమంది వ్యవసాయం చేసి బతుకుతారు. ఒకప్పుడు చిరుధాన్యాలతోపాటు వేరుశనగ విపరీతంగా పండేది. ఇప్పుడు రైతులు చీని, నిమ్మ తోటలను పెంచుతున్నారు. వందల అడుగుల లోతులో బోర్లు వేస్తే కానీ నీళ్లు పడని స్థితి. తమతోపాటు పొలాల్లో పని చేసి తమకింత తిండి పెట్టే మూగజీవాలను ఇక్కడివాళ్లు ఇంటి మనుషుల కిందే చూసుకుంటారు. అవి చనిపోతే మనుషులతో సమానంగా అంత్యక్రియలు చేస్తారు. మధ్యాహ్నం ఇంటికొచ్చిన అతిథికి అన్నం పెట్టకుండా పంపరు. ఆడపిల్లలందరినీ వాళ్ల వయసుతో నిమిత్తం లేకుండా గౌరవంగా 'అమ్మా' అని పిలుస్తారు. అత్యంత గౌరవ మర్యాదలకూ, సున్నితత్వానికీ, సహ జీవన సంస్కృతికీ నెలవు ఇక్కడి నేల. అందుకే ఇక్కడి నుంచి అంతమంది కళాకారులు రాగలిగారు. పెద్దన లాంటి వాళ్లు 'ఇక్కడ పుట్టిన చిగురు కొమ్మయినా చేవే' అన్నారంటే ఇదే కారణం.




అదంతా వదిలేసి కేవలం కళ్లముందు జరుగుతున్న కొన్ని రాజకీయ పరిణామాలను దృష్టిలో పెట్టుకుని మొత్తం ఇక్కడి వాళ్లంతా దుర్మార్గులు అన్నట్టు, ఇక్కడి సంస్కృతి అంతా ఆటవిక సంస్కృతి అన్నట్టు రాజకీయ నాయకులు మీడియాలో మాట్లాడుతున్నారు. నిజానికి రాజకీయ స్వభావమూ, ప్రాంతీయ స్వభావమూ ఒకటి కాదు. ఏ ప్రాంతంలో అయినా రాజకీయం అన్నింటికీ అతీతమైంది. దానికి ఎల్లలు లేవు. అది పెట్టుబడి దారులతో కలసి దేశవ్యాప్తంగానే అన్ని రకాల వ్యవస్థలనూ, మానవీయ విలువలనూ ధ్వంసం చేస్తోంది. ఒక దశలో ప్రజాస్వామ్యానికి మూల సూత్రమైన ప్రజలను సైతం నిర్లక్ష్యం చేసి కేవలం డబ్బు, ప్రలోభాలు, బెదిరింపులతో అధికారం చేపట్టే దశకు వచ్చింది.

ఇలాంటి రాజకీయాల్లో ఎవరూ ప్రశ్నలు, విమర్శలకు అతీతులు కాదు. అయితే ఆ ముసుగులో తమకు గిట్టని లేదా ఓటేయని ప్రాంతాలను ఆ యా స్థానిక రాజకీయ నాయకుల చర్యలతో కలిపి నిందించడం కరెక్టు కాదు. ముఖ్యంగా పులివెందుల నుంచి ఆరు సార్లు ఎమ్మెల్యేగా, నాలుగు సార్లు కడప ఎంపీగా, రెండు సార్లు రాష్ట్ర ముఖ్యమంత్రిగా పని చేసిన వైఎస్ రాజశేఖర రెడ్డి, తరువాత వచ్చిన ఆయన తనయుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విషయంలో ఈ ధోరణి ఎక్కువగా కనిపిస్తోంది.

జగన్‌పై రాజకీయ విమర్శలు చేయాల్సి వచ్చినప్పుడల్లా ఒక వర్గం మీడియా, నేతలు మొత్తం పులివెందుల ప్రాంతాన్నీ, అక్కడి ప్రజలనూ నిందిస్తూ మాట్లాడుతున్నారు. విచక్షణతో రాజకీయ విమర్శలను రాజకీయాలకు లేదా రాజకీయ వ్యక్తుల వరకే పరిమితం చేస్తే బావుంటుంది. అలా కాకుండా పరిస్థితి ఇలాగే కొనసాగితే పులివెందుల ప్రాంత ప్రజలు, ప్రజా సంఘాల వాళ్లు తగిన కార్యాచరణతో సదరు మీడియా, రాజకీయ నేతల ధోరణికి వ్యతిరేకంగా ఉద్యమించాల్సి వస్తుంది.

– డా॥ వేంపల్లె షరీఫ్
జర్నలిస్టు, రచయిత I 96034 29366

జగత్తంతా ఈశ్వరమయం!



ద్వారకలో శ్రీకృష్ణుడు సభలో కొలువుతీరి ఉండగా, ఒకరోజు ఒక బోయవాడు చేతిలో ఉత్తరంతో వచ్చి శ్రీకృష్ణుడి దర్శనాన్ని కోరగా, సేవకులు అతడిని శ్రీకృష్ణుడి సముఖానకు తెచ్చి, వచ్చిన పనియేదో ప్రభువుల వారితో విన్నవించుకోమనగా, ఆ బోయవాడు 'కుండినపురంలోని భీష్మక మహారాజు సభలో అమాత్యులవారు వ్రాసి ఇచ్చిన వర్తమానాన్ని యేలినవారి సముఖాన పెట్టడానికి రయాన వచ్చాను ప్రభూ!' అని వివరం చెప్పాడు.

'మహారాజశ్రీ అఖండలక్ష్మీ సమేతులైన శ్రీకృష్ణులవారికి మేము వ్రాసి పంపించే విన్నపము. ఇక్కడి సర్వక్షేమ స్థితిని శ్రీవారికి ఈవరకే తెలిపియుంటిమి. ఇప్పుడు విన్నవించుకొనుట యేమనగా– భీష్మక మహారాజులవారు వారి కుమార్తెకు వివాహం చేయాలని సంకల్పించి, స్వయంవరానికై రాజులందరికీ వర్తమానాలు పంపించారు. ఆ సందర్భంగా శ్రీకృష్ణులవారు కూడా వేంచేయాలని కోరుకుంటూ ఎంతో ఆదరంతో మిమ్ములను ఆహ్వానించమని మాకు ఉత్తరువులను ఇచ్చారు. కనుక స్వామివారు తప్పక విచ్చేయగలరని మా విన్నపము!' అని ఆ లేఖలోని విషయాన్ని మంత్రివర్యులు చదివి వినిపించగా విన్న శ్రీకృష్ణుడు చిరునవ్వు నవ్వి, సభలో కొలువై ఉన్న వారిని ఉద్దేశించి 'కూతురు పెళ్ళి ఘనంగా చేయాలని ఉత్సాహంతో భీష్మక మహారాజు పంపిన వర్తమానాన్ని విన్నారు కదా! ఆ ఆహ్వానంపై మీ అభిప్రాయాన్ని ఆలోచించి చెబితే బాగుంటుంది. ఆప్తులైన మీరందరూ మేలైనదిగా ఏది అనుకుంటారో, ఆ దారిలో నడుచుకుంటేనే కదా ప్రభువునైన నాకు శుభం చేకూరుతుంది!' అని అంటాడు. శ్రీకృష్ణుడి మాటలకు సభలోని అందరూ ముగ్ధులై–

నీరజనాభ కార్యముల నిశ్చయమిట్టిదటంచు దెల్పగా
నేరుచువారలుం గలరె నీయెదుటన్ సకలాంతరాత్మవై
నేరిచినట్టివారలను నేర్వనివారనిపించి దిద్దగా
నేరిచినట్టి దేవుడవు నీకొకరా యెఱిగించు నేర్పరుల్.

'ఓ పద్మనాభ స్వామీ! జరగవలసిన పనిని గురించి 'ఇది ఇలా జరిగితే బాగుంటుంది' అని మీకు చెప్పగలిగినవారు ఉన్నారా? సకలమూ తెలుసునని భావించేవారి చేత కూడా వారికి ఏమీ తెలియదని వొప్పించగలిగే నేర్పు కలిగిన దేవుడవైన మీకు చెప్పగలవారు ఎవరైనా ఈ ముల్లోకాలలోనూ ఉన్నారా?' అని భక్తితో బదులిచ్చారని కోటేశ్వరకవి రచించిన 'భోజసుతా పరిణయం' కావ్యం, ప్రథమాశ్వాసంలోని సన్నివేశంలో రసవత్తరంగా వర్ణించబడింది. 'సకలాంతరాత్మవు' అని ఒక్క మాటలో 'జగత్తులోని ప్రతిదీ ఈశ్వరాంశయే!' అని చెప్పడం ఇందులో గ్రహించదగినది.

– భట్టు వెంకటరావు

క్లుప్తంగా...

బడిబాట వాయిదా

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా సోమవారం నుంచి జరగాల్సిన బడిబాట కార్యక్రమం వాయిదా పడింది. తిరిగి ఎప్పట్నుంచి చేపడతారనేది మాత్రం విద్యాశాఖ వెల్లడించలేదు. బడి మానేసిన, బడిలో చేర్చని పిల్లలను గుర్తించి, వారిని బడిలో చేర్చేందుకు ఈ నెల 19 వరకూ ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. కానీ ఈ నెల 4న ఎన్నికల ఫలితాలున్న నేపథ్యంలో బడిబాటను వాయిదా వేయాలని అన్ని వర్గాల నుంచి ఒత్తి డి వచ్చింది. దీంతో వాయిదా వేయమని ప్రభుత్వం ఆదేశించినట్టు అధికారులు చెబుతున్నారు.

ముగిసిన టెట్ పరీక్ష

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా గత నెల 20వ తేదీ నుంచి మొదలైన ఉపాధ్యాయ అర్హత పరీక్షలు ఆదివారంతో ముగిసాయి. పరీక్షకు మొత్తం 2,86,381 దరఖాస్తులు వచ్చాయి. వీరిలో 50 వేల మంది వరకూ గైర్హాజరయ్యారు. పరీక్ష ఫలితాలను ఈ నెల 12వ తేదీన వెల్లడిస్తారు.

విజేతలెవరో చెబితే రూ.10 లక్షలు

- జ్యోతిష్యులకు భారత నాస్తిక సమాజం సవాల్

పాలకుర్తి టౌన్: 'దేశంలో, రాష్ట్రంలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఏ పార్టీకి ఎన్ని స్థానాలు వస్తాయో ఫలితాలు వెలువడకముందే కచ్చితంగా తెలియజేసిన జ్యోతిష్యులను సన్మానించి రూ.10 లక్షల అవార్డు అందజేస్తాం.. అలా కాని పక్షంలో జ్యోతిష్యం తప్పని ఒప్పుకునే ధైర్యం ఉందా? అని భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు గుమ్మడిరాజు సాంబయ్య, ఉప్పులేటి నరేశ్ సవాల్ విసిరారు. వారు ఆదివారం జనగామ జిల్లా పాలకుర్తిలో మాట్లాడుతూ 1975లోనే ప్రపంచంలోని 175 మంది శాస్త్రవేత్తలు జ్యోతిష్యం అబద్ధమని ప్రకటన విడుదల చేశారని తెలిపారు. కోట్లాది కిలో మీటర్ల దూరంలోని గ్రహాలు భూమి మీద ఉన్న మానవునిపై ప్రభావం చూపుతాయంటూ ప్రజల అజ్ఞానాన్ని సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. సైన్సును ప్రోత్సహించాల్సిన ప్రభుత్వాలు ఈ మోసగాళ్ల విషయంలో ఉదాసీనంగా వ్యవహరించడం దారుణమన్నారు.

కెసెట్ ఫలితాల్లో నారాయణ ప్రభంజనం

సాక్షి, హైదరాబాద్: కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన కెసెట్ ప్రవేశ పరీక్షలో నారాయణ విద్యార్థులు సత్తా చాటారు. కెసెట్‌లో రాష్ట్రస్థాయిలో 1, 2, 2, 2, 2, 3, 3, 4, 4, 4, 4, 6, 6, 7, 7, 9, 9, 10, 10 వంటి పది లోపు 19 అత్యుత్తమ ర్యాంకులతో 100 లోపు 92 ర్యాంకులు కైవసం చేసుకుని విజయ దుందుభి మోగించారు. వివిధ కేటగిరీల్లో రెండు విభాగాల్లో 1000 లోపు 399 అత్యుత్తమ ర్యాంకులతో నంబర్ 1 స్థానాన్ని కైవసం చేసుకుందని నారాయణ విద్యాసంస్థ డైరెక్టర్లు డాక్టర్ పి.సింధూర నారాయణ, పి.శరణి తెలిపారు. వారు ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటకలోనూ నారాయణ విజయ ప్రస్థానం కొనసాగుతోందని చెప్పారు.

ప్రభాకర్‌రావును కలిసేందుకే అమెరికాకు హరీశ్

తెలంగాణకు రావద్దని చెప్పేందుకే అల్లుడు హరీశ్‌ను కేసీఆర్ చడీచప్పుడు లేకుండా అమెరికా పంపారు

- కొలరాడో, షికాగోల్లో ప్రభాకర్‌రావును హరీశ్ కలిశారు
- వాళ్లు కలిసినప్పుడు పక్కన ఉన్నవారే నాకు చెప్పారు
- కలవలేదని హరీశ్ ప్రమాణం చేస్తారా?
- హరీశ్‌రావు ప్రయాణించిన విమానం నంబర్, తేదీలతో అన్ని వివరాలు వెల్లడించిన మంత్రి కోమటిరెడ్డి



సాక్షి, హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ బాధ్యతలను ఐపీఎస్ అధికారి ప్రభాకర్‌రావుకు అప్పగించిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రౌడీగ్యాంగ్ ద్వారా రూ.లక్షల కోట్లు వసూలు చేశారని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఇప్పుడు ప్రభాకర్‌రావు తెలంగాణకు వచ్చి అప్రూవర్‌గా మారితే తనతో పాటు కుమారుడు కేటీఆర్ జైలుకు వెళ్లడం ఖాయమని తెలిసి ఆయన రాష్ట్రానికి రావొద్దని చెప్పేందుకే అల్లుడు హరీశ్‌రావును చడీచప్పుడు కాకుండా అమెరికాకు పంపారని ఆరోపించారు. హరీశ్‌రావు తన అమెరికా పర్యటనలో ప్రభాకర్‌రావును కలవలేదని ప్రమాణం చేయాలని, అలా చేస్తే తాను దేనికైనా సిద్ధమన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని తన నివాసంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు.

మే నెల 26వ తేదీన ఎమిరేట్స్ విమానంలో (నెంబర్ ఈకే525) ఎవరికీ తెలియకుండా హరీశ్ అమెరికా వెళ్లాడన్నారు. 26న ఉదయం 4:35 గంటలకు ఆ విమానం బయలుదేరిందని, అక్కడి నుంచి మళ్లీ ముంబై ద్వారా ఈనెల 1వ తేదీన ఉదయం 7:30 గంటలకు కుటుంబంతో కలిసి హరీశ్ హైదరాబాద్ వచ్చాడని చెప్పారు. కొలరాడో, చికాగోల్లో తిరుగుతున్న ప్రభాకర్‌రావును కలిసి హరీశ్ మాట్లాడారని, ఇప్పట్లో తెలంగాణకు రావద్దని చెప్పి వచ్చాడన్నారు. ప్రభాకర్‌రావు, హరీశ్‌లు కలిసినప్పుడు పక్కన ఉన్న వాళ్లే తనకు ఈ విషయం చెప్పారని కోమటిరెడ్డి తెలిపారు.

కేసీఆర్ చేసిన పనితో తెలంగాణ మంత్రులని చెప్పుకునేందుకు కూడా..

ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కేసీఆర్ ఫామ్‌హౌజ్‌లో ఉంటే, సెక్రటేరియట్‌కు రాకుండా, ఎవరినీ కలవకుండా పాలన చేస్తుంటే ప్రజల కోసం ఏదైనా చేస్తున్నాడని అనుకున్నాం. కానీ, ఆయన అక్కడ కూర్చుని ఫోన్‌ట్యాపింగ్ చేశాడు. తెలంగాణను నవ్వుల పాలు చేశాడు. ఎక్కడికైనా వెళ్లి తెలంగాణ మంత్రులమని చెప్పుకునేందుకు కూడా మాకు సిగ్గుగా ఉంది.' అని కోమటిరెడ్డి వ్యాఖ్యానించారు. ప్రభాకర్‌రావుకు రెడ్‌కార్నర్ నోటీసు రాకుండా, కూతుర్ని జైలు నుంచి విడుదల చేయించుకునేందుకు కేసీఆర్ కేంద్రంతో లోపాయికారీ ఒప్పందం కుదుర్చుకుని పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీకి ఓట్లు వేయించారని ఆరోపించారు. కేసీఆర్ ఏది చేసినా చట్టం తన పని చేసుకుపోతుందని, ప్రభాకర్‌రావును రేపోమాపో తీసుకువస్తామని, కేసీఆర్, ఆయన కుమారుడు కేటీఆర్‌లు అరెస్టు కాక తప్పదని, ఈ కేసులో కనీసం ఏడేండ్ల శిక్ష పడుతుందని చెప్పారు.

ఆ దుఃఖం తెలంగాణ ప్రజల కోసం కాదు

రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో కేసీఆర్ తెలంగాణలో ఈ పరిస్థితులను చూస్తే తనకు దుఃఖం వస్తోందని అన్నారని, కానీ ఆయనకు దుఃఖం రావడానికి వేరే కారణాలు ఉన్నాయని మంత్రి కోమటిరెడ్డి ఎద్దేవా చేశారు. ''సీఎం సీటు పోయిందని, యువరాజుకు దేశ విదేశాలు తిరిగే అవకాశాలు లేకుండా పోయాయని, కోట్ల రూపాయల ఆదాయం పోయిందని, కూతురు కేసుల్లో ఇరుక్కుని మూడు నెలల నుంచి జైల్లో ఉందని దుఃఖం వస్తోంది తప్ప తెలంగాణ ప్రజల గురించి కాదు. కేసీఆర్‌కు తెలంగాణ ప్రజలంటే అసహ్యం''అని నిందించారు. దశాబ్ది ఉత్సవాలను గత ఏడాదే ప్రారంభించిన కేసీఆర్ పాకిస్తాన్ స్వాతంత్ర్య వేడుకలను జిన్నా నిర్వహించినట్టు ఒకరోజు ముందే నిర్వహించాడని ఎద్దేవా చేశారు. పాలనలో భాగంగా ఏది ముట్టుకోవాలన్నా మంత్రులుగా తమకు భయమేస్తోందని, గొర్రెలు, చేపపిల్లల వ్యవహారంలో కూడా రూ.వేల కోట్లు మింగారని మంత్రి కోమటిరెడ్డి ఆరోపించారు.

కలిసినట్లు నిరూపిస్తే
ముక్కు నేలకు రాస్తా

- లేకుంటే బహిరంగ క్షమాపణ చెప్పి.. కోమటిరెడ్డి ముక్కు నేలకు రాయాలి
- హరీశ్‌రావు సవాల్
- దీనిపై బహిరంగ చర్చకు సిద్ధమని ప్రకటన



సాక్షి, హైదరాబాద్: అమెరికా పర్యటనలో తాను మాజీ పోలీసు అధికారి ప్రభాకర్‌రావును కలిసినట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నిరూపిస్తే అమరుల స్తూపం ముందు ముక్కు నేలకు రాస్తానని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే మాజీ మంత్రి టి.హరీశ్ రావు సవాల్ చేశారు. లేని పక్షంలో వెంకట్‌రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పి అమరుల స్తూపం ముందు ముక్కు నేల కు రాయాలని డిమాండ్ చేశారు. తన విదేశీ పర్యటనపై రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను హరీశ్‌రావు ఖండించారు. 'మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి మతిభ్రమించింది. ఆయ న డాక్టర్‌కు చూపించుకోవడం మంచిది. ముఖ్యమంత్రి, మంత్రులు అబద్ధాలతో ప్రభుత్వాన్ని నడుపుతున్నారని అనేందుకు నాపై ఆయన చేసిన ఆరో పణే ఉదాహరణ. నేను నా కుటుంబ సభ్యులతో విదేశాలకు వెళ్లింది వాస్తవం. నేను ఏ దేశం వెళ్లా ను, ఏ హోటల్‌లో ఉన్నాను తదితర వివరాలు ఇ చ్చేందుకు సిద్ధంగా ఉన్నా'అని హరీశ్ పేర్కొన్నారు.

బహిరంగ చర్చకు సిద్ధం

'నా పాస్‌పోర్ట్‌తో సహా ఇతర వివరాలు తీసుకొని బహిరంగ చర్చకు వస్తాను. పాస్‌పోర్టులో ఇమిగ్రేషన్ ఇన్ అండ్ అవుట్ వివరాలు ఉంటాయి. కోమటిరెడ్డి చెప్పిన తేదీ, సమయానికి అమరవీరుల స్తూపం వద్దకు నేను వస్తాను. మంత్రి కోమటిరెడ్డి కూడా తన దగ్గరున్న రుజువులు, ఆధారాలతో రావాలి'అని హరీశ్ సవాల్ చేశారు. టీవీల్లో బ్రేకింగ్, స్క్రోలింగ్‌ల కోసం చిల్లర వ్యాఖ్యలు చేయడం మాని పాలనపై మంత్రులు దృష్టి సారించాలని హితవు పలికారు.

పాకిస్తాన్ వేడుకలతో పోల్చడం సీఎం కుసంస్కారం

బీఆర్‌ఎస్ నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలను పాకిస్తాన్ స్వాతంత్ర్య దినోత్సవాలతో పోల్చడం సీఎం రేవంత్‌రెడ్డి కుసంస్కారం, అవగాహన రాహిత్యానికి నిదర్శనమని మాజీ మంత్రి హరీశ్‌రావు 'ఎక్స్'లో పేర్కొన్నారు. 'తెలంగాణ ఉద్యమంలో పోరాటం చేసిన వారికి, తెలంగాణ గడ్డ మీద ప్రేమ ఉన్నవారికి రాష్ట్ర అవతరణ ప్రాముఖ్యత అర్థం అవుతుంది. ఉద్యమంలో ఏనాడూ పాల్గొనని వారికి, నోటి నుంచి ఒక్కసారి కూడా జై తెలంగాణ అని నినదించని వారికి, అమరులకు ఏనాడూ నివాళులర్పించని వారికి ఆ ఆర్తి, ఆ భావోద్వేగం ఎలా అర్థమవుతుంది. ఒక్క రోజు ముందుగా జరపడం కాదు, ఏడాది పొడుగునా పండుగగా దశాబ్ది ఉత్సవాలను మా ప్రభుత్వం నిర్వహించే ప్రణాళిక చేసినం. 2023 జూన్ 2 నుంచి దశాబ్ది ఉత్సవాలు ప్రారంభమై, జూన్ 22న అమరుల సంస్మరణతో 21 రోజుల పాటు అనేక కార్యక్రమాలు నిర్వహించి ముగించాం. స్వతంత్ర పోరాటాన్ని చూడని నవతరం, తెలంగాణ ఉద్యమ పోరాటాన్ని చూసింది. ప్రత్యక్షంగా పాల్గొంది. ఇవన్నీ ఉద్యమకారులపైకి తుపాకీ ఎక్కుపెట్టిన వారికి ఎలా అర్థం అవుతాయి. అందుకే వారికి బీఆర్‌ఎస్ శనివారం నిర్వహించిన క్యాండిల్ ర్యాలీ పాకిస్తాన్ అవతరణలా అనిపించాయి. గతంలో ఛత్తీస్‌ఘడ్‌లోనూ అక్కడి సీఎం భూపేష్ భగేల్ మూడు రోజుల పాటు రాష్ట్ర అవతరణ ఉత్సవం జరిపారు. అక్కడ కూడా పాకిస్తాన్ స్వతంత్ర దినోత్సవం జరిగినట్లేనా'అని హరీశ్‌రావు ప్రశ్నించారు.

పదేళ్లయినా ఉద్యమ ఆకాంక్షలు నెరవేరలేదు

- బీఆర్‌ఎస్ బాటలోనే కాంగ్రెస్ నడుస్తోంది
- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఏర్పడి పదేళ్లయినా ఉద్యమ ఆకాంక్షలైన నీళ్లు–నిధులు–నియామకాల గురించి పాలకులు పట్టించుకోకపోవడం బాధాకరమని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ ఆవేదన వ్యక్తంచేశారు. 'పదేళ్లుగా అమరుల ఆత్మ క్షోభిస్తూనే ఉంది. ఉద్యమ ఆకాంక్షలు సాకారం కాలేదనే అశాంతి, ఆగ్రహం ఉద్యమకారులను కలచి వేస్తూనే ఉంది'అని ఆదివారం ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో తమ బతుకులు పెనం మీద ఉంటే.. కాంగ్రెస్ పాలనలో పొయ్యిలో జారిపడ్డట్లయిందని రాష్ట్రంలోని అన్ని వర్గాల వారు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారన్నారు. 'గతపదేళ్లలో ధనిక రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారు. పేపర్ లీకేజీలు, పరీక్షల రద్దు పేరుతో ఉద్యోగ నియామకాలు చేపట్టకుండా నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారు. అవినీతి, కుటుంబ పాలనతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు. బీఆర్‌ఎస్ పాలకులను గద్దె దించి పదేళ్ల పీడ విరగడైందని సంతోషిద్దామంటే.. అధికారం చేపట్టిన కాంగ్రెస్ సర్కార్ సైతం బీఆర్‌ఎస్ బాటలోనే నడుస్తోంది'అని సంజయ్ మండిపడ్డారు. 'కాంగ్రెస్ 6 నెలల పాలనలోనే 6 గ్యారంటీలుసహా ఇతర ఎన్నికల హామీలను తుంగలో తొక్కింది. వేల కోట్ల అవినీతికి పాల్పడుతోంది. కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్, వడ్ల టెండర్లు సహా ప్రతి దాంట్లో కమీషన్లు దండుకోవడమే పనిగా పెట్టుకుంది. తెలంగాణను కాంగ్రెస్ పెద్దలకు ఏటీఎంగా మారుస్తూ రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెడుతోంది'అని ధ్వజమెత్తారు. అందుకే ప్రజల పక్షాన, అమరుల ఆశయాల కోసం, తెలంగాణ ఉద్యమ ఆకాంక్షల సాధన కోసం బీజేపీ మరో ఉద్యమానికి సిద్ధమైందన్నారు.



మఖ్దూం భవన్‌లో రాష్ట్ర అవతరణ వేడుకల సందర్భంగా జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న సీపీఐ నేతలు. చిత్రంలో చాడ వెంకట్‌రెడ్డి, కూనంనేని సాంబశివరావు, నారాయణ తదితరులు

మహనీయుల ప్రాణత్యాగంతోనే తెలంగాణ

- తెలంగాణ దశాబ్ది వేడుకల్లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్



జెండా ఆవిష్కరణ తర్వాత మాట్లాడుతున్న మహేశ్‌కుమార్ గౌడ్. చిత్రంలో గీతారెడ్డి, వీహెచ్, భట్టి, దీపాదాస్ మున్షీ తదితరులు

సాక్షి, హైదరాబాద్: ఎందరో మహనీయులు తమ ప్రాణాలను త్యాగం చేయడంతోనే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సిద్ధించిందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ వ్యాఖ్యానించారు. ఎన్నో కష్టనష్టాలకోర్చి తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియా గాంధీ దేవత అని అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల సందర్భంగా ఆదివారం గాంధీభవన్‌లో టీపీసీసీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ తెలంగాణ ఇచ్చింది సోనియా గాంధీయే అని అసెంబ్లీ సాక్షిగా చెప్పిన మాజీ ముఖ్యమంత్రి ఆమెను ఆ తర్వాత చాలాసార్లు అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ఆకాంక్షల మేరకు సోనియా గాంధీ ఇచ్చిన తెలంగాణ రాష్ట్రంలో గత పదేండ్ల పాలనలో ఏమీ జరగలేదని, ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేరలేదని విమర్శించారు. బీఆర్‌ఎస్ పాలన ప్రజలకు దూరంగా జరిగిందని, అందుకే కేసీఆర్‌ను ప్రజలు ఓడించారని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల ఆశలు, ఆకాంక్షలను కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం నెరవేరుస్తుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా టీపీసీసీ సేవాదళ్ చీఫ్ జితేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సేవాదళ్ మార్చ్‌ను మహేశ్‌గౌడ్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్‌మున్షీ, మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, రాజ్యసభ సభ్యుడు అనిల్‌యాదవ్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఏఐసీసీ కార్యదర్శి రోహిత్‌చౌదరి, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, మాజీ మంత్రి జె. గీతారెడ్డి, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

హామీలు మరిస్తే ఉద్యమిస్తాం

- బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డా.కె.లక్ష్మణ్
- గత సర్కారు దురాగతాలపై చర్యలేవి
- సుష్మాస్వరాజ్‌కు బీజేపీ నేతల నివాళి
- 1969 ఉద్యమకారులకు సన్మానం
- పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు



మాట్లాడుతున్న లక్ష్మణ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర బీజేపీ ఆధ్వర్యంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఆదివారం నాంపల్లిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో పార్టీ నాయకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తెలంగాణ సాధనలో బీజేపీ పాత్ర, పార్లమెంట్‌లో 'చిన్నమ్మ'సుష్మాస్వరాజ్ చేసిన కృషిని నేతలు గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డా.కె.లక్ష్మణ్ జాతీయ జెండాను ఎగురవేశారు. సుష్మా స్వరాజ్ చిత్రపటం వద్ద పుష్పగుచ్ఛాలుంచి పార్టీ నాయకులు నివాళులర్పించారు. అనంతరం లక్ష్మణ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయకపోతే తెలంగాణ పోరాటం తరహాలోనే ఉద్యమిస్తామని హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డి గ్యారంటీలను అమలు చేయకపోతే ఆయన భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతుందని, వచ్చే ఐదేళ్లు ఆయనకు కష్టమేనని వ్యాఖ్యానించారు. 'సోనియా గాంధీ బలిదేవత అన్న రేవంత్‌రెడ్డి ఇప్పుడు ఆమెకే భక్తుడు అయ్యాడు. మాజీ సీఎం కేసీఆర్ విధానాలనే ఈ ప్రభుత్వం కొనసాగిస్తోంది. ఉచితాలు, గ్యారంటీలు ఓట్లు దండుకోవడం కోసమే. వివాదాలు సృష్టించి కాలం గడపాలని అనుకుంటున్నారు. తెలంగాణ ఇచ్చింది సోనియా కాదు. తెలంగాణ సమాజం తెచ్చుకుంది. గత ప్రభుత్వం చేసిన దురాగతాలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు. దోచుకోవడం కోసం రాజీపడుతున్నారు. ఫోన్ ట్యాపింగ్‌పై సీబీఐ విచారణకు ఎందుకు ఆదేశించడం లేదు' అని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమకారులను విస్మరించి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం అనుభవిస్తోందని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి అనుసరిస్తున్న వైఖరిని ప్రజలు గమనిస్తున్నారన్నారు. 'యూపీఏ ప్రభుత్వం కళ్లు తెరవాలని శ్రీకాంతాచారితో మొదలు పెడితే ఎందరో ఆత్మబలిదానాలు చేసుకున్నారు. 1,200 మంది అమరులయ్యారు. వారి బలిదానాల తోనే తెలంగాణ వచ్చింది'అని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీ, ఎంపీ బీబీ పాటిల్, పార్టీనేతలు కాసం వెంకటేశ్వర్లు, మనోహర్‌రెడ్డి, శిల్పారెడ్డి, ప్రేంసింగ్‌రాథోడ్, ఎన్వీసుభాష్, పీఎల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

1969 ఉద్యమకారులకు బీజేపీ సన్మానం

బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన దశాబ్ది ఉత్సవాల సందర్భంగా 1969 తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నవారిని బీజేపీ నేత డా.కె.లక్ష్మణ్ శాలువాలతో సన్మానించారు. మాజీ మంత్రులు మేచినేని కిషన్‌రావు, మర్రి శశిధర్ రెడ్డి, అలాగే యాదగిరి గౌడ్ తదితరులు సన్మానం అందుకున్నవారిలో ఉన్నారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో అమరులైనవారిని గుర్తించి గౌరవించాలని ఉద్యమ కారులు కోరుకుంటున్నారన్నారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి మోదీ నాయకత్వంలో బీజేపీ పనిచేస్తుందని చెప్పారు. మేచినేని కిషన్‌రావు మాట్లాడుతూ.. 'బీజేపీ చొరవ వల్ల తెలంగాణ సిద్ధించింది. కాంగ్రెస్ నిర్లక్ష్యం చేసింది. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని ఉద్యమకారులుగా తీర్మానం చేశాం. ఈ రోజు నుంచి హైదరాబాద్ ఉమ్మడి రాజధాని కాదు. వంద ఎకరాల్లో స్మృతి వనం ఏర్పాటు చేయాలి'అని అన్నారు.

నాటి పోరాటాన్ని స్మరించుకున్న మాజీ ఎంపీలు

- మంత్రి పొన్నం నివాసంలో లంచ్
- హాజరైన గుత్తా, వివేక్, రాజగోపాల్‌రెడ్డి, షెట్కార్, మున్షీ



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రం ఏర్పాటై పదేళ్లవుతున్న సందర్భంగా నాడు పార్లమెంట్‌లో ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాటం చేసిన మాజీ ఎంపీలు సమావేశమయ్యారు. అప్పటి ఎంపీ, ప్రస్తుత రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నివాసంలో ఆదివారం జరిగిన ఈ సమావేశానికి అప్పుడు ఎంపీలుగా ఉన్న ప్రస్తుత శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు వివేక్ వెంకటస్వామి, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రాజయ్య, మాజీ ఎంపీలు మధుయాష్కీగౌడ్, అంజన్‌కుమార్ యాదవ్, సురేశ్‌షెట్కార్‌లతోపాటు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్‌మున్షీ హాజరయ్యారు. ఈ సందర్భంగా నాటి తెలంగాణ ఉద్యమ ఘటనలు, పోరాటాలు, తెలంగాణ బిల్లు ఆమోదం సందర్భంగా పార్లమెంట్ హాలులో జరిగిన సన్నివేశాలను వారు స్మరించుకున్నారు. అనంతరం అందరూ కలిసి లంచ్ చేశారు.

తెలంగాణ స్ఫూర్తిని వదిలిపెట్టం: పొన్నం

సమావేశానంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పాటై పదేళ్లు పూర్తయి 11వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా తెలంగాణ ఉద్యమకారులకు వందనాలు తెలిపారు. అమరవీరులకు జోహార్లు అర్పిస్తూ 12వ ఆవిర్భావ దినోత్సవం నాటికి కాంగ్రెస్ పార్టీ చెప్పిన విధంగా అమరవీరుల కుటుంబాలకు పింఛన్, ఉద్యమకారులకు నివాసస్థలం ఇచ్చి గౌరవించుకుంటామన్నారు.

పిడుగులకు మూగజీవాల మృత్యువాత



మృతిచెందిన గొర్రెలు, మేకలను పరిశీలిస్తున్న పశువైద్యులు, స్థానికులు



గుండివాగుపై తెగిన తాత్కాలిక వంతెన



నాగవరం వాగులో కొట్టుకుపోతున్న కారు

- రాష్ట్రంలో అక్కడక్కడా వర్షాలు
- నగరంలో జలమయమైన రహదారులు... ట్రాఫిక్‌జామ్

సాక్షి, నెట్‌వర్క్: ఈదురుగాలులు..ఉరుములు..మెరుపులతో రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల మోస్తరు వర్షం కురిసింది. పిడుగుపాటు కారణంగా వివిధ జిల్లాల్లో మూగజీవాలు మృత్యువాత పడ్డాయి.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా..

కుమురంభీంఆసిఫాబాద్ జిల్లా కన్నెపల్లి మండలం మొక్కంపల్లి(కుర్మగూడం) ఊరి చివరన మేకలు మేపుతుండగా పిడుగు పడి మూడు మేకలు, వేమనపల్లి మండలం జిల్లెడ గ్రామంలో ఒక గేదె, ఆసిఫాబాద్‌రూరల్ మండలంలో 10 మేకలు 6 ఆవులు, ఒక ఎద్దు మృతి చెందాయి. బెల్గాం గ్రామానికి చెందిన హనుమంతు తన 40 మేకలను మేతకు తీసుకెళ్లాడు. ఈ క్రమంలో పిడుగుపడి 10 మేకలు అక్కడికక్కడే చనిపోయాయి. చింతకుంటలోని దావులత్‌రావుకు చెందిన 6 ఆవులు, అదే గ్రామానికి చెందిన కుర్రెగాబాదు ఎద్దు పిడుగుపడి చనిపోయింది. కాసిపేట మండలం ధర్మరావుపేట గ్రామానికి చెందిన పశువులకాపరి మేకలు, గొర్రెలను అడవికి వెళ్లాడు. మధ్యాహ్నం తర్వాత గాలి,వానతో వర్షం కురవడంతో అన్నీ చెట్టు కిందకు చేరాయి. ఈ క్రమంలో చెట్టుపై పిడుగుపడటంతో మందలోని 17 గొర్రెలు, 14 మేకలు అక్కడిక్కకడే మృతిచెందాయి. ఆసిఫాబాద్ మండలం గుండి గ్రామానికి వెళ్లే దారిలోని వాగుపై పైపులతో ఏర్పాటు చేసిన తాత్కాలికవంతెన వరదకు కొట్టుకుపోయింది.

ఉమ్మడి వరంగల్‌జిల్లా..

హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో భారీ వర్షం కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం, మహాముత్తారం, చిట్యాల మండలాల్లో చెట్లు కూలిపోయాయి. చిట్యాలలో పిడుగుపాటుకు ఆవు మృతి చెందింది. మహబూబాబాద్ జిల్లా కురవి, కేసముద్రం మండలాల్లో రోడ్లపై చెట్లు కూలిపోయాయి.

ఉమ్మడి నల్లగొండ జిల్లా..

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. రామన్నపేట మండలంలోని బాచుప్పల, సూరారం, ఎన్నారం, తుర్కపల్లి గ్రామాల్లో ఈదురుగాలకు చెట్లు విరిగిపడ్డాయి. విద్యుత్‌స్తంభాలు నేలకొరిగాయి. బాచుప్పల శివారులో ఓ కోళ్లఫాం షెడ్డు పూర్తిగా నేలమట్టమై కోడి పిల్లలు చనిపోయాయి.

పెద్దపల్లిజిల్లా..

పెద్దపల్లి జిల్లా మంథని మండలం ఉప్పట్లలో తాటిచెట్టు విరిగి ఇంటిపై పడడంతో గోడలు ధ్వంసమయ్యాయి. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడతో ప్రాణాపాయం తప్పింది. ముత్తారంలో ఉరుములు, మెరుపుల శబ్దాలతో ప్రజలు భయంతో ఇళ్లనుంచి బయటకు పరుగులు తీశారు. సుల్తానాబాద్ మండలం రేగడిమద్దికుంటలో పిడుగుపాటుకు ఎద్దు మృతి చెందింది.

వాగులో కొట్టుకుపోయిన కారు

పరిగి మండలం మైసమ్మగడ్డ తండాకు చెందిన విశాల్, రాకేష్, నరేష్, పండు కారులో బంట్వారం మండలం నాగవరం తండాలో జరిగిన ఓ వేడుకకు హాజరయ్యారు. తిరిగి వెళుతుండగా నాగవరం వాగులో నీటి ఉధృతికి వీరు ప్రయాణిస్తున్న కారు కొట్టుకుపోయింది. కొద్ది దూరం వెళ్లాక, కారులో ఉన్న నలుగురూ ఈదుకుంటూ క్షేమంగా బయటపడ్డారు. అయితే కారు వాగులో కొట్టుకుపోయింది.

నగరంలో జడివాన...

హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు నుంచి భారీవర్షం కురిసింది. దీంతో రహదారులు జలమయమయ్యాయి. ఒకవైపు తెలంగాణ అవతరణ ఉత్సవాల సందర్భంగా విధించిన ట్రాఫిక్ ఆంక్షలు, మరోవైపు వర్షం కారణంగా పలు చోట్ల ట్రాఫిక్ స్తంభించింది. వీకెండ్ కావడంతో ట్యాంక్‌పైన జరిగిన దశాబ్ది ఉత్సవాల్లో పాల్గొనేందుకు వచ్చిన నగరవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది.

5వ తేదీ నాటికి రాష్ట్రంలోకి నైరుతి!

నైరుతి బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం

- దీని ప్రభావంతో రానున్న రెండ్రోజులు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షాలు
- జీహెచ్‌ఎంసీ, సమీప జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలకు అవకాశం



సాక్షి, హైదరాబాద్: నైరుతి బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడినట్టు వాతావరణశాఖ సూచించింది. ఇది సముద్రమట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తున కేంద్రీకృతమైనట్టు వివరించింది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని చాలా జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు వాతావరణ శాఖ వివరించింది. సోమవారం ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, మంగళవారం కొన్నిచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరించింది. ప్రధానంగా యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్‌మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, నారాయణపేట, జోగులాంబగద్వాల, వనపర్తి జిల్లాల్లోని కొన్నిచోట్ల భారీ వర్షాలు నమోదు కావొచ్చని వివరించింది. రానున్న రెండ్రోజులు రాష్ట్రంలో సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు. ఉత్తర ప్రాంత జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీ సెల్సియస్ అధికంగా నమోదు కావొచ్చని వివరించారు. ఆదివారం రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే... గరిష్ఠ ఉష్ణోగ్రత ఆదిలాబాద్‌లో 43.3 డిగ్రీ సెల్సియస్, కనిష్ఠ ఉష్ణోగ్రత నల్లగొండలో 25.2 డిగ్రీ సెల్సియస్ చొప్పున నమోదయ్యాయి. నైరుతి ఋతుపవనాలు ఆదివారం కేరళలోని మిగిలిన ప్రాంతాలు, తమిళనాడులోని మరి కొన్ని ప్రాంతాలతోపాటు కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాల్లోకి ప్రవేశించినట్టు వాతావరణశాఖ తెలిపింది. రుతుపవనాల కదలిక చురుగ్గా ఉంటే ఈనెల 5వ తేదీ నాటికి తెలంగాణలోకి ప్రవేశించే అవకాశం ఉన్నట్టు వివరించింది.

ఆదివారం రాష్ట్రంలోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లలో)

కేంద్రం	గరిష్ఠం
ఆదిలాబాద్	43.3
నిజామాబాద్	43.0
మెదక్	42.9
నల్లగొండ	41.5
హైదరాబాద్	40.6
రామగుండం	40.5
మహబూబ్‌నగర్	40.4
దుండిగల్	40.0
హకీంపేట్	40.0
హన్మకొండ	39.5
ఖమ్మం	39.4
భద్రాచలం	36.0

ఐస్‌ల్యాండ్ అధ్యక్షురాలిగా హల్లా థామస్ డాటర్



లండన్: ఐస్‌ల్యాండ్ అధ్యక్ష ఎన్నికల్లో వ్యాపారవేత్త హల్లా థామస్ డాటర్ (55) విజయం సాధించారు. శనివారం జరిగిన ఎన్నికల్లో ముగ్గురు మహిళలే ప్రధానంగా తలపడ్డారు. హల్లా అత్యధికంగా 34.3% ఓట్లను దక్కించుకున్నారు. మాజీ ప్రధాని కత్రిన్ జాకబ్స్ డాటర్‌కు 25.2%, హల్లా హెచ్‌రుండ్ లొగా డాటర్‌కు 15.5 శాతం ఓట్లొచ్చాయి. ఆగస్ట్ 1న హల్లా బాధ్యతలు చేపట్టనున్నారు.

అమెరికాలో కాల్పులు.. ముగ్గురు దుర్మరణం

పెన్ హిల్స్(అమెరికా): అమెరికాలో పెన్సిల్వేనియా, ఒహాయో రాష్ట్రాల్లో రెండు కాల్పుల ఘటనల్లో ముగ్గురు చనిపోగా 32 మంది గాయపడ్డారు. వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉంది. పెన్సిల్వేనియాలో పిట్స్‌బర్గ్ శివారులోని బార్‌లో ఆదివారం వేకువజామున జరిగిన కాల్పుల్లో ఇద్దరు చనిపోగా ఏడుగురు గాయపడ్డారు. ఒహాయోలోని ఏక్రాన్‌లో స్ట్రీట్‌పార్టీలో జరిగిన తుపాకీ కాల్పుల్లో ఒకరు చనిపోగా 25 మంది గాయపడ్డారు.

గూడ్స్ ఢీ.. పైలట్లకు గాయాలు

ఫతేగఢ్ సాహిబ్: పంజాబ్‌లోని సర్‌హింద్ సమీపంలోని మాధోపూర్ వద్ద ఆదివారం ఉదయం రెండు గూడ్స్ రైళ్లు ఢీకొన్న ఘటనలో ఇద్దరు లోకో పైలట్లు గాయపడ్డారు. ఆగి ఉన్న గూడ్స్ రైలును వెనుక నుంచి మరో గూడ్స్ ఢీకొందని గవర్నమెంట్ రైల్వే పోలీస్(జీఆర్‌పీ) అధికారి తెలిపారు. ప్రమాద తీవ్రతకు ఒక రైలింజన్ పక్కనే పట్టాలపై ఆగి ఉన్న ప్రయాణికుల రైలును ఢీకొట్టిందని వివరించారు. అయితే, ఈ ఘటనలో ప్రయాణికులెవరికీ ఎటువంటి ప్రమాదం వాటిల్లలేదన్నారు. గాయపడిన లోకో పైలట్లు వికాస్ కుమార్, హిమాన్షు కుమార్‌లను పటియాలాలోని రాజేంద్ర ఆస్పత్రికి తరలించినట్లు వివరించారు. ఘటన కారణంగా కొన్ని రైళ్లను దారి మళ్లించామన్నారు. పునరుద్ధరణ పనులు వేగంగా కొనసాగుతున్నట్లు వివరించారు.

తమిళ నటుడు కరుణాస్ బ్యాగులో బుల్లెట్లు

చెన్నై: తమిళ నటుడు, మాజీ ఎమ్మెల్యే కరుణాస్ బ్యాగులో బుల్లెట్లు కనిపించడం కలకలం రేపింది. ఆదివారం ఉదయం కరుణాస్ చెన్నై విమానాశ్రయంలో అధికారులు సోదాలు జరపగా బ్యాగులో 40 వరకు తుపాకీ బుల్లెట్లు బయటపడ్డాయి. బుల్లెట్లు ఉంచుకునేందుకు తనకు అనుమతి ఉందని కరుణాస్ చెప్పారని అధికారులు వెల్లడించారు. అయితే, విమానంలోకి బుల్లెట్లు తీసుకురావడం నిషిద్ధమని ఆయనకు వివరించి, అనంతరం వెనక్కి పంపించి వేశామన్నారు.


అరుణాచల్‌లో బీజేపీ

అసెంబ్లీ ఎన్నికల్లో హ్యాట్రిక్ విజయం • 60 స్థానాలకు 46 కైవసం

ఈటానగర్: అరుణాచల్‌ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ ఘనవిజయం సాధించింది. వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చింది. 60 స్థానాలకు గాను ఏకంగా 46 చోట్ల కాషాయ జెండా రెపరెపలాడింది. 10 స్థానాలు ముందే ఏకగ్రీవంగా బీజేపీ సొంతం కావడంతో ఏప్రిల్ 19న మిగతా 50 స్థానాలకు పోలింగ్ జరిగింది. ఆదివారం ఓట్ల లెక్కింపు జరిగింది. బీజేపీ 36 సీట్లు గెలుచుకోగా నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పీపీ) 5, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) 3, పీపుల్స్ పార్టీ ఆఫ్ అరుణాచల్ (పీపీఏ) 2 స్థానాలు నెగ్గాయి. కాంగ్రెస్ ఒక స్థానంతో సరిపెట్టుకుంది. ముగ్గురు స్వతంత్ర అభ్యర్థులు నెగ్గారు. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 41 సీట్లు సాధించగా ఈసారి మరో ఐదు పెరగడం విశేషం. ఏకగ్రీవంగా నెగ్గిన వారిలో సీఎం పెమా ఖండూ కూడా ఉన్నారు.

అభివృద్ధి రాజకీయాలకు పట్టం: మోదీ


అరుణాచల్ ఫలితాలపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వెలిబుచ్చారు. బీజేపీకి మరోసారి విజయం కట్టబెట్టిన రాష్ట్ర ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రగతి కోసం మరింత ఉత్సాహంగా, నూతన శక్తితో పని చేస్తామంటూ 'ఎక్స్'లో పోస్టు చేశారు. ''అభివృద్ధి రాజకీయాలకు ప్రజలు పట్టం కట్టారు. పార్టీ కార్యకర్తల అలుపెరుగని కృషితోనే ఈ విజయం సాధ్యమైంది'' అని అన్నారు.





సంగీతాభిమాని...

అరుణాచల్‌లో బీజేపీని వరుసగా మూడోసారి గెలుపు బాటన నడిపిన నాయకుడిగా పెమా ఖండూ పేరు మార్మోగిపోతోంది. క్రీడలు, సంగీతం పట్ల అమితాసక్తి ఉన్న ఆయన రాష్ట్రంలో తిరుగులేని నేతగా ఎదిగారు. 2000లో కాంగ్రెస్‌లో చేరిన ఖండూ తండ్రి డోర్జీ ఖండూ ప్రాతినిధ్యం వహించిన ముక్తో అసెంబ్లీ స్థానం నుంచి ఉప ఎన్నికలో గెలిచారు. నబామ్ తుకీ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్నారు. 2016 జనవరిలో రాష్ట్రపతి పాలన అనంతరం బీజేపీ మద్దతిచ్చిన కల్కోపుల్ ప్రభుత్వంలో మరోసారి మంత్రి అయ్యారు. సుప్రీంకోర్టు జోక్యంతో తుకీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వచ్చింది. తుకీ రాజీనామాతో 2016లో ఖండూ 37 ఏళ్ల వయసులో తొలిసారి సీఎం అయ్యారు. తర్వాత బీజేపీలో చేరారు. 2019లో రెండోసారి సీఎం అయి ఐదేళ్లు కొనసాగారు. తాజాగా మరోసారి విజయం దక్కించుకున్నారు. బౌద్ధ మతస్థుడైన పెమా ఖండూ మోన్‌పా గిరిజన తెగకు చెందినవారు. తండ్రి డోర్జీ 2011లో హెలికాప్టర్ ప్రమాదంలో మరణించారు.



సిక్కింలో ఎస్‌కేఎం

తమాంగ్ పార్టీ క్లీన్‌స్వీప్

- 32 స్థానాలకు 31 కైవసం
- ఎస్‌డీఎఫ్‌కు 1, బీజేపీ, కాంగ్రెస్ 0
- మాజీ సీఎం చామ్లింగ్ ఓటమి

గాంగ్‌టక్: సిక్కిం శాసనసభ ఎన్నికల్లో సిక్కిం క్రాంతికారి మోర్చా (ఎస్‌కేఎం) సంచలన విజయం నమోదు చేసింది. ఆదివారం జరిగిన ఓట్ల లెక్కింపులో 32 స్థానాలకు గాను ఏకంగా 31 తన ఖాతాలో వేసుకుంది. వరుసగా రెండోసారి అధికారం దక్కించుకుంది. ఎస్‌కేఎం అధినేత, ముఖ్యమంత్రి ప్రేమ్‌సింగ్ తమాంగ్ ఈ ఎన్నికల్లో రెండు స్థానాల్లో పోటీకి దిగి రెండింటా విజయం సాధించారు. 2019 ఎన్నికల్లో 17 సీట్లు గెలుచుకున్న ఎస్‌కేఎం ఈసారి క్లీన్‌స్వీప్ చేయడం విశేషం. పోలైన మొత్తం ఓట్లలో 58.28 శాతం సాధించింది! 2019 దాకా 25 ఏళ్ల పాటు అప్రతిహతంగా రాష్ట్రాన్ని పాలించిన విపక్ష సిక్కిం డెమొక్రటిక్ ఫ్రంట్ (ఎస్‌డీఎఫ్) ఒకే ఒక్క స్థానానికి పరిమితమైంది. ఎస్‌డీఎఫ్ అధ్యక్షుడు, మాజీ సీఎం పవన్ కుమార్ చామ్లింగ్ పోటీ చేసిన రెండు స్థానాల్లోనూ అనూహ్య ఓటమి చవిచూశారు. బీజేపీ, కాంగ్రెస్ అయితే ఖాతాయే తెరవలేదు! 31 సీట్లలో పోటీ చేసిన బీజేపీకి కేవలం 5.18 శాతం ఓట్లు లభించాయి. కాంగ్రెస్‌కైతే 0.32 శాతం ఓట్లే వచ్చాయి. భారత ఫుట్‌బాల్ జట్టు మాజీ కెప్టెన్, ఎస్‌డీఎఫ్ ఉపాధ్యక్షుడు బైచుంగ్ భూటియా, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, సిట్టింగ్ ఎమ్మెల్యే దిల్లీరామ్ థాపా కూడా ఓటమి చవిచూశారు. నామ్చీ జిల్లా బర్‌ఫుంగ్ నుంచి పోటీ చేసిన భూటియా ఎస్‌కేఎం అభ్యర్థి డోర్జీ భూటియా చేతిలో ఓటమి చవిచూశారు. డోర్జీకి 8,358 ఓట్లు, భూటియాకు 4,012 ఓట్లు లభించాయి. అసెంబ్లీ ఎన్నికల ముందే భూటియా ఎస్‌డీఎఫ్‌లో చేరారు.

మోదీ అభినందనలు

ఎస్‌కేఎంకు, సీఎం తమాంగ్‌కు ప్రధాని నరేంద్ర మోదీ అభినందనలు తెలిపారు. రాష్ట్రాభివృద్ధి కోసం కలిసి పని చేస్తామన్నారు. బీజేపీకి ఓటేసిన ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతూ 'ఎక్స్'లో పోస్టు చేశారు. ప్రధానికి తమాంగ్ కృతజ్ఞతలు తెలిపారు.

టీచర్ నుంచి సీఎం దాకా

తమాంగ్ ఆసక్తికర ప్రస్థానం



ప్రేమ్‌సింగ్ తమాంగ్. సిక్కింలో ఎస్‌కేఎం క్లీన్‌స్వీప్ వెనుక ఉన్న శక్తి. 56 ఏళ్ల తమాంగ్ వ్యక్తిగత చరిష్మాతోపాటు పరిపాలనాదక్షుడిగా ఆయనకున్న పేరు, అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలు ఈ ఘన విజయానికి కారణమయ్యాయి. తమాంగ్ 1968 ఫిబ్రవరి 5న జన్మించారు. తల్లిదండ్రులు కాలూసింగ్ తమాంగ్, ధన్‌మాయ తమాంగ్. పశ్చిమబెంగాల్‌లోని డార్జిలింగ్‌లో కాలేజీ విద్య పూర్తిచేశారు. 1990లో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉద్యోగంలో చేరారు. మూడేళ్ల తర్వాత రాజీనామా చేసి ఎస్‌డీఎఫ్‌లో చేరారు. 15 ఏళ్ల పాటు మంత్రిగా చేశారు. 2009లో నాటి సీఎం పవన్ కుమార్ చామ్లింగ్‌తో విభేదించి ఎస్‌డీఎఫ్ నుంచి బయటకొచ్చారు. 2013లో ఎస్‌కేఎం ఏర్పాటు చేశారు. 2014 ఎన్నికల్లో పార్టీ 10 సీట్లు సాధించింది. అవినీతికి కేసుల్లో అరెస్టయిన తమాంగ్ ఏడాదిపాటు జైల్లో ఉండి 2017లో బయటికొచ్చారు. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో 17 సీట్లు గెలిచి రెండేళ్లకే సీఎం అయ్యారు. అనంతరం పార్టీని మరింత పటిష్టపరిచారు.

జైలుకు కేజ్రీవాల్

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల ప్రచారం కోసం సుప్రీంకోర్టు ఇచ్చిన మధ్యంతర బెయిల్ గడువు ముగియడంతో ఆప్ కన్వీనర్, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఆదివారం తిహార్ జైల్లో లొంగిపోయారు. అంతకుముందు రాజ్‌ఘాట్ వద్ద నివాళులర్పించి హనుమాన్ ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆప్ ప్రధాన కార్యాలయంలో పార్టీ కార్యకర్తలు, నేతలనుద్దేశించి మాట్లాడారు. ''నేను జైలుకు వెళ్తున్నది అవినీతికి పాల్పడి కాదు. నియంతృత్వానికి వ్యతిరేకంగా గళం వినిపించినందుకు. నాకు ఆప్ కంటే దేశమే ముఖ్యం. మోదీ మూడోసారి ప్రధాని అవుతారన్న ఎగ్జిట్ పోల్స్ అంచనాలన్నీ అబద్ధం. జనాన్ని మానసిక ఒత్తిడికి గురిచేసే మైండ్ గేమ్'' అన్నారు. అనంతరం లొంగిపోయే సమయంలో కేజ్రీవాల్ భార్య సునీత, ఆప్ నేతలు ఆతిశి, కైలాశ్ గహ్లోత్, సౌరభ్ భరద్వాజ్, రాఖీ బిర్లా, రీనా గుప్తా, ఆప్ రాజ్యసభ సభ్యులు సంజయ్ సింగ్, సందీప్ పాఠక్ జైలు వద్దకు వచ్చారు.

5 దాకా జ్యుడీషియల్ కస్టడీ

మనీ లాండరింగ్ కేసులో కేజ్రీవాల్‌ను జూన్ 5 దాకా జ్యుడీషియల్ కస్టడీకి పంపుతూ డ్యూటీ జడ్జి సంజీవ్ అగర్వాల్ ఉత్తర్వులు జారీచేశారు. తిహార్ జైలులో లొంగిపోయాక ఆయనను జడ్జి ఎదుట వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరుపరిచారు. ఈడీ 14 రోజులపాటు జ్యుడీషియల్ కస్టడీ కోరగా జడ్జి 5 రోజులు అనుమతించారు.

టోల్ ట్యాక్స్ పెంపు

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఎక్స్‌ప్రెస్ వేలపై వాహనదారులు చెల్లించే టోల్ టాక్స్‌ను జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ(ఎన్‌హెచ్‌ఏఐ) సగటున 5 శాతం పెంచింది. ఇది సోమవారం నుంచి అమలవుతుంది. ద్రవ్యోల్బణం, టోకు ధరల సూచీ ఆధారంగా టోల్ టాక్స్ ఏటా మారుతుంటుంది. ఈ పెంపు ఏప్రిల్ 1 నుంచే అమల్లోకి రావాల్సి ఉంది. లోక్‌సభ ఎన్నికల కారణంగా కేంద్రం తాత్కాలికంగా నిలిపివేసింది. పోలింగ్ ముగియడంతో జూన్ 3 నుంచి టాక్స్ పెంచుతూ ఎన్‌హెచ్‌ఏఐ నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా జాతీయ రహదారులపై 855 వరకు టోల్ ప్లాజాలు ఉన్నాయి.

ఒడిశాలో హోరాహోరీ

- అసెంబ్లీ పోరులో బీజేపీ, బీజేడీ నువ్వానేనా
- ఇరుపక్షాలకు 62–80 సీట్లు రావచ్చు
- ఇండియా టుడే ఎగ్జిట్ పోల్ వెల్లడి

భువనేశ్వర్: 147 స్థానాలున్న ఒడిశా శాసనసభ ఎన్నికల్లో ఈసారి హోరాహోరీ పోరు తప్పదని ఇండియా టుడే-యాక్సిస్ మై ఇండియా ఎగ్జిట్ పోల్ వెల్లడించింది. విపక్ష బీజేపీకి 62 నుంచి 80 స్థానాలు లభించే అవకాశం ఉందని, అధికార బిజూ జనతాదళ్(బీజేడీ)కి సైతం 62 నుంచి 80 స్థానాలే దక్కే వీలుందని అంచనా వేసింది. దీన్నిబట్టి చూస్తే ఒడిశాలో బీజేపీ అధికారం దక్కించుకొనేందుకు ఆస్కారం ఉన్నట్లు స్పష్టమవుతోంది. ఒకవేళ బీజేడీకి స్పష్టమైన మెజార్టీ రాకపోతే ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ రాజకీయ ప్రస్థానం దాదాపు ముగిసినట్లే అని చెప్పొచ్చు. ఆయన ఐదుసార్లు ముఖ్యమంత్రిగా ఎన్నికైన సంగతి తెలిసిందే. నవీన్ పట్నాయక్ ఇప్పటికే అనారోగ్యంతో బాధపడుతున్నట్లు వార్తలొస్తున్నాయి. ఒడిశాలో కాంగ్రెస్ 5 నుంచి 8 అసెంబ్లీ స్థానాలు గెలుచుకొనే అవకాశం ఉన్నట్లు ఎగ్జిట్ పోల్ వెల్లడించింది. బీజేపీ ఓట్ల శాతం 42 శాతానికి పెరుగుతుందని, బీజేడీ ఓట్ల శాతం 42 శాతం పడిపోతుందని, కాంగ్రెస్‌కు 12 శాతం ఓట్లు లభించే అవకాశం ఉందని తెలియజేసింది. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేడీ 112 సీట్లు, బీజేపీ 23, కాంగ్రెస్ 9 సీట్లు గెలుచుకున్నాయి. 21 లోక్‌సభ స్థానాల్లో బీజేపీకి ఏకంగా 18–20 వస్తాయని ఇండియా టుడే అంచనా వేసింది!

భేటీలతో మోదీ బిజీ బిజీ



ఆదివారం అధికారులతో మోదీ సమీక్షలు

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం అధికార యంత్రాంగంతో సమీక్షలు నిర్వహించారు. మూడోసారి అధికారంలోకి వస్తే '100 రోజుల అజెండా'లో చేయాల్సిన పనులపై చర్చించారు.

వరస సమీక్షలు

రేమాల్ తుపాను బీభత్సం, సహాయక చర్యలు తదితరాలపై మోదీ సమీక్ష జరిపారు. దేశవ్యాప్తంగా పదుల సంఖ్యలో పౌరుల మరణానికి కారణమైన హీట్‌వేవ్‌పై సమీక్ష జరిగింది. ఆస్పత్రుల్లో సరిపడ పడకలు, వైద్యులు, వైద్యసిబ్బంది, ఔషధాల లభ్యతపై చర్చించారు. జూన్ ఐదో తేదీన ప్రపంచ పర్యావరణ దినోత్సవం జరుపుకుంటున్న సందర్భంగా ప్రభుత్వ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన కార్యక్రమాలు, చేయాల్సిన ఏర్పాట్లపై సమీక్ష జరిపారు. అన్నింటికన్నా ముఖ్యమైనదిగా భావిస్తున్న '100 రోజుల అజెండా'పై విడిగా మరో సమీక్ష సమావేశం నిర్వహించారు. అధికారంలోకి రాగానే చేపట్టాల్సిన పనుల పురోగతిపై ప్రధాని అధికారులను ఆరాతీశారు. తొలి 100 రోజుల్లో ఎలాంటి పనులు చేస్తే బాగుంటుందో సలహాలు, సూచనలు ఇవ్వాలని గతంలో మంత్రిమండలి సభ్యులను మోదీ ఆజ్ఞాపించడం తెల్సిందే.

ఫైర్, ఎలక్ట్రిక్ సేఫ్టీ ఆడిట్లు చేయండి

ఎండలు, వేడి వాతావరణం కారణంగా భవనాల్లో ఎలక్ట్రిక్ షార్ట్ సర్క్యూట్ జరిగి అగ్ని ప్రమాదాలకు దారి తీయకుండా ఎప్పటికప్పుడు ఫైర్, ఎలక్ట్రిక్ సేఫ్టీ ఆడిట్లను చేయాలని సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. అధిక ఉష్ణోగ్రతల ధాటికి అటవీప్రాంతాల్లో కార్చిచ్చు ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని అటవీశాఖ అధికారులకు సూచనలు చేశారు. 'మిజోరం, అస్సాం, మణిపూర్, త్రిపుర, మేఘాలయలో రేమాల్ తుపాను బాధితులకు అండగా ఉంటామని మోదీ భరోసా ఇచ్చారు' అని కేంద్రం ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ భేటీల్లో పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

చంద్రుని ఆవలి వైపుకు చాంగే6

బీజింగ్: చంద్రుని ఆవలివైపు చైనా చాంగే6 ల్యాండర్ విజయవంతంగా దిగింది. అక్కడి మట్టిని సేకరించి తిరిగి భూమికి చేరుకోనుంది. చంద్రుని దక్షిణ ధృవ అయిట్‌కెన్(ఎస్పీఏ) బేసిన్ వద్ద బీజింగ్ కాలమానం ప్రకారం ఆదివారం ఉదయం 6.23 గంటలకు విజయవంతంగా అది దిగిందని చైనా నేషనల్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్(సీఎన్ఎస్ఏ) ప్రకటించింది. చాంగే6లో ఒక ఆర్బిటార్, ఒక రిటర్నర్, ఒక ల్యాండర్, ఒక అసెండర్ ఉన్నాయి. మే మూడో తేదీన చాంగే6ను చైనా ప్రయోగకేంద్రం నుంచి ప్రయోగించారు. అది తొలుత భూస్థిర కక్ష్యలో, తర్వాత చంద్ర కక్ష్యలో తిరిగింది. చాంగే6లో ఆర్బిటార్-రిటర్నర్, ల్యాండర్-అసెండర్ జతలు ఉన్నాయి. ఆర్బిటార్-రిటర్నర్ జత నుంచి ల్యాండర్-అసెండర్ జత మే 30వ తేదీన విడిపోయింది. ఆర్బిటార్-రిటర్నర్ జత చంద్రుని కక్ష్యలోనే తిరుగుతోంది.

కీలకమైన ల్యాండింగ్

ల్యాండర్-అసెండర్ జత చంద్రుడిపై సురక్షితంగా ల్యాండ్ అవడమే ఈ మొత్తం మిషన్‌లో అత్యంత కీలకమైన దశ. దిగేటపుడు మార్గమధ్యంలో ఏమైనా అవాంతరాలు ఉంటే వాటిని గుర్తించేందుకు స్వయంచాలిత



అవాంతరాల నిరోధక వ్యవస్థ, కాంతి కెమెరాను వినియోగించారు. వీటి సాయంతో సురక్షితమైన ల్యాండింగ్ ప్రదేశాన్ని ఎంచుకుని ల్యాండర్-అసెండర్ అక్కడే దిగిందని చైనా అధికారి జిన్‌హువా వార్తాసంస్థ పేర్కొంది. ఎస్పీఏ బేసిన్‌లోని అపోలో బేసిన్‌లో ఇది దిగింది. భూమి వైపు కంటే ఆవలి వైపు చంద్రుడి ఉపరితలం కాస్తంత గట్టిగా ఉందని సీఏఎస్‌సీ అంతరిక్ష నిపుణుడు హుయాంగ్ హావో చెప్పారు. అక్కడ దిగిన ల్యాండర్ 14 గంటల్లోపు రెండు రకాలుగా మట్టిని సేకరిస్తుంది. డ్రిల్లింగ్ చేసి కొంత, రోబోటిక్ చేయితో మరికొంత ఇలా మొత్తంగా 2 కేజీల మట్టిని సేకరిస్తుంది. ల్యాండర్ చంద్రునికి ఆవలివైపు ఉపరితలంపై ఉన్న నేపథ్యంలో భూమి నుంచి నేరుగా దానిని కమాండ్ ఇవ్వడం అసాధ్యం. అందుకే కమ్యూనికేషన్‌కు వారధిగా ఇప్పటికే చైనా క్వికియావో-2 రిలే ఉపగ్రహాన్ని ప్రయోగించింది. ఆ శాటిలైట్ ద్వారా చాంగే-6 ల్యాండర్‌కు ఆదేశాలు ఇవ్వొచ్చు.

మళ్లీ భూమి మీదకు

సేకరించిన మట్టిని ల్యాండర్ అసెండర్‌లోకి చేరుస్తుంది. అసెండర్ రాకెట్‌లా నింగిలోకి దూసుకెళ్లి ఆర్బిటార్-రిటర్నర్ జతతో అనుసంధానమవుతుంది. రిటర్నర్ మాడ్యూల్‌లోకి మట్టిని మార్చాక రిటర్నర్ అక్కడి నుంచి భూమి దిశగా బయల్దేరుతుంది. అంతా అనుకున్నది అనుకున్నట్లు సవ్యంగా జరిగితే జూన్ 25వ తేదీన రిటర్నర్ భూమి మీదకు చేరుకుంటుంది. చంద్రుని ఆవలివైపు మట్టిని తీసుకొచ్చిన దేశంగా చైనా చరిత్రలో నిలిచిపోనుంది.

ఎలక్షన్ బీట్



లోక్‌సభ ఎన్నికల ప్రచార హోరు ముగియడంతో అస్సాం వ్యవసాయ మంత్రి అతుల్ బోరా ఆదివారం ఇలా సాగుబాట పట్టారు

ముందు పోస్టల్ ఫలితాలు: విపక్షాలు

న్యూఢిల్లీ: జూన్ 4న లోక్‌సభ ఓట్ల లెక్కింపు ప్రక్రియలో నిబంధనలను పాటించాలని విపక్ష ఇండియా కూటమి నేతలు ఎన్నికల సంఘాన్ని కోరారు. నిబంధనల ప్రకారం పోస్టల్ బ్యాలెట్ ఫలితాలను ప్రకటించాకే ఈవీఎం ఫలితాలను వెల్లడించాలన్నారు. వారు ఆదివారం ఈసీతో భేటీ అయ్యారు. ఈసీకి రెండు మూడు ప్రధానాంశాలను వివరించినట్టు అనంతరం సీతారాం ఏచూరి (సీపీఎం), అభిషేక్ సింఘ్వీ (కాంగ్రెస్) మీడియాకు తెలిపారు. ''ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఫలితాలను ప్రకటించాలి. ఓట్ల లెక్కింపు వేళ మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటించేలా అధికారులకు ఆదేశాలివ్వాలని కోరాం. ఈవీఎంలను సీసీటీవీ పర్యవేక్షణలో ఉండే కారిడార్ల గుండానే లెక్కింపు కేంద్రాలకు తీసుకెళ్లాలని, కంట్రోల్ యూనిట్లలో సమయం, తేదీలను ధ్రువీకరించాలని కోరాం. సీల్ చేసిన ఈవీఎంకు ఉండే స్లిప్పులు, ట్యాగ్‌లను కూడా వెరిఫికేషన్ సమయంలో కౌంటింగ్ ఏజెంట్ల ఎదుట ప్రదర్శించాలని కోరాం'' అన్నారు.

అవి మోదీ మీడియా పోల్స్: రాహుల్

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి గెలుస్తుందన్న ఎగ్జిట్‌పోల్స్ అంచనాలను కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తోసిపుచ్చారు. పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, పీసీసీ చీఫ్‌లతో ఆయన ఆదివారం వర్చువల్‌గా మాట్లాడారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ''వాటిని ఎగ్జిట్ పోల్ కంటే మోదీ మీడియా పోల్ అంటే బాగుంటుంది. అవన్నీ ఆయన ఊహను ప్రతిబింబించే పోల్స్. బీజేపీ రిగ్గింగ్‌కు, మోదీ సైకలాజికల్ గేమ్‌కు ప్రతిరూపం. ఇదంతా విపక్షాల, 'ఇండియా' కూటమి కార్యకర్తల మనోస్థైర్యాన్ని దెబ్బతీసే కుట్ర'' అన్నారు. ఇండియా కూటమికి ఎన్ని సీట్లు వస్తాయని ప్రశ్నించగా ''సిద్ధూ మూసేవాలా '295' పాట విన్నారా? మాకు అన్నే వస్తాయి'' అని బదులిచ్చారు.

లెక్కింపు రోజు జాగ్రత్త: నేతలతో వర్చువల్ భేటీలో రాహుల్‌తో పాటు కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే కూడా మాట్లాడారు. ఓట్ల లెక్కింపు రోజు రిగ్గింగ్ వంటివి జరగకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కౌంటింగ్ ముగిసేదాకా హాళ్ల నుంచి ఎక్కడికీ వెళ్లొద్దని ఏజెంట్లు, నేతలకు సూచించారు.

ఎగ్జిట్ పోల్స్‌కు విలువే లేదు: మమత

కోల్‌కతా: లోక్‌సభ ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు వాస్తవ పరిస్థితులకు అద్దం పట్టేలా లేవని పశ్చిమబెంగాల్ సీఎం, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ అన్నారు. రెండు నెలల క్రితమే సిద్ధం చేసి ఉంచిన ఆ ఫలితాలకు విలువే లేదని పేర్కొన్నారు. ''2016, 2019, 2021 ఎగ్జిట్ పోల్స్‌లో ఒక్కటీ నిజం కాలేదు. తాజా ఎగ్జిట్ పోల్స్ ప్రజల స్పందనకు తగ్గట్టుగా లేవు. ముస్లింలు బీజేపీకి ఓటేస్తారనుకోను. ఇండియా కూటమి నేతలు అఖిలేశ్ యాదవ్, తేజస్వీ యాదవ్, స్టాలిన్, ఉద్ధవ్ ఠాక్రే తదితరులు బాగా ప్రచారం చేశారు. ప్రాంతీయ పార్టీలన్నీ బాగా పనిచేశాయి. బెంగాల్‌లో మాత్రం సీపీఎం, కాంగ్రెస్ బీజేపీకి అనుకూలంగా పని చేశాయి. కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి వస్తే ప్రభుత్వంలో చేరతాం'' అన్నారు.

ప్యారిస్–ముంబై విమానానికి బాంబు బెదిరింపు

ముంబై: పారిస్ నుంచి 306 మందితో ముంబై బయల్దేరిన విస్తారా విమానానికి ఆదివారం బాంబు బెదిరింపు వచ్చింది. 'బాంబు పెట్టాం' అని రాసిన నోట్ ఎయిర్ సిక్‌నెస్ బ్యాగ్‌లో కనిపించింది. దాంతో ముంబైలో లాండవగానే అందరినీ హుటాహుటిన దించేసి తనిఖీలు చేపట్టారు. బాంబు సహా అనుమానాస్పద వస్తువులేవీ లేవని తేలడంతో ఊపిరి పీల్చుకున్నారు.

సందేశ్‌ఖాలిలో మళ్లీ హింస

కోల్‌కతా: లోక్‌సభ ఎన్నికల పోలింగ్ పూర్తవగానే పశ్చిమబెంగాల్‌లోని సందేశ్‌ఖాలిలో ఆదివారం మళ్లీ ఘర్షణలు చెలరేగాయి. పోలింగ్ సమయంలో పోలీసులపై దాడికి పాల్పడ్డ వారిని అరెస్ట్ చేసేందుకు అగర్హటి గ్రామానికి వెళ్లిన బలగాలపై మహిళలు దాడికి దిగారు. మహిళా సిబ్బంది గాయపడ్డారు. నిర్బంధంలోకి తీసుకున్న వ్యక్తిని విడిపించుకునేందుకు నిరసనకారులు చేసిన ప్రయత్నాలను బలగాలు అడ్డుకున్నాయి. జనవరి 5వ తేదీన రేషన్ కుంభకోణం కేసులో తనిఖీల కోసం సందేశ్‌ఖాలీకి వెళ్లిన ఈడీ బృందంపై దాడి, అనంతరం టీఎంసీ నేత షాజహాన్ షేక్ అరెస్టయినప్పటి నుంచి ఆ ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం కొనసాగుతోంది.

జూలియట్ మళ్లీ ఆడుకుంది!

ఏడేళ్ల శునకానికి విజయవంతంగా గుండె ఆపరేషన్ • ఆసియాలో ఇదే తొలిసారి

న్యూఢిల్లీ: హుషారుగా గెంతుతూ చలాకీగా తిరుగుతూ తమ కుటుంబంలో భాగమైపోయిన ఏడేళ్ల శునకం గుండె జబ్బుతో బాధపడటం చూసి ఆ కుటుంబం అల్లాడిపోయింది. ఎలాగైనా అది మళ్లీ హుషారుగా తిరిగితే చాలు అని మనసులోనే మొక్కుకున్నారు. వారి బాధను అధునాతన చికిత్సవిధానంతో పోగొట్టారు ఢిల్లీలోని ఒక మూగజీవాల వైద్యుడు. రెండేళ్ల క్రితం అమెరికాలో అందుబాటులోకి వచ్చిన ఒక నూతన వైద్యవిధానంతో డాక్టర్ భానుదేవ్ శర్మ నేతృత్వంలోని వైద్య బృందం ఆ శునకానికి కొత్త జీవితం ప్రసాదించింది.

ఏమిటీ సమస్య?

ఏడేళ్ల బీగల్ జాతి శునకం జూలియట్ రెండేళ్లుగా మైట్రల్ వాల్వ్ సమస్యతో బాధపడుతోంది. గుండెలో ఎడమ ఎగువ కర్ణిక నుంచి జఠరికకు వెళ్లాల్సిన రక్తం తిరిగి కర్ణికలోకి లీక్ అవుతోంది. దీంతో గుండె కొద్దికొద్దిగా కుంచించుకుపోయి, ఊపిరితిత్తుల్లో నీరు చేరి మృత్యువు ఒడికి చేరే



జూలియట్



డాక్టర్ భానుదేవ్ శర్మ

ప్రమాదముంది. దీంతో విషయం తెల్సుకున్న ఢిల్లీలోని ఈస్ట్ కైలాశ్ ప్రాంతంలోని మ్యాక్స్ పెట్జ్ ఆస్పత్రిలోని డాక్టర్ భానుదేవ్ శర్మ నేతృత్వంలోని వైద్య బృందం ఆపరేషన్ చేసేందుకు ముందుకొచ్చింది. చిన్న జీవాలకు గుండె ఆపరేషన్‌లు చేయడంలో శర్మ నిష్ణాతునిగా పేరొందారు. ''అమెరికాలోని కొలరాడో స్టేట్ యూనివర్సిటీలో రెండేళ్ల క్రితమే ఈ కొత్త ఆపరేషన్ విధానం అమల్లోకి వచ్చింది. ట్రాన్స్‌క్యాథటర్ ఎడ్జ్ టు ఎడ్జ్ రిపేర్(టీఈఈఆర్) విధానంలో మే 30న జూలియట్‌కు గుండె ఆపరేషన్ చేశాం. ఓపెన్ హార్ట్ సర్జరీలాగా దీనికి పెద్ద కోత అక్కర్లేదు. చాలా చిన్న కోత సరిపోతుంది. గుండె ఊపిరితిత్తుల బైపాస్ మెషీన్‌తో పని ఉండదు. గుండె కొట్టుకుంటుండగానే ఆపరేషన్ చేసేయొచ్చు. ఛాతీ వద్ద అత్యల్ప రంధ్రం చేసి మెషీన్‌ను పంపి గుండె కవాటం ద్వారాన్ని సరిచేస్తాం'' అని శర్మ వివరించారు. ఆపరేషన్ చేసి రెండు రోజులకే జూలియట్‌ను డిశ్చార్జ్ చేశారు. ప్రస్తుతం అది ఆరోగ్యంగా ఆటుకుంటూ కుటుంబంలో మళ్లీ సంతోషాన్ని నింపింది.

ఈ తరహాలో 80 శాతం మరణాలు

భారత్‌సహా ప్రపంచవ్యాప్తంగా శునకాలు ఎదుర్కొంటున్న హృద్రోగ సమస్యల్లో ఈ తరహావే 80 శాతం ఉండటం గమనార్హం. శునకాల మరణాలకు ప్రధాన కారణాల్లో ఈ సమస్య కూడా ఒకటి. ఆసియా ఖండంలో శునకాలకు ఈ తరహా ఆపరేషన్ చేయడం ఇదే తొలిసారి అని ఆ వెటర్నరీ ఆస్పత్రి తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా చూస్తే ఈ ఆపరేషన్ విజయవంతంగా పూర్తిచేసిన రెండో ప్రైవేట్ వైద్య బృందం వీళ్లదేనని ఆస్పత్రి పేర్కొంది.

రామఫోసా గద్దెదిగే ప్రసక్తే లేదు: ఏఎన్‌సీ

కేప్ టౌన్: దక్షిణాఫ్రికా ఎన్నికల్లో అధికార ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్‌కు ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన మెజారిటీ రాకపోయినా అధ్యక్షుడు సిరిల్ రామఫోసా రాజీనామా చేయబోరని పార్టీ స్పష్టం చేసింది. ఐక్య కూటమి ఏర్పాటు చేసి ఆయన సారథ్యంలోనే స్థిరమైన ప్రభుత్వాన్ని అందిస్తామని పేర్కొంది. ఎన్నికల్లో ఏఎన్‌సీకి 40 శాతం, డెమొక్రటిక్ అలయెన్స్‌కు 20 శాతం, మాజీ అధ్యక్షుడు జాకబ్ జుమా సారథ్యంలోని ఎంకే పార్టీకి 14 శాతం ఓట్లు రావడం తెలిసిందే. 1994లో వర్ణ వివక్ష అంతమైన ఎన్నికలు జరిగినప్పటి ఏఎన్‌సీకి మెజారిటీ రాకపోవడం ఇదే తొలిసారి.

పాక్‌లో బ్రిగేడియర్‌గా తొలిసారి... మైనారిటీ మహిళ

ఇస్లామాబాద్: పాకిస్తాన్‌లో మైనారిటీ వర్గానికి చెందిన తొలి మహిళా బ్రిగేడియర్‌గా హెలెన్ మేరీ రాబర్ట్స్ చరిత్ర నెలకొల్పారు. ఆమె 26 ఏళ్లుగా సైన్యంలో పని చేస్తున్నారు. ప్రస్తుతం మెడికల్ కార్ప్స్‌లో సీనియర్ పాథాలజిస్ట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. పాక్ జనాభాలో 96.47 శాతం మంది ముస్లింలే. హిందువులు 2.14%, క్రైస్తవులు 1.27% దాకా ఉంటారు.



కలెక్టర్‌ను కలిసిన ఇన్‌చార్జి డీడీ

కరీంనగర్: కలెక్టర్ పమేలా సత్పతిని కొత్తగా బాధ్యతలు చేపట్టిన సోషల్ వెల్ఫేర్ ఇన్‌చార్జి డీడీ ఎండీ హమీద్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేశారు.



ధర్మపురిలో భక్తుల రద్దీ

బుగ్గారం(ధర్మపురి): ధర్మపురి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
38.0/28.0

జిల్లాలో నేడు ఎండ తీవ్రత సాధారణంగా ఉంటుంది. ఉక్కపోత స్వల్పంగా తగ్గుతుంది. ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పక్కాగా ఎన్నికల కౌంటింగ్ ఏర్పాట్లు చేపట్టండి

- కౌంటింగ్ అబ్జర్వర్ నజ్మా
- స్ట్రాంగ్‌రూంలు, ఏర్పాట్ల పరిశీలన



ఎస్సారార్ కళాశాలలో ఎన్నికల కౌంటింగ్ ఏర్పాట్లు పరిశీలించిన జి.నజ్మా, లక్ష్మీకిరణ్

కరీంనగర్ అర్బన్: జూన్ 4న జరగనున్న పార్లమెంటు ఎన్నికల ఓట్ల లెక్కింపు కోసం ఏర్పాట్లను పక్కాగా చేపట్టాలని కౌంటింగ్ అబ్జర్వర్ జీ.నజ్మా అధికారులను ఆదేశించారు. ఆదివారం కరీంనగర్‌లోని ఎస్ఆర్ఆర్ కళాశాలలో స్ట్రాంగ్‌రూంలు, కౌంటింగ్ కోసం చేపట్టిన ఏర్పాట్లను అబ్జర్వర్ అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్‌తో కలిసి పరిశీలించారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల కౌంటింగ్ కేంద్రాలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా చేపడుతున్న ఏర్పాట్లపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ కౌంటింగ్ ప్రశాంతంగా సాగేలా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫలితాల ప్రకటనలో ఎలాంటి జాప్యం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఆర్డీవోలు కుందారపు మహేశ్వర్, రమేశ్ బాబు, రామ్మూర్తి, రమేశ్ తదితరులు ఉన్నారు.

విద్యుత్ ఉద్యోగులకు అవార్డులు



సీఎండీ వరుణ్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డు స్వీకరిస్తున్న విద్యుత్ ఉద్యోగులు

కొత్తపల్లి: టీజీఎన్‌పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ పరిధిలో ఉత్తమ సేవలందించినందుకు పలువురు ఉద్యోగులకు అవార్డులు వరించాయి. కంపెనీ స్థాయిలో కరీంనగర్ సర్కిల్ ఎస్ఈ వడ్లకొండ గంగాధర్, హుజూరాబాద్ డీఈ లక్ష్మారెడ్డి, ఏడీ (టెక్నికల్) లావణ్య, కరీంనగర్ రూరల్ ఏఏవో ఎన్.సునీత, సబ్ ఇంజినీర్ చంద్రశేఖర్‌తో పాటు పలువురు ఓఅండ్ఎం సిబ్బందికి రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం వరంగల్‌లో టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి అవార్డు అందజేశారు.

నేటి నుంచి 'పది' సప్లిమెంటరీ పరీక్షలు

కరీంనగర్: పదోతరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమై ఈనెల 13 వరకు కొనసాగుతాయి. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించడం కోసం విద్యాశాఖ అధికారులు సర్వంసిద్ధం చేశారు. ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు జరుగనున్నాయి. 9.35 గంటల వరకు ఐదు నిమిషాల గ్రేస్ పీరియడ్‌తో విద్యార్థులకు పరీక్షా కేంద్రాల్లోకి అనుమతి ఉండనుంది. ఆ తర్వాత వచ్చిన విద్యార్థులకు అనుమతి ఉండదని డీఈవో స్పష్టం చేశారు. జిల్లావ్యాప్తంగా 483 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని వెల్లడించారు. వారి కోసం కరీంనగర్ జిల్లాకేంద్రంలోని పురాతన ఉన్నత పాఠశాల, హుజూరాబాద్ పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. డిపార్ట్‌మెంట్ అధికారులు ఇద్దరు, చీఫ్ సూపరింటెండెంట్లు ఇద్దరు, ఫ్లయింగ్‌స్క్వాడ్ బృందాలు పర్యవేక్షించనున్నారు. విద్యార్థులను గంట ముందు నుంచే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారు. విద్యార్థులు, సిబ్బంది ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకరావద్దని డీఈవో జనార్దన్‌రావు వెల్లడించారు.

జాతీయ పక్షిని కాపాడిన విద్యుత్ సిబ్బంది



నెమలిని అప్పగించిన విద్యుత్ అధికారులు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం బొమ్మకల్ సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం గాయంతో నడవలేని స్థితిలో ఉన్న జాతీయపక్షి నెమలిని విద్యుత్‌సిబ్బంది కాపాడారు. అటవీశాఖ రేంజ్ ఆఫీసరు శ్రీనివాస్‌రెడ్డికి నెమలిని అప్పగించారు. ఈ కార్యక్రమంలో ఏఈ తిరుపతి, సీనియర్‌లైన్ ఇన్‌స్పెక్టర్ రఘుపతి, లైన్‌మెన్‌లు ప్రకాశ్,ఫారుఖ్, జేఎల్ఎంలు చంద్రశేఖర్, అమర్‌నాథ్ తదితరులు ఉన్నారు.

జిల్లా సమగ్రాభివృద్ధే లక్ష్యం



మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

- జీవన ప్రమాణాలు మరింత మెరుగుపరుస్తాం
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో కార్పొరేట్ తరహాలో వైద్య సేవలు
- సాధారణ ప్రసవాలు పెరిగేలా ప్రత్యేక ప్రణాళిక
- ప్రభుత్వ పాఠశాలలకు కొత్తరూపు
- 10వ తరగతిలో అత్యుత్తమ ఫలితాలు
- అంగన్‌వాడీలను బలోపేతం చేస్తాం
- రైతులు అధిక దిగుబడి సాధించేలా ప్రోత్సాహం
- తెలంగాణ ఆవిర్భావ దినోత్సవంలో కలెక్టర్ పమేలా సత్పతి

సాక్షి ప్రతినిధి, కరీంనగర్:

'సకల జన హితమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. జిల్లా సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నాం. ప్రజల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపరచడమే ధ్యేయంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు పకడ్బందీగా అమలు చేస్తున్నాం. కుల వృత్తులతో పాటు ప్రధాన వ్యవసాయ రంగాన్ని లాభాలబాట పట్టించేందుకు ప్రణాళికతో సాగుతున్నాం..' అని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. ఆదివారం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని కలెక్టరేట్ ఆవరణలో కలెక్టర్ పమేలా సత్పతి జాతీయ జెండాను ఆవిష్కరించి పోలీస్ గౌరవవందనం స్వీకరించారు. అనంతరం కలెక్టరేట్ ఆడిటోరియంలో జరిగిన సమావేశంలో ప్రసంగించారు.



కలెక్టరేట్‌లో జాతీయ జెండా ఆవిష్కరించి, వందనం చేస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి, తదితరులు

నలుదిక్కులా చాటేలా..

తెలంగాణ సాధించిన ఘనతను నలుదిక్కులా చాటేలా దశాబ్ది వేడుకలు ఘనంగా జరుపుకోవడం సంతోషంగా ఉందని కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరులకు నివాళి అర్పిస్తున్నానని తెలిపారు. ఎందరో మహానుభావుల ప్రాణత్యాగాల ఫలితంగా దశాబ్దాల కల నెరవేరిందన్నారు. ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ ప్రభుత్వ పాఠశాలలను సమగ్రంగా తీర్చిదిద్దుతున్నామని వెల్లడించారు. అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పాఠశాలల పునఃప్రారంభంలోపే పనులు పూర్తిచేసి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామని అన్నారు. జూన్ 3 నుంచి ప్రారంభం కానున్న బడిబాట కార్యక్రమం ద్వారా బడీడు పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించామని వెల్లడించారు. 2023–24 విద్యా సంవత్సరంలో పదోతరగతి పరీక్షల్లో జిల్లా రాష్ట్రంలో ఏడోస్థానంలో నిలిచిందని, 96.65 ఉత్తీర్ణ శాతం ఫలితాలు సాధించామని తెలిపారు. ఇంటర్ ఫస్టియర్‌లో ఐదోస్థానం, సెకండ్ ఇయర్‌లో నాలుగో స్థానం సాధించామన్నారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హాస్టళ్లలో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఉచిత భోజన వసతి కల్పిస్తున్నామని వివరించారు. పోటీ పరీక్షలకు హాజరయ్యేవారికి స్టడీ సెంటర్ల ద్వారా ప్రత్యేక నిపుణులతో శిక్షణ ఇప్పిస్తున్నామని తెలిపారు.

సర్కారు ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం

ప్రైవేట్ ఆస్పత్రులకు దీటుగా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వ ఆస్పత్రులను తీర్చిదిద్దుతున్నామని అన్నారు. ఆరోగ్యశ్రీ వైద్య సదుపాయాన్ని రూ.10లక్షల వరకు ప్రభుత్వం పెంచిందని అన్నారు. మే 31నాటికి జిల్లాలో 5,909 మంది చికిత్స పొందగా 9,258మందికి ప్రభుత్వ ఖర్చులతో నెట్వర్క్ ఆస్పత్రుల్లో చికిత్స చేయించామని వివరించారు. ఈ సంవత్సరానికి గానూ ప్రభుత్వాసుపత్రుల్లో 8910 ప్రసవాలు జరిగాయని తెలిపారు. జిల్లాలో శిశు, మాత మరణాల నిష్పత్తి గణనీయంగా తగ్గిందని వివరించారు.

అంగన్‌వాడీల బలోపేతానికి కృషి

జిల్లాలో అంగన్వాడీలను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. 777అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆరేళ్లలోపు 57,075 మంది చిన్నారులు, 4,211మంది గర్భిణులు, 4,812మంది బాలింతలకు పోషకాహారం అందిస్తున్నామని తెలిపారు. 31,507 మంది పిల్లలకు ప్రీస్కూల్ ఎడ్యుకేషన్ అందిస్తున్నామని వివరించారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి రైతులు ఆర్థిక అభివృద్ధి చెందేలా నిరంతరం శ్రమిస్తున్నామని వివరించారు. ప్రతి పంట కాలానికి ఎకరానికి 5000 చొప్పున సర్కారు పెట్టుబడి సాయం అందిస్తున్నదని, జిల్లాలో ఈ యాసంగి సీజన్లో 2,03,096 మంది రైతులకు రూ.182.12 కోట్ల సాయం అందించినట్లు తెలిపారు. రైతులకు సరిపడా విత్తనాలు సరఫరా చేస్తున్నామని, నకిలీ విత్తనాలను అరికట్టేందుకు టాస్క్‌ఫోర్స్ బృందాలతో తనిఖీలు చేయిస్తున్నామని అన్నారు. పౌరసరఫరాల శాఖ ద్వారా జిల్లాలో 2023–24సంవత్సరానికి సంబంధించి వానకాలం, యాసంగి సీజన్లో 4,86,603 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 45వేల మంది రైతుల నుంచి కొనుగోలు చేశామని తెలిపారు. ఇందుకు గానూ రూ.1071కోట్లను రైతులకు ఆన్‌లైన్ ద్వారా చెల్లించామని ఈ సందర్భంగా కలెక్టర్ వెల్లడించారు.

జిల్లాలో పచ్చదనం వెల్లివిరిసేలా..

జిల్లాలో ప్రతి పట్టణం, గ్రామం పచ్చదనంతో ఉండే లక్ష్యంతో 2023–24 సంవత్సరానికి గానూ 43.18 లక్షల మొక్కలు నాటామని వివరించారు. 1,39,061 మంది లబ్ధిదారులకు పింఛన్ల ద్వారా ప్రతినెలా రూ.29.35కోట్లు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది ఉపాధి హామీ పథకం కింద 22.16 లక్షల పనిదినాల లక్ష్యానికి గానూ 28.65లక్షల పనిదినాలను కల్పించామని తెలిపారు. ఇందుకు గానూ 59 కోట్ల79 లక్షలను ఖర్చు చేశామని వివరించారు. అనంతరం మహిళల కోలాట నృత్య ప్రదర్శన, సాంస్కృతిక కళాకారుల పాటలు ఆకట్టుకున్నాయి. అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, ఆర్డీవో మహేశ్వర్, మేయర్ సునీల్‌రావు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



అమరవీరుల స్తూపం వద్ద అధికారుల నివాళి



నివాళి అర్పిస్తున్న బీఆర్ఎస్ నేతలు



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, ప్రజలు



కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు

జిల్లా కోర్టు ఆవరణలో..



జెండా వందనం చేస్తున్న జడ్జి ప్రతిమ

కరీంనగర్‌క్రైం: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కోర్టు భవన సముదాయంలో ఆదివారం జిల్లా జడ్జి బి.ప్రతిమ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం బార్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేక్ కట్ చేశారు. అసోసియేషన్ పక్షాన స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పీవీ.రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి బేతి మహేందర్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు న్యాయమూర్తులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ కమిషనరేట్‌లో..



జెండా వందనం చేస్తున్న సీపీ అభిషేక్ మహంతి

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కేంద్రంలో ఆదివారం రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. కమిషనరేట్ కేంద్రంలోని క్వార్టర్స్‌గాడ్స్ వద్ద సీపీ అభిషేక్ మహంతి, కమిషనరేట్ పరిపాలన కార్యాలయం వద్ద అడిషనల్ డీసీపీ ఏ.లక్ష్మీనారాయణ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం గౌరవ వందనాలు స్వీకరించారు. సిబ్బందికి స్వీట్లు పంపిణీ చేశారు. ఏసీపీలు, సీఐలు, ఎస్సైలు, పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.

డీసీసీ ఆధ్వర్యంలో..



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

కరీంనగర్ కార్పొరేషన్: ఉద్యమకారుల బలిదానాలు, సోనియాగాంధీ చొరవతో తెలంగాణ ఏర్పడిందని డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా డీసీసీ కార్యాలయంలో జాతీయ జెండా ఎగురవేశారు. సోనియాగాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్, సిటీ అధ్యక్షుడు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, పీసీసీ కార్యదర్శి అంజన్‌కుమార్, కార్పొరేటర్లు గంట కల్యాణి, భూమాగౌడ్ ఉన్నారు.

దశాబ్ది.. సాగులో నూతన ఒరవడి

- వర్షాధార భూములు 30,300 ఎకరాలే
- 3.05లక్షల ఎకరాలకు వివిధ రకాల సాగునీరు
- గణనీయంగా పెరిగిన వరిసాగు
- 'సాక్షి'తో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్

కరీంనగర్ అర్బన్: ఒకప్పుడు నీళ్లు దొరకని దుస్థితి నుంచి సాగుకు సమృద్ధిగా నీరుదొరికే పరిస్థితికి జిల్లా చేరింది. దశాబ్దకాలంలో సాగురంగంలో అనేక మార్పులు చోటుచేసుకోగా సేద్యం కొత్త పుంతలు తొక్కుతోంది. వర్షాధార పంటలకే పరిమితమైన జిల్లా నేడు వర్షాలు లేకున్నా పంటలు సాగు చేసేలా నీటి వనరులు పెరిగాయి. జిల్లాలో 3.36లక్షల ఎకరాల సాగుభూమి ఉండగా 3,05,775 ఎకరాలు వివిధ రకాల నీటి వనరులను కలిగి ఉండటం శుభ పరిణామం. కేవలం 30,300ల ఎకరాలు మాత్రమే వర్షాధార భూములు ఉన్నాయని జిల్లా వ్యవసాయ అధికారి బత్తిని శ్రీనివాస్ వెల్లడించారు. ఒకప్పుడు 50వేల ఎకరాల వరకు బీడు భూములుండగా సాగులోకి వచ్చాయి. దశాబ్దకాలంలో సాగురంగంలో వచ్చిన మార్పులు, ఏ ఏ పంటలు పండిస్తున్నారు. సమగ్ర వివరాలు.. జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌తో 'సాక్షి' ఇంటర్వ్యూ..

మిషన్ కాకతీయతో పెరుగుదల



బత్తిని శ్రీనివాస్
డీఏవో, కరీంనగర్

చెరువుల కింద అంతంత మాత్రమే సాగవుతుండగా మిషన్ కాకతీయ పథకం కింద చెరువుల్లో పూడిక తీత, ఇతర మరమ్మతులు చేపట్టడంతో సాగుపెరిగింది. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా ఆయా చెరువుల కింద 18,888ఎకరాల ఆయకట్టు ఉంది. కరీంనగర్ రూరల్ మండలంలో అత్యధికంగా చెరువుల కింద 4వేల ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. చిన్నచిన్న కుంటల చెరువుల ద్వారా 14,715 ఎకరాల సాగుభూమికి నీరందుతోంది. మానకొండూరు, శంకరపట్నం, చిగురుమామిడి, సైదాపూర్, గంగాధరలో చెరువులు ఎక్కువగా ఉన్నాయి. మొత్తంగా చెరువులు, కుంటల ద్వారా 33,603 ఎకరాల్లో సాగునీరు అందుతోంది.

బోర్‌వెల్స్, బావులతో 1,55,888 ఎకరాలు

జిల్లాలో మెట్ట ప్రాంతాలైనా గంగాధర, రామడుగు, చొప్పదండి, గన్నేరువరం, ఇల్లందకుంట వంటి మండలాల్లో బోర్‌వెల్స్, బావులు ఎక్కువ. బోర్‌వెల్స్ ద్వారా సాగునీరు లభిస్తుండగా 13,888 ఎకరాలను సాగు చేస్తున్నారు. ఇక బావుల ద్వారా 1,42,000 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. జిల్లాలో అత్యధిక సాగు బావుల ద్వారానే సాగవుతోందని గణాంకాలు చాటుతున్నాయి. గతంలో వర్షాలు సమృద్ధిగా కురియడంతో భూగర్భజలాలు పైపైకి చేరడంతో నీటికి ఢోకా లేదు. ఈ సారీ వర్షాలు సమృద్ధిగా ఉంటాయని వాతావరణశాఖ స్పష్టం చేసింది.

ప్రాజెక్టులతో 1.16లక్షల ఎకరాలు

జిల్లాలో బావుల తరువాత అత్యధిక సాగువిస్తీర్ణం ప్రాజెక్టుల కిందే సాగవుతోంది. జిల్లాకు ఆయువుపట్టుగా ఎల్ఎండీ జలాశయం ఉండగా మిడ్‌మానేరు ద్వారా నీరందుతోంది. శ్రీరాంసాగర్, కాళేశ్వరం ప్రాజెక్టుల తిమ్మాపూర్, మానకొండూరు, శంకరపట్నం, హుజూరాబాద్, జమ్మికుంట, ఇల్లందకుంట మండలాల్లోని రైతులకు సాగునీరందుతోంది. గంగాధర, రామడుగు, చొప్పదండి మండలాల్లోని పలు గ్రామాలకు వరద కాలువ ద్వారా సాగునీరు అందుతోంది. 1,16,280 ఎకరాలకు ప్రాజెక్టుల ద్వారా సాగునీరు లభిస్తోందని సర్వేలో తేలింది.

అపరాలు, కూరగాయల సాగు పెంపుకు కృషి

జిల్లాలో పప్పుల సాగు, కూరగాయల సాగు తగ్గింది. ఇతర జిల్లాలపై ఆధారపడాల్సి వస్తోంది. రైతులు వాణిజ్య పంటలకే మొగ్గు చూపుతున్నారు. కందులు, పెసలు, మినుములు, రాగులు, సజ్జలు, జొన్నలు వంటి పంటలను సాగు చేసేలా రైతులను ప్రోత్సహిస్తున్నాం. జిల్లాలో 2వేల ఎకరాల్లో కూరగాయలు సాగవుతున్నాయి. ప్రజల అవసరాల దృష్ట్యా కూరగాయల సాగు విస్తీర్ణం రెట్టింపు చేసేలా ప్రయత్నిస్తున్నాం.

ఈ కూడలిలో ఏ విగ్రహం?



కరీంనగర్ వన్‌టౌన్ ఎదుట కూడలి వద్ద నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ కార్పొరేటర్ కమల్‌జిత్‌కౌర్

- వన్‌టౌన్ జంక్షన్ వద్ద పంచాయితీ
- పనుల్లో జాప్యంతో ముదురుతున్న వివాదం
- గతంలో ఇక్కడే చొక్కారావు, తెలంగాణ తల్లి విగ్రహాలు



నిర్మాణంలో ఉన్న కూడలి

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలోని వన్‌టౌన్ పోలీసుస్టేషన్ ఎదుట ఉన్న కూడలి వివాదాలకు కేంద్రంగా మారుతోంది. గత బీఆర్ఎస్ హయాంలోనే అన్ని కూడళ్లతో పాటు, ఈ కూడలి ఆధునీకరణ పనులు మొదలు పెట్టారు. ఏళ్లు గడుస్తున్నా పూర్తికావడం లేదు. పనుల్లో తీవ్రజాప్యంతో సరికొత్త వివాదం మొదలైంది. గతంలో ఇక్కడ మాజీ ఎంపీ, స్వర్గీయ జువ్వాడి చొక్కారావు విగ్రహం ఉండగా, పక్కనే తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. దాదాపు ఏడాది క్రితం ఈ కూడలి ఆధునీకరణ పనుల నేపథ్యంలో రెండు విగ్రహాలను తొలగించారు. అప్పటి నుంచి కూడలి నిర్మాణం పూర్తయితే విగ్రహాన్ని ఏర్పాటు చేస్తారని నగరవాసులు చూస్తున్నారు. పనుల్లో జాప్యంతో విగ్రహాల ఊసే కనిపించడం లేదు. ఈ క్రమంలోనే తెలంగాణ తల్లి విగ్రహం కనిపించడం లేదని, అప్పట్లో నగరపాలకసంస్థలో ఉన్న ఓ ఆంధ్ర ఇంజినీరింగ్ అధికారి విగ్రహాన్ని మాయం చేశారంటూ ఆరు నెలల క్రితం మాజీ మేయర్, బీఆర్ఎస్ నాయకుడు సర్దార్‌రవీందర్ సింగ్ నగరపాలకసంస్థ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు.

బీఆర్ఎస్ కార్పొరేటర్ నిరసన

జంక్షన్‌లో ఉన్న తెలంగాణ తల్లి విగ్రహాన్ని తొలగించి మూడేళ్లు కావస్తున్నా తిరిగి ఏర్పాటు చేయడం లేదంటూ బీఆర్ఎస్‌కు చెందిన 47వ డివిజన్ కార్పొరేటర్ కమల్‌జిత్‌కౌర్ సోహన్‌సింగ్ నిరసన తెలిపారు. ఆదివారం రాష్ట్ర ఆవిర్భావదినోత్సవ సందర్భంగా తెలంగాణ తల్లి విగ్రహం లేదంటూ, వన్‌టౌన్ పోలీసు స్టేషన్ ముందున్న జంక్షన్ వద్ద ఆమె ఆందోళన చేపట్టారు. తెలంగాణ తల్లి ఫొటో ఏర్పాటు చేసి, పూలమాల వేశారు. ఇక్కడి నుంచి తొలగించిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఎక్కడుంచారో నగరపాలకసంస్థ అధికారులు చెప్పడం లేదని ఆరోపించారు. ఇదే స్థలంలో తిరిగి తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, లేదంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.


రెండు విగ్రహాలు ఒక్కచోటే

విగ్రహాల పంచాయితీకి ముగింపు పలికేందుకు కూడలిలో రెండు విగ్రహాలు ఏర్పాటు చేయాలని నగరపాలకసంస్థ అధికారులు నిర్ణయించినట్లు సమాచారం. గతంలో ఇదే చోట పోలీసుస్టేషన్ వైపు చొక్కారావు విగ్రహం, మున్సిపల్ కార్పొరేషన్ వైపు తెలంగాణ తల్లి విగ్రహం ఉండేది. ఇప్పుడు ఈ కూడలి వైశాల్యం పెరగడం, ఆధునీకరించడంతో ఇందులోనే విగ్రహం ఏర్పాటు చేయాలని రెండు వైపుల నుంచి ఒత్తిడి పెరుగుతోంది. నిర్మాణం ఆలస్యమవుతున్న కొద్దీ వివాదం ముదురుతుండడం, ఒత్తిడి పెరుగుతుండడంతో చొక్కారావు, తెలంగాణ తల్లి విగ్రహాలు ఏర్పాటు చేసేందుకే అధికారులు మొగ్గుచూపుతున్నట్లు తెలిసింది. అయితే ఒక విగ్రహానికి ప్రాధాన్యత ఇస్తే, మరో విగ్రహానికి సంబంధించి వివాదం చెలరేగే అవకాశం ఉండడంతో, ఈ వివాదానికి బల్దియా అధికారులు ఎలా ముగింపు పలుకుతారో వేచి చూడాలి.

ఉక్కపోత నుంచి ఉపశమనం



నగరంలో కురుస్తున్న వర్షం



కరీంనగర్‌రూరల్: రోహిణికార్తెలో రోకళ్లు పగిలే ఎండ ఉంటుందనే సామెతను నిజం చేస్తూ గత నాలుగైదు రోజుల నుంచి ఎండతీవ్రతకు ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. ఆదివారం మధ్యాహ్నం 3గంటల వరకు భరించలేని ఎండవేడి, ఉక్కపోతతో ఇబ్బందులు ఎదుర్కొన్న జిల్లా ప్రజలు సాయంత్రం 4గంటలకు ఒక్కసారిగా ఉరుములు, మెరుపులు, పిడుగులతో కురిసిన వర్షంతో కొంత ఉపశమనం పొందారు. ఈదురుగాలులకు కరీంనగర్ రూరల్ మండలం ఎలబోతారంలోని ఎస్సీకాలనీలో విద్యుత్‌స్తంభం విరిగిపడటంతో సరఫరా నిలిచిపోయింది. సిబ్బంది ప్రత్యామ్నాయంగా మరోచోట నుంచి విద్యుత్‌సరఫరాను పునరుద్ధరించినట్లు రూరల్ ఏడీఈ రాజు తెలిపారు.

క్లుప్తంగా

ప్రమాదవశాత్తు వృద్ధుడి మృతి

సైదాపూర్: మండలంలోని గొడిశాలలో ఆదివారం ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి బాషవేని శంకరయ్య(75) మృతి చెందినట్లు సైదాపూర్ ఎస్సై జన్ను ఆరోగ్యం తెలిపారు. శంకరయ్య కుమారులు గ్రామ సమీపంలో ఉన్న వారి వ్యవసాయ బావిలో క్రేన్‌తో పూడిక తీస్తున్నారు. ఇద్దరు కుమారులు బావిలో ఉన్నారు. తండ్రి శంకరయ్య పైన ఉండి, బావిలోకి తొంగి చూస్తుండగా కండ్లు తిరిగి బావిలో పడ్డాడు. బావిలో నుంచి పైకి తీసిన వెంటనే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. కుమారుడు అశోక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మద్యం మత్తులో కిందపడి..


రాకేశ్

జమ్మికుంట: జమ్మికుంటలో మద్యంమత్తులో కిందపడి తీవ్రగాయాలై ఓ వ్యక్తి మృతి చెందాడు. టౌన్ సీఐ రవి వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన రాకేశ్(30) కొంత కాలంగా పట్టణంలో ఉంటూ కూలీ పనులు చేస్తున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. శనివారం రాత్రి అతిగా సేవించి కిందపడ్డాడు. తలకు తీవ్రగాయాలై చనిపోయాడు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లేవు. మృతదేహాన్ని జమ్మికుంట ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచామని సీఐ తెలిపారు. అతని సంబంధికులు ఉంటే సెల్ నంబర్ 87126 70776కు సంప్రదించాలని సీఐ సూచించారు.

అనుమానాస్పద స్థితిలో వలస కూలి...


రసూల్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై శ్రీకాంత్

చందుర్తి(వేములవాడ): రోజులాగానే భవనంపై పడుకున్న వలసకూలి తెల్లవారే సరికి అనుమానాస్పద స్థితిలో మృతిచెంది ఉన్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా గజవాడకు చెందిన నాయక్ రసూల్(36) ఉపాధి కోసం పది రోజుల క్రితం చందుర్తిలో ఉంటున్న తన మేనబావ వద్దకు వచ్చాడు. రోజు మాదిరిగానే భవనంపై పడుకున్నాడు. ఆదివారం ఉదయం ఎంతకు కిందకు రాకపోవడంతో భవనం పైకి వెళ్లి చూడగా చెవుల్లో నుంచి రక్తం కారి చనిపోయి ఉన్నాడు. ఈ విషయాన్ని మృతుడి మేనబావ హుస్సేన్ పోలీసులకు తెలిపాడు. వెంటనే చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై శ్రీకాంత్ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా మృతికి గల కారణాలు చెబుతామని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం


గుర్తు తెలియని మృతదేహం

కరీంనగర్‌క్రైం: కరీంనగర్‌లోని బస్టాండ్ చౌరస్తాలో ఆదివారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు వన్‌టౌన్ పోలీసులు గుర్తించారు. వయసు సుమారు 45 నుంచి 50ఏళ్ల వరకు ఉంటుందని తెలిపారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఆచూకీ తెలిసిన వారు వన్‌టౌన్ పోలీసులను సంప్రదించాలని సూచించారు.

జల్సాల కోసం బైక్ చోరీలు

- పెడదారి పడుతున్న యువత
- డబ్బులకోసం వాహనాల చోరీలు
- ఉజ్వల భవిష్యత్ నాశనం చేసుకుంటున్న వైనం
- తీరు మార్చుకోవాలంటున్న పోలీసులు


దొంగల నుంచి కరీంనగర్ వన్‌టౌన్ పోలీసులు స్వాధీనం చేసుకున్న 21 బైకులు(ఫైల్)

కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలానికి చెందిన ఇద్దరు యువకులు జల్సాలకు అలవాటుపడ్డారు. అందుకు డబ్బు అవసరం కాగా.. బైక్ దొంగతనాలను ఎంచుకున్నారు. ఇప్పటి వరకు 21 బైక్‌లు దొంగతనం చేసిన వీరు ఇటీవల కరీంనగర్ వన్‌టౌన్ పోలీసులకు చిక్కారు. కరీంనగర్ వన్‌టౌన్ పరిధిలో 15, టూ టౌన్ పరిధిలో 03, ఎల్‌ఎండీ పరిధిలో 05, గన్నేరువరంలో ఒకటి, కొమరవెల్లిలో ఒకటి చొప్పున బైక్‌లు దొంగతనం చేసినట్లు విచారణలో వెల్లడించారు.

పెద్దపల్లి జిల్లా మంథని ప్రాంతానికి చెందిన ఓ యువకుడు బైక్ కొనుక్కోవాలని ఆశపడ్డాడు. అతని వద్ద డబ్బులు లేవు. దీంతో బైక్ దొంగతనం చేసి వచ్చిన డబ్బులతో కొత్తబైక్ కొనాలని ఆలోచన చేశాడు. అలా 12 బైక్‌లు దొంగతనం చేసిన సదరు యువకుడు చివరకు నెలన్నర క్రితం కరీంనగర్‌లో పోలీసులకు చిక్కి కటకటాల పాలయ్యాడు.

కరీంనగర్‌క్రైం: యువతరం పెడతోవ పడుతోంది. జల్సాలకోసం అడ్డదారులు తొక్కుతోంది. అక్రమంగా డబ్బులు సంపాదించి జల్సాలు చేస్తూ.. చివరకు పోలీసులకు చిక్కి కటకటాల పాలవుతున్నారు. మద్యం, సిగరేట్లు, ఖరీదైన బైక్‌లు కొనుగోలు చేయడం కోసం డబ్బులు లేక చోరీలు చేస్తున్నారని పోలీసు విచారణలో వెల్లడవుతోంది. సరదాగా మొదలైన అలవాటు జీవితాలను నాశనం చేస్తోంది. జైలుపాలు కావడంతో యువత బంగారు భవిష్యత్తు నాశనం చేసుకుంటోంది.

బైక్ దొంగతనాల వైపు

యువకులు ఎక్కువగా బైకు దొంగతనాలే ఎంచుకుంటున్నారని విచారణలో తేలుతోందని ఓ పోలీసు అధికారి వివరించారు. పార్కింగ్ చేసి ఉన్న బైకులను నిశితంగా పరిశీలించి, ఎవరూ లేని సమయంలో వెంటతెచ్చుకున్న టూల్‌కిట్‌తో తాళాలు పగలగొట్టడం, సునాయాసంగా తాళం తెరిచి బైకులు దొంగిలిస్తున్నారు. ఒకే ప్రాంతంలో కాకుండా కరీంనగర్ సిటీ, రూరల్‌ప్రాంతాల్లో, సిద్దిపేట, వరంగల్, నిజామాబాద్ అనుమానం రాకుండా ప్రాంతాలు మార్చుతూ దొంగతనాలు చేస్తున్నారు. పోలీసులకు పట్టుబడిన తర్వాత లోతుగా విచారించగా వారు చేసిన దొంగతనాలు మొత్తం బయటపడుతున్నాయి. పట్టుబడిన వారిని పోలీసులు విచారించగా ఎక్కువశాతం జల్సాల కోసం దొంగతనాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. కమిషనరేట్ పరిధిలో ఏడాదికాలంలో దొంగతనాల కేసులు 410కిపైగా నమోదు కాగా 450మందిని అరెస్టు చేశారు. ఇందులో సుమారుగా 370 మంది వరకు యువకులే ఉన్నట్లు సమాచారం. ఇలా జల్సాల కోసం దొంగతనాలు బాటపడుతూ ఉజ్వలమైన భవిష్యత్తు నాశనం చేసుకుంటున్నారు. డబ్బు సంపాదన కోసం నేరాలు చేస్తే ఎప్పటికైనా చట్టానికి చిక్కడం తప్పదని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

పోలీసుల అదుపులో హత్యకేసు నిందితులు?

- మూడు బృందాలుగా గాలించిన పోలీసులు
- ప్రశాంత్ ఆచూకీ చెప్పిన అజ్ఞాత వ్యక్తి ఎవరు?

కరీంనగర్ క్రైం: జిల్లాలో సంచలనం సృష్టించిన మానకొండూర్ మండలం పచ్చునూరుకు చెందిన ప్రశాంత్‌రెడ్డి హత్య కేసు కొలిక్కి వచ్చింది. వ్యక్తిగత దూషణలు, బెదిరింపులే ఈ హత్యకు కారణమని పోలీసులు నిర్ధారణకు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ కేసులో పోలీసుల కళ్లుగప్పి ఇతర రాష్ట్రాలకు పారిపోయిన నిందితులు చివరికి హైదరాబాద్‌లో చిక్కినట్లు సమాచారం. విశ్వసనీయ సమాచారం మేరకు.. ఈ హత్యలో మొత్తం ఎనిమిదిమంది వరకు పాల్గొన్నట్లు తెలుస్తోంది. నలుగురిని స్థానికంగానే అదుపులోకి తీసుకున్నారు. మిగిలిన వారిలో సగం మహారాష్ట్రలోని నాందేడ్, ఏపీలోని తిరుపతికి పరారైనట్లుగా పోలీసులు కాల్స్ ఆధారంగా గుర్తించారు. ఆయా ప్రాంతాల నుంచి తమ మిత్రులకు ఫోన్లు చేసిన నిందితులు చివరకు హైదరాబాద్‌లో చిక్కినట్లు సమాచారం. పచ్చునూరు నుంచి నిందితులకు జరిగిన మనీ ట్రాన్స్‌ఫర్ ఆధారంగా పోలీసులు వేట సాగించారు. మొత్తం మూడు బృందాలు వీరిని వెంటాడి, చివరికి రాజధానిలో పట్టుకున్నాయి. త్వరలోనే పోలీసులు నిందితుల అరెస్టును చూపనున్నారని తెలిసింది.

ఎవరా అజ్ఞాత వ్యక్తి..?

ఈ హత్యలో దాదాపు ఎనిమిది మంది పాల్గొన్నారని పోలీసులు అనుమానిస్తున్నారు. వీరిలో నలుగురు కేవలం సోమవారం రాత్రి వరకు కలిసి ఉన్నారు. మంగళవారం వేకువజామున ప్రశాంత్‌ను కిడ్నాప్ చేసి, హత్య చేసింది నలుగురేనని తెలిసింది. వీరు మాత్రమే కాకుండా మరో వ్యక్తి నిందితులకు సాయం చేసినట్లుగా ప్రచారం జరుగుతోంది. సాంకేతిక పరిజ్ఞానం బాగా తెలిసిన ఓ వ్యక్తి ప్రశాంత్ ఎక్కడెక్కడ సంచరిస్తున్నాడో వీరికి ఎప్పటికప్పుడు సమాచారం ఇచ్చినట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. సదరు అజ్ఞాత వ్యక్తి ఎవరు ? అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఆ అజ్ఞాత వ్యక్తి ప్రశాంత్ పక్కనే ఉన్నాడా? లేక మరో ప్రాంతంలో ఉండి ప్రశాంత్ ఆచూకీని చెప్పాడా? అన్న అనుమానాలు నివృత్తి కావాల్సి ఉంది. ప్రశాంత్‌ను నిందితులు తొలుత గోదావరిఖని, తరువాత పచ్చునూరు, ఆపై ఊటూరు వరకు నీడలా వెంటాడటం వెనక సదరు వ్యక్తి ఇచ్చిన సమాచారమే కారణమని అనుమానిస్తున్నారు.

మాజీ ఎమ్మెల్యేకు తప్పిన ప్రమాదం


ప్రమాదానికి గురైన కారు

తిమ్మాపూర్: రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌కు త్రుటిలో ప్రమాదం తప్పింది. హైదరాబాద్ నుంచి రాజీవ్ రహదారి మీదుగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌తో కలిసి వాహనంలో రామగుండం వెళ్తున్నారు. తిమ్మాపూర్ మండలం రేణికుంట టోల్‌ప్లాజా సమీపంలో చందర్ వాహనాన్ని వెనుక నుంచి లారీ ఢీకొట్టింది. కారులో ఎయిర్ బెలూన్స్ తెరుచుకోవడంతో గన్‌మెన్లకు ప్రమాదం తప్పింది.

నకిలీ కంపోస్టు ఎరువుల పట్టివేత


ఎరువులను చుపుతున్న ఎస్సై శ్యాంరాజు

మేడిపల్లి: వ్యవసాయ శాఖ, పోలీస్ అధికారులు దాడులు చేసి మండలంలోని వల్లంపల్లిలో నిల్వ చేసిన నకిలీ బయోకంపోస్ట్ ఎరువులను పట్టుకున్నారు. ఎరువులను విక్రయిస్తున్న విజయ ఫర్టిలైజర్ యజమానిని అదుపులోకి తీసుకున్నామని వ్యవసాయ అధికారులు చంద్రదీపక్, వాణి తెలిపారు. 40 కిలోల బయోకంపోస్ట్ ఎరువు బస్తాలు తయారు చేసి.. అనుమతి లేకుండా విక్రయిస్తున్నారని, ఇది చట్టవిరుద్ధమని అన్నారు. నకిలీ ఎరువులను ట్రాలీ ఆటోలో తీసుకొచ్చిన తుమ్మెనాల గ్రామానికి చెందిన చెన్నవేని మల్లేశ్‌పై కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. రైతులు విత్తనాలు కొనేటప్పుడు రశీదు తప్పనిసరిగా తీసుకుని, పంటచేతికొచ్చేవరకూ భద్రపరుచుకోవాలని తెలిపారు.

ఆవిర్భావ దినోత్సవం వేళ.. అనంతలోకాలకు..

- రోడ్డు ప్రమాదంలో శాత్రాజ్‌పల్లి హెచ్‌ఎం మృతి


తాళ్లపల్లి సత్తవ్వ (ఫైల్)

కొత్తపల్లి(కరీంనగర్): రాష్ట్ర ఆవిర్భావ వేడుకల రోజున విషాదం నెలకొంది. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు కరీంనగర్ జిల్లా రామడుగు మండలం వెలిచాల గ్రామానికి చెందిన సత్తవ్వ రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం శాత్రాజ్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. ఆదివారం రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్నారు. జాతీయజెండాను ఆవిష్కరించారు. తిరిగి స్కూటీపై ఇంటికి బయల్దేరారు. వెలిచాల క్రాస్ రోడ్డు వద్దకు రాగానే హుజూరాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వేగంగా వచ్చి సత్తవ్వ(56)ను ఢీకొట్టింది. వాహనంతో సహా కొంతదూరం ఈడ్చుకెళ్లడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన వెంటనే స్థానికులు ఆమెను 108లో తొలుత కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి, అక్కడి నుంచి ప్రతిమ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు ప్రయత్నించినా ఫలితం కనిపించలేదు. చికిత్స పొందుతూ సత్తవ్వ మృతి చెందారు. సత్తవ్వ కొడుకు నీరజ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు కొత్తపల్లి ఎస్సై తెలిపారు.

అదుపుతప్పిన ఆర్టీసీ బస్సు


రోడ్డు కిందకు దూసుకెళ్లిన బస్సు

శంకరపట్నం: శంకరపట్నం మండలం కేశవపట్నం శివారులో ఆదివారం ఆర్టీసీ బస్సు అదుపుతప్పింది. ఓ కిరాణాషాపు ఎదుట నిలిపిఉంచిన స్కూటీని ఢీకొట్టి రోడ్డు కిందకు దూసుకెళ్లింది. స్థానికుల వివరాల ప్రకారం.. కరీంనగర్-1 డిపోకు చెందిన ఆర్టీసీ అద్దె బస్సు హనుమకొండ నుంచి కరీంనగర్ వెళ్తోంది. శంకరపట్నం మండలం కేశవపట్నం శివారులోకి రాగానే వర్షం కురుస్తుండడంతో ముందుగా వెళ్తున్న ఓ కారును తప్పించబోయి, రోడ్డు పక్కన ఉన్న కిరాణాషాపు ఎదుట నిలిపిన స్కూటీని ఢీకొట్టింది. అనంతరం రోడ్డుకిందకు దూసుకెళ్లింది. ప్రమాద సమయంలో బస్సులో 60మంది ప్రయాణికులు ఉన్నారు. క్షేమంగా బయటపడ్డారు. మరోబస్సులో వెళ్లిపోయారు. పోలీసులు వివరాలు సేకరించారు.

రామగుండం: ఆసిఫాబాద్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఆదివారం మధ్యాహ్నం బసంత్‌నగర్ రైల్వే వంతెన సమీపంలో అదుపుతప్పి డివైడర్‌పై నుంచి పక్కరోడ్డులోకి దూసుకెళ్లింది. ఇదే సమయంలో కరీంనగర్ నుంచి గోదావరిఖని వైపు కర్రల లోడుతో ఎదురుగా వస్తున్న లారీని బస్సు ఢీకొట్టింది. లారీకి క్లీనర్ వైపు భాగం, ఆర్టీసీ వెనక భాగం నుజ్జునుజ్జయింది. ఈ ప్రమాదంలో పలువురికి స్వల్ప గాయాలు కాగా.. ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. రాజీవ్ రహదారిపై రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో.. ఇరువైపులా కిలోమీటర్ దూరం వరకు వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం తెలుసుకున్న అంతర్గాం ఎస్సై బి.వెంకటస్వామి తన సిబ్బందితో ప్రమాద స్థలికి చేరుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

ప్రమాదాలకు నిలయంగా..

రైల్వే వంతెనపై రహదారి నిర్మాణ పనులు ఏళ్లుగా పెండింగ్‌లో ఉండడంతో.. ఒకే రోడ్డుపై వాహనాలు ఇరువైపులా రాకపోకలు సాగిస్తుంటాయి. ఫలితంగా నిత్యం రోడ్డు ప్రమాదాలకు అడ్డాగా మారింది. నెల రోజుల క్రితం నూతన వంతెన పూర్తయి రెండు రోజులు రాకపోకలు సాగించిన క్రమంలో వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు. అంతలోనే నూతన వంతెన రహదారిని మూసివేయడంతో ఒకే రోడ్డుపై రాకపోకలు సాగిస్తున్నాయి. సంబంధిత అధికారులు నూతన వంతెనను వినియోగంలోకి తీసుకురావాలని వాహనదారులు కోరుతున్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో శిశువు మృతి


ఆందోళనకారులతో మాట్లాడుతున్న ఎస్సై

సుల్తానాబాద్(పెద్దపల్లి): స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ఆదివారం మగశిశువు మృతి చెందడం ఆందోళనకు దారితీసింది. పుసాల ప్రాంతానికి చెందిన గర్భిణి పసుపులేటి మౌనికను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. నొప్పులు అధికంగా ఉండడతో పరిశీలించిన డాక్టర్ రమాదేవి.. మౌనికను లేబర్‌రూమ్‌కు తరలించాలని సిబ్బందిని ఆదేశించారు. తొలికాన్పు కావడంతో నార్మల్ డెలివరీకి ప్రయత్నం చేశారు. ఈలోగా శిశువు జన్మించగా, ఆక్సిజన్ సరిగా అందలేదు. వెంటనే కరీంనగర్ తరలించాలని డాక్టర్ సూచించారు. అంబులెన్స్‌లో కరీంనగర్ తరలించగా చికిత్స పొందుతూ శిశువు మృతి చెందాడని డాక్టర్లు చెప్పారు. శిశువు మృతదేహంతో మళ్లీ సుల్తానాబాద్ ఆస్పత్రికి చేరుకున్న కుటుంబసభ్యులు, బాబు తండ్రి ప్రశాంత్.. డాక్టర్ వైద్యం చేయక, నార్మల్ డెలివరీ కోసం వేచిచూడడంతోనే శిశువు మృతి చెందాడని ఆరోపించారు. ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. సమాచారం అందుకున్న ఎస్సై శ్రావణ్‌కుమార్.. ఆస్పత్రికి చేరుకొని వివరాలు సేకరించారు. ఆందోళనకారులను సముదాయించార. కాగా, మౌనికకు తొలికాన్పు కావడంతో నార్మల్ డెలివరీ కోసం ప్రయత్నం చేశామని, ఈ క్రమంలో మగశిశువు జన్మించాడని, హార్ట్‌బీట్ సరిగానే ఉందని, అయితే, ఆక్సిజన్ అందక సమస్య తలెత్తిందని డాక్టర్ రమాదేవి, పిల్లల వైద్యనిపుణుడు శ్రీధర్ వివరించారు. సిబ్బంది, వైద్యుల పొరపాటు ఏమీలేదని వివరించారు.

చిరుతదాడిలో దూడ....


సంఘటన స్థలంలో విచారణ చేపడుతున్న అధికారులు

కోనరావుపేట(వేములవాడ): చిరుతదాడిలో దూడ మృతిచెందిన సంఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం ధర్మారంలో జరిగింది. గ్రామానికి చెందిన దడిగె లక్ష్మీనర్సు రోజు మాదిరిగానే తన గేదె, దూడలను గ్రామ శివారులోని తన పొలం వద్ద కట్టేశాడు. ఆదివారం ఉద యం పాలు పితికేందుకు వెళ్లగా దూడ కొద్ది దూరంలో మృతిచెంది కనిపించింది. ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించగా ఎఫ్‌ఎస్‌వో బాపురాజు, బీట్ ఆఫీసర్ లావణ్య సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. వెటర్నరీ సిబ్బంది పంచనామా నిర్వహించి దూడ మృతదేహాన్ని పూడ్చిపెట్టారు. రాత్రి వేళ రైతులు అటవీ శివారు ప్రాంతంలోని పొలాలకు వెళ్లవద్దని సూచించారు. కాగా అదే గ్రామానికి చెందిన మల్లైవేణి శ్రీనివాస్‌కు చెందిన దూడను మే 8న చిరుత దాడిచేసి చంపింది. ధర్మారం శివారులోనే చిరుత సంచారం కనిపిస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

పోలీస్ ట్యాబ్ లాక్కున్న వ్యక్తిపై కేసు

చందుర్తి(వేములవాడ): పోలీసు విధులను అడ్డుకున్న చందుర్తి మండలం మర్రిగడ్డకు చెందిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు చందుర్తి ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. మండలంలోని మర్రిగడ్డకు చెందిన కత్తి చంద్రయ్య గత నెల 30న పెట్రోలింగ్ కానిస్టేబుల్ భాస్కర్, హోంగార్డు శ్రీను మర్రిగడ్డలో డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు చేస్తున్నారు. ఈక్రమంలో చంద్రయ్య పోలీసుల వద్ద ఉన్న ట్యాబును లాక్కుని విధులకు ఆటంకం కలిగించారని కేసు నమోదు చేసి, శనివారం రాత్రి అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కలవరపెడుతున్న వరుస హత్యలు

- భూతగాదాలు, అక్రమ సంబంధాలే కారణం
- కఠిన చర్యలు తీసుకుంటున్న పోలీసులు



- ఏప్రిల్ 4.. మల్యాల మండలం తక్కళపల్లి గ్రామంలో పెగడపల్లికి చెందిన బోగ మహేశ్ ప్రేమపేరుతో యువతి కుటుంబంపై దాడిచేసేందుకు రాగా.. ప్రతిఘటనలో మహేశ్ హత్యకు గురయ్యాడు. మహేశ్ చేతిలో గాయపడిన యువతి తాత ఆనందాస్ నర్సయ్య రెండు రోజుల తర్వాత మృతిచెందాడు.
- ఏప్రిల్ 26.. జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్నపేట గ్రామానికి చెందిన మేడిపల్లి రమను అదే గ్రామానికి చెందిన బోగ ప్రకాశ్ కత్తితో మెడపై నరికి హత్యచేశాడు.
- మే 6.. ధర్మపురి మండలంలోని కమలాపూర్ గ్రామానికి చెందిన పులి లస్మయ్య, గంగన్నకు భూవివాదం కొనసాగుతుండగా.. పులి గంగన్న పద్మ (45)ను కల్లుగీసే ఉలితో పొడిచి హత్య చేశాడు.
- ఏప్రిల్ 5.. మల్లాపూర్ మండల కేంద్రంలో సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌కు చెందిన అంబదాస్ (54)అనే వ్యక్తిని రవితేజ అనే వ్యక్తి కత్తితో గొంతుకోసి హత్యచేశాడు.
- ఏప్రిల్ 22న మల్యాల మండలం రాజారం గ్రామ శివారులో రామన్నపేటకు చెందిన ముస్కు గోపాల్‌రెడ్డిని జగిత్యాలకు చెందిన మహేందర్, గొల్లపల్లి మండలం ఇస్రాజీపల్లికి చెందిన సిద్దిబియాను దారుణంగా హత్య చేశాడు.
- మే ఒకటిన సారంగాపూర్ మండలం రేచపల్లి గ్రామంలోని కొత్తపల్లిలో ఆకుల మౌనికను ఆమె మామ ఆకుల రాజిరెడ్డి దారుణంగా హత్యచేశాడు.
- మే 17న బుగ్గారం మండలం గోపులాపూర్ గ్రామానికి చెందిన దీటి శ్రీనివాస్, దీటి మహేశ్ ఇంటి కొనుగోలు విషయంలో వివాదాలు ఉండగా మనుసులో పెట్టుకుని ఇనుపరాడ్లతో దాడిచేయగా దీటి శ్రీనివాస్, మహేశ్ మృతిచెందారు.
- మే 21న మెట్‌పల్లి పట్టణంలోని 20 వార్డుకు చెందిన సింగం మమత (38) భర్తతో విడాకులు తీసుకుని కొంత కాలంగా అబ్దుల్ అప్సర్‌తో వివాహేతర సంబంధం పెట్టుకోగా.. ఇద్దరి మధ్య గొడవ జరిగి అప్సర్ ఆమెను కత్తితో పొడిచి హత్య చేశాడు.

జగిత్యాలక్రైం: జిల్లాలో వరుస హత్యలు కలకలం కలిగిస్తున్నాయి. హత్యలతో ప్రజల్లో, పోలీసు వర్గాల్లో ఆందోళన మొదలైంది. నేర సంస్కృతిని తగ్గించేందుకు పోలీసులు హత్యల్లో ప్రమేయం ఉన్న ప్రతి ఒక్కరినీ గుర్తించి వారిపై కేసులు నమోదు చేయడంతోపాటు రిమాండ్‌కు తరలిస్తున్నారు. అలాగే గతంలో కేసులుండీ.. హత్యల్లో ప్రమేయం ఉన్న వారిపై రౌడీషీట్‌లు ఓపెన్ చేస్తున్నారు.

భూ తగాదాలతో...

జిల్లాలో వరుస హత్యలకు ప్రధాన కారణం భూతగాదాలు, మంత్రాలు, వివాహేతర సంబంధాలు, ప్రేమోన్మాదమే కారణమని పోలీసుల విచారణలో వెల్లడవుతున్నాయి. మారుతున్న సమాజంలో టెక్నాలజీ, చట్టాలు తెలిసినా నేరం చేయడానికి నిందితులు వెనుకాడటం లేదు. చిన్నపాటి విషయాలకు కూడా క్షణికావేశంలో హత్యలకు పాలపడుతున్నారు.

నిందితుల గుర్తింపులో టెక్నాలజీ

జిల్లాలో చోటుచేసుకుంటున్న హత్యల్లో ప్రత్యక్షంగా హత్యలో పాల్గొన్న వారితోపాటు పరోక్షంగా వెనుక ఉండి హత్యలకు ప్రోత్సహించిన వారిని కూడా పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించి కేసులు నమోదు చేస్తున్నారు. వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తున్నారు. ప్రజలు నేరాలకు దూరంగా ఉండాలనే లక్ష్యంతోనే పోలీసులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. చిన్నచిన్న గొడవలు జరుగుతున్న సమయంలో పోలీసులు కేసులు నమోదు చేసి నిందితులపై చర్యలు చేపడుతూ.. పెద్దనేరాలు జరగకుండా అడ్డుకట్ట వేస్తున్నా కొన్నిచోట్ల ఆగకపోవడం కలవరపెడుతోంది.

నేరాల అదుపునకు రౌడీషీట్ ఓపెన్

ఏదైనా మూడు కేసుల్లో నిందితులై ఉంటే వారిపై నేరాలను నియంత్రించేందుకు పోలీసులు రౌడీషీట్ ఓపెన్ చేస్తున్నారు. ఒక హత్య కేసులో ప్రమేయం ఉన్నా వారి ఆగడాలకు అడ్డుకట్ట వేసేందుకు రౌడీషీట్ ఓపెన్ చేస్తున్నారు. ఏదైనా నాన్‌బెయిలబుల్ ఒకటి, రెండు నేరాలకు పాల్పడిన వారిపైనా రౌడీషీట్ ఓపెన్ చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా రౌడీషీటర్ల కదలికలపై పెట్రోలింగ్ సిబ్బంది, 100 డయల్ సిబ్బంది ఎప్పటికప్పుడు నిఘా పటిష్టం చేస్తున్నారు. వారు ఏదైనా నేరాల్లో ప్రమేయం ఉన్నా వారిపై వెంటనే కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నారు.

నిందితులపై కఠిన చర్యలు



జిల్లాలో హత్యలు చేసిన నిందితులపై కఠిన చర్యలు చేపడుతున్నాం. హత్యకు ప్రోత్సహించిన వారిని కూడా టెక్నాలజీ సహాయంతో గుర్తిస్తున్నాం. ఒకటి, రెండు కేసులున్న వారిపై రౌడీషీట్ ఓపెన్ చేస్తున్నాం. చిన్నపాటి గొడవలలో క్షణికావేశంలో హత్యలకు పాల్పడుతున్నారు.

రఘుచందర్, డీఎస్పీ, జగిత్యాల

రాజన్నకు మొక్కుల జాతర


ఆలయ ఆవరణలో భక్తులు


సికింద్రాబాద్ గణేశ్ ఆలయం ఈవో వినోద్‌రెడ్డికి రాజన్న ప్రసాదాలు అందజేస్తున్న పర్యవేక్షకులు అల్లి శంకర్

వేములవాడ: రాజన్నను ఆదివారం 25 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. వేసవి సెలవులు సమీపిస్తుండడంతో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ధర్మగుండంలో స్నానాలు చేసిన భక్తులు తడి బట్టలతో కల్యాణకట్టలో తలనీలాలు, నిలువెత్తు బంగారం, కోడె మొక్కులు చెల్లించుకున్నారు. సికింద్రాబాద్ గణేశ్ టెంపుల్ ఈవో వినోద్‌రెడ్డి రాజన్నను దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వేదోక్త ఆశీర్వచనం ఇచ్చారు. అల్లి శంకర్, ప్రొటోకాల్ పర్యవేక్షకులు శ్రీరాములు, ఈవో సీసీ ఎడ్ల శివసాయి ఉన్నారు.

కమ్మరి కొలిమి పనిలో ఖాకీ

- జిల్లాలో వైరల్ అవుతున్న వీడియో
- చిన్ననాటి జ్ఞాపకమన్న అధికారి
- మూలాలు మరవనన్న డీఎస్పీ నాగేంద్రచారి


కొలిమి వద్ద కమ్మరి పని చేస్తున్న వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి

సిరిసిల్లక్రైం: కష్టనష్టాలకోర్చి కొలిమిలో నిప్పులు రాజేసి వ్యవసాయ పనులకు పనికొచ్చే పరికరాలను తయారు చేసే కమ్మరి వృత్తి నుంచి ఖాకీ కొలువు సాధించిన పోలీసు అధికారి తన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్న వీడియో ప్రస్తుతం జిల్లాలో వైరల్‌గా మారింది. వేములవాడ డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న నాగేంద్రచారి మూడు రోజు క్రితం చందుర్తి మండలం మల్యాలకు వెళ్లారు. అలా వెళ్లే క్రమంలో కమ్మరి కొలిమిలో వ్యవసాయ పనిముట్లు తయారు చేస్తుండాన్ని చూసి వెంటనే తన వాహనంలో నుంచి దిగి అక్కడికి వెళ్లారు. కొలిమిలో అగ్గిరాజేసి సుత్తెతో కొడుతూ పనిముట్టు తయారు చేశారు. దీనికి ఓ పాటను జతచేసిన వీడియో ఇప్పుడు జిల్లాలో వైరల్‌గా మారింది. దీనిపై ‘సాక్షి’ డీఎస్పీ నాగేంద్రచారిని పలుకరించగా అమ్మనాన్నలు చేసే వృత్తిలో మమేకమయ్యేవాళ్లమని అన్నారు. ప్రస్తుతం ఉన్న సాంకేతిరంగంలో చేతి ఆధారిత వృత్తులు కనుమరుగవడం బాధాకరమని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న తరానికి తమ తల్లిదండ్రులు ఏ విధంగా కష్టించి పిల్లలను పోషిస్తున్నారో తెలపాల్సిన అవసరం ఉందన్నారు. కొలిమిలో నిప్పుల సెగలు తనలోని పాత జ్ఞాపకాలను తట్టిలేపాయని పేర్కొన్నారు.

కాంగ్రెస్ నాయకుడిపై హత్యాయత్నం

- తీవ్రగాయాలు.. పరిస్థితి విషమం
- బాధితుడు జీవన్‌రెడ్డి అనుచరుడు

ధర్మారం(ధర్మపురి): కటికనపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మండల మాజీ ప్రధానకార్యదర్శి రేండ్ల నరేశ్(38)పై ఆదివారం రాత్రి హత్యాయత్నం జరిగింది. స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయం సమీపంలో నరేశ్ నూతనంగా ఇంటి నిర్మాణం చేపట్టారు. భవన నిర్మాణానికి సంబంధించిన సామాను భద్రపరిచేందుకు సమీపంలోనే ఓ గది అద్దెకు తీసుకుని అందులోనే ఉంటున్నారు. ఇంటి నిర్మాణం పనులు చూసుకుని నిద్రించేందుకు తన గదికి చేరుకున్నాడు. ఇదే సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి నరేశ్‌తో వాగ్వాదానికి దిగారు. అక్కడే ఉన్న పారతో ఆయనపై దాడిచేసి తీవ్రంగా కొట్టి గాయపర్చారు. ఆ తర్వాత అక్కడి నుంచి పరారైనట్లు తెలిసింది. కుటుంబసభ్యులు గమనించి నరేశ్‌ను వెంటనే కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని కుటుంబసభ్యులు తెలిపారు. సమాచారం అందుకున్న పెద్దపల్లి సీఐ కృష్ణ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు.

క్లుప్తంగా

ఏకాదశి ఉత్సవం.. వరుణ యాగం


వరుణయాగం నిర్వహిస్తున్న పండితులు

కరీంనగర్‌కల్చరల్: నగరంలోని తిరుమల్‌నగర్‌లో మయూరిపీఠం శ్రీ నిలయంలో ఆదివారం వైశాఖ బహుళ ఏకాదశి ఉత్సవం, వరుణయాగం ఘనంగా నిర్వహించారు. మయూరగిరి పీఠాధిపతులు, జ్యోతిష్యవాస్తు పండితులు నమిలకొండ రమణాచారి ఆధ్వర్యంలో విష్ణుమూర్తికి అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం హోమాలు, సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం, హనుమాన్‌చాలీసా పారాయణాలు చేశారు. ఎండలు వీపరీతంగా ఉన్నందున వరుణమంత్ర జపాల వరుణయాగం నిర్వహించారు. ఈ హోమం ద్వారా కనీసం ఎండ తీవ్రత తగ్గి చల్లటి వాతావరణం ఏర్పడే అవకాశం ఉంటుందని పండితులు తెలిపారు. కార్యక్రమంలో రామకృష్ణమాచార్యులు, వివేకాచార్యులు, రమేశ్‌స్వామి, తదితరలు పాల్గొన్నారు.

వివాహ వార్షికోత్సవ సంబరం


వార్షికోత్సవ వేడుకల్లో సభ్యులు

సప్తగిరికాలనీ: మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ఒకే చోట వారి వివాహ వార్షికోత్సవ వేడుకలు జరుపుకోవడం మంచి సంప్రదాయం అని నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో కశ్మీర్‌గడ్డ వాకర్స్ అసోసియేషన్‌కు చెందిన పలువురి సభ్యుల మే నెల వివాహ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. 17 మంది సభ్యులు కలిసి ఒకే చోట వివాహ వార్షికోత్సవ సంబరాలతో సందడి చేశారు. ఈసందర్భంగా మేయర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సంబరాలు చేసుకున్నవారికి వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపి, సత్కరించారు. మార్నింగ్‌వాకర్స్ సభ్యులు ఇలా ఒకే చోట వేడుకలు జరుపుకోవడం సంతోషకరమన్నారు. వాకర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మధుసూదనాచారి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం


ఆర్థికసాయం అందిస్తున్న తోటి పోలీసులు

కరీంనగర్‌క్రైం: కరీంనగర్‌లో విధులు నిర్వహిస్తున్న 2000వ సంవత్సరం బ్యాచ్‌కు చెందిన రాజు అనే కానిస్టేబుల్ ఇటీవల అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈసందర్భంగా తోటి బ్యాచ్‌మేట్స్ అంతా కలిసి రూ.లక్షా నలభై ఎనిమిది వేలు ఆదివారం హైదరాబాద్‌లో అందజేశారు. కార్యక్రమంలో సంపత్‌రెడ్డి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు రెండు గేదెలు మృతి


బద్దిపల్లిలో మృతిచెందిన గేదెల వద్ద రైతులు

కొత్తపల్లి: కొత్తపల్లి మండలం బద్దిపల్లి గ్రామ రైతు ఉప్పు రాజయ్యకు చెందిన రెండు గేదెలు ఆదివారం సాయంత్రం పిడుగుపాటుకు మృతి చెందాయి. రైతు తన వ్యవసాయ భూమి వద్ద రెండు గేదెలను ఉంచగా.. పిడుగుపడి మృతి చెందాయి. దీంతో రూ.1.40 లక్షల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని రాజయ్య విజ్ఞప్తి చేశాడు. కాగా మండల కిసాన్‌మోర్చా అధ్యక్షుడు పోర్తి అనిల్, నాయకులు సందీప్, కమలాకర్, నవీన్, మహేందర్‌లు సంఘటనా స్థలాన్ని సందర్శించి, ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం అందించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

తిమ్మాపూర్: అల్గునూర్ ట్రాన్స్‌కో పరిధిలో విద్యుత్ లైన్ల కింద, పక్కల ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్నామని, సోమవారం ఉదయం 7 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ వెంకటరమణ తెలిపారు. వాగేశ్వరి కాలేజీ నుంచి తపాలా లక్ష్మీనర్సింహస్వామి ఆలయం వరకు రాజీవ్ రహదారికి ఇరువైపులా చెట్ల కొమ్మలు తొలగించనున్నామని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.


విద్యుత్ భవన్‌లో జరిగిన వేడుకల్లో ఎస్ఈ గంగాధర్, ఉద్యోగులు

దశాబ్ది వైభవం


జెండా ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ


జెండా ఎగరేస్తున్న జోన్ ఏడీ వినోద్‌కుమార్


వేడుకల్లో కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రాజు తదితరులు

కరీంనగర్/కొత్తపల్లి/కరీంనగర్‌రూరల్: తెలంగాణ సిద్ధించి పదేళ్లు పూర్తయిన సందర్భంగా జిల్లాలో రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, వివిధ పార్టీలు, కుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థల ఆధ్వర్యంలో మువ్వన్నెల జెండా ఎగురవేసి జాతీయ గీతాలను ఆలపించారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో చైర్‌పర్సన్ కనుమల్ల విజయ జెండా ఆవిష్కరించారు. విద్యుత్ భవన్‌లో ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ జెండా ఎగురవేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆర్టీసీ బస్‌స్టేషన్ ఆవరణలో కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి.వినోద్ కుమార్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. సీపీఐ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి, కొత్తపల్లిలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ జెండా ఆవిష్కరించారు. కొత్తపల్లి మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ రుద్ర రాజు, కరీంనగర్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తిప్పర్తి లక్ష్మయ్య, ఎలబోతారంలో బీజేపీ మండలాధ్యక్షుడు మాడిశెట్టి సంతోష్‌కుమార్ జాతీయ జెండా ఎగురవేశారు.


జెండావందనం చేస్తున్న ఎంపీపీ లక్ష్మయ్య


జెండా ఆవిష్కరిస్తున్న వెంకటస్వామి


జెండా ఎగరేస్తున్న సంతోష్‌కుమార్


జెండా వందనం చేస్తున్న అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి


పారమితలో నినాదాలు చేస్తున్న యాజమాన్యం, సిబ్బంది


అచీవర్స్‌లో జెండా ఎగరేస్తున్న డైరెక్టర్ వెంకటేశ్వర్లు

విద్యా సంస్థల్లో..

కరీంనగర్/కొత్తపల్లి:కరీంనగర్ వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ టైనీటాట్స్‌లో రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. విద్యా సంస్థల చైర్మన్ డా.వి.నరేందర్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పారమిత విద్యాసంస్థల చైర్మన్ డా.ఇ.ప్రసాదరావు ప్రజలందరికీ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అచీవర్స్ పాఠశాలలో వేడుకలను ప్రిన్సిపాల్ పల్లవి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించగా, డైరెక్టర్ జి.వెంకటేశ్వర్లు జెండా ఆవిష్కరించారు.

సంఘాల ఆధ్వర్యంలో..


జెండావందనం చేస్తున్న రెడ్‌క్రాస్ బాధ్యులు

కరీంనగర్‌టౌన్: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కార్యాలయంలో చైర్మన్ పెండ్యాల కేశవరెడ్డి జెండా ఎగురవేశారు. తెలంగాణచౌక్‌లో రజక సంఘం నాయకులు సంబరాలు నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు పూసాల సంపత్ తదితరులు పాల్గొన్నారు.

తెరవే ఆధ్వర్యంలో..

కరీంనగర్: తెలంగాణ ఏర్పడి దశాబ్దకాలం పూర్తయిన సందర్భంగా స్థానిక అమరవీరుల స్తూపం వద్ద తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో అమరులకు నివాళి అర్పించారు. తెరవే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బూర్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, రాష్ట్ర సాధనలో వేలాదిమంది ప్రాణత్యాగం మరువలేనిదని కొనియాడారు. గాజోజు నాగభూషణం, కూకట్ల తిరుపతి, విలాసాగరం రవీందర్, పెనుగొండ బసవేశ్వర్, నసీరుద్దీన్, కనకం శ్రీనివాస్, రాజేశం, సంతోష తదితరులు పాల్గొన్నారు.


స్తూపం వద్ద నివాళి అర్పిస్తున్న తెరవే బాధ్యులు

ఉద్యమకారుల త్యాగ ఫలితం తెలంగాణ

కరీంనగర్: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక ఉద్యమకారుల సంక్షేమ సంఘం కార్యాలయంలో ఆదివారం అమరవీరులకు ఘనంగా నివాళి అర్పించారు. ఈసందర్భంగా అధ్యక్షుడు పామరాజు రామారావు మాట్లాడుతూ, రాష్ట్ర సాధనలో ఉద్యమకారులు ఎంతో శ్రమించారని, వారి శ్రమకు తగ్గ ఫలితం దక్కిందన్నారు. ప్రధాన కార్యదర్శి, న్యాయవాది దయాల ఓంప్రసాద్ మాట్లాడుతూ, తెలంగాణ సాధించుకున్న సందర్భంగా దశాబ్ది ఉత్సవాలు జరుపుకోవడం వెనుక ఎంతో మంది బలిదానాలు ఉన్నాయన్నారు. అనంతరం ఉద్యమకారులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కెంసారం సమ్మయ్య, సత్తినేని శ్రీనివాస్, మంద వెంకన్న, గొడిశాల రమేశ్, బత్తిని శ్రీనివాస్, శ్రీకోటి గోపికృష్ణ, శ్రీరాంవెంకట్‌రాం, ఊకంటి ఓంకార్, ఈసంపెల్లి మధనయ్య, కొరెపు సుధాకర్, ఎంఏ ఖుద్దూస్, కంతారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ప్రశంసాపత్రాలు అందజేస్తున్న సంఘం బాధ్యులు

క్షీరాభిషేకం


ఇరుకుల్లలో సోనియా చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

కరీంనగర్‌రూరల్: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం కరీంనగర్ మండలం దుర్శేడ్‌లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కాంరెడ్డి రాంరెడ్డి ఆధ్వర్యంలో సోనియాగాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం గ్రామస్తులకు స్వీట్లు పంపిణీ చేశారు. కరీంనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్, సింగిల్‌విండో వైస్ చైర్మన్ బీరం ఆంజనేయులు, నాయకులు పాల్గొన్నారు. ఇరుకుల్లలో సోనియా చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించగా, కాశిపాక రాకేశ్, రమేశ్, జువ్వాడి మారుతీరావు, బుర్ర బాబు, భాస్కర్, ప్రవీణ్, స్వామి, శంకర్, సురేశ్ పాల్గొన్నారు.

స్తంభాలు వేయరు.. కనెక్షన్ ఇవ్వరు

కరీంనగర్ మండలం నల్లగుంటపల్లిలోని వ్యవసాయబావులకు ఏడాది నుంచి విద్యుత్ కనెక్షన్ ఇచ్చేందుకు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. గతేడాది వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలకు ఇరుకుల్ల వాగు ఉప్పొంగడంతో మొగ్దుంపూర్ సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా చేసే స్తంభాలు వరదల్లో కొట్టుకుపోయాయి. బొమ్మకల్ సబ్‌స్టేషన్ నుంచి తాత్కాలిక విద్యుత్ కనెక్షన్ ఇచ్చినా దూరం కావడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. కొత్త లైన్ వేసేందుకు స్తంభాలు తీసుకొచ్చినప్పటికీ కాంట్రాక్టర్ పనులు చేయడంలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులు పూర్తి చేసేందుకు తగిన చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

– కరీంనగర్‌రూరల్


వృథాగా విద్యుత్ స్తంభాలు

టీయూడబ్ల్యూజే నివాళి

విద్యానగర్: ఎందరో అమరవీరుల త్యాగాల ఫలితమే తెలంగాణ ఏర్పాటు అని టీయూడబ్ల్యూజే (ఏ–143) జిల్లా అధ్యక్షుడు బోనాల మల్లికార్జున్ అన్నారు. ఆదివారం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమంలో టీయూడబ్ల్యూజే జర్నలిస్టులు పాల్గొన్న విషయం గుర్తు చేసుకున్నారు.

42 ఏళ్లకు ఒక చోటకు..

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం బొమ్మకల్ మండల పరిషత్తు పాఠశాలలో 1981–82 సంవత్సరం ఏడో తరగతి బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. 42 ఏళ్ల అనంతరం కలుసుకున్న విద్యార్థులు అప్పటి మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. చదువు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పోగుల ఆంజనేయులు, చింతల కిషన్‌పటేల్, తిరుపతి, రమేశ్, సంపత్, కనుకయ్య, రవి, సుమతి, పద్మ, పుష్పలత, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను సన్మానించిన పూర్వ విద్యార్థులు ➤



అమరుల త్యాగాలను మరువలేం


క్యాంపు కార్యాలయంలో జెండా వందనం చేస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

• కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ అర్బన్: తెలంగాణ సాధనలో అమరుల త్యాగాలను మరువలేమని, ప్రాణత్యాగం చేసి స్వరాష్ట్రాన్ని సాధించారని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆదివారం పతాకావిష్కరణ చేశారు. తెలంగాణ సాధనలో దశాబ్దాల పోరాట చరిత్ర ఉందని, మన ప్రాంతాన్ని సకల రంగాల్లో వృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, ఆర్డీవో మహేశ్వర్, కలెక్టరేట్ ఏవో సుధాకర్, క్యాంపు కార్యాలయ అధికారులు రామ్మోహన్, సతీశ్, గందె లక్ష్మీనర్సింహరావు తదితరులు పాల్గొన్నారు.

పథకాల ప్రగతిలో భాగస్వాములమవుదాం

ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో నిబద్ధతతో పని చేయాలని టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు మారం జగదీశ్వర్ అన్నారు. తెలంగాణ సాధనలో టీఎన్జీవోల సంఘం చేసిన కృషి, పోరాటాన్ని గుర్తు చేశారు. సంఘం జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణరావు, మడిల్లి కాళిచరణ్‌గౌడ్, ముప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి, నాగుల నర్సింహస్వామి, పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు కేశవరెడ్డి, కార్యదర్శి లింగయ్య, నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కోట రామస్వామి, సర్దార్ హర్మిందర్‌సింగ్, మారుపాక రాజేశ్‌భరద్వాజ, నేరేళ్ల కిషన్, గూడ ప్రభాకర్‌రెడ్డి, మహిళా ఉద్యోగ నాయకులు సబిత, సునీత, సరిత, హరిప్రియ, శైలజ తదితరులు పాల్గొన్నారు. కరీంనగర్ వ్యవసాయ పరిశోధన స్థానంలో ప్రధాన శాస్త్రవేత్త, హెడ్ డీన్ డా.జి.మంజులత పతాకావిష్కరణ చేసి అమరుల త్యాగాలను గుర్తు చేశారు. ఏరువాక కేంద్రం, కరీంనగర్ బోధన సిబ్బంది డా.ఉషారాణి, డా.మధుకర్, డా.శ్రావణి, డా.మదన్‌మోహన్‌రెడ్డి, డా.రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు. కరీంనగర్ వ్యవసాయ మార్కెట్‌లో ఉన్నత శ్రేణి కార్యదర్శి పురుషోత్తం జెండా ఆవిష్కరించారు.


కరీంనగర్ వ్యవసాయ పరిశోధన స్థానంలో..


టీఎన్జీవో భవన్‌లో..

స్వరాష్ట్రంలోనే కరీంనగర్ అభివృద్ధి

• నగర మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ కార్పొరేషన్: తెలంగాణ ఏర్పాటుతోనే కరీంనగర్ నగరంలో అభివృద్ధి సాధ్యపడిందని మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో ఆదివారం రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది వేడుకలు ఘనంగా జరిగాయి. ముందుగా జాతీయజెండా ఆవిష్కరించి, జాతీయ గీతాన్ని ఆలపించారు. అనంతరం వెంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద అమరులకు పాలకవర్గసభ్యులు, అధికారులతో కలిసి మేయర్ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర సాదనకు అసువులు బాసిన అమరవీరుల త్యాగాలను గుర్తుంచుకోవాలన్నారు. పదేళ్ల కేసీఆర్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచారని అన్నారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా రాబోయే రోజుల్లో అభివృద్ధి ఆశయంగా పనిచేయాలన్నారు. 2014 నుంచి 2024 వరకు కరీంనగర్ అభివృద్ధి కోసం సుమారు రూ.1,400 కోట్ల నిధులు కేటాయించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో నగరపాలకసంస్థ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణి, కార్పొరేటర్లు గందె మాదవిమహేశ్, గంట కళ్యాణి శ్రీనివాస్, కోల మాలతి సంపత్, వంగల శ్రీదేవి పవన్, రాపర్తి విజయ, కమల్‌జిత్ కౌర్ సోహన్ సింగ్, దిండిగాల మహేశ్, ఐలేందర్‌యాదవ్, కుర్ర తిరుపతి, ఆకుల నర్మద నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.


జెండా ఆవిష్కరిస్తున్న మేయర్ సునీల్‌రావు

బీజేపీ మద్దతుతోనే తెలంగాణ


• పార్టీ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి

కరీంనగర్‌టౌన్: దశాబ్దాల పాటు దేశాన్ని ఏలిన కాంగ్రెస్ తెలంగాణ ఏర్పాటు విషయంలో నాన్చుడు ధోరణి అవలంబించిందని, బీజేపీ మద్దతుతోనే రాష్ట్రం సిద్ధించిందని పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా శాఖ ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని పార్టీ కార్యాలయంలో జాతీయ పతాకం ఎగురవేసి మాట్లాడారు. తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన వారిని మరువలేమన్నారు. ముఖ్యంగా కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ వల్లే తెలంగాణ వచ్చిందనే కాంగ్రెస్ వాదుల తీరుపై మండిపడ్డారు. గత బీఆర్ఎస్, నేటి కాంగ్రెస్ ప్రభుత్వానికి పెద్ద తేడా ఏమీ లేదని, రాష్ట్ర ఆకాంక్షలు, ఆశయాలు నెరవేర్చడం బీజేపీతోనే సాధ్యమన్నారు. నాయకులు బాస సత్యనారాయణరావు, మేకల ప్రభాకర్‌యాదవ్, తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, బత్తుల లక్ష్మీనారాయణ, దండు కొమురయ్య, మలుగూరు సమ్మిరెడ్డి, కన్న కృష్ణ, కటకం లోకేశ్, దుబాల శీను, పుప్పాల రఘు, కార్పొరేటర్లు కోలగని శ్రీనివాస్, దుర్శేట్టి అనుప్, పవన్, జితేందర్, బండ రమణారెడ్డి, నరహరి లక్ష్మారెడ్డి, రాగి సత్యనారాయణ, శ్రీనివాస్, సుధాకర్, బండారు గాయత్రి, రాజు, శివ తదితరులు పాల్గొన్నారు.


జెండా ఆవిష్కరణలో కృష్ణారెడ్డి, నాయకులు

కళలను కాపాడుకోవడం అందరి బాధ్యత

హుజూరాబాద్: కళలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని సినీ గేయ రచయిత, గాయకుడు మురళి మధు అన్నారు. ఆదివారం రాత్రి పట్టణంలోని సిటీ సెంట్రల్ ఫంక్షన్ హాల్‌లో కూచిపూడి నృత్యం సమ్మర్ క్యాంపు ముగింపు సందర్భంగా చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... తెలంగాణలోని కళలు వర్ధిల్లాలని, జానపద కళలతో పాటు కూచిపూడి నృత్యాన్ని మనం కొనసాగిస్తున్నామని, కళలు మన జీవన సంస్కృతిని ప్రతిబింబిస్తాయన్నారు. 30 రోజులపాటు 40 మంది బాలికలకు వరంగల్‌కు చెందిన ఎస్.సీఎస్ కళాక్షేత్రం డ్యాన్స్ మాస్టర్ వెంకటేశ్వర్లు శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు.


నృత్య ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు

నాలుక్కర్చుకున్న ఇండియాటుడే-యాక్సిస్ మై ఇండియా

- రాష్ట్ర ఎన్నికలపై ఎగ్జిట్ పోల్స్‌పై విస్తుపోయిన రాజకీయ విశ్లేషకులు
- గ్రామీణ ప్రాంత ప్రజలు, మహిళలు అధిక శాతం వైఎస్సార్‌సీపీకే మద్దతుగా నిలిచారన్న రాజ్‌దీప్ సర్దేశాయ్
- మీరు చేసిన సర్వే సహేతుకంగా కన్పించడం లేదంటూ యాక్సిస్ మై ఇండియా అధినేత ప్రదీప్‌గుప్తాకు చురక

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలపై వెల్లడించిన ఎగ్జిట్ పోల్స్‌పై ఇండియాటుడే-యాక్సిస్ మై ఇండియా నాలుక్కర్చుకుంది. యాక్సిస్ మై ఇండియా నిర్వహించిన ఎగ్జిట్ పోల్స్‌ను ఇండియాటుడే శనివారం ప్రసారం చేసింది. ఈ సర్వేపై దేశ వ్యాప్తంగా రాజకీయ విశ్లేషకులు విస్మయం వ్యక్తం చేయడంతో.. ఆదివారం ఇండియాటుడే టీవీలో చర్చ చేపట్టింది. 'ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అద్భుతంగా పనిచేసింది. ఐదేళ్లలో విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రుల రూపురేఖలు మారిపోయాయి. డీబీటీ పథకాల ద్వారా రూ.2.70 లక్షల కోట్ల లబ్ధి పేదలకు నేరుగా చేరాయి. జగన్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల పట్ల గ్రామీణ ప్రజలు..ముఖ్యంగా మహిళలు ఎక్కువగా ఆకర్షితులయ్యారు. వారంతా ఈ ఎన్నికల్లో జగన్‌కు అండగా నిలిచారని అంచనా వేస్తున్నాం'అని ఇండియా టుడే కన్సల్టింగ్ ఎడిటర్ రాజ్‌దీప్ సర్దేశాయ్ అన్నారు. ఏపీలో జరిగిన మార్పును స్వయంగా చూశాను. పాఠశాలలు, ఆస్పత్రులు చాలా మార్పు కన్పించిందన్నారు. ఈ నేపథ్యంలో మీరు చేసిన సర్వే సహేతుకంగా లేదన్నది స్పష్టమవుతోందంటూ యాక్సిస్ మై ఇండియా అధినేత ప్రదీప్ గుప్తాకు రాజ్‌దీప్ సర్దేశాయ్ చురకలంటించారు. స్కిల్ స్కామ్‌లో చంద్రబాబును అరెస్టు చేయడం వల్ల ప్రజల్లో సానుభూతి.. దక్షిణాది రాష్ట్రాల్లో ఐదేళ్లకు ఓ సారి ప్రభుత్వాన్ని మార్చే సంప్రదాయం ఉండటం ఏపీలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమికి అనుకూలించిందని ప్రదీప్ గుప్తా చెప్పారు. దీనిపై యాంకర్ రాహుల్ కన్వల్ స్పందిస్తూ.. కేజ్రీవాల్ అరెస్టు వల్ల ఢిల్లీ, పంజాబ్‌లో.. హేమంత్ సోరేన్ అరెస్టు వల్ల జార్ఖండ్‌లో ప్రజల్లో సానుభూతి రాలేదా.. అక్కడ ఎగ్జిట్ పోల్స్‌లో అది ప్రతిబింబించలేదేం అంటూ ప్రదీప్ గుప్తాను నిలదీశారు. తమిళనాడులో జయలలిత.. తెలంగాణలో కేసీఆర్ వరుసగా రెండు సార్లు విజయం సాధించారని ఎత్తిచూపారు. వీటిని పరిశీలిస్తే.. మీ సర్వే శాస్త్రీయంగా లేదేమోనని అనుమానాలు వ్యక్తం చేయడంతో ప్రదీప్‌గుప్తా నీళ్లు నమిలారు. ఇండియాటుడే-యాక్సిస్ మై ఇండియా ఎగ్జిట్ పోల్స్ 2021లో బెంగాల్‌లోనూ అంచనాలు తప్పాయి. అక్కడ బీజేపీ విజయం సాధిస్తుందని చెప్పగా.. టీఎంసీ విజయం సాధించింది. గతేడాది నవంబర్‌లో ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని చెప్పగా.. రెండు రాష్ట్రాల్లోనూ బీజేపీ విజయం సాధించింది.

లెక్క ఏదైనా... ఫ్యాన్ పక్కా

అసెంబ్లీ ఎన్నికలపై మెజార్టీ జాతీయ, రాష్ట్ర మీడియా సంస్థల ఎగ్జిట్ పోల్స్ స్పష్టీకరణ

సాక్షి, అమరావతి : పేదలకు, పెత్తందారులకు.. విశ్వసనీయతకు, వంచనకు మధ్య పోరుగా దేశ వ్యాప్తంగా అత్యంత ఆసక్తి రేకెత్తించిన ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘనవిజయం ఖాయమని... ఏ లెక్కన చూసుకున్నా మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రావడం పక్కా అని అధిక శాతం జాతీయ, రాష్ట్ర మీడియా, సర్వే సంస్థల ఎగ్జిట్ పోల్స్ తేల్చిచెప్పాయి. రాష్ట్రంలో 50 శాతానికిపైగా ఓట్లతో వైఎస్సార్‌సీపీ తిరుగులేని విజయం సాధిస్తుందని ఇవన్నీ స్పష్టం చేశాయి. దేశ వ్యాప్తంగా క్షేత్రస్థాయిలో విస్తృత యంత్రాంగం ఉన్న టైమ్స్ ఆఫ్ ఇండియా గ్రూప్‌కు చెందిన టైమ్స్‌నౌ-ఈటీజీ రీసెర్చ్ నిర్వహించిన ఎగ్జిట్ పోల్స్‌లో 50 శాతం ఓట్లతో వైఎస్సార్‌సీపీ 14 లోక్‌సభ స్థానాలను చేజిక్కించుకుంటుందని.. ఎన్డీఏ కూటమి 48 శాతం ఓట్లతో 11 లోక్‌సభ స్థానాలకు పరిమితం అవుతుందని వెల్లడయింది. టైమ్స్ ఆఫ్ ఇండియా తరహాలోనే దేశ వ్యాప్తంగా విస్తృత యంత్రాంగం ఉన్న దైనిక్ భాస్కర్ గ్రూప్... రాష్ట్రంలో 15-17 లోక్‌సభ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ ఘనవిజయం సాధిస్తుందని.. ఎన్డీఏ కూటమి 8-9 లోక్‌సభ స్థానాలకు పరిమితం అవుతుందని తన ఎగ్జిట్ పోల్స్ ద్వారా తేల్చిచెప్పింది. ఇక తెలుగు రాష్ట్రాల్లో టీవీ9 వంటి మీడియా సంస్థలు, సెఫాలజిస్టులు, ఆరా వంటి ప్రతిష్ఠాత్మక సర్వే సంస్థలు నిర్వహించిన 32 ఎగ్జిట్ పోల్స్‌లో 24 ఎగ్జిట్ పోల్స్‌లో వైఎస్సార్‌సీపీ ఘనవిజయం సాధించడం తథ్యమని.. మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని స్పష్టమయింది.

ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు ఇవి..

సంఖ్య	సర్వే సంస్థ	వైఎస్సార్ సీపీ	కూటమి
1	పార్థదాస్(చాణక్య)	110-120	55-65
2	జన్మత్‌పోల్స్	95-103	67-75
3	టీవీ9 పోల్	110-120	55-65
4	ర్యాప్ స్ట్రాటజీస్	158	17
5	స్మార్ట్ పోల్	82(+/-8)	93(+/-8)
6	ఆరా	94-104	71-81
7	ఆత్మసాక్షి	98-116	59-77
8	హెచ్ఎంఆర్	91-101	73-83
9	క్యూ-మెగా	120+	50-60
10	పొలిటికల్ లెబొరేటరీ	108	67
11	రేస్	117-128	47-58
12	ఎన్డీఏ ఎగ్జిట్‌పోల్	143	32
13	ఎల్ఆర్ సర్వే	93	82
14	నాగన్న సర్వే	118	49
15	సీ-నెక్స్ట్ ఏపీ	123	52
16	ఎస్ఏఎస్‌గ్రూప్ ఐపీఎస్ఎస్ టీమ్ హైదరాబాద్	126	49
17	కేఎస్ ప్రసాద్	146	29
18	కోగంటి సత్యం	110-125	45-55
19	పోల్ స్ట్రాటజీస్	115-125	50-60
20	అగ్నివీర్	124-128	46-49
21	ఆపరేషన్ చాణక్య	95-102	64-68
22	సీపీఎస్	97-108	66-78
23	ఫస్ట్‌స్టెప్ సొల్యూషన్స్	119	56
24	సీపీఆర్ఎస్	120-135	40-55
25	చాణక్య స్ట్రాటజీస్	39-49	114-125
26	రింగ్ టు పోల్	60	115
27	పీపుల్ పల్స్	45-60	111-135
28	నేషనల్ ఫ్యామిలీ	65-71	104-115
29	పయనీర్	31	144
30	పోల్ పల్స్	45-60	108-116
31	రైజ్	52	123
32	కేకే సర్వే	31	133-144

బీజేపీ భజన చేసే జాతీయ మీడియా ఎగ్జిట్ పోల్స్ తద్భిన్నం..

బీజేపీ భజన చేసే ఇండియాటుడే గ్రూప్, జీన్యూస్.. ఈనాడుతో భాగస్వామ్యం ఉన్న నెట్‌వర్క్‌లోని సీఎన్ఎన్ న్యూస్-18 వంటి రెండు మూడు జాతీయ మీడియా సంస్థలు నిర్వహించిన ఎగ్జిట్ పోల్స్ మాత్రం రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి విజయం సాధిస్తుందని తేల్చడం గమనార్హం. రాజధాని అంశంతోపాటు స్కిల్ స్కామ్‌లో చంద్రబాబును అరెస్టు చేయడంపై ప్రజల్లో సానుభూతి వచ్చిందని.. అదే ఎన్డీఏ కూటమి విజయానికి బాటలు వేసిందని ఆ సంస్థలు విశ్లేషించాయి. కానీ వాస్తవంగా రాష్ట్రంలో ఎన్నికల ప్రచారంలో ఇటు వైఎస్సార్‌సీపీగానీ అటు ఎన్డీఏగానీ రాజధాని అంశాన్ని ఎక్కడా పెద్దగా ప్రస్తావించలేదు. ఇక స్కిల్ స్కామ్‌లో చంద్రబాబును అరెస్టు చేసినప్పుడు రాష్ట్రంలో ఎక్కడా చిన్నపాటి బంద్‌లు గానీ, ర్యాలీలు గానీ, నిరసనలు గానీ జరగనేలేదు. తప్పు చేశాడు కనక అరెస్టయ్యాడనే రీతిలో జనం స్పందించారు. దీంతో హైదరాబాద్‌లో చంద్రబాబు సామాజిక వర్గానికి చెందిన కొందరు వ్యక్తులు కూపన్లు ఇచ్చి మరీ 'ఐటీ ఉద్యోగుల' పేరిట స్థానికంగా ఒక ఈవెంట్‌లా నిరసన కార్యక్రమం చేశారు. అలాంటిది ఈ రెండు అంశాలూ ప్రభావం చూపిస్తున్నాయని, అందుకే కూటమి గెలుస్తోందని ఈ జాతీయ ఛానెళ్లు చెప్పిన జోస్యం నూటికి నూరుపాళ్లూ తప్పవుతుందని రాష్ట్ర వ్యవహారాలను దగ్గర నుంచి పరిశీలిస్తున్న విశ్లేషకులు స్పష్టంగా చెబుతున్నారు.

కనీస జాగ్రత్తలు కూడా తీసుకోని ఎగ్జిట్ పోల్స్‌ను నమ్మేదెలా?

విచిత్రమేంటంటే 'ఇండియా టుడే- మై యాక్సిస్' సంస్థ శనివారంనాడు దేశవ్యాప్త ఎగ్జిట్‌పోల్స్‌ను వెలువరించింది. దీన్లో బీజేపీ నినాదమైన '400' సీట్లకు ఆ పార్టీని చేర్చటమే లక్ష్యంగా ఒకో రాష్ట్రంలో స్వీప్ అంటూ ముందుకు వెళ్లిపోయినట్లు స్పష్టంగా కనిపించింది. పైపెచ్చు రాష్ట్రంలో వైఎస్సార్ సీపీకి 2 నుంచి 4 లోక్‌సభ స్థానాలు వస్తాయని మాత్రమే చెప్పిన ఇండియా టుడే సంస్థ... ఆ సందర్భంగా వైఎస్సార్ సీపీ గుర్తును కూడా ఆప్ గుర్తయిన చీపురుగా చూపించింది. విశేషమేంటంటే దీన్నే తెలుగుదేశం పార్టీ తన ట్విటర్ ఖాతాలోనూ పోస్ట్ చేసుకుంది. మరి పార్టీ గుర్తు విషయంలో కూడా జాగ్రత్తలు పాటించకుండా చేసిన ఈ ఎగ్జిట్ పోల్స్‌ను నమ్మేదెలా? ఇక కొన్ని రాష్ట్రాల విషయంలోనైతే కొన్ని ఎగ్జిట్ పోల్స్ అక్కడ వాస్తవంగా ఉన్న మొత్తం స్థానాలకన్నా ఎక్కువ స్థానాలు ఎన్డీఏ గెలుస్తుందని చూపించటాన్ని ఇప్పటికే ట్విటర్లో పలువురు ట్రోల్ చేస్తున్నారు కూడా. ఇదే ఇండియా టుడే- మై యాక్సిస్ సంస్థ 2021లో బెంగాల్లో చేసిన ఎగ్జిట్‌పోల్స్, 2023లో ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లలో చేసిన ఎగ్జిట్‌పోల్స్ పూర్తిగా రివర్సయ్యాయనేది ఇక్కడ గమనార్హం. అంతేకాదు. తాజాగా బీజేపీ కూటమికి దేశంలో అత్యంత భారీగా స్థానాలు వస్తాయని పేర్కొన్న జాతీయ మీడియా సంస్థల ఎగ్జిట్ పోల్స్‌లో చిత్రవిచిత్రమైన తప్పులు కనిపించాయి. ఇండియాటుడే గ్రూప్‌లోని ఆజ్ తక్ నిర్వహించిన ఎగ్జిట్ పోల్స్‌లో తమిళనాడులో కాంగ్రెస్ 9 లోక్‌సభ స్థానాల్లో పోటీ చేస్తే.. అక్కడ 13-15 లోక్‌సభ స్థానాల్లో ఆ పార్టీ విజయం సాధిస్తుందని తేల్చడంతో చర్చలో పాల్గొన్న వారే విస్తుపోయారు. రాజస్థాన్‌లో ఉన్నదే 25 లోక్‌సభ స్థానాలైతే.. ఆ రాష్ట్రంలో 33 స్థానాల్లో ఎన్డీఏ విజయం సాధిస్తుందని ఎగ్జిట్ పోల్స్‌లో టుడేస్ చాణక్య వెల్లడించడం గమనార్హం. జార్ఖండ్‌లో సీపీఐ (ఎంఎల్) ఒక స్థానంలో పోటీ చేస్తే.. రెండు నుంచి మూడు స్థానాల్లో ఆపార్టీ విజయం సాధిస్తుందని ఆజ్‌తక్ ఎగ్జిట్ పోల్స్‌లో వెల్లడించింది. హర్యానాలో ఉన్నదే 10 లోక్‌సభ స్థానాలైతే 16-19 స్థానాల్లో ఎన్డీఏ విజయం సాధిస్తుందని జీన్యూస్ ఎగ్జిట్ పోల్స్‌లో తేల్చడం విస్మయకరమే. ఇక హిమాచల్‌ప్రదేశ్‌లో ఉన్నవే నాలుగు లోక్‌సభ స్థానాలైతే.. అక్కడ ఎన్డీఏ 6-8 స్థానాల్లో విజయం సాధిస్తుందని జీన్యూస్ తేల్చింది. విశేషమేంటంటే ఈ సంస్థలన్నీ రాష్ట్రంలో కూటమికే మెజారిటీ లోక్‌సభ స్థానాలు దక్కుతున్నాయని చెప్పాయి. లోతుగా పరిశీలించినట్లయితే ఈ జాతీయ మీడియా సంస్థలకు రాష్ట్రంలో క్షేత్ర స్థాయిలో ఎలాంటి యంత్రాంగమూ లేదు. వీటిలో చాలావరకూ ప్రజల అభిప్రాయాన్ని ఐవీఆర్ఎస్ ఫోన్ కాల్స్ ద్వారా తెలుసుకుని.. వాటినే ఎగ్జిట్ పోల్స్‌గా వెల్లడించాయి. గ్రామీణ ఓటర్లు, మహిళలు, వైఎస్సార్ సీపీకి ఎప్పుడూ అండగా ఉండే బలహీనవర్గాలు ఇలాంటి సర్వేల్లో పాల్గొనే అవకాశం తక్కువ. దీన్ని బట్టి చూస్తే.. ఈ జాతీయ మీడియా సంస్థలు నిర్వహించిన ఎగ్జిట్ పోల్స్... జూన్ 4న పూర్తి స్థాయిలో తిరగబడతాయని స్పష్టంగానే చెప్పొచ్చు.

వైఎస్సార్‌సీపీ ఓడిపోయే అవకాశమే లేదు..

రాష్ట్రంలో ఎక్కడికక్కడ పరిశ్రమలను తెస్తూ... గ్రామ స్థాయిలో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తూ... ఐదేళ్లుగా కొనసాగిస్తున్న సంక్షేమ పథకాలు.. విప్లవాత్మక సంస్కరణలను జనం పెద్ద ఎత్తున ఆదరించారు. ఈ విషయం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు నిర్వహించిన 'సిద్ధం' సభలతో రుజువయింది. గ్రామీణ ప్రాంత ప్రజలు.. మహిళల్లో వైఎస్సార్‌సీపీకి అత్యంత ఆదరణ ఉందని.. ఇదే ఆపార్టీ విజయానికి బాటలు వేస్తుందని ఇవే జాతీయ మీడియా సంస్థలు గతంలో విశ్లేషించాయి. గ్రామీణ ప్రాంతాల్లో అత్యధిక శాతం ఓట్లు పోల్ కావడం.. మహిళలు ఎన్డీఏ కూటమి కంటే వైఎస్సార్‌సీపీకి 12 శాతం అధికంగా వేశారని.. ఇది ఆపార్టీ ఘనవిజయానికి బాటలు వేస్తుందని ఆరా మస్తాన్, చాణక్య పార్థదాస్‌లు కుండబద్దలు కొట్టారు. వీటిని పరిగణనలోకి తీసుకుంటే తాము ఓడిపోయే అవకాశమే లేదని వైఎస్సార్‌సీపీ నేతలు స్పష్టం చేస్తున్నారు.



టైమ్స్ నౌ-ఈటీజీ ఎగ్జిట్ పోల్‌లో వైఎస్సార్‌సీపీ హవా

▶ మొదటి పేజీ తరువాయి

ఓట్లతో 50-58 సీట్లకే పరిమితమవుతుందని వెల్లడించింది. అలాగే, లోక్‌సభ పోలింగ్ విషయానికొస్తే.. వైఎస్సార్‌సీపీ 50 శాతం ఓట్లతో 14 ఎంపీ స్థానాలు, ఎన్డీయే కూటమి 48 శాతం ఓట్లతో 11 ఎంపీ సీట్లు గెలుచుకుంటుందని తెలిపింది. ఈసారి ఏపీలో దాదాపు 82శాతం పోలింగ్ నమోదైందని.. 2019 ఎన్నికలతో పోలిస్తే ఇది ఇంచుమించు రెండుశాతం అధికమని వివరించింది. అంతేకాక, మహిళల ఓటింగ్ కూడా ఈ దఫా 15శాతం అధికంగా నమోదైందని టైమ్స్ నౌ-ఈటీజీ రీసెర్చ్ తెలిపింది.

కౌంటింగ్ నాడు అక్రమాలకు తెగబడటానికే!

రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఎగ్జిట్‌పోల్స్ ఫలితాలు వస్తుండటంలో పలువురు సెఫాలజిస్టులను చంద్రబాబు నాయుడు, లోకేశ్ బెదిరించినట్లు వాళ్లే వ్యాఖ్యానిస్తున్నారు. ఓ సర్వే సంస్థ లోకేశ్ బెదిరింపులను తట్టుకోలేక... ఫలితాలను అట్నుంచి ఇటు మార్చి కూటమి గెలుస్తున్నట్లుగా ఇచ్చిందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఎలాగూ రెండ్రోజుల్లో తేలే ఫలితాల కోసం చినబాబు- చంద్రబాబు ఎందుకు ఇంతలా బెదిరింపులకు పాల్పడుతున్నారనే అంశాన్ని నిపుణులు లోతుగా విశ్లేషిస్తున్నారు. తామే గెలుస్తున్నామనే భ్రమలు కల్పించటం ద్వారా వైఎస్సార్ సీపీ క్యాడర్‌లో నిరుత్సాహాన్ని నింపి... కౌంటింగ్ రోజున అవసరమైతే వారిని ప్రలోభపెట్టో, బెదిరించో తమ పబ్బం గడుపుకోవాలనేది తండ్రీ కొడుకుల ఆలోచనగా చెబుతున్నారు. ఈసీ ఎలాగూ తమకే సహకరిస్తుంది కనక ఎలాంటి దారుణాలకైనా వెనకాడకూడదన్నది వీళ్ల ఆలోచనగా చెబుతున్నారు. అయితే పులిట్లోనే సంధికొట్టినట్లు చాలామంది సెఫాలజిస్టులు వీరి బెదిరింపులకు లొంగకుండా వైఎస్సార్‌సీపీ గెలుస్తున్నదని చెప్పటం 'బాబు'లిద్దరికీ మింగుడుపడటం లేదు.

మేమింతే.. మారమంతే!

- ఎన్ని చర్యలు చేపట్టినా ఆగని డీలర్ల దందా
- మహారాష్ట్ర రైతుకు డిమాండ్ రకం పత్తి విత్తనాలు విక్రయం
- టాస్క్‌ఫోర్స్ తనిఖీల్లో వెలుగులోకి..

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా యంత్రాంగం ఎన్ని చర్యలు చేపట్టినా, కేసులు నమోదు చేసినా కొంత మంది విత్తన డీలర్ల తీరు మాత్రం మారడం లేదు. అధికారులు వరుస తనిఖీలతో హడలెత్తించినా, రైతులు విత్తనాల కోసం గోస పడినా వీరికెలాంటి పట్టింపు ఉండదు. మేమింతే.. మారమంతే అనేలా యథేచ్ఛగా అక్రమాలను సాగిస్తున్నారు. జిల్లాకు ఆనుకొని ఉన్న మహారాష్ట్రకు పత్తి విత్తనాలు తరలించకుండా పోలీసు, రెవెన్యూ, వ్యవసాయ శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలు ఏర్పాటు చేశారు. చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వాహనాల తనిఖీలు చేపడుతున్నారు. రైల్వేస్టేషన్, బస్టాండ్‌లోనూ నిఘా పెంచారు. అయినప్పటికీ అక్రమార్కులు తమ బుద్ధిని మార్చుకోవడం లేదు. కుటుంబ సభ్యులందరితో కలిసి రైతులు గంటల తరబడి క్యూలో నిల్చొని రెండేసి విత్తన ప్యాకెట్ల కోసం తంటాలు పడుతుంటే.. వీరు మాత్రం అధిక ధరతో మహారాష్ట్ర రైతులకు విత్తనాలను దొడ్డిదారిన విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. దొరికితే కేసు నమోదవుతుంది కదా.. అంతకంటే ఏముందన్న ధోరణితో ముందుకెళ్తున్నారు. ఇందుకు జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగిన ఘటనే నిదర్శనం.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

అసలేం జరిగిందంటే..

పట్టణంలోని శివాజీచౌక్ స్టేషన్‌రోడ్డు ప్రాంతంలో గల ఆదిత్య సీడ్ షాప్ యజమాని సోర్తి రమేశ్ ఆదివారం మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా లోహ తాలుకా అరన్వాడి గ్రామానికి చెందిన గోవింద్ నాగోరావుకు డిమాండ్ రకం గల 25 రాశీ పత్తి విత్తన ప్యాకెట్లు, తులసీ సీడ్ కబడ్డీ రకం 8 ప్యాకెట్లను దొడ్డిదారిన విక్రయించాడు. వీటిధర రూ.864 ఉండగా, కబడ్డీ రకం విత్తనాలను రూ.1,100, రాశీ విత్తన ప్యాకెట్‌ను రూ.900 చొప్పున విక్రయించాడు. కొనుగోలు చేసిన రైతు రైల్వేస్టేషన్‌లో ఉండగా, టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీల్లో భాగంగా పరిశీలించారు. ఆదిలాబాద్ నుంచి విత్తనాలను మహారాష్ట్రకు తరలిస్తున్నట్లు తేలింది. సదరు డీలర్ మహారాష్ట్ర పేరిట కాకుండా జైనథ్ మండలం తిరుపతి అనే రైతు పేరిట బిల్లు రాశాడు. కేవలం కబడ్డీ కంపెనీకి చెందిన 8 విత్తనాలకు సంబంధించి మాత్రమే బిల్లు ఇచ్చాడు. మిగతా రాశీ కంపెనీకి సంబంధించి ఎలాంటి బిల్లు ఇవ్వలేదు. వన్‌టౌన్‌లో ఆదిలాబాద్ అర్బన్ వ్యవసాయ అధికారి విశ్వమిత్ర ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేశారు. కాగా ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి ఇందుకు సంబంధించి ఆదివారం సాయంత్రం వన్‌టౌన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. ప్రస్తుతం ఆ డీలర్ పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో వన్‌టౌన్, టూటౌన్ సీఐలు సత్యనారాయణ, అశోక్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన అంజన్న పెద్ద జయంతి



క్యూలైన్ ద్వారా దర్శనానికి వెళ్తున్న భక్తులు

- ఐదు రోజులపాటు తరలివచ్చిన భక్తులు
- సుమారు మూడు లక్షల మంది రాక

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు అంజన్న పెద్ద జయంతి ఉత్సవాలు ఐదు రోజులపాటు ప్రశాంతంగా జరిగాయి. సుమారు మూడు లక్షల మంది భక్తులు హాజరై మొక్కులు సమర్పించుకున్నారు. ముఖ్యంగా స్వామివారి మాలాధారులు ఇరుముడులతో ఆలయానికి చేరుకున్నారు. దీంతో కొండగట్టు ఎటుచూసినా కాషాయమయంగా మారింది. రాత్రి, పగలు తేడా లేకుండా రద్దీ కొనసాగింది. దర్శనం, మాల విరమణకు మూడు గంటల సమయం పట్టింది. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకపోవడంతో ఆలయ అధికారులు, పోలీసులు ఊపిరిపీల్చుకున్నారు. దర్శన సమయంలో భక్తుల మధ్య తోపులాట జరిగి ఓ భక్తుడి చేయి, మరో భక్తుడి కాలుకు స్వల్ప గాయమైంది. ఈవో చంద్రశేఖర్, సీఐ నీలం రవి, ఉత్సవాల ఇన్‌చార్జి వినోద్‌రెడ్డి భక్తులకు ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు పర్యవేక్షించారు.



దర్శనం చేసుకుని వెళ్తున్న స్వాములు



ఆలయంలో స్వామివారికి మొక్కులు చెల్లిస్తున్న భక్తులు



భక్తులు సమర్పించిన ఇరుముడి బియ్యం



ఇరుముడి మొక్కులు తీర్చుకున్న స్వాములు

యోగా నేషనల్ జడ్జీలుగా రోహిత్, హారిక



రోహిత్, హారికను అభినందిస్తున్న నిర్వాహకులు

మంచిర్యాలటౌన్: నేషనల్ యోగా జడ్జీలుగా జిల్లాకు చెందిన రేవెల్లి రోహిత్, లెక్కల హారిక ఎంపికయ్యారు. ఈ నెల 1, 2 తేదీల్లో యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ జడ్జెస్‌లలో ఎంపియ్యారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జడ్జీలను సన్మానించారు. కార్యక్రమంలో తెలంగాణ యోగాసన క్రీడా సంఘం అధ్యక్షుడు శ్రీధర్‌రావు, కార్యదర్శి నందనం కృపాకర్, మంచిర్యాల యోగాసన క్రీడా సంఘం అధ్యక్షుడు తిరుపతివర్మ, మండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్టెప్పేసిన సుగుణక్క

జన్నారం: జన్నారం మండలంలోని కవ్వాల్ ఇందూరు పోచమ్మతల్లి ఆలయంలో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారికి ఆదివారం మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా గిరిజనులు ప్రదర్శించిన సంప్రదాయ నృత్యం ఆకట్టుకుంది. గిరిజనులతో కలిసి సుగుణ నృత్యం చేశారు.



నృత్యం చేస్తున్న సుగుణ



కడెం ప్రాజెక్ట్ నీళ్లు లేక వెలవెలబోతోంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు కాగా, ప్రస్తుతం 672.075 అడుగులుగా ఉంది. గతేడాది జూన్ 2న 677.050 అడుగుల నీటి మట్టం ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. - కడెం

సాక్షి ఫ్యామిలీ
కరీంనగర్
సోమవారం ॥ 3-6-2024

మంచిమాట

చీరకొంగు



చీరలు కట్టే రోజుల్లో వాటికి కొంగు ఉండేది. దానికి ఎన్నో ప్రయోజనాలు ఉండేవి. గుండెలని కప్పటంతోపాటు, అవసరమైతే తన చేతులు తుడుచుకోవటం, దేనినైనా గబగబా తుడిచి శుభ్రం చేయటం, కోపం లేదా పౌరుషాన్ని ప్రదర్శించటానికి కొంగుని చీరకట్టులో దోపి ముందుకు రావటం తరచుగా కనపడే ప్రయోజనాలు. అలసిపోతే మొహం తుడుచుకోవటానికి, చెమట పడితే విసురుకోవటానికి, వీలైతే పక్కనున్న భర్తకో, అత్తగారికో, పిల్లలకో కూడా ఆ భోగాన్ని కలిగించటానికి కొంగు పనికి వస్తుంది. పిల్లలు మొహం తుడుచుకోవటానికి, అన్నం తిని చేతులు కడుక్కున్నాక తుడుచుకోటానికి కూడా ఉపయోగ పడుతుంది. అయితే మగవారికో? వారు కూడా ఉత్తరీయం పైన వేసుకునే వారు. లేదంటే కనీసం తుండు గుడ్డ. ఇప్పుడు రెండూ కనపడటం అపురూపమైపోయాయి. ఇవి రెండు చేసే పనులు ఒకటే అయినా, చీర కొంగు చేసే పనులు ప్రత్యేకంగా కొన్ని ఉన్నాయి.

ఇంటితాళాలు, ఇనుపపెట్టె తాళాలు ఒకప్పుడు ఇంటావిడ కొంగుచివర ఉండేవి. ముఖ్యంగా బెంగాలీ స్త్రీలకి పెద్ద తాళాల గుత్తి కొంగు చివర కట్టి ఉంటుంది. అది వారు వంగ దేశపు వారు అనటానికి గుర్తు. కొంగున కట్టారు అంటే ఎంతో ముఖ్యమైనది అని అర్థం. గుడిలో ఇచ్చిన అక్షతలు కావచ్చు, ప్రసాదం కావచ్చు, ఏదైనా విలువైన తాయెత్తో, రక్షరేకో, మరేదైనా కావచ్చు ఇల్లాలి కొంగులో ఒదిగి దాక్కుంటాయి.


అంతేకాదు, పనికి రానివి, ఉన్నచోట పడేయ కూడనివి ఉంటే కొంగులో దాక్కుంటాయి. అంటే, విరిగిన గోళ్ళు, రాలి పడిన వెంట్రుకలు, చిన్న చిన్న గాజుముక్కలు, ముళ్ళు... ఇట్లాంటి వాటిని కూడా కొంగు భద్రంగా జాగ్రత్త చేస్తుంది చెత్తలో వేసేవరకు.

కొంగుకి ఎంతటి ప్రాముఖ్యమో చూడండి – వివాహ సమయంలో బ్రహ్మముడి వేయటానికి ఇద్దరి కొంగులని కలుపుతారు. అంటే, ఒకరి కొంగులో మరొకరు ఉండమని. ఒకరికొకరు కొంగు బంగారం. కొంగు బంగారం అంటే అందుబాటులో ఉండే విలువైన, అవసరానికి ఆదుకొనేది అని అర్థం. ఒకరి అవసరాలు, కష్టసుఖాలు మరొకరు అడగనవసరం లేకుండానే పంచుకుంటూ, తీర్చుకుంటూ జీవితం గడపాలన్నది సూచన. అందుకే ఎవరైనా భార్యని అపురూపంగా చూస్తుంటే – ఆవిడ భర్తని కొంగున కట్టుకుంది అంటారు. లక్ష్మీదేవే దానికి పెద్ద ఉదాహరణ. గజేంద్రుడి కుయ్యాలించిన విష్ణువు ఉన్న వాడు ఉన్నట్టుగా బయలుదేరితే లక్ష్మీదేవి వెంట వెళ్ళవలసి వచ్చింది. ఎందుకంటే ఆవిడ కొంగు ఆయన చేతిలో ఉన్నది అని వర్ణించారు. ''వివాద ప్రోత్థిత శ్రీ కుచోపరి చేలాంచల మైన వీడడు'' అన్నారు పోతన గారు. అసలు విషయం అది కాదు. విష్ణువుని లక్ష్మీదేవి కొంగున కట్టుకుంది. ఆయన కదిలితే తానున్న కొంగు కూడా కదిలింది. పోనీ, ఆయనే పట్టుకున్నాడు అనుకుందాం. అప్పుడైనా విష్ణువు లక్ష్మీదేవి కొంగు విడవడు అనే కదా అర్థం.

భర్తని తానే కొంగున కట్టుకున్నా, కొంగుని వదలని వారూ ఉన్నారు. వారే సంతానం. కొంగు పట్టుకుని తిరుగుతూ ఉంటారు. ఎవరైనా కొత్త వారు వచ్చినా, సిగ్గు కలిగినా అమ్మ కొంగు చాటున దాక్కుంటూ ఉంటారు. అది వారికి రక్షణ. పసితనంలో పాలు తాగుతున్నపుడు, (తల్లిపాలు అయినా, పోతపాలు అయినా) అందరి చూపు పడకుండా అడ్డుగా ఉండే అమ్మ కొంగు, ఎండ, వాన, చలి, గాలి మొదలైనవి రాగానే తమ పైన చేరి వాటి బాధ నుండి రక్షణ కలిగించే అమ్మ చీర కొంగు తమకి ఎప్పుడు భద్రతా భావన కలిగిస్తుంది అని నమ్మకం. ''కొంగు చాటు బిడ్డ'' అనే నానుడి అందుకే వచ్చి ఉంటుంది.

– డా. ఎన్. అనంతలక్ష్మి

గృహస్థాశ్రమ వైశిష్ట్యం



రుషిరుణం

మనం ఏ విషయాన్ని నిర్ణయించాల్సి వచ్చినా ''తస్మాచ్ఛాస్త్రం ప్రమాణంతే కార్యాకార్యవ్యవస్థితౌ...'' శాస్త్రమే ప్రమాణం. మనకు బుద్ధికి తోచిన దానితో నిర్ణయం చేయడం సనాతన ధర్మంలో భక్తి అనిపించుకోదు. మనం ఎన్ని చదివాం, ఎన్ని విన్నాం... అని కాదు ఎన్ని ఏ మేరకు పాటిస్తాం అన్నది ప్రధానం. ఈ విషయాన్నే రామాయణంలో సీత 'ఇహ సంతో న వా సంతి సతో వా నానువర్తసే / తథా హి విపరీతా తే బుద్ధిరాచార వర్జితా..' అంటూ రావణాసురుడికి బోధ చేస్తుంది. అలా మనం ఏదయినా ఒక పని చేయాలనుకున్నప్పుడు మనకు ప్రమాణం శాస్త్రం. పుట్టుకతో ప్రతివారికీ మూడు రుణాలుంటాయి.. అని శాస్త్రం అంటుంది. అవి రుషి రుణం, దేవరుణం, పితృరుణం. 'నేనెప్పుడు చేశానండీ ఈ రుణాలు, నేనెలా రుణగ్రస్తుడనయ్యాను' అన్న ప్రశ్న అన్వయం కాదు. శాస్త్రవాక్కు కనుక అందరికీ ఉంటుంది. వీటిలో ఒక రుణం విషయంలో మాత్రం దానిని తీర్చుకోవడానికి గృహస్థాశ్రమ అవసరం ఉండదు. అది రుషి రుణం. సనాతన ధర్మంలో మనందరం రుణపడిపోయింది రుషులకు. మంత్రానికి రుషి ద్రష్ట. వేదమంత్రాలను ధ్యానంతో దర్శించి, విని మనకు స్వరంతో అందించాడు. ఆయన కూడా మనలాగే జీవించినవాడే అయినా రుషి తర్పణం అని... రుషికి వేరు తర్పణం ఉంటుంది.


బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

రుషి మన నుంచి ఏ విధమైన ఫలాన్ని ఆశించలేదు, ఏ సత్కారాన్నీ, ఏ బిరుదునూ కోరుకోలేదు. కేవలం మనల్ని ఉద్ధరించడం కోసమని, మనందరికీ కటికచీకటిలో కాంతిరేఖ కనపడాలని, మన జీవితాలు సుసంపన్నం కావాలని, మార్గం చూపించాలని వేదాల ద్వారా అందించి ధర్మానుష్ఠానికి ప్రమాణాన్ని కల్పించాడు. అలాగే ఒకవేళ మనం ఇవన్నీ చదవగలమో లేదో, స్వరంతో మంత్రం చెప్పగలమో లేదో, మంత్రభాష్యాన్ని అర్థం చేసుకోగలమో లేదో, అసలు ఇది అందరికీ అందుబాటులో ఉంటుందో ఉండదో అన్న అనుమానంతో రుషులు పురాణాలను ఇతిహాసాలుగా అందించారు.

వ్యాసభగవానుడు 18 పురాణాలను అందించాడు. ''నమోఽస్తు తే వ్యాస విశాల-బుద్ధే/ఫుల్లారవిందయత -పత్ర-నేత్ర/యేన త్వయా భారత-తైల-పూర్ణః/ప్రజ్వలితో జ్ఞాన-మయః ప్రదీపః'' అంటారు. అంతటితో ఆగకుండా ఆయన పరమ దయాళువై వేదాల సారాన్ని అందరూ చదువుకుని అనుష్ఠించడానికి వీలుగా పంచమ వేదంగా మహాభారతాన్ని రచించి లోకానికి అందించారు. వేదం చదువుకుంటే ఏది తెలుస్తుందో మహాభారతం చదువుకున్నా అదే తెలుస్తుంది.

సూర్యవంశాన్ని అంతటినీ కూడా శ్రీరామాయణం ద్వారా వాల్మీకి మహర్షి వర్ణించాడు. ''వేద వేద్యే పరే పుంసి జాతే దశరథాత్మజే /వేదః ప్రచేతసదాసీత్ సాక్షాత్ రామాయణాత్మనా'' వేదములు ప్రతిపాదించిన బ్రహ్మము రామచంద్రమూర్తిగా వస్తే ఆ వేదమే రామాయణ కావ్యంగా వచ్చింది. వేదం ఏం చెప్పిందో తెలియనప్పుడు రామాయణం చదువుకుంటే చాలు. మనకు ఆ ప్రయోజనం నెరవేరుతుంది. రాముడు ఏ పరిస్థితుల్లో ఏం చేసాడో, మానవాళికి అదే వేదం విధించిన కర్తవ్యం కూడా.

అందుకే ఎవరయినా అత్యంత విశ్వాసంతో ఒక విషయాన్ని తదేక దృష్టితో నమ్మి ఆచరించేవారయితే 'రుషి సమానులు' అంటారు. ఆయన ఒక 'రుషి' అంటారు.

బౌద్ధవాణి



మణి-దీపం

వేసవి ఎండ తీవ్రంగానే ఉంది. కానీ ఆ మామిడి తోటలో చల్లగానే ఉంది. ఆ మామిడితోట వేణువనానికి ఒక మూలన ఉంది. ఆ తోట మధ్యలో ఒక పెద్ద మామిడి చెట్టు కింద విశాలమైన అరుగు. ఆ అరుగు దగ్గరకు నెమ్మదిగా, మందహాసంతో నడిచి వచ్చాడు బుద్ధుడు. ఆయన రాకను గమనించాయి తోటలో ఉడతలు.

మనిషి అలికిడి తగిలితే పారిపోయే ఉడతలు, బుద్ధుణ్ణి చూస్తే దగ్గరకు వచ్చేస్తాయి.

అది ఎప్పటినుండో వాటికి అలవాటు. భిక్షాపాత్రలోంచి కొన్ని పళ్ళు తీసి అరుగు పైన ఒక పక్కన చల్లాడు. అవి కుచ్చుతోకలు విప్పుకుని, పైకెత్తుకుని వచ్చి, పండ్లు ఏరుకుని తినసాగాయి.

కొంత సమయం గడిచింది.

సకుల ఉదాయి అనే పరివ్రాజకుడు వచ్చాడు. బుద్ధునికి నమస్కరించి కూర్చున్నాడు. అతను రాగానే కొన్ని ఉడతలు చెట్లెక్కాయి. వాటిని చూసి–

''భగవాన్! మీ కరుణ అమోఘం. ఉడతలు కూడా మిమ్మల్ని మిత్రునిగా భావిస్తాయి. ఇది విచిత్రం. మీ జీవకారుణ్యానికి మచ్చుతునక. మీకు మరోమారు ప్రణమిల్లుతాను'' అని వంగి నమస్కరించాడు.

''సకుల ఉదాయీ! వచ్చిన విషయం?'' అని అడిగాడు బుద్ధుడు.

''మా గురువుగారు నిగంఠ నాథుల వారు నిన్న 'పరమ సత్యం, పరమ వర్ణం'' అంటూ ''పరమం'' గురించి చెప్పారు. మీ దృష్టిలో పరమ వర్ణం ఏది? అని అడిగాడు.

''ఉదాయీ! పరమం అంటే?''

''మీకు తెలియంది కాదు. దేని కంటే ఉన్నతమైంది మరొకటి ఉండదో... అదే పరమం''

''నీకు ఈ లోకం ఎంత తెలుసు. అందులో ఇదే పరమం అని ఎలా నిర్ణయిస్తావు? నూతిలోని కప్పకి నుయ్యే ప్రపంచం. చెరువులోని చేపకి చెరువే ప్రపంచం. ఈ అనంతమైన విశ్వానికి హద్దులు ఎలా గీస్తావు?'' అని అడిగాడు భగవానుడు. సకుల ఉదాయి మౌనం వహించాడు.

''ఉదాయీ! ఒక చీకటి గదిలో ఒక పసుపురంగు కంబళిలో ఒక సానబెట్టిన మణి ఉంది. అది ఆ చీకటిలో ప్రకాశిస్తుంది. అంతలో ఆ గదిలోకి ఒక మిణుగురు పురుగు వచ్చింది. అప్పుడు ఆ మణి వెలుగు ఎక్కువ ప్రకాశంగా ఉంటుందా? మిణుగురు వెలుగా?'' అని అడిగాడు.

''భగవాన్! మిణుగురు వెలుగే మిగుల ప్రకాశం'' అన్నాడు ఉదాయి.

''ఇందులో ఒక వ్యక్తి నూనె దీపం తెచ్చాడు. అప్పుడు ఏ వెలుగు ప్రకాశం?''

''దీపం వెలుగే భగవాన్!''

'అలా ఉదాయీ! దీపం వెలుగు కంటే నెగడు వెలుగు ప్రకాశం. దాని కంటే వేగుచుక్క వెలుగు, దానికంటే చంద్రుని వెలుగు, దానికంటే సూర్యుని వెలుగు ప్రకాశం.... ఉదాయీ! సూర్యుని కంటే ప్రకాశవంతమైన వెలుగులు కూడా ఉంటాయి.'' అన్నాడు. ఉదాయి మనస్సు తేటబడింది. ఆ తేటదనం అతని ముఖంలోంచి తొంగి చూస్తోంది!

ఉడతలు కిచకిచ మంటూ బుద్ధుని దగ్గరకు వచ్చాయి. ఆయన పాత్రలో నుంచి మరికొన్ని పళ్ళను వాటిముందు పోశాడు. అవి వాటి పనిలో మునిగి పోయాయి.

''ఉదాయీ! మిణుగురు పురుగు కంటే తక్కువ ప్రకాశించే మణి వెలుగునే 'పరమం' అనుకుంటున్నావు? అన్నాడు.

'విజ్ఞానం, విశ్వం, అన్నీ అనంతాలే' అని గ్రహించాడు. సకుల ఉదాయీ! బుద్ధునికి ప్రణమిల్లాడు! అతని ముఖంలో అనుమాన ఛాయలు తొలిగాయి. సంతోష కాంతులు వెలిగాయి! దోసిలి చాచాడు. బుద్ధుడు కొన్ని పండ్లను అతని దోసిట్లో పోశాడు.

ఉదాయి, కొద్దిగా ముందుకు వంగి ఉడతలకు దోసిలి చూపాడు. అవి అతని ముఖం కేసి చూశాయి. ధైర్యంగా దోసిలి లోని పండ్లు అందుకున్నాయి.

– డా. బొర్రా గోవర్ధన్

సినిమా


ఎన్టీఆర్

చలో మెక్సికో

మెక్సికోలో యాక్షన్ చేయనున్నారట ఎన్టీఆర్. ఆయన హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో 'డ్రాగన్' (ప్రచారంలో ఉన్న టైటిల్) అనే చిత్రం తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో రష్మికా మందన్న హీరోయిన్‌గా నటించనున్నారనే టాక్ వినిపిస్తోంది. నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మించనున్న ఈ సినిమా చిత్రీకరణ ఆగస్టులో ప్రారంభం కానుంది. ప్రస్తుతం ఈ సినిమాకు చెందిన ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. కాగా ఈ సినిమా తొలి షెడ్యూల్ మెక్సిక్‌లో ప్రారంభం కానుందని సమాచారం. ఈ షెడ్యూల్‌లో యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరిస్తారట. అంతేకాదు.. ఈ సినిమాకి సంబంధించిన ఎక్కువ శాతం షూటింగ్ విదేశాల్లోనే జరుగుతుందని, దాదాపు పదిహేను దేశాల్లో చిత్రీకరణ జరిపేలా మేకర్స్ ప్లాన్ చేస్తున్నారని ఫిల్మ్‌నగర్ టాక్.

అప్పుడే ఇండియన్ 2 గురించి శంకర్‌తో మాట్లాడా! – కమల్‌హాసన్


అనిరుద్, గుల్షన్, సుభాస్కరన్, జ్ఞానాంబిగై, కమల్‌హాసన్, శంకర్

''ఇరవైఎనిమిదేళ్ల క్రితం నేను శివాజీ గణేశన్ గారితో ఓ సినిమా చేయాల్సింది. అదే సమయంలో 'ఇండియన్' కథతో దర్శకుడు శంకర్ వచ్చారు. ఈ రెండు చిత్రాల కథలు దగ్గర దగ్గరగా ఉన్నాయని శివాజీగారితో చెప్పాను. 'శంకర్‌గారితోనే సినిమా చేయండి. మనం ఇప్పటికే ఎన్నో సినిమాలు కలిసి చేశాం' అని నాతో ఆయన అన్నారు. శివాజీగారు అన్న ఒక్క మాటతో, ఆ నమ్మకంతో శంకర్‌గారితో 'ఇండియన్ ' సినిమా చేశాను. నిర్మాత ఏఎం రత్నం గారు ఈ సినిమాను అద్భుతంగా నిర్మించారు. ఆ సమయంలోనే 'ఇండియన్'కు సీక్వెల్ గురించి శంకర్‌గారితో మాట్లాడాను. కథ రెడీగా లేదన్నారు. 28 ఏళ్ల తర్వాత 'ఇండియన్ 2' చేశాం. అనిరుధ్ సంగీతంలో ఎప్పుడూ ఎనర్జీ ఉంటుంది'' అన్నారు కమల్‌హాసన్. హీరో కమల్ హాసన్– దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో రూపొందిన చిత్రం 'ఇండియన్ 2'. కమల్‌హాసన్–శంకర్ కాంబినేషన్‌లో 1996లో వచ్చిన 'ఇండియన్'కు సీక్వెల్స్‌గా 'ఇండియన్ 2', 'ఇండియన్ 3' చిత్రాలు రూపొందాయి. లైకా ప్రొడక్షన్స్, రెడ్ జెయింట్ మూవీస్ పతాకాలపై సుభాస్కరన్ నిర్మించిన 'ఇండియన్ 2' జూలై 12న తెలుగు, తమిళ, హిందీ భాషల్లో విడుదల కానుంది. 'భారతీయుడు 2' మూవీ తెలుగు థియేట్రికల్ హక్కులను ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్మెంట్స్ ఎల్ఎల్‌పి, సీడెడ్ హక్కులను శ్రీలక్ష్మి మూవీస్ సంస్థలు దక్కించుకున్నాయి. ఈ సందర్భంగా చెన్నైలో జరిగిన ఈ సినిమా ఆడియో ఆవిష్కరణ వేడుకలో శంకర్ మాట్లాడుతూ– ''కమల్‌హాసన్ వంటి నటులు ఈ ప్రపంచంలోనే లేరు. ఆయనతో 'ఇండియన్ 2', 'ఇండియన్ 3' చేయడం ఆనందంగా ఉంది'' అన్నారు. ''ఇండియన్ 2' పెద్ద విజయాన్ని సాధిస్తుంది'' అన్నారు బ్రహ్మానందం. ''ఇండియన్' సినిమాకు ఏఆర్ రెహమాన్‌గారు గొప్ప సంగీతం ఇచ్చారు. 'ఇండియన్ 2'కి నేను సంగీతం ఇచ్చాను. శంకర్‌గారు నా పై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకున్నానని అనుకుంటున్నాను'' అన్నారు అనిరుధ్ రవిచందర్.


నాగార్జున

యాక్షన్ కుబేర

'కుబేర అండ్ కో యాక్షన్ మోడ్‌లోకి వెళ్లారు. ధనుష్, నాగార్జున లీడ్ రోల్స్‌లో నటిస్తున్న చిత్రం 'కుబేర'. ఈ చిత్రంలో రష్మికా మందన్నా హీరోయిన్. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. ఈ సినిమా కోసం తయారు చేయించిన ఓ స్పెషల్ సెట్‌లో ధనుష్–నాగార్జున పాల్గొంటుండగా, యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరిస్తున్నారు. ఈ షెడ్యూల్‌తో 'కుబేర' చిత్రీకరణ దాదాపు పూర్తవుతుందట. ''చాలా వరకు టాకీ పార్టును పూర్తి చేశాం. ఒక వైపు షూటింగ్ చేస్తూనే, మరోవైపు పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ కూడా చేస్తున్నాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. తెలుగు, తమిళ, హిందీ భాషల్లో ఏకకాలంలో శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పి, అమిగోస్ క్రియేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్‌పై సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీ ప్రసాద్.

డేట్ ఫిక్స్


చాందిని

చాందినీ చౌదరి, వశిష్ఠ సింహా, భరత్ రాజ్, అషు రెడ్డి లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'యేవమ్'. ఈ చిత్రంలో ఎస్ఐ సౌమ్య పాత్రలో కనిపిస్తారు చాందినీ చౌదరి. ప్రకాశ్ దంతులూరి దర్శకత్వంలో నవదీప్, పవన్ గోపరాజు నిర్మించిన ఈ చిత్రం రిలీజ్ డేట్ ఫిక్స్ అయింది. జూన్ 14న రిలీజ్ చేయనున్నట్లు యూనిట్ ప్రకటించింది. ఈ సందర్భంగా ప్రకాశ్ దంతులూరి మాట్లాడుతూ– ''మహిళా సాధికారతను చాటి చెప్పేలా ఈ సినిమా కథనం ఉంటుంది'' అని పేర్కొన్నారు.

మనమే నా గ్రాఫ్ పెంచుతుంది

– దర్శకుడు శ్రీరామ్ ఆదిత్య



''ఇండస్ట్రీలో సక్సెస్ ఉంటేనే మన కెరీర్ గ్రాఫ్ పెరుగుతుంటుంది. నా గత చిత్రం 'హీరో' ఎక్కువమంది ప్రేక్షకులకు రీచ్ కాలేదు. కొంత కరోనా ప్రభావం కూడా ఉంది. ఇప్పుడు 'మనమే' సినిమా విజయంపై నమ్మకంతో ఉన్నాను. నా కెరీర్ గ్రాఫ్ మళ్లీ పెరుగుతుంది'' అన్నారు దర్శకుడు శ్రీరామ్ ఆదిత్య. శర్వానంద్, కృతీ శెట్టి హీరో హీరోయిన్లుగా, చైల్డ్ ఆర్టిస్టు విక్రమాదిత్య ఓ కీలక పాత్రలో నటించిన చిత్రం 'మనమే'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 7న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆదివారం జరిగిన విలేకర్ల సమావేశంలో శ్రీరామ్ ఆదిత్య మాట్లాడుతూ – ''పేరెంటింగ్ ఎమోషన్స్ గురించి కొంచెం వినూత్నంగా చెప్పాలన్న ఉద్దేశం నాకు ఎప్పట్నుంచో ఉంది. కాకపోతే ఈ ఎమోషన్స్‌కు ఫన్ జోడించి, ఫుల్ ఎనర్జీతో చెప్పాలనుకున్నాను. అదే 'మనమే' కథ. ఈ సినిమాలో శర్వానంద్–కృతీ శెట్టిల క్యారెక్టర్స్ టామ్ అండ్ జెర్రీలా ప్రేక్షకులను అలరిస్తాయి. ఇప్పటివరకు నేను చేసిన సినిమాల్లో 'మనమే' నా ఫేవరెట్. ఈ సినిమాలో నా కొడుకు చైల్డ్ ఆర్టిస్టుగా చేశాడని నేను ఇలా చెప్పడం లేదు. అందమైన భావోద్వేగాలు ఉన్న మంచి సినిమా ఇది. ఈ సినిమాలో శివ కందుకూరి పాత్ర సర్‌ప్రైజింగ్‌గా ఉంటుంది. 'మనమే'లో 16 పాటల వరకూ ఉన్నాయి. ఇవి సినిమా ఫ్లోకు ప్లస్‌గానే ఉంటాయి కానీ అడ్డుగా అనిపించవు. హేషమ్ మంచి సంగీతం అందించారు'' అని చెప్పుకొచ్చారు.

ఎన్నో కష్టాలు దాటి..


హరీష్, మాన్య

హరీష్ బొంపెల్లి, మాన్య సలాడి జంటగా నటించిన చిత్రం 'ఓసీ'. విష్ణు బొంపెల్లి దర్శకత్వంలో బీవీఎస్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 7న రిలీజ్ కానుంది. ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో కామారెడ్డి ఎమ్మెల్యే కాటపల్లి వెంకటరమణారెడ్డి ఈ చిత్రం మొదటి టికెట్‌ను లాంచ్ చేసి, ఈ సినిమా విజయం సాధించాలన్నారు. ఈ వేడుకలో హీరో హరీష్ బొంపెల్లి మాట్లాడుతూ– ''ఈ సినిమా ప్రయాణంలో ఎన్నో కష్టాలు పడ్డాం. మా డాడీ ఇల్లుతో పాటు అమ్మ నగలు కూడా తాకట్టు పెట్టాల్సి వచ్చింది. అన్ని అవమానాలను మరిచిపోయేలా డిస్ట్రిబ్యూటర్ ప్రశాంత్ గౌడ్ మాకు అండగా నిలిచారు'' అంటూ ఎమోషనల్‌గా మాట్లాడారు. ''సినిమా అంటేనే వైకుంఠపాళి ఆట. ఈ సినిమా మొదలు పెట్టినప్పటి నుంచి నేటి వరకు చాలా అప్ అండ్ డౌన్స్ చూశాం. అన్ని కష్టాలనూ దాటుకుని విడుదల వరకూ వచ్చాం'' అన్నారు విష్ణు బొంపెల్లి.

సింహాసనం దక్కాలి కానీ...


మీరా జాస్మిన్

ఉత్పలదేవిగా మారిపోయారు మీరా జాస్మిన్. ఉత్పలదేవి దయాగుణం వల్ల రాణి కావాల్సిన ఆమెకు సింహాసనం దక్కదు. ఆ తర్వాత ఏం జరిగిందనేది 'శ్వాగ్' సినిమా చూసి తెలుసుకోవాల్సిందే. శ్రీవిష్ణు హీరోగా హసిత్ గోలీ దర్శకత్వంలో 'శ్వాగ్' అనే సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో వింజమర వంశంలోని రాణి రుక్మిణి దేవిగా రీతూ వర్మ ఓ లీడ్ రోల్‌లో నటిస్తుండగా, మరో లీడ్ రోల్‌లో ఉత్పలదేవిగా మీరా జాస్మిన్ కనిపిస్తారు. ఆదివారం ఆమె ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు. ఈ చిత్రాన్ని టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు.

ప్రేమ... ఆకర్షణ


అంకిత, సుధీష్

సుధీష్ వెంకట్, అంకితా సాహ, శ్రేయాసి షా హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'ప్యాషన్'. ఫ్యాషన్ డిజైనింగ్ కాలేజ్ నేపథ్యంలో సాగే ఈ ప్రేమ కథా చిత్రానికి ఫ్యాషన్ డిజైనర్ అరవింద్ జోషువా దర్శకుడు. డా. అరుణ్ కుమార్ మొండితోక, నరసింహ యేలె, ఉమేష్ చిక్కు నిర్మాతలు. ''తొలి షెడ్యూల్ పూర్తయింది. ప్రేమ, ఆకర్షణలకి సంబంధించి యువతలో ఉత్పన్నమయ్యే అనేక ప్రశ్నలకు సమాధానంగా ఈ సినిమా ఉంటుంది'' అన్నారు అరవింద్ జోషువా.

నాని ప్రేమకథ


సాహిబా, పవన్

'మెరిసే మెరిసే' చిత్రంతో దర్శకుడిగా విజయాన్ని అందుకున్న పవన్ కుమార్ కొత్తూరి హీరోగా మారారు. ఆయన హీరోగా నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'యావరేజ్ స్టూడెంట్ నాని'. సాహిబా భాసిన్, స్నేహ మాల్వియ, వివియా సంత్ హీరోయిన్లు. శ్రీ నీలకంఠ మహాదేవ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఎల్ఎల్‌పీపై రూపొందిన ఈ సినిమా మోషన్ పోస్టర్ రిలీజ్ చేశారు. ''మంచి ఫీల్ గుడ్ లవ్, యాక్షన్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న చిత్రం ఇది'' అన్నారు పవన్ కుమార్ కొత్తూరి. ఈ చిత్రానికి నిర్మాతలు: పవన్ కుమార్ కొత్తూరి, బిషాలీ గోయెల్.

విల్లాలో సస్పెన్స్


శీతల్

విజయ్, శీతల్ భట్ జంటగా విగన్ క్రియేషన్ సమర్పణలో విద్యా గణేశ్ నిర్మించిన చిత్రం 'విల్లా 369'. సురేశ్ ప్రభు దర్శకుడు. ''ఒక విల్లాలో ఏం జరిగింది? అనే థ్రిల్లింగ్ కాన్సెప్ట్‌తో ఈ సినిమా రూపొందించాం. ఆద్యంతం ఆసక్తికరంగా సాగుతుంది. షూటింగ్, పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. అతి త్వరలో టీజర్, ట్రైలర్ విడుదల చేస్తాం'' అని దర్శక–నిర్మాతలు తెలిపారు.

వందేళ్ల తర్వాత...


స్టీఫెన్, కబీర్

యానియా, అంకిత, అజయ్, కబీర్ సింగ్ లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'ఇంద్రాణి ఎపిక్1: ధరమ్ వర్సెస్ కరమ్'. స్టీఫెన్ పల్లం స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 14న విడుదల కానుంది. ఈ చిత్రం విలేకర్ల సమావేశంలో స్టీఫెన్ మాట్లాడుతూ– ''వందేళ్ల తర్వాత ప్రపంచంలో భారతదేశం ఎలాంటి పాత్ర వహిస్తుందో ఇందులో సరికొత్తగా చూపించడం జరిగింది. ఈ సినిమా కోసం ఒక రోబోని కూడా క్రియేట్ చేశాం. టైమ్ ట్రావెల్ కాన్సెప్ట్ ఉంది. ఇండియన్ సూపర్ ఉమెన్‌గా యానీయా అద్భుతంగా నటించింది'' అన్నారు. ''ఇందులో సూపర్ విలన్‌గా కనిపిస్తాను'' అన్నారు కబీర్ సింగ్.



ప్రపంచ రెండో ర్యాంకర్‌పై ప్రజ్ఞానంద... ప్రపంచ మూడో ర్యాంకర్‌పై వైశాలి సంచలన విజయాలు

నార్వే చెస్ టోర్నీలో భారత గ్రాండ్‌మాస్టర్లు, తోబుట్టువులైన ప్రజ్ఞానంద, వైశాలి సంచలన ప్రదర్శన కొనసాగిస్తున్నారు. స్టావెంజర్ నగరంలో జరుగుతున్న ఈ ప్రతిష్టాత్మక టోర్నీ పురుషుల విభాగం ఐదో రౌండ్‌లో ప్రజ్ఞానంద 77 ఎత్తుల్లో ప్రపంచ రెండో ర్యాంకర్ ఫాబియానో కరువానా (అమెరికా)పై గెలిచాడు. ఇదే టోర్నీ మూడో రౌండ్‌లో ప్రజ్ఞానంద ప్రపంచ నంబర్‌వన్ కార్ల్‌సన్‌ను ఓడించిన సంగతి తెలిసిందే. ఇదే వేదికపై జరుగుతున్న మహిళల టోర్నీ ఐదో రౌండ్ గేమ్‌లో ప్రజ్ఞానంద సోదరి వైశాలి తెల్ల పావులతో ఆడి 'ఆర్మగెడాన్' గేమ్‌లో ప్రపంచ మూడో ర్యాంకర్ టింగ్జీ లె (చైనా)పై 76 ఎత్తుల్లో గెలిచింది. వీరిద్దరి మధ్య క్లాసికల్ గేమ్ 'డ్రా' కావడంతో విజేతను నిర్ణయించేందుకు 'ఆర్మగెడాన్' గేమ్ నిర్వహించారు. ప్రపంచ చాంపియన్ జూ వెన్‌జున్ (చైనా), భారత స్టార్ కోనేరు హంపి మధ్య క్లాసికల్ గేమ్ 31 ఎత్తుల్లో 'డ్రా' అయింది. విజేతను నిర్ణయించేందుకు 'అర్మగెడాన్' గేమ్ నిర్వహించగా జు వెన్‌జున్ 64 ఎత్తుల్లో హంపిపై గెలిచింది.



పారిస్ ఒలింపిక్స్‌కు అమిత్, జైస్మిన్ అర్హత



బ్యాంకాక్: భారత బాక్సర్లు అమిత్ పంఘాల్, జైస్మిన్ లంబోరియా పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించారు. వరల్డ్ క్వాలిఫయింగ్ చివరి టోర్నీలో ఆదివారం పురుషుల 51 కేజీల విభాగంలో అమిత్... మహిళల 57 కేజీల విభాగంలో జైస్మిన్ సెమీఫైనల్లోకి దూసుకెళ్లి 'పారిస్' బెర్త్‌లను ఖరారు చేసుకున్నారు. పురుషుల 57 కేజీల విభాగంలో సచిన్ సివాచ్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించడంలో విఫలమయ్యాడు. క్వార్టర్ ఫైనల్స్‌లో అమిత్ 5–0తో చువాంగ్ లియు (చైనా)పై... జైస్మిన్ 5–0తో మరీన్ కమారా (మాలి)పై గెలుపొందారు. మరోవైపు 'బాక్స్ ఆఫ్' మ్యాచ్‌లో సచిన్ సివాచ్ 0–5తో మునార్‌బెక్ (కిర్గిస్తాన్) చేతిలో ఓడిపోయాడు. హరియాణాకు చెందిన 28 ఏళ్ల అమిత్ వరుసగా రెండోసారి ఒలింపిక్స్‌కు అర్హత పొందాడు. టోక్యో ఒలింపిక్స్‌లో అమిత్ 52 కేజీల విభాగంలో పాల్గొని రెండో రౌండ్‌లో ఓడిపోయాడు. 2019 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో రజతం, 2019 ఆసియా చాంపియన్‌షిప్‌లో స్వర్ణం నెగ్గిన అమిత్ 2018 ఆసియా క్రీడల్లో, 2022 కామన్వెల్త్ గేమ్స్‌లో పసిడి పతకాలు గెలిచాడు. గత టోక్యో ఒలింపిక్స్‌లో భారత్ నుంచి మొత్తం తొమ్మిది మంది బాక్సర్లు బరిలోకి దిగగా... ఈసారి పారిస్ ఒలింపిక్స్‌లో ఆరుగురు భారత బాక్సర్లు మాత్రమే పోటీపడనున్నారు. మహిళల విభాగంలో నిఖత్ జరీన్ (50 కేజీలు), ప్రీతి (54 కేజీలు), జైస్మిన్ (57 కేజీలు), లవ్లీనా (75 కేజీలు)... పురుషుల విభాగంలో అమిత్ పంఘాల్ (51 కేజీలు), నిశాంత్ దేవ్ (71 కేజీలు) పారిస్ ఒలింపిక్స్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తారు.


భారత హాకీ జట్ల ఓటమి

లండన్: ప్రొ హాకీ లీగ్ యూరోప్ అంచె పోటీల్లో ఆదివారం భారత పురుషుల, మహిళల జట్లకు బ్రిటన్ జట్ల చేతిలో పరాజయం ఎదురైంది. భారత పురుషుల జట్టు 1–3 గోల్స్ తేడాతో ఓడిపోగా... భారత మహిళల జట్టు 2–3 గోల్స్ తేడాతో ఓటమి పాలైంది. భారత పురుషుల జట్టు తరఫున అభిషేక్ (35వ ని.లో) ఏకైక గోల్ చేశాడు. భారత మహిళల జట్టుకు నవ్‌నీత్ కౌర్ (34వ ని.లో), షర్మిలా దేవి (56వ ని.లో) ఒక్కో గోల్ అందించారు. శనివారం జర్మనీతో జరిగిన మ్యాచ్‌ల్లో ముందుగా భారత పురుషుల జట్టు 0–3తో... అనంతరం మహిళల జట్టు 1–3తో ఓడిపోయాయి.

విండీస్ శ్రమించి...

- ఐదు వికెట్లతో పపువా న్యూగినీ జట్టుపై గెలిచింది
- ఆకట్టుకున్న పపువా బౌలర్లు
- విండీస్‌ను గెలిపించిన చేజ్

గయానా: టి20 ప్రపంచకప్‌కు ఆతిథ్యమిస్తున్న రెండో దేశం వెస్టిండీస్ కూడా టోర్నీలో శుభారంభం చేసింది. ఆదివారం జరిగిన రెండో మ్యాచ్‌లో రెండుసార్లు చాంపియన్ విండీస్ ఓటమి అంచుల్లోంచి బయటపడి 5 వికెట్ల తేడాతో పపువా న్యూగినీ జట్టుపై గెలిచి ఊపిరి పీల్చుకుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పపువా న్యూగినీ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 136 పరుగులు చేసింది. టాపార్డర్ బ్యాటర్లు టోని వుర (2), అసద్ వాలా (21), లెగా సియాక (1) నిరాశ పరచడంతో 34 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో సెసె బావు (43 బంతుల్లో 50; 6 ఫోర్లు, 1 సిక్స్) అర్ధసెంచరీతో ఆదుకున్నాడు. చార్లెస్ అమిని (12)తో ఐదో వికెట్‌కు 44 పరుగులు జోడించాడు. జట్టు స్కోరు 98 వద్ద ఆరో వికెట్‌గా సెసె బావు నిష్క్రమించగా, కిప్లిన్ డొరిగా (18 బంతుల్లో 27 నాటౌట్; 3 ఫోర్లు) మెరుగ్గా ఆడటంతో పపువా ఆ మాత్రం స్కోరు చేయగలిగింది. విండీస్ బౌలర్లలో రసెల్, జోసెఫ్ చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం వెస్టిండీస్ 19 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 137 పరుగులు చేసి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రోస్టన్ చేజ్ (27 బంతుల్లో 42 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) విండీస్‌ను ఒడ్డున పడేసే ఆట ఆడాడు. సులువైన ప్రత్యర్థే అయినా... ఏమంత కష్టం కానీ లక్ష్యమే ఎదురైనా... వెస్టిండీస్ గెలిచేందుకు ఆపసోపాలు పడింది. ఓపెనర్ బ్రాండన్ కింగ్, పూరన్ ఉన్నంత వరకు 8 ఓవర్లలో విండీస్ 61/1 స్కోరు చేసింది. గెలిచేందుకు 72 బంతుల్లో 76 పరుగులు చేస్తే సరిపోతుంది. కానీ తర్వాతి వరుస ఓవర్లలో పూరన్ (27 బంతుల్లో 27; 1 ఫోర్, 2 సిక్స్‌లు), కింగ్ (29 బంతుల్లో 34; 7 ఫోర్లు) అవుటయ్యాక పరిస్థితి మారింది. కెప్టెన్ రొవ్‌మన్ పావెల్ (15), రూథర్‌ఫోర్డ్ (2) వికెట్లు పారేసుకోవడంతో సమీకరణం 24 బంతుల్లో 40 పరుగుల వద్ద కష్టంగా కనిపించింది. ఈ దశలో రసెల్ (9 బంతుల్లో 15 నాటౌట్; 1 సిక్స్) వచ్చాక చేజ్ ధాటిగా ఆడాడు. 18వ ఓవర్లో 2 బౌండరీలు, ఓ సిక్స్ బాది 18 పరుగులు పిండుకున్నాడు. మరుసటి ఓవర్లోనూ చేజ్ 2 ఫోర్లు కొట్టడంతో 19వ ఓవర్ ఆఖరి బంతికి లక్ష్యాన్ని చేరుకుంది.



రోస్టన్ చేజ్

అమెరికా ధనాధన్...

మెరుపులతో టి20 ప్రపంచకప్ టోర్నీ ఆరంభం

- 10 సిక్స్‌లతో విరుచుకుపడ్డ జోన్స్
- తొలి పోరులో కెనడాపై 7 వికెట్లతో అమెరికా గెలుపు

డాలస్: అమెరికా ఆతిథ్య హోదాలో ఆడిందంతే! టి20 ప్రపంచకప్ ఆడే సత్తా ఆ జట్టుకెక్కడిది అని తేలిగ్గా తీసిపారేసే వారికి మెగా మెరుపులతో టోర్నీకే గొప్ప ఆరంభం ఇచ్చింది అమెరికా. రెండు కొత్త జట్లు (కెనడా, అమెరికా) ప్రపంచకప్‌లో ఆడటం తొలిసారే అయినా... ధనాధన్ షోతో సిసలైన క్రికెట్ వినోదాన్ని పంచాయి. భారత కాలమానం ప్రకారం ఆదివారం ఉదయం జరిగిన గ్రూప్ 'ఎ' మొదటి మ్యాచ్‌లో అమెరికా 7 వికెట్ల తేడాతో కెనడాపై ఘనవిజయం సాధించింది. టాస్ నెగ్గిన అమెరికా ఫీల్డింగ్ ఎంచుకోగా, ముందుగా బ్యాటింగ్‌కు దిగిన కెనడా నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 194 పరుగుల భారీస్కోరు చేసింది. ఓపెనర్ నవ్‌నీత్ ధలివాల్ (44 బంతుల్లో 61; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు), నికోలస్ కిర్టన్ (31 బంతుల్లో 51; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధసెంచరీలు సాధించారు. శ్రేయస్ మొవ్వ (16 బంతుల్లో 32 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), ఆరోన్ జాన్సన్ (16 బంతుల్లో 23; 5 ఫోర్లు) ధాటిగా ఆడారు. అలీఖాన్, హర్మీత్ సింగ్, కోరె అండర్సన్ తలా ఒక వికెట్ తీశారు. అనంతరం భారీ లక్ష్యాన్ని అమెరికా 17.4 ఓవర్లలోనే మూడే వికెట్లు కోల్పోయి 197 పరుగులు చేసి ఛేదించింది. జట్టు ఖాతా తెరువకముందే స్టీవెన్ టేలర్ (0) డకౌటయ్యాడు. మరో ఓపెనర్, కెప్టెన్ మోనంక్ పటేల్ (16) తక్కువే చేశాడు. 42/2 స్కోరు వద్ద కష్టాల్లో ఉన్న అమెరికాను 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఆరోన్ జోన్స్ (40 బంతుల్లో 94 నాటౌట్; 4 ఫోర్లు, 10 సిక్స్‌లు) అసాధారణ బ్యాటింగ్‌తో గెలిపించాడు. భారీ సిక్సర్లతో విరుచుకుపడిన జోన్స్... మూడో వికెట్‌కు ఆండ్రీస్ గౌస్ (46 బంతుల్లో 65; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు)తో కలిసి 131 పరుగులు జోడించి విజయాన్ని ఖాయం చేశాడు. ఈ క్రమంలో ఆరోన్ 22 బంతుల్లో, గౌస్ 39 బంతుల్లో ఫిఫ్టీలు పూర్తి చేసుకున్నారు. 16వ ఓవర్లో 173 పరుగుల వద్ద ఆండ్రీస్ నిష్క్రమించగా... మరో రెండు ఓవర్లలోనే కోరె అండర్సన్ (3 నాటౌట్)తో కలిసి ఆరోన్ జోన్స్ 14 బంతులు మిగిలుండగానే అమెరికాను గెలిపించాడు. అమెరికా తమ తదుపరి మ్యాచ్‌లో ఈనెల 6న పాకిస్తాన్ జట్టుతో, కెనడా తమ తదుపరి మ్యాచ్‌లో ఈనెల 7న ఐర్లాండ్‌తో ఆడతాయి.



ఆండ్రీస్ గౌస్



ఆరోన్ జోన్స్

టి20 ప్రపంచకప్‌లో నేడు

నమీబియా X ఒమన్
వేదిక: బ్రిడ్జ్‌టౌన్; ఉదయం గం. 6 నుంచి

శ్రీలంక X దక్షిణాఫ్రికా
వేదిక: న్యూయార్క్; రాత్రి గం. 8 నుంచి

స్టార్ స్పోర్ట్స్, హాట్ స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

స్వియాటెక్ ఫటాఫట్...

ప్రిక్వార్టర్ ఫైనల్లో రష్యా ప్లేయర్‌పై 6-0, 6-0తో విజయం

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీలో 'హ్యాట్రిక్' టైటిల్‌పై గురి పెట్టిన ప్రపంచ నంబర్‌వన్ ఇగా స్వియాటెక్ ఆ దిశగా మరో అడుగు వేసింది. ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో స్వియాటెక్ అదరగొట్టింది. రష్యా ప్లేయర్ అనస్తాసియా పొటపోవాతో జరిగిన మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ స్వియాటెక్ (పోలాండ్) 6–0, 6–0తో ఘనవిజయం సాధించింది. కేవలం 40 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో స్వియాటెక్ మూడు ఏస్‌లు సంధించింది. ప్రత్యర్థి సర్వీస్‌ను ఆరుసార్లు బ్రేక్ చేసింది. 13 విన్నర్స్ కొట్టిన ఆమె నెట్ వద్ద ఆరు పాయింట్లు గెలిచింది. ఇతర ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో మూడో సీడ్ కోకో గాఫ్ (అమెరికా) 6–1, 6–2తో ఎలిసబెట్టా కొక్సియారెట్టో (ఇటలీ)పై, ఐదో సీడ్ వొంద్రుసోవా (చెక్ రిపబ్లిక్) 6–4, 6–2తో ఓల్గా డానిలోవిచ్ (సెర్బియా)పై నెగ్గి క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు.

అల్‌కరాజ్ ముందంజ

పురుషుల సింగిల్స్ విభాగంలో మూడో సీడ్ అల్‌కరాజ్ (స్పెయిన్), తొమ్మిదో సీడ్ సిట్సిపాస్ (గ్రీస్) క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టారు. ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో అల్‌కరాజ్ 6–3, 6–3, 6–1తో అగర్ అలియాసిమ్ (కెనడా)పై, సిట్సిపాస్ 3–6, 7–6 (7/4), 6–2, 6–2తో మాటియో అర్నాల్డి (ఇటలీ)పై గెలుపొందారు. మరోవైపు డిఫెండింగ్ చాంపియన్, ప్రపంచ నంబర్‌వన్ జొకోవిచ్ (సెర్బియా) మూడో రౌండ్ మ్యాచ్‌లో విజయం కోసం తీవ్రంగా శ్రమించాడు. 4 గంటల 29 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో జొకోవిచ్ 7–5, 6–7 (6/8), 2–6, 6–3, 6–0తో లొరెంజో ముసెట్టి (ఇటలీ)పై గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు.



ప్రిక్వార్టర్స్‌లో బోపన్న జోడీ

పురుషుల డబుల్స్‌లో రెండో సీడ్ రోహన్ బోపన్న (భారత్)–మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) ద్వయం ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టింది. ఆదివారం జరిగిన తొలి రౌండ్‌లో బోపన్న–ఎబ్డెన్ జోడీ 7–5, 4–6, 6–4తో ఒర్లాండో లుజ్–మార్సెలో జొర్మాన్ (బ్రెజిల్) జంటను ఓడించింది. రెండో రౌండ్‌లో బోపన్న–ఎబ్డెన్‌లతో ఆడాల్సిన సెబాస్టియన్ బేజ్ (అర్జెంటీనా)–థియాగో వైల్డ్ (బ్రెజిల్) టోర్నీ నుంచి వైదొలిగారు. దాంతో బోపన్న–ఎబ్డెన్ రెండో రౌండ్ మ్యాచ్ ఆడకుండానే నేరుగా ప్రిక్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నారు. ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో శ్రీరామ్ బాలాజీ (భారత్)–మిగెల్ వరేలా (మెక్సికో)లతో బోపన్న–ఎబ్డెన్ ఆడతారు.



భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో ప్రవేశాలు

ఆంధ్రప్రదేశ్‌లో పశ్చిమ గోదావరి జిల్లా వెంకటరామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం.. 2024–25 విద్యా సంవత్సరానికి యూనివర్సిటీతోపాటు అనుబంధ కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.

» మొత్తం సీట్ల సంఖ్య: 500

కోర్సు వివరాలు

» డిప్లొమా ఇన్ హార్టికల్చర్: 480 సీట్లు (ప్రభుత్వ-200, అనుబంధ-280).
» డిప్లొమా ఇన్ హార్టికల్చర్ ఫుడ్ ప్రాసెసింగ్: 20 సీట్లు (ప్రభుత్వ).
» కోర్సు కాలవ్యవధి: రెండేళ్లు
» అర్హత: పదో తరగతిలో ఉత్తీర్ణతసాధించాలి
» వయసు: 31.08.2024 నాటికి 15 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.
» ఎంపిక ప్రక్రియ: పదో తరగతి మార్కులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఉంటుంది.

ముఖ్య సమాచారం

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభ తేది: 25.05.2024
» ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేది: 18.06.2024
» వెబ్‌సైట్: https://drysrhu.ap.gov.in/home.html

నల్సార్ యూనివర్సిటీలో ఎల్‌ఎల్‌ఎం ప్రోగ్రామ్

హైదరాబాద్‌లోని నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా.. 2024–25 విద్యా సంవత్సరానికి ఎల్‌ఎల్‌ఎం ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.

ప్రోగ్రామ్ వివరాలు

» ఎల్‌ఎల్‌ఎం ప్రోగ్రామ్ (ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంకప్టసి లాస్).
» కోర్సు వ్యవధి: రెండేళ్ల ఫుల్‌టైం ప్రోగ్రామ్
» మొత్తం సీట్ల సంఖ్య: 19
» అర్హత: సంబంధిత విభాగంలో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
» ఎంపిక ప్రక్రియ: ప్రవేశ పరీక్ష, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ముఖ్యసమాచారం

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: 15.06.2024
» హాల్‌టికెట్ డౌన్‌లోడింగ్ ప్రారంభం:20.06.2024
» ప్రవేశ పరీక్ష తేదీ: 23.06.2024
» ఇంటర్వ్యూ తేదీ(ఆన్‌లైన్): 24.06.2024
» వెబ్‌సైట్: https://apply.nalsar.ac.in/llmiblapplicationform

నల్సార్ యూనివర్సిటీలో పీహెచ్‌డీ ప్రోగ్రామ్

హైదరాబాద్‌లోని నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా.. 2024–25 విద్యా సంవత్సరానికి పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

» ప్రోగ్రామ్ వివరాలు: పీహెచ్‌డీ (విభాగాలు: లా, సోషల్ సైన్సెస్, మేనేజ్‌మెంట్)
» మొత్తం సీట్ల సంఖ్య: 15
» అర్హత: కనీసం 55 శాతం మార్కులతో సంబంధిత విభాగంలో పీజీ లేదా కంపెనీ సెక్రటరీ ఎగ్జామ్/ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా ఫైనల్ ఎగ్జామ్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులు.

ముఖ్యసమాచారం

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: 14.07.2024
» ఆన్‌లైన్ ప్రవేశ పరీక్ష తేదీ: 20.07.2024
» వెబ్‌సైట్: https://apply.nalsar.ac.in/phdapplicationform

కేంద్ర శాఖల్లో 312 ఉద్యోగాలు

దేశవ్యాప్తంగా వివిధ కేంద్ర విభాగాలు/శాఖల్లో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన 312 పోస్టుల భర్తీకి యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) నోటిఫికేషన్ విడుదల చేసింది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 312

పోస్టుల వివరాలు

» డిప్యూటీ సూపరింటెండింగ్ ఆర్కియలాజికల్ కెమిస్ట్: 4 పోస్టులు
» డిప్యూటీ సూపరింటెండింగ్ ఆర్కియాలజిస్ట్: 67 పోస్టులు
» సివిల్ హైడ్రోగ్రాఫిక్ ఆఫీసర్: 4 పోస్టులు
» స్పెషలిస్ట్ గ్రేడ్–3 అసిస్టెంట్ ప్రొఫెసర్: 132 పోస్టులు »స్పెషలిస్ట్ గ్రేడ్–3: 35 పోస్టులు
» డిప్యూటీ సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్: 09 పోస్టులు
» అసిస్టెంట్ డైరెక్టర్: 04 పోస్టులు
» అసిస్టెంట్ డైరెక్టర్ గ్రేడ్–2: 46 పోస్టులు
» ఇంజనీర్, షిప్ సర్వేయర్ కం డిప్యూటీ డైరెక్టర్ జనరల్: 02 పోస్టులు
» ట్రైనింగ్ ఆఫీసర్: 08 పోస్టులు
» అసిస్టెంట్ ప్రొఫెసర్: 01 పోస్టులు
» అర్హతలు: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ, పీజీ, పీజీ డిప్లొమా ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
» ఎంపిక విధానం: రాత పరీక్ష, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా ఎంపిక చేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేది: 13.06.2024
» వెబ్‌సైట్: https://upsc.gov.in

» ఏఎఫ్‌క్యాట్ (2)-2024 నోటిఫికేషన్ విడుదల
» ఫ్లయింగ్, గ్రౌండ్ డ్యూటీ ఆఫీసర్ జాబ్స్
» ఏఎఫ్‌క్యాట్, ఏఎఫ్ఎస్‌బీతో నియామకం
» ప్రారంభ వేతన శ్రేణి రూ.56,100-రూ.1,77,500

వాయు సేనలో ఆఫీసర్ కొలువు

త్రివిధ దళాల్లో ఉన్నత స్థాయి కెరీర్ కోరుకునే వారికి చక్కటి అవకాశం స్వాగతం పలుకుతోంది. ఎయిర్‌ఫోర్స్ కామన్ అడ్మిషన్ టెస్ట్(ఏఎఫ్‌క్యాట్)కు నోటిఫికేషన్ విడుదలైంది. ఈ ఎంపిక ప్రక్రియలో విజయం సాధిస్తే.. ఎయిర్‌ఫోర్స్ గ్రౌండ్ డ్యూటీ, ఫ్లయింగ్ బ్రాంచ్‌లలో.. ఆఫీసర్ కొలువు సొంతం చేసుకోవచ్చు. ప్రారంభంలోనే పే లెవల్-10తో వేతనం పొందే అవకాశం లభిస్తుంది! ఈ నేపథ్యంలో.. ఏఎఫ్‌క్యాట్ (2)/2024 ద్వారా భర్తీ చేసే పోస్టులు, దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక విధానం తదితర వివరాలు..

ఎయిర్‌ఫోర్స్‌లోని పలు విభాగాల్లో (గ్రౌండ్ డ్యూటీ టెక్నికల్, నాన్–టెక్నికల్, ఫ్లయింగ్ బ్రాంచ్)లలో ఉన్నత పోస్ట్‌ల భర్తీ కోసం ఎయిర్‌ఫోర్స్ సొంతంగా నియామక ప్రక్రియ చేపడుతోంది. ఇందుకోసం ముందుగా నిర్వహించే రాత పరీక్షనే ఏఎఫ్‌క్యాట్ అంటారు. సాధారణంగా ఎయిర్‌ఫోర్స్‌లో ఖాళీలను ఎన్‌డీఏ, సీడీఎస్‌ఈల ద్వారా భర్తీ చేస్తారు. వీటికి అదనంగా ఏఎఫ్‌క్యాట్ విధానంలోనూ పోస్ట్‌ల భర్తీ చేపడుతున్నారు. దీంతో ఎన్‌డీఏ, సీడీఎస్‌ఈ ద్వారా అవకాశాలను అందిపుచ్చుకోలేని వారికి ఇది మరో చక్కటి మార్గంగా నిలుస్తోంది.

ఏటా రెండుసార్లు

ఏఎఫ్‌క్యాట్‌ను ఏటా రెండుసార్లు నిర్వహిస్తారు. తాజాగా 2024కు సంబంధించి రెండో దశ నోటిఫికేషన్ (2/2024) విడుదలైంది. ఇందులో విజయం సాధించినవారికి 2025 జూలై నుంచి శిక్షణ తరగతులు ఉంటాయి.

మొత్తం 304 పోస్ట్‌లు

ఏఎఫ్‌క్యాట్ (2)–2024 ద్వారా మొత్తం 304 పోస్ట్‌లను భర్తీ చేయనున్నారు. ఇందులో ఎఎఫ్‌క్యాట్ ఎంట్రీ ద్వారా ఫ్లయింగ్, గ్రౌండ్ డ్యూటీ టెక్నికల్, గ్రౌండ్ డ్యూటీ నాన్ టెక్నికల్, అలాగే ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ ఫ్లయింగ్ ఆఫీసర్ పోస్టులకు ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్నారు.

ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ

ఏఎఫ్‌క్యాట్‌లో భాగంగానే ఫ్లయింగ్ బ్రాంచ్‌లో ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ స్కీమ్ విధానాన్ని అమలు చేస్తున్నారు. కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్‌లో పేర్కొన్న ఖాళీలు, అదే విధంగా ఏఎఫ్‌క్యాట్‌లో పేర్కొన్న సీట్లకు పది శాతం చొప్పున ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ స్కీమ్‌కు కేటాయిస్తారు. ఈ విధానంలో దరఖాస్తు చేసుకోవాలంటే.. ఎన్‌సీసీ ఎయిర్ వింగ్ విభాగంలో 'సి' సర్టిఫికెట్ పొంది ఉండాలి.

అర్హతలు

ఆయా పోస్ట్‌లను అనుసరించి ఇంటర్మీడియెట్ (మ్యాథ్స్, ఫిజిక్స్), సంబంధిత విభాగంలో కనీసం 60 శాతం మార్కులతో డిగ్రీ, నిర్దేశిత బ్రాంచ్‌లలో 60 శాతం మార్కులతో బీఈ/బీటెక్,బీఎస్సీ, బీబీఏ/బీబీఎం/సీఎఫ్ఏ/పీజీ తదితర అర్హతలు ఉండాలి.

వయసు

- ఫ్లయింగ్ బ్రాంచ్: జూలై 1, 2025 నాటికి 20–24 ఏళ్లు ఉండాలి.
- ఫ్లయింగ్ బ్రాంచ్‌కు సంబంధించి కమర్షియల్ పైలట్ లైసెన్స్ కలిగి ఉన్న వారికి గరిష్ఠ వయోపరిమితిలో రెండేళ్ల సడలింపు లభిస్తుంది.
- గ్రౌండ్ డ్యూటీ: జూలై 1, 2025 నాటికి 20–26 ఏళ్లు ఉండాలి.
- అన్ని విభాగాలకు అవివాహితులు మాత్రమే అర్హులు.

ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ స్కీమ్(ఫ్లయింగ్ బ్యాచ్)

ఎన్‌సీసీ ఎయిర్‌వింగ్ సీనియర్ డివిజన్ 'సి' సర్టిఫికెట్ ఉన్న అభ్యర్థులకు అందుబాటులో ఉన్న అవకాశం ఇది. ఎన్‌సీసీ సర్టిఫికెట్‌తోపాటు కనీసం 60 శాతం మార్కులతో ఏదైనా డిగ్రీ ఉండాలి. ఇంటర్‌లో(మ్యాథ్స్, ఫిజిక్స్) కనీసం 60 శాతం మార్కులు సాధించాలి.

ఏఎఫ్‌క్యాట్‌తోపాటు ఏఎఫ్ఎస్‌బీ

ఎయిర్ ఫోర్స్‌లో పలు విభాగాల్లో పోస్ట్‌ల భర్తీకి చేపట్టే ఎంపిక ప్రక్రియలో భాగంగా ముందుగా ఎయిర్‌ఫోర్స్ కామన్ అడ్మిషన్ టెస్ట్‌ను నిర్వహిస్తారు. ఇందులో నిర్దేశిత కటాఫ్ మార్కులు సాధించిన వారికి మలి దశలో ఎయిర్‌ఫోర్స్ సెలక్షన్ బోర్డ్ (ఏఎఫ్ఎస్‌బీ) పరిధిలో తుది దశ ఎంపిక ప్రక్రియ ఉంటుంది.

300 మార్కులకు ఏఎఫ్‌క్యాట్

ఏఎఫ్‌క్యాట్ పరీక్ష మొత్తం నాలుగు విభాగాల్లో (జనరల్ అవేర్‌నెస్, ఇంగ్లిష్ వెర్బల్ ఎబిలిటీ, న్యూమరికల్ ఎబిలిటీ అండ్ రీజనింగ్, మిలటరీ ఆప్టిట్యూడ్ టెస్ట్) 100 ప్రశ్నలు–300 మార్కులకు పరీక్ష ఉంటుంది. ఒక్కో ప్రశ్నకు మూడు మార్కులు కేటాయిస్తారు. పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. పరీక్షకు నిర్దేశించిన సమయం రెండు గంటలు. నెగెటివ్ మార్కింగ్ నిబంధన కూడా ఉంది. ప్రతి పొరపాటు సమాధానానికి ఒక మార్కు తగ్గిస్తారు.

ఏఎఫ్ఎస్‌బీ

- ఎంపిక ప్రక్రియలో తొలిదశ ఏఎఫ్‌క్యాట్‌లో అర్హత సాధించిన వారికి రెండో దశలో ఎయిర్ ఫోర్స్ సెలక్షన్ బోర్డ్‌ల ఆధ్వర్యంలో ఏఎఫ్ఎస్‌బీ టెస్టింగ్ నిర్వహిస్తారు. ఈ ఎంపిక ప్రక్రియ మొత్తం మూడంచెల్లో ఉంటుంది. ఆ వివరాలు..
- **తొలి దశ.. స్టేజ్–1:** ఆఫీసర్ ఇంటెలిజెన్స్ రేటింగ్ టెస్ట్, పిక్చర్ పర్సెప్షన్ టెస్ట్ నిర్వహిస్తారు.
- **రెండో దశ.. స్టేజ్–2:**ఇందులో సైకలాజికల్ టెస్ట్ ఉంటుంది.ఇందులో భాగంగా అయిదు రోజుల పాటు పలు అంశాల్లో పరీక్షలు నిర్వహిస్తారు. అదే విధంగా పర్సనల్ ఇంటర్వ్యూ ఉంటుంది.
- ఫ్లయింగ్ బ్రాంచ్ అభ్యర్థులకు ప్రత్యేకంగా కంప్యూటరైజ్డ్ పైలట్ సెలక్షన్ సిస్టమ్(సీపీఎస్ఎస్) విధానంలో మరో పరీక్ష కూడా నిర్వహిస్తారు.
- ఎన్‌సీసీ ఎయిర్ వింగ్ 'సి' సర్టిఫికెట్ ద్వారా ఎన్‌సీసీ ఎంట్రీకి దరఖాస్తు చేసుకున్న వారికి ఏఎఫ్‌క్యాట్ నుంచి మినహాయింపు ఉంటుంది.
- రెండు దశల్లోనూ విజయం సాధించి తుది విజేతల జాబితాలో నిలిచిన వారిని శిక్షణకు ఎంపిక చేస్తారు.



ఏఎఫ్‌క్యాట్(2)-2024

74, 52 వారాల శిక్షణ

- తుది విజేతలుగా నిలిచిన వారికి ఎయిర్‌ఫోర్స్ అకాడమీ (హైదరాబాద్)లో శిక్షణనిస్తారు. ఫ్లయింగ్, గ్రౌండ్ డ్యూటీ–టెక్నికల్ విభాగాలకు ఎంపికైన వారికి 74 వారాలు, గ్రౌండ్ డ్యూటీ (నాన్–టెక్నికల్) బ్రాంచ్‌లకు 52 వారాల పాటు శిక్షణ ఉంటుంది. ఈ శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న వారికి సంబంధిత విభాగాల్లో ఎయిర్‌ఫోర్స్ ఆఫీసర్‌గా కొలువు ఖరారు అవుతుంది.

ప్రారంభ వేతనం

ఎంపికైన వారికి ప్రారంభంలో నెలకు రూ. 56,100–రూ.1,77,500 వేతన శ్రేణి అందుతుంది. శిక్షణ సమయంలో నెలకు రూ.56,100 స్టయిఫండ్ ఇస్తారు. ఎయిర్‌ఫోర్స్‌కు ఎంపికైన వారికి షార్ట్ సర్వీస్ కమిషన్ విధానంలో పదేళ్ల పాటు విధులు నిర్వర్తించే అవకాశం కల్పిస్తారు. ఆ తర్వాత ఆసక్తి, ప్రతిభను అనుసరించి మరో నాలుగేళ్లపాటు పొడిగించుకునే అవకాశం ఉంటుంది. షార్ట్ సర్వీస్ కమిషన్ విధానంలో మొత్తం 14 ఏళ్లు పూర్తి చేసుకున్న తర్వాత పర్మనెంట్ కమిషన్ హోదా పొందే అవకాశాన్ని కూడా ఎయిర్‌ఫోర్స్ కల్పిస్తోంది.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం: 30.05.2024
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 2024, జూన్ 28
- ఏఎఫ్‌క్యాట్ పరీక్ష తేదీలు: 2024, ఆగస్ట్ 9, 10, 11 తేదీల్లో
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://afcat.cdac.in

రాత పరీక్షలో రాణించేలా

ఎయిర్‌ఫోర్స్ ఆఫీసర్ కొలువులకు అవకాశం కల్పించే ఏఎఫ్‌క్యాట్‌లో రాణించడానికి సిలబస్ అంశాలపై పూర్తి పట్టు సాధించాలి. ముఖ్యంగా ఇంగ్లిష్, జనరల్ అవేర్‌నెస్, న్యూమరికల్ ఎబిలిటీ, రీజనింగ్ అండ్ మిలటరీ ఆప్టిట్యూడ్ టెస్ట్ అంశాలను అధ్యయనం చేయడంతోపాటు ప్రాక్టీస్ చేయాలి.

ఇంగ్లిష్

ఈ విభాగంలో స్కోర్ కోసం కాంప్రహెన్షన్, ఇంగ్లిష్ గ్రామర్, సెంటెన్స్ కంప్లీషన్, సెంటెన్స్ ఫార్మేషన్, స్పాటింగ్ ద ఎర్రర్, యాంటానిమ్స్, సినానిమ్స్, క్లోజ్ టెస్ట్, ఇడియమ్స్, ఫ్రేజెస్, అనాలజీ, వన్ వర్డ్ సబ్‌స్టిట్యూషన్‌లపై దృష్టి పెట్టాలి.

జనరల్ అవేర్‌నెస్

చరిత్ర, జాగ్రఫీ, పాలిటీ, ఎకానమీలతోపాటు జాతీయ, అంతర్జాతీయంగా ప్రాధాన్యం సంతరించుకున్న అంశాలు, సంఘటనలు, సైన్స్ అండ్ టెక్నాలజీ తాజా పరిణామాలు, రక్షణ రంగంలోని పరిణామాలపై అవగాహన ఏర్పరచుకోవాలి.

న్యూమరికల్ ఎబిలిటీ

టైమ్ అండ్ వర్క్, యావరేజెస్, ప్రాఫిట్ అండ్ లాస్, రేషియోస్, సింపుల్ అండ్, కాంపౌండ్ ఇంట్రస్ట్, టైమ్ అండ్ డిస్టెన్స్, నంబర్ సిరీస్, పెరిమీటర్, ఏరియా, ప్రాబబిలిటీ అంశాలపై అవగాహన పొందాలి.

రీజనింగ్, మిలటరీ ఆప్టిట్యూడ్ టెస్ట్

ఇందులో మంచి స్కోర్ కోసం వెర్బల్, నాన్–వెర్బల్ రీజనింగ్ అంశాలతోపాటు.. సీటింగ్ అరేంజ్‌మెంట్, రొటేటెడ్ బ్లాక్స్, హిడెన్ ఫిగర్స్, అనాలజీపై అవగాహన పెంచుకోవాలి.

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
76	42
73,961	22,531

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	16,735	▽	2
డోజోన్స్	38,686	▲	575
ఎఫ్‌టీఎస్ఈ 100	8,275	▲	44
డాక్స్	18,498	▲	1
హాంగ్‌సెంగ్	3,087	▽	5
నికాయ్	38,488	▲	434

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	82.85	83.87
£	బ్రిటన్ పౌండ్	104.76	107.31
€	యూరో	89.01	91.37
¥	జపాన్ ఎన్ (100)	52.39	53.55
AU$	ఆస్ట్రేలియా డాలర్	54.23	56.17
S$	సింగపూర్ డాలర్	59.59	63.56
SAR	సౌదీ రియాల్	21.34	22.88
UAE D	యూఏఈ దిర్హామ్	21.81	23.58
¥	చైనా యువాన్	10.36	12.36

బఫెట్ సంపద రహస్యం అదే

లెజెండరీ హెడ్జ్ ఫండ్ మేనేజర్ జిమ్ సిమన్స్ సంపద విలువ 31.4 బిలియన్ డాలర్లు. విఖ్యాత ఇన్వెస్టర్ వారెన్ బఫెట్ నెట్‌వర్త్ 139 బిలియన్ డాలర్లు. బఫెట్ కంటే సిమన్స్ సంపద 77 శాతం తక్కువ. వీరిద్దరి మధ్యనున్న సూక్ష్మ వైరుధ్యాన్ని ప్రతి ఇన్వెస్టర్ తప్పకుండా తెలుసుకోవాలి. జిమ్ సిమన్స్ స్థాపించిన హెడ్జ్ ఫండ్ 'రెనైసెన్స్ టెక్నాలజీస్' ఒకటి రెండేళ్లు కాదు.. 1988 నుంచి ఏటా 66 శాతం చొప్పున, నిరంతరాయంగా మూడు దశాబ్దాలకు పైనే ఇన్వెస్టర్లకు పెట్టుబడులపై ప్రతిఫలాన్ని తెచ్చిపెట్టింది. అదే వారెన్ బఫెట్ స్థాపించిన బెర్క్‌షైర్ హాథవే ఏటా 19.8 శాతం కాంపౌండింగ్ వృద్ధినే నమోదు చేసింది. సిమన్స్ కంటే బఫెట్ సంపదే నాలుగు రెట్లు అధికం. ఏటా ఎంత అధికంగా రాబడి తెచ్చుకున్నారనే దానికంటే.. ఎంత ముందుగా పెట్టుబడులు మొదలు పెట్టారు, వాటిని ఎంత కాలం పాటు కొనసాగించారు? అన్నవే సంపదను నిర్ణయిస్తాయని సిమన్స్–బఫెట్ జర్నీ చెబుతోంది. అందుకే ప్రతి ఒక్కరూ వీలైనంత ముందుగా ఇన్వెస్ట్‌మెంట్ ఆరంభించి, దీర్ఘకాలం పాటు కొనసాగించినప్పుడే కాంపౌండింగ్ ప్రయోజనాన్ని గరిష్టంగా అందుకోగలరు.

ముందుగా పెట్టుబడులు ఆరంభించాలి

- కాంపౌండింగ్‌తో దీర్ఘకాలంలో గొప్ప రాబడి
- స్వల్ప మొత్తమే అయినా చెప్పుకో తగినంత నిధి
- బఫెట్–జిమ్ సిమన్స్ మధ్య వైరుధ్యమే అది





ఏటా 12 శాతం రాబడి

సంపద సృష్టించాలనుకునే ప్రతి ఒక్కరూ ముందుగా చేయాల్సిన పని.. సంపాదనను తీసుకెళ్లి వృద్ధి చెందే చోట పెట్టడం. ఎంత ముందుగా ఆరంభిస్తే, దీర్ఘకాలంలో అంత అధికంగా ప్రయోజనం పొందొచ్చు. బఫెట్ పెట్టుబడుల ప్రయాణాన్ని గమనించినా ఇదే బోధపడుతుంది. ముందుగా మొదలు పెట్టడం వల్ల అప్పుడు కాంపౌండింగ్ ప్రయోజనం గరిష్ట స్థాయిలో పొందడానికి కావాల్సినంత వ్యవధి ఉంటుంది. 25 ఏళ్ల మహిమ ప్రతి నెలా రూ.1,000 చొప్పున తనకు 50 ఏళ్లు వచ్చే వరకు.. అంటే 25 ఏళ్లపాటు ఇన్వెస్ట్ చేసిందని అనుకుందాం. అప్పుడు 25 ఏళ్లలో మహిమ అసలు పెట్టుబడి రూ.3 లక్షలు అవుతుంది. ఏటా 12 శాతం రాబడి (ఈక్విటీలలో దీర్ఘకాల సగటు) అంచనా ప్రకారం సమకూరే మొత్తం రూ.18 లక్షలు. కేవలం వెయ్యి రూపాయలే.. 25 ఏళ్లలో రూ.18 లక్షలుగా మారడం కాంపౌండింగ్ వల్లే. ఇలా కాకుండా మహిమ కేసులో కాంపౌండింగ్ ప్రయోజనం తీసేసి చూస్తే.. అంటే అసలుతోపాటు, దానిపై వచ్చిన వడ్డీని ఇన్వెస్ట్ చేయకుండా ఉంటే సమకూరే మొత్తం రూ.7.5 లక్షలుగానే ఉండేది. మొత్తం రూ.18 లక్షల్లో మిగిలిన రూ.10.5 లక్షలు కేవలం కాంపౌండింగ్ వల్లే సమకూరినట్టు అర్థం చేసుకోవచ్చు. ఒకవేళ పెట్టుబడికి ఇప్పుడేం తొందరొచ్చిందిలే.. తర్వాత చూద్దామనుకుని, మహిమ పదేళ్లు ఆలస్యంగా తన 35వ ఏట నుంచి ఇన్వెస్ట్ చేయడం మొదలు పెట్టి ఉంటే ఏమయ్యేది? పైన చెప్పుకున్నట్టు 50 ఏళ్ల వయసుకు రూ.18 లక్షలు రావాలంటే అప్పటి నుంచి 15 ఏళ్ల పాటు ప్రతి నెలా ఆమె రూ.1,700 ఇన్వెస్ట్ చేయాల్సిందే. పదేళ్లు వృథా చేయడం వల్ల 70 శాతం అదనపు పెట్టుబడి అవసరం అవుతుందని ఇక్కడి ఉదాహరణ చెబుతోంది. పెట్టుబడి విషయంలో కాలం వృథా అవుతున్న కొద్దీ కాంపౌండింగ్ ప్రయోజనం అదే స్థాయిలో కోల్పోతారు.

కాంపౌండింగ్



పెట్టుబడిపై వడ్డీ వస్తుందని తెలుసు. దీన్ని వడ్డీ రాబడిగా చెబుతారు. ఈ వడ్డీ కూడా తిరిగి పెట్టుబడిగా మారి దానిపైనా వడ్డీ సమకూరడమే కాంపౌండింగ్. దీన్నే చక్రవడ్డీ అని కూడా చెబుతారు. బ్యాంకులో వ్యక్తిగత రుణం, బంగారంపై రుణం తీసుకున్నప్పుడు ప్రతి నెలా వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. ఏదైనా కారణంతో ఒక నెల ఈఎంఐ చెల్లించడంలో విఫలమై, మరుసటి నెలలో చెల్లిస్తున్నప్పుడు నెల బకాయిపై వడ్డీని కూడా బ్యాంక్ రాబడుతుంది. దీన్నే వడ్డీ మీద వడ్డీగా చెబుతారు. రూ.100 ఇన్వెస్ట్ చేస్తే 10 శాతం రాబడి ప్రకారం ఏడాది తర్వాత రూ.110గా మారుతుంది. ఇందులో రూ.10 వడ్డీ రూపంలో సమకూరింది. రెండో ఏడాది రూ.110 కాస్తా రూ.121గా మారుతుంది. మొదటి ఏడాది వడ్డీ రూ.10పైనా రెండో ఏడాది రూపాయి వడ్డీ వచ్చినట్టు. ఇలా వడ్డీపై వడ్డీ రాబడి జమవుతుంది కనుకనే దీర్ఘకాలంలో భారీ మొత్తం సమకూరుతుంది.

బఫెట్ పంచ సూత్రాలు

- పెట్టుబడుల విషయంలో దీర్ఘకాల దృష్టి ఉండాలి. అవసరమైతే ఎప్పటికీ కొనసాగించాలి.
- పెట్టుబడుల్లో ఉండే రిస్క్ తెలుసుకోవాలి. మీరు ఏం చేస్తున్నారో తెలియనప్పుడే రిస్క్ ఎదురవుతుంది.
- నాణ్యత విషయంలో రాజీ పడొద్దు. ఇక్కడ పరిమాణం కంటే నాణ్యత ముఖ్యం. మంచి కంపెనీని అద్భుతమైన ధరలో (చాలా ఖరీదైన వ్యాల్యుయేషన్‌లో) కొనడం కంటే.. అద్భుతమైన కంపెనీని సరసమైన ధరలో కొనుక్కోవాలి.
- వ్యాపారంపై పెట్టుబడి పెడుతున్నారు. అసాధారణ యాజమాన్యం, అద్భుతమైన వ్యాపారంతో ఉంటే ఆ కంపెనీలో మీరు పెట్టే పెట్టుబడి కాల వ్యవధి జీవితకాలంగానే భావించాలి.
- ఈక్విటీ మార్కెట్లో ఓపిక ఉన్నవారికే అధిక రాబడులు సొంతమవుతాయి. దూకుడైన ఇన్వెస్టర్ నుంచి ఓపికగా వేచి చూసే ఇన్వెస్టర్‌కు సంపదను బదిలీ చేసే విధంగా స్టాక్ మార్కెట్ పనితీరు ఉంటుంది.

పెట్టుబడుల జర్నీ..

బఫెట్ ప్రస్తుత వయసు 90 ఏళ్లు. ఆయన సంపద విలువ 139 బిలియన్ డాలర్లు. నిజానికి బఫెట్ సంపదలో 99 శాతం ఆయనకు 65 ఏళ్లు వచ్చిన తర్వాత సమకూరిందేనని ప్రముఖ రచయిత మోర్గాన్ హౌసెల్ 'ద సైకాలజీ ఆఫ్ మనీ' అనే పుస్తకంలో పేర్కొన్నారు. ఒకవేళ బఫెట్ 65 ఏళ్లకే రిటైర్ అయి ఉంటే నేడు ఆయన గురించి అంతగా మాట్లాడుకునే వాళ్లం కాదని ఓ ఇంటర్వ్యూలో భాగంగా హౌసెల్ పేర్కొన్నారు. బఫెట్ 30 ఏళ్ల వయసులో పెట్టుబడులు మొదలు పెట్టి, 60 ఏళ్లకు రిటైర్మెంట్ తీసుకున్నాడన్నది చాలా మంది ఇన్వెస్టర్లకు తెలిసిన విషయం. కానీ, నిజానికి బఫెట్ 10 ఏళ్ల వయసులోనే పెట్టుబడి ఆరంభించారు. 30 ఏళ్ల నాటికి ఆయన 9.3 మిలియన్ డాలర్లు సమకూర్చుకున్నారు. వెనక్కి తీసుకోకుండా అలాగే జీవితకాలం పాటు కొనసాగించారు. సంపాదిస్తున్న మొత్తంలో కనీస అవసరాలకే తప్ప ఎప్పుడూ లగ్జరీ వ్యయాలకు పోలేదు. వీలైనంత పెట్టుబడి పెట్టడమే ఆయన చేసిన పని. నిజానికి దీన్నే బఫెట్ స్కిల్ (నైపుణ్యం)గా హౌసెల్ అభివర్ణిస్తారు. ఏటా 20 శాతం చొప్పున బఫెట్ సంపద కాంపౌండ్ అయింది. జిమ్ సిమన్స్ 1988 నుంచి పెట్టుబడులు ఏటా 66 శాతం చొప్పున వృద్ధి చెందేంత గొప్ప వ్యూహాలు అమలు చేసినప్పటికీ.. తక్కువ సంపద కలిగి ఉండడానికి కారణం పెట్టుబడుల ప్రపంచంలోకి ఆలస్యంగా ప్రవేశించడమే. నిజానికి సిమన్స్ వార్షిక రాబడి 66 శాతంలో బఫెట్ వార్షిక రాబడి మూడింట ఒక వంతే. బఫెట్ ఎంతో ముందుగా మొదలు పెట్టడం వల్ల కాంపౌండింతో ఎక్కువ సంపద సమకూరింది. ప్రపంచంలో మరెవరికీ సాధ్యం కానంత వార్షిక రాబడులను సిమన్స్ తెచ్చుకున్నా కానీ, ఆస్తుల్లో బఫెట్ కంటే దిగువన ఉండడానికి కారణం 50 ఏళ్లు వచ్చిన తర్వాతే తన ఇన్వెస్ట్‌మెంట్ జర్నీ ఆరంభించడం. అందుకే ప్రతి ఇన్వెస్టర్ ముందుగా పెట్టుబడులు మొదలు పెట్టి, ఎక్కువ కాలం పాటు కొనసాగించడం ఆచరించాలని బఫెట్ విజయ గాథ తెలియజేస్తోంది. బఫెట్ మాదిరే సిమన్స్ కూడా 70 ఏళ్ల పాటు ఏటా 66 శాతం చొప్పున రాబడులు తెచ్చుకుని ఉంటే.. ఆ మొత్తం కొన్ని వందల రెట్లు అధికంగా ఉంటుంది.



జిమ్ సిమన్స్ ఏమి చెప్పారంటే..?

- ఒక గొప్ప సిద్ధాంతం అందంగా ఎలా ఉంటుందో.. గొప్పగా, సమర్థవంతంగా పనిచేసే కంపెనీ కూడా అంతే అందంగా ఉంటుంది.
- వీలైనంత వరకు మీ చుట్టూ తెలివైన, ఉత్తమమైన వ్యక్తులు ఉండేలా చూసుకోవాలి. వారు మీకంటే తెలివైన వారు అయితే ఇంకా మంచిది.
- ఏదో ఒకటి వాస్తవికంగా చేయండి. మిగిలిన వారిని అనుసరించొద్దు. ఒకే సమస్యను పరిష్కరించేందుకు ఎక్కువ మంది ప్రయత్నిస్తుంటే మీరు దాన్ని చేయొద్దు.
- అంత సులభంగా వదిలేసుకోవద్దు. దానికే కట్టుబడి ఉండాలి. అలా అని శాశ్వతంగా కాదు. కానీ, ఫలితమిచ్చేంత సమయం దానికి ఇవ్వాలి.
- చివరిగా అదృష్టం కలసిరావాలి. ఇది చాలా ముఖ్యమైన సూత్రం.
- జేమ్స్ హారిస్ సిమన్స్ (జిమ్ సిమన్స్) గణితంలో దిట్ట. తనకున్న అసాధారణ ప్రతిభతో మార్కెట్ల తీరును కచ్చితంగా అంచనా వేసి, పెట్టుబడులపై అధిక ప్రతిఫలం పొందే దిశగా ఆయన అమలు చేసిన విధానాలు అద్భుత ఫలితాలను ఇచ్చాయి. 1980లోనే క్వాంట్ ఇన్వెస్టింగ్ విధానాన్ని ఆవిష్కరించి బఫెట్, జార్జ్ సోరోస్ వంటి దిగ్గజ ఇన్వెస్టర్లను అధిగమించారు.



రిలయన్స్ పర్సనల్ యాక్సిడెంట్ 360 షీల్డ్ పాలసీ



రిలయన్స్ జనరల్ ఇన్సూరెన్స్ సంస్థ తాజాగా రిలయన్స్ పర్సనల్ యాక్సిడెంట్ 360షీల్డ్ పాలసీని ఆవిష్కరించింది. ప్రమాదంపరంగానే కాకుండా ఆ తర్వాత ఎదురయ్యే ఆర్థిక పరిణామాల నుంచి పాలసీదారుకు, వారి కుటుంబానికి భద్రత కల్పించేందుకు ఇది తోడ్పడుతుంది. చికిత్స వ్యయాలు, అలాగే ఆ సమయంలో పాలసీదార్లకు గృహ, వాహన, విద్యా రుణాల ఈఎంఐలు మొదలైన బాధ్యతలేమైనా ఉంటే వాటికి కూడా కవరేజీని ఇవ్వడంతో పాటు లీగల్ అసిస్టెన్స్‌లాంటివి సైతం ఏర్పాటు చేసే విధంగా ఇది సమగ్రంగా ఉంటుంది. తద్వారా కష్ట సమయంలో పాలసీదారుల కుటుంబం ఆర్థికంగా ఒత్తిడికి లోను కాకుండా ఈ పాలసీ తోడ్పడుతుంది. రూ. 5 లక్షల నుంచి రూ. 25 కోట్ల వరకు కవరేజీ తీసుకోవచ్చు. అడ్వెంచర్ స్పోర్ట్స్ కవరేజీ వంటి యాడ్–ఆన్ ఫీచర్లను కూడా తీసుకోవచ్చు.

కోడిగుడ్లు (హోల్‌సేల్–నెక్ / 100కు రూ.లలో)

3-6-2024	
విశాఖ	500–00
చిత్తూరు	563–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	485–00
విజయవాడ	490–00
రిటైల్ ధర (డజను)	66.00
హైదరాబాద్	505–00
వరంగల్	507–00
రిటైల్ ధర	5.65

ఫండ్ స్ట్రీట్

బరోడా బీఎన్‌పీ పారిబా నిఫ్టీ బ్యాంక్ ఈటీఎఫ్

బరోడా బీఎన్‌పీ పారిబా మ్యుచువల్ ఫండ్ తాజాగా దీర్ఘకాలానికి నిఫ్టీ బ్యాంక్ ఈటీఎఫ్‌ను ఆవిష్కరించింది. సరళంగా, తక్కువ వ్యయాలతో దేశీ బ్యాంకింగ్ రంగంలో ఇన్వెస్ట్ చేసేందుకు ఇది ఉపయోగపడగలదని సంస్థ సీఈవో సురేష్ సోనీ తెలిపారు. నిఫ్టీ బ్యాంక్ టోటల్ రిటర్న్ ఇండెక్స్ పనితీరును ఈ ఫండ్ ప్రతిబింబించేదిగా ఉంటుంది. ఇందులో కనీసం రూ. 5,000 నుంచి ఇన్వెస్ట్ చేయొచ్చు. 95–100 శాతం నిధులను నిఫ్టీ బ్యాంక్ ఇండెక్స్‌లోని ఈక్విటీలు, ఈక్విటీ ఆధారిత సెక్యూరిటీల్లో ఇన్వెస్ట్ చేస్తారు.

మహీంద్రా మాన్యులైఫ్ మాన్యుఫాక్చరింగ్ ఫండ్..

మహీంద్రా మాన్యులైఫ్ మ్యుచువల్ ఫండ్ కొత్తగా మాన్యుఫాక్చరింగ్ ఫండ్‌ను ఆవిష్కరించింది. ఈ న్యూ ఫండ్ ఆఫర్ జూన్ 14తో ముగుస్తుంది. దీని ద్వారా సేకరించిన నిధుల్లో 80–100 శాతం మొత్తాన్ని వివిధ మార్కెట్ క్యాపిటలైజేషన్‌వ్యాప్తంగా తయారీ రంగ సంస్థల్లో ఇన్వెస్ట్ చేస్తారు. ఎస్అండ్‌పీ బీఎస్ఈ ఇండియా మాన్యుఫాక్చరింగ్ ఇండెక్స్‌కి సంబంధించి ఏషియా ఇండెక్స్ రూపొందించే జాబితాలోని 10 పైచిలుకు రంగాల సంస్థలు ఈ పోర్ట్‌ఫోలియోలో ఉంటాయి. కనీసం రూ. 1,000 నుంచి ఇన్వెస్ట్ చేయొచ్చు. వీక్లీ, మంత్లీ సిప్‌లకు సంబంధించి కనీస వాయిదా రూ. 500గా ఉంటుంది.

మార్కెట్లకు ఫలితాల జోష్!

- ఎన్‌డీఏదే విజయం: ఎగ్జిట్ పోల్స్
- శుక్రవారం ఆర్‌బీఐ పాలసీ సమీక్ష
- విదేశీ పెట్టుబడులు, గణాంకాలు కీలకమే
- ఈ వారం ట్రెండ్‌పై స్టాక్ నిపుణులు




న్యూఢిల్లీ: ప్రధానంగా సార్వత్రిక ఎన్నికల ఫలితాలు ఈ వారం దేశీ స్టాక్ మార్కెట్లకు జోష్‌నివ్వనున్నట్లు విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఇప్పటికే శనివారం(1న) వెలువడిన ఎగ్జిట్ పోల్స్‌లో అధికార బీజేపీ అధ్యక్షతన ఏర్పాటైన ఎన్‌డీఏ భారీ విజయాన్ని సాధించనున్నట్లు అంచనాలు వెలువడ్డాయి. దీంతో మంగళవారం(4న) వెలువడనున్న లోక్‌సభ ఫలితాలలో తిరిగి బీజేపీ కూటమి అధికారాన్ని అందుకుంటుందన్న అంచనాలు బలపడినట్లు రాజకీయ వర్గాలు తెలియజేశాయి. వరుసగా మూడోసారి భారీ మెజారిటీతో నరేంద్ర మోదీ ప్రధాని పదవిని చేపట్టే వీలున్నట్లు పేర్కొన్నాయి. వెరసి స్టాక్ మార్కెట్లలో ప్రోత్సాహకర సెంటిమెంటుకు తెరలేవనున్నట్లు నిపుణులు పేర్కొన్నారు. ఎగ్జిట్ పోల్స్ ప్రభావంతో నేడు(3న) మార్కెట్లు జోరు చూపే అవకాశమున్నట్లు అభిప్రాయపడ్డారు. అయితే 4న ప్రకటించనున్న వాస్తవిక ఫలితాలు భిన్నంగా వెలువడితే.. మార్కెట్లలో దిద్దుబాటుకూ అవకాశమున్నట్లు స్వస్తికా ఇన్వెస్ట్‌మార్ట్ రీసెర్చ్ హెడ్ సంతోష్ మీనా తెలియజేశారు. కాగా.. గత వారం సెన్సెక్స్ చరిత్రాత్మక గరిష్టం 76,010కు, నిఫ్టీ 23,111కు చేరినప్పటికీ సెన్సెక్స్ 1,449 పాయింట్లు(1.9 శాతం) కోల్పోయి, నిఫ్టీ 426 పాయింట్లు(1.9 శాతం) పతనమై ముగిశాయి. ఈ బాటలో బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్స్ సైతం 1.5 శాతం చొప్పున డీలా పడ్డాయి.

జీడీపీ దన్ను

గత వారాంతాన వెలువడిన జీడీపీ గణాంకాలు సైతం ఇన్వెస్టర్లకు జోష్‌నివ్వనున్నట్లు స్టాక్ నిపుణులు తెలియజేశారు. గతేడాది క్యూ4(జనవరి–మార్చి)లో ఆర్థిక వ్యవస్థ 7.4 శాతం పురోగతిని సాధించగా.. పూర్తి ఏడాదికి అంచనాలను మించుతూ 8.2 శాతం వృద్ధి చూపింది. ప్రోత్సాహకర ఎగ్జిట్ పోల్స్, జీడీపీ గణాంకాల నేపథ్యంలో విదేశీ ఇన్వెస్టర్లు(ఎఫ్ఐఐలు) సైతం కొనుగోళ్లకు ఆసక్తి చూపే వీలున్నట్లు మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రిటైల్ రీసెర్చ్ హెడ్ సిద్ధార్థ ఖేమ్కా తెలియజేశారు. ఎగ్జిట్ పోల్స్ పరిధిలోనే వాస్తవిక ఫలితాలు సైతం వెలువడితే.. రాజకీయ, పాలసీ కొనసాగింపుపై ఇన్వెస్టర్లలో నెలకొన్న ఆందోళనలకు చెక్ పడుతుందని ఎమ్‌కే రీసెర్చ్ నివేదికలో పేర్కొంది.

రెపో యథాతథం



లోక్‌సభ ఫలితాల తదుపరి దేశీ స్టాక్ మార్కెట్లను శుక్రవారం(7న) వెలువడనున్న ఆర్‌బీఐ పాలసీ సమీక్షా నిర్ణయాలు ప్రభావితం చేయనున్నట్లు విశ్లేషకులు పేర్కొన్నారు. 5న ప్రారంభంకానున్న ఆర్‌బీఐ పాలసీ సమావేశం 7న ముగియనుంది. 2024 ఏప్రిల్‌లో నిర్వహించిన పాలసీ సమీక్షలో ఆర్‌బీఐ కమిటీ వరుసగా ఏడోసారి వడ్డీ రేట్లకు కీలకమైన రెపో రేటును 6.5 శాతం వద్ద స్థిరంగా కొనసాగించేందుకే నిర్ణయించింది. ఇక ఈ వారంలో మే నెలకు తయారీ(3న), సర్వీసెస్ పీఎంఐ(5న) గణాంకాలు వెలువడనున్నాయి. చైనా, యూఎస్ తయారీ, ఉపాధి గణాంకాలు సైతం 3, 5న వెల్లడికానున్నాయి. వీటికితోడు ఎఫ్ఐఐల పెట్టుబడుల తీరు, విదేశీ మార్కెట్లలో ముడిచమురు ధరలు, డాలరుతో మారకంలో రూపాయి కదలికలు వంటి అంశాలు సైతం సెంటిమెంటును ప్రభావితం చేయగలవని మార్కెట్ నిపుణులు ప్రస్తావించారు.

ఆసియా కుబేరుడిగా మళ్లీ అదానీ

- అంబానీని దాటి అగ్రస్థానం
- 111 బిలియన్ డాలర్ల సంపదతో ప్రపంచంలో 11వ ర్యాంకు

న్యూఢిల్లీ: ఆసియాలోనే అత్యంత సంపన్నుల జాబితాలో అదానీ గ్రూప్ చీఫ్ గౌతమ్ అదానీ మరోసారి రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ ముకేశ్ అంబానీని అధిగమించారు. 111 బిలియన్ డాలర్ల సంపదతో అగ్రస్థానం దక్కించుకున్నారు. అంతర్జాతీయంగా కుబేరుల లిస్టులో 11వ స్థానంలో నిల్చారు. బ్లూమ్‌బర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ రిపోర్టు ప్రకారం అంబానీ 109 బిలియన్ డాలర్ల సంపదతో అంతర్జాతీయంగా 12వ స్థానంలో ఉన్నారు. అదానీ 2022లోనే ఆసియాలో నంబర్ వన్ సంపన్నుడిగా ఎదిగారు. అంతే కాదు స్వల్ప సమయం పాటు ప్రపంచంలోనే రెండో స్థానంలో నిల్చారు. అయితే, ఆయన గ్రూప్ కంపెనీల ఖాతాల్లో అవకతవకలు జరుగుతున్నాయంటూ అమెరికాకు చెందిన హిండెన్‌బర్గ్ రీసెర్చ్ సంస్థ ఆరోపించడంతో 2023 జనవరిలో అదానీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ తర్వాత పరిణామాలతో గ్రూప్ సంస్థల షేర్లన్నీ కుదేలై ఏకంగా 150 బిలియన్ డాలర్ల విలువ కరిగిపోయింది. దీంతో ఆసియాలో అత్యంత సంపన్నుడిగా అంబానీ మళ్లీ అగ్రస్థానం దక్కించుకున్నారు. మరోవైపు, ఆరోపణలను దీటుగా ఎదుర్కొని, అదానీ క్రమంగా దిద్దుబాటు చర్యలు తీసుకుంటూ గ్రూప్‌ను మళ్లీ నిలబెట్టుకున్నారు. శుక్రవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి 10 గ్రూప్ కంపెనీల మార్కెట్ విలువ రూ. 17.51 లక్షల కోట్లకు చేరడంతో ఆయన సంపద కూడా పెరిగింది. మొత్తం మీద 2024లో అదానీ నికర విలువ 26.8 బిలియన్ డాలర్లు పెరగ్గా, అంబానీ సంపద 12.7 బిలియన్ డాలర్లు పెరిగింది.



హోనసా కన్జూమర్ | ఎమ్‌కే గ్లోబల్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 440 టార్గెట్: రూ. 500

ఎందుకంటే: బ్యూటీ, వ్యక్తిగత సంరక్షణ ప్రొడక్టుల కంపెనీ హోనసా కన్జూమర్ దేశీయంగా అమ్మకాల విస్తరణ బాటలో సాగుతోంది. మామాఎర్త్ బ్రాండుతో సుప్రసిద్ధమైన సంస్థ ద డెర్మా కో పేరుతో రెండో లాభదాయక బ్రాండుకు ఊపిరిపోసింది. వార్షికంగా రూ. 500 కోట్లకుపైగా ఆదాయాన్ని ఆర్జిస్తోంది. 2020లో ఏర్పాటైన డెర్మా కో సైన్స్ ఆధారిత ఉత్పత్తులను రూపొందిస్తోంది. ఇందుకు యాక్టివ్ ఇన్‌గ్రెడియంట్స్ తోడ్పాటునిస్తున్నాయి. వెరసి రూ. 2,000 కోట్ల విలువైన మార్కెట్‌ను లీడ్ చేస్తోంది. 20 శాతం మార్కెట్ వాటాతో అగ్రపథాన నిలుస్తోంది. యాక్టివ్ ఇన్‌గ్రెడియంట్స్‌తో విస్తరించిన ప్రొడక్టులకు కనిపిస్తున్న డిమాండ్‌రీత్యా పలు సంప్రదాయ స్టార్టప్ కంపెనీలు ఈ విభాగంలోకి ప్రవేశిస్తున్నాయి. దీంతో మరిన్ని ప్రాంతాలలోకి ఉత్పత్తులు విస్తరించే వీలుంది. తద్వారా మార్కెట్, అమ్మకాలు పుంజుకునే అవకాశముంది. ఈ బాటలో ప్రస్తుతం అత్యధికంగా దృష్టి సారించిన ముఖ సౌందర్యం విభాగం నుంచి కంపెనీలు కేశాలు, కలర్ కాస్మెటిక్స్‌వైపు మళ్లనున్నాయి. విభిన్న కొత్తతరహా ప్రొడక్టులను విడుదల చేయడంపై కసరత్తు చేసే అవకాశముంది. ఇందుకు అనుగుణంగా ఎగ్జిక్యూషన్ పెంచుకుంటున్న డెర్మా కో.. మామాఎర్త్ అనుసరిస్తున్న వ్యూహాల(ప్లేబుక్)ను వినియోగించుకుంటోంది. తద్వారా అమ్మకాలను విస్తరించడంతోపాటు.. లాభదాయకతను సైతం మెరుగుపరచుకుంటోంది. దీంతో మూడేళ్ల కాలం(2023–26)లో డెర్మాకో వార్షికంగా ఆదాయంలో 50 శాతం వృద్ధిని సాధించగలదని భావిస్తున్నాం.



పటేల్ ఇంజనీరింగ్ | ఐసీఐసీఐ డైరెక్ట్ | కొనొచ్చు

ప్రస్తుతధర:రూ. 62 టార్గెట్: రూ. 80

ఎందుకంటే: టెక్నాలజీ ఆవశ్యకత అధికంగాగల జల విద్యుత్(హైడ్రో పవర్), సొరంగ మార్గాలు, నీటి పారుదల, నీటి సరఫరా, పట్టణ మౌలిక సదుపాయాలు, రవాణా విభాగాలలో ప్రత్యేకత కలిగిన ఈపీసీ కంపెనీ పటేల్ ఇంజినీరింగ్. 2023 డిసెంబర్‌కల్లా కంపెనీ రూ. 19,134 కోట్ల విలువైన ఆర్డర్ బుక్‌ను కలిగి ఉంది. వీటిలో ఎల్–1 కాంట్రాక్టులు సైతం ఉన్నాయి. అంటే 4.3 రెట్లు బుక్‌టు బిల్ కంపెనీ సొంతం. అయితే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గత ఆర్థిక సంవత్సరం(2023–24) ద్వితీయార్థం(అక్టోబర్–మార్చి)లో ఆర్డర్లు మందగించాయి. దీంతో ఎన్నికల ఫలితాల తదుపరి అంటే ఈ ఏడాది(2024–25) తొలి త్రైమాసికం(ఏప్రిల్–జూన్) నుంచి తిరిగి కాంట్రాక్టుల జారీ ఊపందుకునే అవకాశముంది. కంపెనీ ఆర్డర్‌బుక్‌లో జల విద్యుత్, టన్నెలింగ్, ఇరిగేషన్ విభాగాలు 93 శాతం వాటాను ఆక్రమిస్తున్నాయి. వెరసి కంపెనీ ఇకపైనా ఆయా విభాగాల నుంచి భారీస్థాయిలో ప్రభుత్వ రంగ కాంట్రాక్టులు పొందే వీలున్నట్లు భావిస్తున్నాం. 19 గిగావాట్ల హెచ్ఈపీ ప్రాజెక్టులకు తెరతీసిన అధీకృత కేంద్ర విద్యుత్ సంస్థ(సీఈఏ) వివిధ రాష్ట్రాలలో 20,000 మెగావాట్ల సామర్థ్యానికిపైబడిన పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టుల ఏర్పాటు ప్రణాళికల్లో ఉంది. పీఎంకేఎస్‌వై పథకంలో భాగంగా రూ. 93,068 కోట్ల పెట్టుబడులతో కూడిన 2,600 కిలోమీటర్ల పొడవైన 875 సొరంగ మార్గాలను చేపట్టనుంది. వెరసి స్థిరమైన బ్యాలన్స్‌షీట్ కలిగిన కంపెనీ కీలక విభాగాల ద్వారా ఇకపై మరిన్ని కాంట్రాక్టులు దక్కించుకునే వీలుంది. తద్వారా ఆదాయం, నికర లాభాల ఆర్జనకు భరోసా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ షేరు సానుకూలంగా ఉండవచ్చు.



క్లుప్తంగా...

స్థానికులకు ప్రతి మంగళవారం అంతరాలయ దర్శనం

యాదగిరిగుట్ట ఆలయ ఈవో ప్రకటన

యాదగిరిగుట్ట: ప్రతి మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచి 5.30 గంటల వరకు స్థానిక భక్తులకు యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి అంతరాలయ దర్శనం కల్పిస్తున్నట్లు ఈవో భాస్కర్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య విజ్ఞప్తి మేరకు 4వ తేదీ నుంచి ఈ అవకాశం కల్పిస్తున్నట్లు స్పష్టం చేశారు. సాయంత్రం 5 గంటల నుంచి 5.30 గంటల వరకు సుమారు 30 నిమిషాల పాటు స్థానికులు తమ గుర్తింపుకార్డులతో పాటు సంప్రదాయ దుస్తులతో వచ్చి అంతరాలయంలో శ్రీస్వామిని దర్శించుకోవాలని సూచించారు.

ఔటర్‌పై నేటి నుంచి పెరగనున్న టోల్ చార్జీలు

లక్డీకాపూల్: ఔటర్ రింగ్ రోడ్‌పై టోల్ చార్జీలు భారీగా పెరగనున్నాయి. సోమవారం నుంచి పెంచిన టోల్ చార్జీలు 5 శాతం అమలులోకి రానున్నాయి. కారు, జీపు, వ్యాన్‌లకు ప్రతి కిలోమీటర్‌కి రూ.2.34 పైసలు, ఎల్‌సీవీ, మినీ బస్‌లకు రూ.3.77, బస్, 2-యాగ్జిల్ ట్రక్‌లకు రూ.6.69, భారీ నిర్మాణ మెషినరీ, ఎర్త్ మూవింగ్ ఎక్విప్‌మెంట్‌లకు రూ.12.40, ఓవర్ సైజ్డ్ వాహనాలకు రూ.15.09 చొప్పున టోల్ చార్జీలు పెరగనున్నాయి. కొత్త టోల్ రేట్లు, రోజువారీ పాసులు, నెలవారీ పాసులు తదితరాలకు హెచ్‌ఎండీఏ వైబ్‌సైట్‌ను సందర్శించాల్సిందిగా ఐఆర్‌బి గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌వే ప్రైవేట్ సంస్థ నిర్వాహకులు సూచించారు.

ఇదేం 'లెక్క'

ఫిజిక్స్ టీచర్లు 6,7 తరగతులకు గణితం చెప్పాలని ఉత్తర్వులు

- అదనపు క్లాసులు చెప్పాలనడం అన్యాయమంటున్న ఫిజిక్స్ టీచర్లు
- స్కూళ్లు తెరిచే ముందు కొత్త పంచాయితీ



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పనిచేసే ఫిజిక్స్ టీచర్లు ఇక నుంచి ఆరు, ఏడు తరగతుల విద్యార్థులకు గణితం సబ్జెక్టు బోధించాలని ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఇది అన్యాయమంటూ ఫిజిక్స్ టీచర్లు ఉన్నతాధికారులను కలిశారు. దీనివల్ల తమకు తీవ్ర మానసిక ఒత్తిడి కలుగుతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. గణితం బోధించే ఉపాధ్యాయులకు తక్కువ పనిగంటలు ఉంటాయని, తామే ఎక్కువ గంటలు పనిచేస్తామని, అయినా అదనంగా గణితం బోధించమనడం ఏమిటని ప్రశ్నించారు. అసలిది పాత విషయమేనని అనవసరంగా పెద్దది చేస్తున్నారని గణితం టీచర్లు అంటున్నారు. పరస్పర వాదనల నేపథ్యంలో ఈ ఏడాది బోధనకు ఏ స్థాయిలో సమస్య తలెత్తుతుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయ సంఘాలూ ఆందోళన చెందుతున్నాయి.

అసలేంటీ పంచాయితీ

గతంలో ఫిజిక్స్ సబ్జెక్టు గణితం వారు, కెమిస్ట్రీ సబ్జెక్టు బయలాజికల్ సైన్స్ వారు చెప్పేవారు. 2000లో ఫిజికల్ సైన్స్ పోస్టులు మంజూరు చేసి, 2002లో భర్తీ చేశారు. ఆ సమయంలో ప్రభుత్వం ఓ టైంటేబుల్‌తో సర్క్యులర్ ఇచ్చింది. ఇందులో 8, 9, 10 ఫిజిక్స్ చెప్పాలని, 6, 7 తరగతులకు గణితం చెప్పాలని పేర్కొంది. 2017 వరకూ ఈ విధానం కొనసాగింది. 2017 తర్వాత సిలబస్‌లో మార్పులొచ్చాయి. గణితం వారికి ఎక్కువ బోధన, సైన్స్ వారికి తక్కువ బోధన క్లాసులు ఉన్నాయనే వాదన తెరమీదకొచ్చింది. అప్పట్లో ఎస్‌ఈఆర్‌టీ 2017లో 6వ తరగతి గణితంను ఫిజిక్స్ టీచర్లు, 7వ తరగతి గణితంను 10 వరకూ చెప్పే గణితం టీచర్లే చెప్పాలని కొత్త ఆదేశాలు జారీ చేసింది. దీనిపై గణితం టీచర్లు ఆందోళనకు దిగారు. గణితం సబ్జెక్టులోనే ఎక్కువ మంది ఫెయిల్ అవుతున్నారని, మరింత శ్రద్ధ అవసరమని తెలిపారు. దీంతో ఎస్‌సీఈఆర్‌టీ ఇచ్చిన ఆదేశాలు నిలిపివేసింది. అప్పట్నుంచీ వివాదం అలాగే కొనసాగింది. స్థానిక హెచ్‌ఎంలు సర్దుబాటు చేసుకొని క్లాసులు నిర్వహిస్తున్నారు. తాజాగా మళ్లీ ఫిజికల్ సైన్స్ టీచర్లు 6, 7 క్లాసుల గణితం చెప్పాలని ఆదేశాలివ్వడంతో వివాదం మొదలైంది.


ఎట్టి పరిస్థితుల్లోనూ చెప్పం

ఎట్టి పరిస్థితుల్లోనూ 6, 7 తరగతులకు గణితం సబ్జెక్టు బోధించం. దీనివల్ల 8, 9, 10 తరగతుల విద్యార్థులకు అన్యాయం జరుగుతుంది. సైన్స్ యాక్టివిటీ అయిన ఇన్‌స్పైర్ అవార్డులు, స్కూల్ ఇన్నోవేషన్ చాలెంజ్,, నేషనల్ చిల్డ్రన్స్ కాంగ్రెస్ తదితర ముఖ్యమైన వాటిపై దృష్టి పెట్టడం కష్టం. గణితం కన్నా భౌతిక, రసాయన శాస్త్రాల బోధనే కష్టం. డిగ్రీలో, బీఈడీలో గణితం చదవాలన్న అర్హత నిబంధనలు లేవు. ఇలా గణితం నేపథ్యం లేని ఫిజిక్స్ అధ్యాపకులూ ఉన్నారు. వారిని గణితం బోధించమంటే ఎలా వీలవుతుంది? తక్షణమే ప్రభుత్వం పునరాలోచన చేయాలి.

– అజయ్‌సింగ్, రాష్ట్ర ఫిజికల్ సైన్స్ టీచర్ల ఫోరం అధ్యక్షుడు

జరిగే నష్టం ఏమిటి?

ప్రభుత్వ ఉపాధ్యాయులు బీఈడీ చేసిన సమయంలో ఇప్పుడున్న సిలబస్ లేదు. ఈ కారణంగా ఫిజిక్స్ మినహా 6, 7 తరగతుల గణితం చెప్పాలంటే కొంత ప్రిపేర్ అవ్వాల్సి ఉంటుంది. సమయాన్ని ఇలా వెచ్చిస్తే కీలకమైన 9, 10 తరగతుల విద్యార్థులకు సైన్స్ సబ్జెక్టులో అన్యాయం జరుగుతుందనేది వారి వాదన. జాతీయస్థాయిలో జరిగే నీట్‌కు హాజరయ్యే విద్యార్థులకు 8వ తరగతి నుంచే సైన్స్‌లో గట్టి పునాది పడాలని ఫిజిక్స్ టీచర్లు చెబుతున్నారు. రాష్ట్రంలో ఉన్న టీచర్లలో 25 శాతం మంది ఫిజిక్స్ టీచర్లు ఉన్నారు. వీరికన్నా 20 శాతం గణితం టీచర్లు ఎక్కువగా ఉన్నారని తెలిపారు. అలాంటప్పుడు వారికే 6,7 మేథ్స్ బోధన అప్పగించాలని కోరుతున్నారు. స్కూళ్లు తెరిచేలోగా సమస్య పరిష్కరించకపోతే విద్యార్థులు నష్టపోయే ప్రమాదం కనిపిస్తోంది.



ముక్కుతో మూడోసారి..

ఫొటో చూడగానే విషయం కొంత అర్థమై ఉంటుంది. ఈయన పేరు వినోద్ కుమార్ చౌదరి(44). అందరూ టైపింగ్ చేత్తో చేస్తే.. ఈయన ముక్కుతోనూ చేస్తారు. ముక్కుతో అత్యంత వేగంగా ఆల్ఫాబెట్ల(ఏ–జెడ్)ను టైప్ చేయడంలో వినోద్ పేరిట గిన్నిస్ రికార్డు కూడా ఉంది. తాజాగా మరోసారి తన రికార్డును తానే బద్దలు కొట్టారు. 2023లో 27.80 సెకన్లలో ఏ–జెడ్ వరకూ కొట్టి తొలిసారి గిన్నిస్ బుక్‌లోకి ఎక్కారు. అదే ఏడాది అంతకన్నా తక్కువ సమయంలో(26.73 సెకన్లలో) టైప్ చేసి పాత రికార్డును చెరిపేశారు. ఇప్పుడు ఏ టు జెడ్ వరకూ ప్రతి అక్షరానికి మధ్యలో స్పేస్ ఇస్తూ.. 25.66 సెకన్లలో పని పూర్తి చేసి.. హ్యాట్రిక్ కొట్టారు. ఢిల్లీలోని జవహర్‌లాల్ యూనివర్సిటీలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న వినోద్ టైపింగ్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా ప్రసిద్ధి పొందారు.

కాళేశ్వరంలో నీటినిల్వకు సన్నద్ధం!



అన్నారం బ్యారేజీలో చేపట్టిన గ్రౌటింగ్ పనులు

- అన్నారం బ్యారేజీలో గ్రౌటింగ్ పనులు ప్రారంభం
- మేడిగడ్డ బ్యారేజీలో కొనసాగుతున్న మరమ్మతులు

కాళేశ్వరం: కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని అన్నారం బ్యారేజీలో త్వరగా మరమ్మతు పనులు పూర్తి చేసి నీటిని నిల్వ చేయడానికి ఇంజనీరింగ్‌శాఖ అధికారులు సన్నద్ధం అవుతున్నట్లు తెలిసింది. అన్నారం బ్యారేజీలోని సీపేజీ లీకేజీలకు గ్రౌటింగ్ పనులను ఆదివారం అధికారులు ప్రారంభించారు. ఎన్‌డీఎస్‌ఏ సూచనల మేరకు ఇంజనీరింగ్ అధికారులు సీసీ బ్లాక్‌లు తొలగించి మళ్లీ అమరుస్తున్నారు. బ్యారేజీ క్రస్ట్‌గేట్ల ముందు, వెనుకాల ఉన్న ఇసుక మేటలు తొలగించారు. అక్కడి సీపేజీ లీకేజీలను సిమెంట్, ఇసుక మిశ్రమాన్ని 38వ పియర్ వెంట్ వద్ద గ్రౌటింగ్ ద్వారా నింపుతున్నారు. వర్షాకాలంలో అన్నారం బ్యారేజీ నింపి ఎగువన సుందిళ్ల పంపుహౌస్ ద్వారా ఎత్తిపోసి నీటిని తరలించడానికి ఈఎన్‌సీ జనరల్ అనిల్‌కుమార్ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. అన్నారం బ్యారేజీకి ఎగువన పెద్దవాగు, మానేరు, గ్రావిటీ ద్వారా వచ్చే వరద నీరు కూడా వాడుకునే వీలుందని, ఈ నీటిని ఎగువన సుందిళ్లను తరలించడానికి యత్నాలు జరుగుతున్నట్లు తెలిసింది. మేడిగడ్డ(లక్ష్మీ) బ్యారేజీ 7వ బ్లాక్‌లో కుంగిన పియర్‌లు 19, 20, 21ల దిగువన సీసీ బ్లాక్‌ల అమరిక, షీట్‌ఫైల్స్ దింపుతున్నారు. కాగా, ఆదివారం కురిసిన వర్షానికి అన్నారం, మేడిగడ్డ బ్యారేజీల్లో పనులు నిలిచాయి. కొద్దిపాటి వర్షానికే అన్నారం బ్యారేజీగేట్ల ముందు భాగంలోకి నీరు చేరుతుందని ఇంజనీరింగ్ అధికారులు ఆందోళన చెందుతున్నారు.



వాహనాలతో కిక్కిరిసిన రహదారి

బీబీనగర్: యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం గూడూరు టోల్‌ప్లాజాతో పాటు హైదరాబాద్– వరంగల్ జాతీయ రహదారి ఆదివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు వాహనాలతో కిక్కిరిసిపోయింది. యాదాద్రితో పాటు స్వర్ణగిరికి భక్తులు భారీగా తరలిరాగా, శుభకార్యాలు కూడా ఎక్కువగా ఉండడంతో 40వేల వరకు వాహనాలు గూడూరు టోల్‌ప్లాజా గుండా రాకపోకలు సాగించాయి. టోల్‌ప్లాజా వద్ద గూడూరు నుంచి పగిడిపల్లి వరకు వాహనాలు బారులుదీరాయి.

ఈ-కామర్స్, బీఎఫ్ఎస్ఐ, హాస్పిటాలిటీలదే జోరు

జాబ్స్ అండ్ ప్రొఫెషనల్ నెట్‌వర్కింగ్ ప్లాట్‌ఫామ్ అప్నా.కో అధ్యయనంలో వెల్లడి



సాక్షి, హైదరాబాద్: ఈ ఏడాది తొలి నాలుగు నెలల్లో విభిన్నరంగాల్లో ఉద్యోగ అవకాశాలు మెరుగైనట్టుగా వివిధ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. గతేడాదితో పోల్చితే మొదటి 4 నెలల్లో 31 శాతం జాబ్ పోస్టింగ్స్ పెరిగినట్టు వెల్లడైంది. ఉద్యోగ అవకాశాల వృద్ధిలో దక్షిణాది రాష్ట్రాల్లో మంచి అవకాశాలు లభిస్తున్నట్టు తేలింది. దేశవ్యాప్తంగా ఆర్థికరంగం తిరిగి పుంజుకోవడంతోపాటు, జాబ్ సెక్టార్‌ల పురోగతితో జాబ్ మార్కెట్ పుంజుకుంటున్నదని జాబ్స్ అండ్ ప్రొఫెషనల్ నెట్‌వర్కింగ్ ప్లాట్‌ఫామ్ అప్నా.కో తాజా అధ్యయనం వెల్లడించింది.

- ఈ-కామర్స్, బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్ (బీఎఫ్ఎస్ఐ), హాస్పిటాలిటీలదే జోరు అని అప్నా.కో నివేదిక వెల్లడించింది. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది ఈ-కామర్స్ 21 శాతం, బీఎఫ్ఎస్ఐ 17 శాతం, హాస్పిటాలిటీ రంగాల్లో 13 శాతం మేర ఉద్యోగ అవకాశాలు పెరిగినట్టు తెలిపింది.
- సేల్స్, బిజినెస్ డెవలప్‌మెంట్, బ్రాండ్, మార్కెటింగ్, కస్టమర్ సపోర్ట్ డొమైన్‌లలో వృత్తి నిపుణులకు డిమాండ్ గణనీయంగా పెరిగినట్టుగా పేర్కొంది. దక్షిణాది రాష్ట్రాల్లో ఈ రంగాల్లో 23 శాతం వృద్ధి నమోదైనట్టుగా, ఆయా రంగాల్లో జాబ్ పోస్టింగ్‌ల విషయంలో హైదరాబాద్, బెంగళూరు, చెన్నై ముందువరుసలో నిలుస్తున్నట్టుగా తెలిపింది.
- లక్నవూ, కోయంబత్తూరు, గ్వాలియర్ వంటి రెండో, మూడో శ్రేణి నగరాల్లోనూ డిజిటలైషన్ అమలు చేస్తుండడంతో ఆయా నగరాల్లోనూ జాబ్‌పోస్టింగ్స్ పెరుగుతున్నాయని చెప్పింది.
- తమ కంపెనీకి సంబంధించినంత వరకు చూసినా గతేడాదితో పోల్చితే ఈ ఏడాది కొత్తగా ఉద్యోగార్థుల (ఫ్రెష్ అప్లికెంట్స్) నుంచి 'జాబ్‌అప్లికేషన్లు'21 శాతం పెరిగినట్టు, వారిలో మహిళలే 18 శాతం ఉన్నట్టుగా ఈ సంస్థ తెలిపింది. గతేడాదితో పోల్చితే 2024లో జనవరి-ఏప్రిల్‌ల మధ్య జాబ్ అప్లికేషన్స్ 15 శాతం పెరుగుదల నమోదైనట్టు (1.7 కోట్లు పెరుగుదల) అప్నా.కో ఈ నివేదికలో పేర్కొంది.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.